సత్యమేవ జయతే

సాక్షి

బుధవారం 6-2-2019



'ప్రజా ప్రతినిధులు చేయాల్సింది రెండే,
ప్రజా సేవలో సమర్థతను చాటుకోవడమా!
లేక తప్పుకోవడమా!'

WWW.SAKSHI.COM

పేజీలు: 16+6+20 వెల: ₹ 5.00

సంపుటి: 11
సంచిక: 316

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



నగల కొనుగోలు పథకంలో చెల్లిస్తున్నది
డబ్బు కాదు.. మీ శ్రమ
అందుకు తగ్గ ఫలితాన్ని అందించాలన్నదే నా ఉద్దేశం
11 నెలల 'నగలు కొనుగోలు పథకం'!
తొలి వాయిదా ఉచితం!
మీకోసం తొలి వాయిదాను మీ పేరిట నేనే చెల్లిస్తా.
+
V.A. 50% ఉచితం!
ఏ బంగారు నగ అయినా V.A. లో సగం V.A.
చెల్లించడం కూడా నా బాధ్యతగా తీసుకుంటా!
ఈ సువర్ణ అవకాశం అన్ని బంగారు నగలకు వర్తిస్తుంది!
కస్టమర్ GST చెల్లించాల్సి ఉంటుంది.
రూ.1000 / రూ.1500 / రూ.2000 / రూ.2500. చిన్న వాయిదాలు, రెండింతల ప్రయోజనం!
ప్రతినెల మీరు చెల్లించే నగదు, ఆరోజునాటి విలువ ప్రకారం 22 క్యారెట్ బంగారంగా ఆదా చేయబడుతుంది.
క్యారెట్ రూ.46,000 కన్నా అధికంగా ఇస్తున్నారంటే..
మీరు తెలిసే మోసపోతున్నట్టు!
భారతదేశంలోనే తక్కువ ధరకు వజ్రాభరణాలు!
క్యారెట్ రూ. 46000 నుంచి!
V.A. గ్రాముకు రూ.975 మాత్రమే
అన్ని వజ్రాభరణాలకు అంతర్జాతీయ స్థాయి సర్టిఫికెట్ అందజేస్తాం.
మా దగ్గర కొన్న వజ్రాభరణాలకు 100% ఎక్స్ఛేంజ్ చేసుకునే సౌకర్యం మరియు 85% క్యాష్‌బాక్ సౌకర్యం.
100% Quality. E-F Colour Grade & VVS Clarity.
నాణ్యత తక్కువైన G-H కలర్‌గ్రేడ్ ఆభరణాలను మేం విక్రయించం.
బంగారు ఆభరణాలు తయారీ ధరకే..!
లక్షలాది డిజైన్లు! 100% నాణ్యత - BIS 916 హాల్‌మార్క్
8% V.A.
8% V.A.
8% V.A.
8% V.A.
9% V.A.
9% V.A.
10% V.A.
10% V.A.
గాజులు
DAILY WEAR MACHINE CUTTING
4% నుంచి 8% V.A.
BOMBAY FANCY
6% నుంచి 9% V.A.
KOLKATA 8% V.A.
చైన్లు
Saradu 3% V.A.
V Chain 4% V.A.
Hollow Rope 4% V.A.
Indrani 6% V.A.
Parinda 6% V.A.
Hollow Flat Rope 6% V.A.
కనువిందు చేసే సంప్రదాయ మరియు వినూత్నమైన వెండిసామగ్రి.
మార్కెట్‌లో కంటే అతి తక్కువ ధరకు అందిస్తున్నాం!
One Time Payment ! నగల బుకింగ్ పథకం
ఏ నగకూ 100% V.A. లేదు
మొత్తం నగదును ఒకసారి చెల్లించి, తర్వాత.. V.A. లేకుండా నగలు కొనుగోలు చేసుకోండి.
5 నెలల నుంచే ఫలితం!
11 నెలల తర్వాత నగను కొనేటప్పుడు, 14% లేదా 16% వరకు
V.A. ఉన్న నగ అయినప్పటికీ.. 1% V.A. కూడా చెల్లించనక్కర్లేదు.
మీ పాత నగలను ఇచ్చి కూడా ఈ పథకంలో చేరొచ్చు.
కేవలం అరశాతం (0.5%) మీ పాత బంగారు నగలను మెల్టింగ్, ప్యూరిఫికేషన్ చేసేందుకు పట్టుకుంటాం.
కస్టమర్ GST చెల్లించాల్సి ఉంటుంది.
Lalithaa
లలితా జ్యువెల్లరి మార్ట్ ప్రై. లిమిటెడ్
విజయవాడ : 60-9-10, పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్, సిద్ధార్థ నగర్, సిద్ధార్థ క్యాటెరింగ్ కాలేజ్ ఎదురుగా.
ఫోన్: 0866-2481133.
వైజాగ్ : 29-1-75/1, ఆర్‌టీసీ బస్టాండ్, ద్వారకా నగర్. ఫోన్: 0891-6600001.
తిరుపతి : 481/482, రెడ్డి అండ్ రెడ్డి కాలనీ, మాస్క్‌రోడ్, (V.V. మహల్‌రోడ్) ఫోన్: 0877-666 0505 / 0606 / 7888.
హైదరాబాద్ : 6-3-883, SBR సౌక్, రాజీవ్‌గాంధి విగ్రహం ఎదురుగా, సోమాజిగూడ సర్కిల్. ఫోన్: 040 - 6748 6677. www.lalithaajewellery.com
చెన్నై • తిరువళ్లూరు • మదురై • తిరుచ్చి • పుదుచ్చేరి • కుంభకోణం • బెంగళూరు • రామనాథపురం • కోయంబత్తూరు • సేలం • నాగర్‌కోవిల్ • ఈరోడ్
నగలు కొనడం ఎలా?..
అన్న విషయంపై
రూపొందించిన పుస్తకం మా షోరూంలో
ఉచితంగా లభ్యమవుతుంది.



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+6+20 వెల: ₹ 5.00

సంపుటి: 11
సంచిక: 316

బుధవారం 6-2-2019

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



రెండేళ్లు.. రూ.లక్ష కోట్లు


ఇన్వెస్టర్లకు తిరిగి ఇచ్చేసిన టాప్ 5 ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ దిగ్గజాలు –బిజినెస్‌లో



ఇక ధనాధన్‌లో అమీతుమీ

భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య నేడు తొలి టి20 మ్యాచ్ –స్పోర్ట్స్‌లో

అధికారాంతమునా..
అదే దగా!



చివరి బడ్జెట్‌లోనూ బాబు జిత్తులమారి ఎత్తులు

నాలుగేళ్ల 9 నెలలుగా అడుగడుగునా మోసం ● ఒక్క హామీ అమలు చేయకుండా వంచన

ఎన్నికలు రెండు నెలలు ఉండగా బడ్జెట్ సాక్షిగా ఘరానా మోసం ● కొత్త పథకాల పేరుతో సెట్స్‌పైకి మరో సినిమా

రైతులు, డ్వాక్రా మహిళలు, నిరుద్యోగులను వంచించే ఎత్తులు ● పథకాలు కాపీ కొట్టారు.. కేటాయింపులు మరిచారు..

సరిగ్గా ఐదేళ్ల క్రితం ఓటర్లపై రంగుల వల..
600కు పైగా హామీలు..
అందులో అలవికానివి ఎన్నో..
వాగ్దానాల వర్షం.. అది చేస్తా ఇది చేస్తా అంటూ గొప్ప సినిమా చూపించారు..
ఒక్కటి కూడా నెరవేర్చకపోయినా ఇన్నాళ్లూ బూటకపు మాటలతో నెట్టుకొచ్చేశారు...
అన్ని వర్గాలనూ మోసగించారు.. ఇంకా చెప్పాలంటే పచ్చిగా జనాన్ని దగా చేయడంలో పీహెచ్‌డీ చేశారు..
అయితే ఆ ఎత్తులు అందరికీ అర్థమైపోయాయి.
కథ క్లైమాక్స్‌కు చేరుకుంది.

ప్రజావ్యతిరేకత వెల్లువెత్తుతుండడంతో సెట్స్‌పైకి మరో సినిమా వచ్చింది.

అబ్బో సూపర్ కదా.. అని భ్రమించేలా ఎన్నికలకు రెండు నెలల ముందు ఎంతో హడావిడి..

ఇప్పటికే కొంత ట్రైలర్ చూపించారు. ఇప్పుడు చిట్ట చివరి బడ్జెట్ సాక్షిగా అసలు సినిమా రిలీజయ్యింది.

రైతు రుణ మాఫీ, డ్వాక్రా రుణమాఫీ, ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి, అంతర్జాతీయ రాజధాని విషయాలలో ఘరానా మోసం ఏ రీతిలో సాగిందో ప్రజలు ఈ ఐదేళ్లలో చూశారు. ఇపుడు ఎన్నికలకు రెండు నెలల ముందు విడుదలైన ఈ సినిమాలోనూ కథా వస్తువులు అవే. కానీ ఇపుడు స్కీముల సీన్లు మారిపోయాయి.

మరో రెండు నెలల్లో ఎన్నికలు జరగబోతున్నాయి. కొత్త ప్రభుత్వం కొలువు దీరబోతోంది. మరి ఇలాంటి సమయంలో 4 నెలల కోసం తాత్కాలిక బడ్జెట్ ప్రవేశ పెడుతూ ఇదేదో వార్షిక బడ్జెట్‌లా ఇలాంటి మోసపూరిత విన్యాసాలేమిటా అని ప్రజలు ఆశ్చర్యపోతున్నారు.

'అన్నదాతా సుఖీభవ' పేరుతో రైతులను మోసగించే స్కీము ఈ బడ్జెట్‌లో ప్రత్యేకం. అయితే ఆ స్కీము వివరాలు పాపం ఎవరి దగ్గరా లేవు. హడావిడి వంటక మాయె. 'రైతు సురక్ష' పేరుతో రైతుకు ఎకరాకు రూ.10వేలు ఇస్తామని ముఖ్యమంత్రి తన వందిమాగధ చానళ్లలో అంతెత్తున ప్రచారం చేయించుకున్నారు. దాన్ని వదిలేశారు. మన రాష్ట్రంలో 1.60 కోట్ల ఎకరాల సాగుభూమి ఉంది. ఎకరాకు 10వేల చొప్పున అంటే రూ. 16వేల కోట్లు ఇవ్వాలి. ఆ మేరకు ఈ బడ్జెట్‌లో

మిగతా 2వ పేజీలో ▶

విద్య.. అంతా మిథ్య	డ్వాక్రా మహిళల జీరో వడ్డీకి అరకొర విదిలింపు	నిరుద్యోగులకు మరో మోసం	ఎన్నికల వేళ రైతులపై వల!	బడ్జెట్ వివరాలు 2,7,8,9,10,11 పేజీల్లో..

ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సంక్షిప్తంగా..
(అంకెలు రూ. కోట్లలో)

మొత్తం బడ్జెట్	2,26,177.53
రెవెన్యూ వ్యయం	1,80,369.32
కేపిటల్ వ్యయం	29,596.53
రెవెన్యూ ఆదాయం	1,78,269.85
కేంద్ర పన్నుల్లో వాటా	36,360.26
కేంద్ర గ్రాంట్లు	60,721.51
రెవెన్యూ మిగులు	2,099.46
ద్రవ్యలోటు	32,390.67
ఏప్రిల్ నుంచి జూలై వరకూ వ్యయం	76,816.85

అంకెల గారడీ!

రూ.2,26,177.53 కోట్లతో ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టిన రాష్ట్ర ప్రభుత్వం

నాలుగు నెలలకు రూ.76,816.85 కోట్ల వ్యయంతో బడ్జెట్ పద్దులో ప్రతిపాదన

- రెవెన్యూ మిగులు రూ.2,099.46 కోట్లు.. ద్రవ్యలోటు రూ.32,390.67 కోట్లు
- రైతుల రుణమాఫీకి నిధులు కేటాయింపు శూన్యం.. ఆరోగ్యశ్రీకి అరకొరే..
- నిరుద్యోగ భృతికి రూ.40,800 కోట్లు అవసరం కాగా కేటాయించింది రూ.1,200 కోట్లే
- డ్వాక్రా మహిళలకు సున్నా వడ్డీ బకాయిలు రూ.2,400 కోట్లు.. కేటాయించింది రూ.1,100 కోట్లే
- బీసీలకు వెన్నుపోటు.. ఎస్సీ, ఎస్టీలకు వంచన.. సబ్‌ప్లాన్ నిధులు పసుపు–కుంకుమకు
- ఈ ఏడాది బడ్జెట్‌లోనూ అంకెల గారడీ చేశారంటున్న ఆర్థిక నిపుణులు

2 లో

రైతుల స్థితిగతులపై దేశవ్యాప్త సర్వే

- రైతుల స్థితిగతుల వివరాలు తెలుసుకునేందుకు కేంద్రం దేశవ్యాప్తంగా సర్వే చేపట్టనుంది. ఈ ఏడాది పంట కాలంలో రైతుల ఆదాయం, వ్యయం, రుణాలు తదితర వివరాలు సేకరించనుంది.

- వివరాలు 4లో



మంగళవారం హైదరాబాద్‌లోని లోటస్‌పాండ్‌లో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ సమక్షంలో పార్టీలో చేరిన మాజీ మంత్రి ఖలీల్ బాషా. చిత్రంలో ఎమ్మెల్యే అంజాద్‌బాషా తదితరులు

ఏపీ పోలీసులపై నమ్మకం లేదు

- కోస్టల్ బ్యాంకు డైరెక్టర్ చిగురుపాటి జయరాం హత్య కేసును తెలంగాణ పోలీసులే దర్యాప్తు చేయాలని కోరుతూ ఆయన భార్య చిగురుపాటి పద్మశ్రీ జూబ్లీహిల్స్ పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు మంగళవారం రాత్రి ఆమె ఫిర్యాదు చేశారు. గత నాలుగు రోజుల నుంచి ఆంధ్రప్రదేశ్ పోలీసులు తన భర్త హత్యపై రకరకాల ప్రచారాలు చేస్తూ, టీవీ సీరియల్స్‌లా సాగదీసి ఏమాత్రం తేల్చలేకపోయారని, ఈ నేపథ్యంలో ఆంధ్రా పోలీసులపై నమ్మకం కోల్పోయానని చెప్పారు.

- వివరాలు 5లో

నా హత్యకు టీడీపీ నేతల రెక్కీ



చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వెల్లడి

ఇద్దరికి రూ.30 లక్షల సుపారీ ఇచ్చిన పులివర్తి నాని అనుచరులు

నాని సహకారంతో రెక్కీ నిర్వహించినట్లు మీడియా ముందు ఒప్పుకున్న నిందితులు

- వివరాలు 5లో



మీకిష్టమైన గిఫ్ట్ తీసుకోండి సార్!

నేడు తిరుపతి నుంచి జగన్ 'సమర శంఖారావం'

ఎన్నికల యుద్ధ భేరిని మోగించనున్న ప్రతిపక్ష నేత

- తటస్థులతోపాటు పార్టీ బూత్ కమిటీ సభ్యులు, కన్వీనర్లతో వైఎస్ జగన్ భేటీ
- సార్వత్రిక సమరానికి వైఎస్సార్ సీపీ శ్రేణులు సన్నద్ధం

తిరుపతి నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి

తిరుమల శ్రీవారి పాదాల చెంత నుంచి ప్రతిపక్ష నేత, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం సార్వత్రిక ఎన్నికల సమరశంఖాన్ని పూరించనున్నారు. పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల షెడ్యూలు ఇక ఏ రోజైనా వెలువడవచ్చనే సంకేతాలు రావడంతో శ్రేణులను కార్యోన్ముఖులను చేసేందుకు వైఎస్ జగన్ జిల్లాలవారీగా సమావేశాలను నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో నేడు తిరుపతిలో తటస్థులతోపాటు పోలింగ్ బూత్ కమిటీ సభ్యులు, కన్వీనర్లతో నిర్వహిస్తున్న రెండు సమావేశాల్లో ఆయన పాల్గొంటారు. రెండో రోజైన 7వ తేదీన వైఎస్సార్ జిల్లాలో సమర శంఖారావం సభలకు హాజరవుతారు. 11వ తేదీన అనంతపురం, 13వతేదీన ప్రకాశం జిల్లాల్లో జరిగే సమావేశాల్లో జగన్ పాల్గొంటారు. అనంతరం మిగతా జిల్లాల్లో కూడా ఇలాంటి సమావేశాలను పార్టీ నిర్వహించనుంది. నాలుగున్నరేళ్లుగా రాష్ట్రంలో టీడీపీ సర్కారు సాగిస్తున్న అరాచక, అప్రజాస్వామిక, ప్రజావ్యతిరేక పాలనకు చరమగీతం పలికే విధంగా ఎన్నికల పోరాటానికి పార్టీ శ్రేణులను సమాయత్తం చేయనున్నారు. సుదీర్ఘ ప్రజాసంకల్ప పాదయాత్రతో రాష్ట్రం నలుమూలలా పర్యటించి

మిగతా 2వ పేజీలో ▶



ముగిసిన దీదీ ధర్నా

సుప్రీంకోర్టు ఆదేశాలతో నిర్ణయం

- సీబీఐ విచారణకు హాజరు కావాల్సిందిగా కమిషనర్ రాజీవ్‌కు సుప్రీం కోర్టు ఆదేశం
- ఆయన అరెస్టు వద్దని సీబీఐకి ఉత్తర్వులు
- రాజీవ్‌పై చర్యలకు బెంగాల్ సీఎస్‌ను ఆదేశించిన కేంద్ర హోంశాఖ
- తదుపరి పోరును ఢిల్లీలో కొనసాగిస్తానన్న బెంగాల్ సీఎం మమత

చల్లగా ఉంటుంది షిల్లాంగ్‌లో విచారించండి

రాజీవ్‌ను షిల్లాంగ్‌లో విచారించాలని సీబీఐకి సుప్రీం సూచన

4 లో

అధికారాంతమునా అదే దగా

▶ మొదటి పేజీ తరువాయి

కేటాయింపులే లేవు. ప్రతిపక్ష నేత ప్రకటించిన స్కీమును కాపీకొట్టారు సరే.. అదయినా సరిగ్గా చేశారా అంటే లేదు. 85 లక్షల రైతు కుటుంబాలకు రు. 12,500 చొప్పున మొత్తం రూ.10,600 కోట్లు ఇస్తానని జగన్ మోహన్ రెడ్డి ప్రకటించారు. స్కీమును కాపీ కొట్టిన చంద్రబాబు ఈబడ్జెట్‌లో కేటాయించింది రూ.5,000 కోట్లు. తను ప్రచారం చేసుకున్న విధంగానైతే రూ.16వేల కోట్లు కేటాయించాల్సింది. లేదా జగన్ నుంచి కాపీ కొట్టిన స్కీమ్ కయితే రూ.10,600 కోట్లు కేటాయించాలి. కానీ రెండూ చేయకుండా రూ. 5వేల కోట్లతో సరిపెట్టారు.

డ్వాక్రా అక్కచెల్లెమ్మలకూ అదే ఘరానా మోసం. రుణాలన్నీ మాఫీ చేస్తానని మోసగించాడు. అదలా ఉంచితే ఇపుడు రూ.10వేల చొప్పున ఇస్తామంటున్నారు. అంటే 93 లక్షల మంది డ్వాక్రా మహిళలకు రూ.10వేలు చొప్పున అంటే రూ.9,300 కోట్లు కేటాయించాలి. కానీ ఈ బడ్జెట్‌లో కేటాయించిందెంత? రూ. 4 వేల కోట్లు. ఈ బడ్జెట్‌లో ఏప్రిల్ వరకు కేటాయించింది రూ.1700 కోట్లు. అంటే డ్వాక్రా మహిళలకు రూ. 9,300 కోట్లు కావాల్సి ఉంటే ఇప్పటివరకు అందుబాటులో ఉంచింది రూ.5,700 కోట్లు మాత్రమే. ప్రకటించిన రూ. 10వేలు ఉచితమూ కాదు. ఇంతకుముందు లానే అని ఊరుకున్నారు. అంటే ఈ రూ.10వేలు అప్పేనని తేలిపోయింది.

మేనిఫెస్టోలో అన్ని వర్గాలనూ మోసగించిన రీతిలోనే ఇపుడు బడ్జెట్‌లో కులాలవారీగా కార్పొరేషన్లు ప్రకటించారు. 35 కులాలకు రూ. 3 వేల కోట్లు కేటాయిస్తున్నట్లు చెప్పారు. కానీ కార్పొరేషన్‌కు రూ.100 కోట్లయినా కేటాయించకుండా అన్ని కులాలను మోసగించారు. బీసీలపై ప్రేమ నటిస్తూ నాలుగేళ్ల తొమ్మిదినెలల్లో వారికి ఖర్చుచేసింది రూ.18వేల కోట్లు. ఇపుడు ఒకే ఏడాదిలో రూ.16వేల కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. నమ్మేదెలా?. కాపులకు ఏటా వెయ్యికోట్ల చొప్పున ఐదేళ్లలో రూ.5వేల కోట్లు కేటాయించాల్సింది. కానీ కేటాయించింది రూ.1400 కోట్లు మాత్రమే. ఇపుడు మళ్లీ ఏడాదికి రూ.వెయ్యికోట్లు కేటాయిస్తానని కల్లబొల్లి కబుర్లు.

బాబుగారి బడ్జెట్‌లలో అన్ని వర్గాలకు కేటాయింపులే చాలా తక్కువ. అవసరాలకు తగినన్ని కేటాయింపులు ఏ పద్దులోనూ లేవు. అన్నీ అరకొర విదిలింపులే.. వాటిలోనూ ఖర్చు చేసింది మరింత తక్కువ. అవసరమైనదాంట్లో 50శాతం కూడా కేటాయింపులు లేవు. ఆ కేటాయించినవన్నా పూర్తిగా ఖర్చు చేస్తారా అంటే అదీ లేదు. కేటాయించిన దాంట్లో 60శాతం కూడా ఖర్చుచేయరు.

మరి నాలుగేళ్లలో విడుదల చేసినంత మొత్తాన్ని ఒకేసారి కేటాయిస్తున్నట్లు చివరి బడ్జెట్‌లో చూపిస్తే ఎవరు నమ్ముతారు బాబూ? ఈ అంకెల గారడీ ఎన్నికల సుడిగుండం నుంచిగట్టెక్కిస్తుందా... హవ్వ ఇంత పచ్చి దగానా జనం నవ్విపోరా అని విశ్లేషకులు ముక్కున వేలేసుకుంటున్నారు.

అంకెల గారడీ



సాక్షి, అమరావతి

చివరి బడ్జెట్‌లో టీడీపీ సర్కారు చిత్ర విచిత్రాలు..! రాష్ట్ర ప్రభుత్వం శాసనసభకు మంగళవారం సమర్పించిన 2019–20 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో అంకెల గారడీ చేసినట్లు స్పష్టమవుతోంది. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2014–15 నుంచి 2018–19 వరకు ప్రవేశపెట్టిన ప్రతి బడ్జెట్‌లోనూ రంగాలవారీగా భారీగా కేటాయింపులు చేయడం, ఆ తర్వాత నిధులను సమకూర్చలేక చేతులెత్తేయడం రివాజుగా మారింది. ఈసారి ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లోనూ తమ ధోరణిని చంద్రబాబు–యనమల జోడి మార్చుకోలేదు. ఈ నెలలోనే ఎన్నికల షెడ్యూల్ వెలువడవచ్చని భావిస్తున్న తరుణంలో బడ్జెట్‌లో అంకెల ఆర్భాటంతో కనికట్టు చేసేందుకు ప్రయత్నించారు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ఏప్రిల్ నుంచి జూలై వరకు మాత్రమే వర్తిస్తుంది. 2019–20కి సంబంధించిన పూర్తి స్థాయి బడ్జెట్‌ను ఎన్నికల తర్వాత కొలువు తీరే సర్కారే ప్రవేశపెడుతుందన్నది తెలిసిందే. ఈ నాలుగు నెలకు రూ.76,816.85 కోట్ల వ్యయం అవుతుందని ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు లెక్క కట్టారు.

- ఈసారి రూ.2,26,117.53 కోట్లతో 'ఓటాన్' బడ్జెట్..
- కేంద్రం నుంచి 2018–19లో గ్రాంట్ల రూపంలో 50,695.77 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేస్తే 2019–20లో రూ.60,721.51 కోట్లు అంచనా..
- సొంత ఆదాయం ద్వారా 2018–19లో రూ.67,535 కోట్లు వస్తాయని సవరిస్తే.. 2019–20లో రూ.75,437.99 కోట్లు సమకూరతాయని అంచనా..
- కేంద్ర పన్నుల్లో వాటా కింద 2018–19లో రూ.33,929.85 కోట్లు వస్తాయని అంచనా వేయగా రూ.32,787.03 కోట్లకు సవరించారు. 2019–20లో రూ.36,360.26 కోట్లు వస్తాయని అంచనా..
- 2018–19 బడ్జెట్‌లో రూ.5,235.23 కోట్లు మిగులు ఉంటుందని చూపించి చివరకు రూ.2,494.11 కోట్లు లోటు చూపించారు. 2019–20 బడ్జెట్‌లో రెవెన్యూ లోటు రూ.2,099.46 కోట్లు ఉంటుందని అంచనా..
- 2018–19లో రూ.1,91,063.60 కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టి రూ.1,96,948.49 కోట్లకు సవరించారు. 2019–20లో రూ.2,26,177.53 కోట్లతో బడ్జెట్‌ను ప్రతిపాదించారు. అంటే ఏడాదిలో రూ.29,229.04 కోట్ల ఆదాయం ఎక్కువ వస్తుందని చూపారు!
- 2018–19 బడ్జెట్‌లో బహిరంగ మార్కెట్ ద్వారా రూ.29,605.06 కోట్లు తీసుకోవాలని అంచనా వేసి రూ.32,972 కోట్ల రుణం తీసుకోవాల్సి వస్తుందని సవరించారు. 2019–20 బడ్జెట్‌లో రూ.45,078.73 కోట్లను బహిరంగ మార్కెట్ ద్వారా రుణంగా తీసుకోవాల్సి ఉంటుందని అంచనా వేశారు.

రైతులు, డ్వాక్రా మహిళలకు మళ్లీ దగా..

గత ఎన్నికలకు ముందు లెక్కకు మించి చేసిన వాగ్దానాలకు గత ఐదు బడ్జెట్‌లలోనూ నిధులు కేటాయించకుండా సీఎం చంద్రబాబు హామీలను తుంగలో తొక్కారు. రూ.87,612 కోట్ల వ్యవసాయ రుణాల మాఫీని కమిటీలు, స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ తదితర వడపోతల పేరుతో రూ.24 వేల కోట్లకు కుదించారు. అందులోనూ ఇంకా రూ. 8,200 కోట్లు బకాయి ఉంది. దీనికి ఈ బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి యనమల నిధులేమీ కేటాయించలేదు. రుణమాఫీ పేరుతో సీఎం చంద్రబాబు రైతులను నిలువునా మోసగించడంతో వ్యవసాయ రుణాలు గత ఏడాది సెప్టెంబరు నాటికి రూ.1.37 లక్షల కోట్లకు చేరాయి. రైతులను అప్పుల ఊబిలోకి నెట్టిసి తన వంచనను కప్పిపుచ్చుకునేందుకు ఇప్పుడు ఎన్నికలకు ముందు 'అన్నదాత సుఖీభవ' పేరుతో కొత్త పథకాన్ని తెరపైకి తెచ్చారు. డ్వాక్రా రుణాలను సంపూర్ణంగా మాఫీ చేస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక 'యూ' టర్న్ తీసుకున్నారు. పెట్టుబడి నిధి కింద ఒక్కో మహిళకు రూ,.పది వేలు ఇస్తామంటూ నాలుగున్నరేళ్ల పాటు సాగదీశారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడటానికి నెల ముందు పోస్ట్ డేటెడ్ చెక్కులను పంపిణీ చేస్తున్నారు. సకాలంలో రుణాలు చెల్లించిన డ్వాక్రా మహిళలకు సున్నా వడ్డీ పథకం కింద వడ్డీ రాయితీ వర్తింపజేయాలి. కానీ రాష్ట్ర ప్రభుత్వం 2016 అక్టోబరు నుంచి సున్నా వడ్డీ చెల్లింపులకు నిధులివ్వడం లేదు. దీంతో డ్వాక్రా సంఘాల నుంచి బ్యాంకులు ఇప్పటివరకు వడ్డీ కింద రూ.2,400 కోట్లను వసూలు చేశాయి. తాజా బడ్జెట్‌లో వడ్డీలేని రుణాలకు రూ.1,100 కోట్లనే కేటాయించారు. అంటే ఈ కేటాయింపులు బకాయిలు చెల్లించడానికి కూడా చాలవన్నది స్పష్టమవుతోంది.

నిరుద్యోగులను నిలువునా ముంచేశారు..

'జాబు రావాలంటే బాబు రావాలి.. ఇంటికో ఉద్యోగం ఇస్తాం. లేదంటే నిరుద్యోగ భృతిగా నెలకు రూ.రెండు వేల చొప్పున ఇస్తాం' అని గత ఎన్నికల్లో టీడీపీ ఇంటింటికీ ప్రచారం చేసింది. ఎన్నికల మేనిఫెస్టోలోనూ అదే విషయాన్ని స్పష్టంగా పేర్కొంది. కానీ అధికారంలోకి వచ్చాక నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించకపోగా ఉన్న సిబ్బందినే తొలగిస్తోంది. లక్షల సంఖ్యలో ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నా భర్తీ చేయకుండా నిరుద్యోగ యువత జీవితాలతో చెలగాటమాడుతోంది. భృతి కింద రూ.రెండు వేలు ఇవ్వకుండా దారుణంగా మోసగించింది. ఇదే అంశంపై ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలదీయడంతో 2017–18 ఆర్థిక సంవత్సరంలో నిరుద్యోగ యువతకు భృతి పేరుతో బడ్జెట్‌లో రూ.500 కోట్లను కేటాయించారు. కానీ ఆ ఏడాది ఒక్క పైసా కూడా ఖర్చు చేయలేదు. 2018–19లో నిరుద్యోగ భృతికి రూ.1,000 కోట్లను కేటాయించినా నవంబర్ వరకూ ఒక్క పైసా కూడా ఖర్చు పెట్టలేదు. ఆ తర్వాత నెలకు రూ.వెయ్యి చొప్పున భృతిగా ఇస్తామని ప్రకటించారు. రాష్ట్రంలోని 1.70 కోట్ల కుటుంబాలకుగానూ టీడీపీ ఎన్నికల హామీ ప్రకారం ఇంటికో ఉద్యోగం లేదంటే నిరుద్యోగ భృతిని ఇవ్వాల్సి ఉంది. అయితే ఇప్పటివరకు కేవలం 3.58 లక్షల మందికి నెలకు రూ.1,000 చొప్పున రూ.116.88 కోట్లు మాత్రమే ఇవ్వడం గమనార్హం. ఇప్పుడు ఎన్నికలకు నెల ముందు నిరుద్యోగ భృతిని రూ.రెండు వేలకు పెంచుతున్నట్లు బడ్జెట్‌లో పేర్కొన్నారు. 1.70 కోట్ల మందికి నిరుద్యోగ భృతి ఇవ్వాలంటే ఏడాదికి రూ.40,800 కోట్లు అవసరం. కానీ బడ్జెట్‌లో కేవలం రూ.1,100 కోట్లు మాత్రమే కేటాయించడం గమనార్హం.

బీసీలకు వెన్నుపోటు..


వెనుకబడిన తరగతులకు చెందిన అన్ని కులాలకు ప్రత్యేకంగా కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఆర్థికంగా తోడ్పాటును అందించి పేదరికాన్ని నిర్మూలిస్తామని ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని ఎన్నికలకు ముందు కాపీ కొట్టిన సీఎం చంద్రబాబు కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తామంటూ నమ్మబలుకుతున్నారు. గత బడ్జెట్‌లో బీసీ కార్పొరేషన్‌కు రూ.1,337.81 కోట్లు కేటాయిస్తే ఈ బడ్జెట్‌లో రూ.3 వేల కోట్లను మాత్రమే కేటాయించారు. బీసీల్లో కులానికో కార్పొరేషన్ ఏర్పాటు చేస్తే ఒక్కో కార్పొరేషన్‌కు రూ.80 నుంచి రూ.90 కోట్లు కూడా వచ్చే అవకాశం ఉండదు.

వైద్యం నిర్వీర్యం..

ఆరోగ్యశ్రీ పథకానికి సర్కారు గత బడ్జెట్‌లో రూ.వెయ్యి కోట్లను కేటాయిస్తే ఆ నిధులు ఏ మూలకూ సరిపోలేదు. ప్రస్తుతం ఆసుపత్రులకు రూ.650 కోట్లకు పైగా ప్రభుత్వం బకాయి పడింది. ఈ బడ్జెట్‌లో ఆరోగ్యశ్రీకి కేవలం రూ.1,200 కోట్లు మాత్రమే కేటాయించారు. అంటే బకాయిలు పోనూ కేవలం రూ.550 కోట్లే మిగులుతాయి. ఆరోగ్యశ్రీ చికిత్సలకు చెల్లించే రుసుము పెంచిన నేపథ్యంలో ఈ నిధులు తొలి త్రైమాసికానికి కూడా సరిపోవన్నది తేటతెల్లమవుతోంది. ఇక సంక్షేమ వసతిగృహాల్లోని విద్యార్థులకు పౌష్టికాహారం, మౌలిక సదుపాయాల కల్పనకు నిధుల కేటాయింపుల్లోనూ సర్కారుకు చిత్తశుద్ధి లేదని స్పష్టమైంది.

సబ్‌ప్లాన్ నిధులను సర్దేశారు...

బడుగు, బలహీన వర్గాలకు ఉప ప్రణాళిక కింద 2018–19లో రూ.11,229.10 కోట్లను కేటాయిస్తే.. 2019–20లో రూ.14,367.34 కోట్లు కేటాయించారు. గిరిజనులకు ఉప ప్రణాళిక కింద 2018–19లో రూ.4,176.61 కోట్లు కేటాయిస్తే 2019–20లో రూ.5,385.31 కోట్లు కేటాయించారు. కానీ 2018–19లో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ కింద కేటాయించిన నిధుల్లో రూ.2,137 కోట్లను పసుపు–కుంకుమ పథకానికి మళ్లించేయడం గమనార్హం. ఎస్సీ, ఎస్టీల జీవనోపాధుల అభివృద్ధికి ఖర్చు చేయాల్సిన ఈ నిధులను దారి మళ్లించి ఆ వర్గాల ప్రజలకు చంద్రబాబు మోసం చేశారు. ఈ ఏడాదీ కూడా నిధులను అదే రీతిలో దారి మళ్లించరనే గ్యారంటీ ఏమీ లేదని అధికార వర్గాలే స్పష్టం చేస్తున్నాయి.



ఆర్థికలోటు రూ.32,390.68 కోట్లు

రెవెన్యూ వ్యయం రూ.1,80,369.33 కోట్లు – క్యాపిటల్ వ్యయం రూ.29,596.33 కోట్లు

సాక్షి, అమరావతి: ఆర్థిక మంత్రి యనమల 2019–20 సంవత్సరానికి మొత్తం రూ.2,26,177.53 కోట్ల వ్యయం ప్రతిపాదించగా.. ఇందులో రూ.1,80,369.33 కోట్ల రెవెన్యూ వ్యయం, రూ.29,596.33 కోట్ల క్యాపిటల్ వ్యయం ఉంది. రూ.32,390.68 కోట్ల ఆర్థిక లోటు చూపించారు. 2018 –19 బడ్జెట్ అంచనాలతో పోల్చితే 2019 – 20 అంచనా మొత్తం రూ.18.38 కోట్ల పెరుగుదల చూపించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంతో పోల్చితే రెవెన్యూ వ్యయం 20.03 శాతం, క్యాపిటల్ వ్యయం 20.03 శాతం పెరగనుంది. రెవెన్యూ మిగులు రూ.2,099.47 కోట్లు ఉంటుందని అంచనా వేశారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో ఆర్థిక లోటు 3.03 శాతం, రెవెన్యూ మిగులు రూ.0.20 శాతం ఉంటుందని అంచనా వేశారు.



వివిధ శాఖలకు కేటాయింపులు

శాఖ	కేటాయింపు (రూ. కోట్లలో)	శాఖ	కేటాయింపు (రూ. కోట్లలో)
వ్యవసాయ మార్కెటింగ్, సహకారం	12,732.97	ఇంఫర్మేషన్ టెక్నాలజీ...	1,006.81
పశుసంవర్ధక	2,030.87	కార్మిక, ఉపాధికల్పన	1,225.75
వెనుకబడిన వర్గాల సంక్షేమం	8,242.64	న్యాయశాఖ	918.81
అటవీ, పర్యావరణం, సైన్స్...	491.93	లెజిస్లేచర్	149.90
ఉన్నత విద్య	3,171.63	పురపాలక,పట్టణాభివృద్ధి	7,979.34
ఇంధన, మౌలిక వసతులు	5,473.83	మైనార్టీ సంక్షేమం	1,308.73
మాధ్యమిక విద్య	22,783.37	ప్రభుత్వరంగసంస్థలు	2.56
ఆహార, పౌరసరఫరాలు	3763.42	ప్రణాళిక	1,403.17
ఆర్థికశాఖ	51,841.69	పంచాయతీరాజ్, ఆర్డీ	35,182.61
సాధారణ పరిపాలన శాఖ	1,177.56	రెవెన్యూ	5,546.94
వైద్య ఆరోగ్య, కుటుం సంక్షేమం	10,032.15	ఆర్టీజీఎస్	172.12
హోంశాఖ	6,397.94	స్కిల్‌డెవలప్‌మెంట్...	458.66
గృహనిర్మాణం	4,079.10	సాంఘిక సంక్షేమం	6,861.60
జలవనరులు	16,852.27	రోడ్లు, భవనాలు, రవాణా	5,382.83
పరిశ్రమలు, వాణిజ్యం	4,114.92	మహిళా శిశుసంక్షేమం....	3,408.66
		క్రీడలు, యువజనసేవలు	1,982.74

ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాం

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం

- గతేడాది కేటాయింపులతో పోల్చితే 18.38 శాతం బడ్జెట్ పెంపు
- నాలుగు నెలల ఓటాన్ అకౌంట్‌కు రూ.76,816.85 కోట్లు
- శాసనసభకు బడ్జెట్ సమర్పించిన ఆర్థిక మంత్రి యనమల



సాక్షి, అమరావతి: సంక్షేమం, సమతుల అభివృద్ధి, కనీస మౌలిక సదుపాయాల కల్పన లక్ష్యాలుగా ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లడం వల్లే రాష్ట్రం ప్రగతిబాట పట్టిందని ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు తెలిపారు. ఐదేళ్ల క్రితం అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న రాష్ట్రం అనేక సవాళ్లను అధిగమించి ప్రగతి బాట పట్టిందన్నారు. 2019 – 20 ఆర్థిక సంవత్సరానికి రూ. 2.26 లక్షల కోట్లతో, మొదటి నాలుగు నెలలకు సంబంధించి రూ. 76816.85 కోట్లతో ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను మంగళవారం ఆయన శాసనసభకు సమర్పించారు. 2019– 20 ఆర్థిక సంవత్సరానికి రూ. 2,26,177.53 కోట్ల వ్యయం ప్రతిపాదించామని, 2018– 19 కేటాయింపులతో పోల్చితే ఇది 18.38 శాతం ఎక్కువని వివరించారు. ముందుగా నిర్ణయించిన ముహూర్తం ప్రకారం మధ్యాహ్నం 11.45 గంటలకు బడ్జెట్ ప్రసంగాన్ని ప్రారంభించిన యనమల సరిగ్గా 1.22 గంటలకు జైహింద్ అంటూ ప్రసంగాన్ని ముగించారు. 'దేశంలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో మన రాష్ట్రం ఒకటిగా నిలబడి వరుసగా మూడేళ్లు రెండంకెల వృద్ధి సాధిస్తుందని మనం ఊహించామా? 70 ఏళ్ల ఆంధ్రుల కల, రాష్ట్రం జీవనాడి అయిన పోలవరం డ్యామ్ శరవేగంగా పూర్తవుతుందని, దేశంలోనే అతి పెద్ద ప్రాజెక్టుల్లో ఒకటిగా నిలుస్తుందని ఊహించామా? ఇవన్నీ ఈరోజు నిజంగానే సాధించాం' అని యనమల పేర్కొన్నారు.

ఉన్నత విద్యకు పెద్దపీట..

సమాజంలో పెరిగిపోతున్న ఆర్థిక అసమానతల పట్ల తమ ప్రభుత్వం పూర్తి జాగరూకతతో ఉందని యనమల చెప్పారు. జాతీయ స్థాయిలో వంద అత్యుత్తమ విద్యాసంస్థల్లో ఆరు మన రాష్ట్రానికి చెందినవే కావడం ఉన్నత విద్యకు తాము ఇస్తున్న ప్రాధాన్యతకు నిదర్శనమని చెప్పారు. 2019 – 20 బడ్జెట్‌లో మానవ వనరుల విభాగానికి రూ. 29,955 కోట్లు కేటాయించామని, ఇది మొత్తం బడ్జెట్‌లో 11.5 శాతమని తెలిపారు. అమరావతిని ప్రపంచంలోని ఐదు ఉత్తమ నగరాల్లో ఒకటిగా అభివృద్ధి చేయాలనేది తమ ప్రభుత్వ లక్ష్యమని ప్రకటించారు.

అమరావతి నిర్మాణానికి రూ. 1.09 లక్షల కోట్లు ఖర్చు

అమరావతి నిర్మాణానికి రూ. 1,09,023 కోట్లు అవుతుందని అంచనా వేయగా మొదటి దశలో రూ. 39,875 కోట్లతో చేపట్టిన నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉన్నాయని యనమల చెప్పారు. తమ ప్రభుత్వ కృషి వల్ల రాష్ట్రం విద్యుత్తు లోటు నుంచి మిగులు రాష్ట్రంగా మారిందన్నారు. 'తల్లి గర్భం నుంచి జీవితాంతం వరకు ప్రతి దశలోనూ సంక్షేమాన్ని అమలు చేస్తున్న స్ఫూర్తిదాయకమైన ప్రభుత్వం ఇది. పురుషులతో మహిళలు పోటీపడే సమాజం ఏర్పాటే మా లక్ష్యం. అందుకే పసుపు కుంకుమ కింద ప్రతి స్వయం సహాయక సంఘం సభ్యురాలికి రూ. 10 వేల చొప్పున ఆర్థిక సాయం అందించాం. ఇప్పుడు మరోమారు 93.81 లక్షల మందికి రూ. 10 వేల చొప్పున మొత్తం రూ.9,381 కోట్లు ఇవ్వాలని నిర్ణయించాం. రూ. 24 వేల కోట్ల రుణ భారం నుంచి రైతులను విముక్తులను చేశాం. ఆఖరి రెండు వాయిదాలను త్వరలో జమ చేస్తాం' అని యనమల పేర్కొన్నారు. పెట్టుబడి రహిత సహజ సేద్యం (జెడ్‌బీఎన్‌ఎఫ్)లో రాష్ట్రం అగ్రగామిగా ఉందని ప్రకటించారు. మరోవైపు శాసన మండలిలో మంత్రి పి.నారాయణ బడ్జెట్ ప్రసంగాన్ని చదివారు.

యనమల బడ్జెట్ ప్రసంగంలో ముఖ్యాంశాలు...

- రైతుల కోసం అన్నదాత సుఖీభవ అనే మరో పథకానికి రూ. 5,000 కోట్లు ప్రతిపాదిస్తున్నా.
- కనీస మద్దతు ధరలు లేని సమయంలో రైతును ఆదుకునేందుకు విపణి ప్రమేయ నిధి రూ. 500 కోట్ల నుంచి రూ. 1,000 కోట్లకు పెంపు.
- పశువుల బీమా కోసం బడ్జెట్‌లో రూ. 200 కోట్లు కేటాయింపు.
- ముఖ్యమంత్రి యువనేస్తం కింద నిరుద్యోగ యువతకు ప్రస్తుతం నెలకు రూ. 1000 చొప్పున ఇస్తున్న నిరుద్యోగ భృతి రూ. 2000కి పెంపు. ఈ పథకం కింద 4.3 లక్షల మంది లబ్ధి పొందుతున్నట్లు ప్రకటన.
- వెనుకబడిన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా కొత్త కార్పొరేషన్ల ఏర్పాటుకు రూ. 3,000 కోట్లు. జనాభా దామాషా ప్రకారం కార్పొరేషన్లకు నిధుల పంపిణీ.
- అంబేడ్కర్ విదేశీ విద్య పథకం కింద ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థులు విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించడానికి మంజూరు చేసే స్కాలర్‌షిప్ రూ. 10 లక్షల నుంచి రూ. 15 లక్షలకు పెంపు.
- ఎస్సీ సబ్‌ప్లాన్ కింద 2019 – 20 కేటాయింపులు 28 శాతం పెంచి రూ. 14,367 కోట్లను ప్రతిపాదిస్తున్నట్లు ప్రకటన. ఎస్టీ సబ్‌ప్లాన్ 33 శాతం పెంచి రూ. 16,226 కోట్లు కేటాయింపు ప్రతిపాదన.
- ఆరోగ్య శాఖ బడ్జెట్ రూ. 8,463 కోట్ల నుంచి రూ. 10,032 కోట్లకు పెంపు. ఎన్టీఆర్ వైద్య సేవ పథకానికి కేటాయింపులు రూ. 1,000 కోట్ల నుంచి రూ. 1,200 కోట్లకు పెంపు.

నేడు తిరుపతి నుంచి జగన్ 'సమర శంఖారావం'



▶ మొదటి పేజీ తరువాయి

ప్రజలను కలుసుకున్న జగన్ తటస్థులకు సైతం చేరువయ్యారు.

నిరంతరం ప్రజల్లోనే ప్రతిపక్ష నేత...

అధికారపక్షం అక్రమాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తూ పార్టీ శ్రేణుల్లో వైఎస్ జగన్ స్ఫూర్తిని నింపుతూ వచ్చారు. విభజన అనంతరం రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాలను నిగ్గదీయటంతోపాటు ప్రత్యేక హోదా ఉద్యమాన్ని ఉరకలెత్తించారు. తొలుత తీవ్రంగా వ్యతిరేకించిన అధికార పార్టీ సైతం హోదాకు జై అనక తప్పని పరిస్థితులను కల్పించారు. హోదా వద్దన్న చంద్రబాబు చివరకు ప్రజల ఆందోళనతో యూ టర్న్ తీసుకోక తప్పలేదు. పార్టీ ప్లీనరీ సందర్భంగా వైఎస్ జగన్ ప్రకటించిన నవరత్నాలను సైతం హేళన చేసిన సీఎం చంద్రబాబు చివరకు వాటినే కాపీ కొట్టే పరిస్థితుల్లోకి వచ్చారు. గత ఎన్నికల్లో అతి స్వల్ప శాతం ఓట్ల తేడాతో అధికారానికి దూరమైనా నాలుగున్నరేళ్లుగా ప్రజల్లోనే ఉంటూ వారి సమస్యలపై జగన్ నిరంతరం పోరాడారు. కీలకమైన 2019 సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కింది స్థాయి నుంచి బూత్ కమిటీల నిర్మాణంపై శ్రద్ధ వహించి పార్టీ నేతల సహకారంతో పటిష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి ఎలా కృషి చేయాలనే అంశంపై సమర శంఖారావం సమావేశాల్లో జగన్ దిశా నిర్దేశం చేయనున్నారు. ఇక తటస్థుల విషయానికి వస్తే 'జగనన్న పిలుపు' పేరుతో ఆయన ఇప్పటికే వారందరికీ లేఖలు రాశారు. జిల్లాలవారీగా తటస్థులతో సమావేశమై చంద్రబాబు సర్కారు దుర్నీతితోపాటు రైతు రుణమాఫీ, డ్వాక్రా మహిళల రుణాల మాఫీ, ఇంటింటికో ఉద్యోగం, బెల్ట్ షాపుల రద్దు లాంటి అంశాలపై మాటతప్పి మోసగించిన తీరును వారికి వివరించనున్నారు. టీడీపీ సర్కారు అరాచకాలు, రాజధాని నిర్మాణం పేరుతో భూ కుంభకోణాలు తదితర అంశాలను వివరించి ప్రజా కంటక పాలలను అంతమొందించేందుకు వారి సహకారాన్ని కోరనున్నారు.

నేటి కార్యక్రమం ఇలా...

తిరుపతిలో 'సమర శంఖారావం' సమావేశాలు బుధవారం రెండు విడతలుగా జరుగనున్నాయి. వైఎస్ జగన్ ఉదయం 11.30 గంటలకు హైదరాబాద్ నుంచి రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి నేరుగా తిరుపతిలోని తనపల్లి క్రాస్ వద్ద గల పీఎల్ఆర్ గార్డెన్స్‌లో తటస్థ ప్రభావితులతో సమావేశమవుతారని వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి తలశిల రఘురామ్ తెలిపారు. అక్కడ సమావేశం అనంతరం వైఎస్ జగన్ రేణిగుంట సమీపంలోని యోగానంద ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన వేదిక వద్దకు మధ్యాహ్నం 1 గంట ప్రాంతంలో చేరుకుని పార్టీ బూత్ కమిటీ సభ్యులు, కన్వీనర్ల సమావేశంలో పాల్గొంటారని ఆయన వివరించారు. ఈ రెండు సమావేశాలు జరిగే వేదికల వద్ద ఏర్పాట్లను పార్టీ సీనియర్ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తలశిల రఘురామ్, బియ్యపు మధుసూదన్‌రెడ్డి తదితరులు మంగళవారం పర్యవేక్షించారు.

నెల్లూరు కార్యక్రమం వాయిదా

సాక్షి, అమరావతి: నెల్లూరు జిల్లాలో ఈ నెల 12వ తేదీన జరగాల్సిన వైఎస్సార్ కాంగ్రెస్ సమర శంఖారావం కార్యక్రమం వాయిదా పడిందని పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. 11వ తేదీన అనంతపురం, 13వ తేదీన ప్రకాశం జిల్లాల్లో సమర శంఖారావం సభలు యథావిధిగా జరుగుతాయని, మార్పు ఉండబోదని ఈ విషయం పార్టీ శ్రేణులు గమనించాలని ఆయన మంగళవారం పేర్కొన్నారు.

వాకపల్లి కేసు విచారణ ప్రారంభం

విశాఖ లీగల్: సంచలనం సృష్టించిన వాకపల్లి గిరిజన మహిళలపై లైంగిక దాడి కేసు విచారణ ప్రారంభమైంది. మంగళవారం మొదటి, మూడవ బాధితుల సాక్ష్యాలను కోర్టు రికార్డు చేసింది. ఇందులో మొత్తం 11 మంది బాధితులు కాగా, ఇద్దరు మృతిచెందారు. ఈ విచారణ ఈనెల 8 వరకు కొనసాగుతుంది. ఎస్సీ, ఎస్టీ కేసుల విచారణ ప్రత్యేక న్యాయస్థానంలో ఈ కేసు విచారణ జరిపారు. 2008 ఆగస్టు 21న కొంతమంది గ్రేహౌండ్ పోలీసులు తనిఖీల నెపంతో విశాఖ జిల్లా గిరిజన ప్రాంతమైన వాకపల్లి గ్రామంపై దాడిచేశారు. అక్కడ కొంతమంది మహిళలపై అమానుషంగా ప్రవర్తించి లైంగిక దాడికి పాల్పడినట్లు కేసు నమోదైంది. ఈ కేసు పలు మలుపులు తిరిగి చివరకు విశాఖలోని ఎస్సీ, ఎస్టీ కోర్టుకు విచారణకు వచ్చింది. గిరిజన మహిళల అభ్యర్థన మేరకు హైకోర్టు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను నియమించింది. ఈ కేసు ముందు హైకోర్టు పరిధిలో విచారణకు వెళ్లింది. ఎలాంటి ఆధారాలు లేవంటూ హైకోర్టు కేసు తోసిపుచ్చడంతో బాధిత మహిళలు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. కేసును పరిశీలించిన సుప్రీంకోర్టు కేసు విచారణను ఆరు నెలల్లో పూర్తిచేయాలని దిగువకోర్టును ఆదేశించింది.

పది నెలల్లో స్టేట్ జీఎస్టీ వసూళ్లు రూ.16,989 కోట్లు

ఎంపీ వేమిరెడ్డి ప్రశ్నకు కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి జవాబు

సాక్షి, న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి జనవరి వరకూ పది నెలల్లో స్టేట్ జీఎస్టీ ద్వారా ఏపీకి వచ్చిన ఆదాయం మొత్తం రూ.16,989 కోట్లని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి శివ్‌ప్రతాప్ శుక్లా తెలిపారు. రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మంగళవారం అడిగిన ప్రశ్నకు ఆయన రాతపూర్వక సమాధానం ఇచ్చారు. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే దేశవ్యాప్తంగా జీఎస్టీ వసూళ్లు మెరుగయ్యాయన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో ఆగస్టు నుంచి మార్చి వరకు రాష్ట్ర జీఎస్టీ ద్వారా రూ.10,826 కోట్లు వసూలైనట్లు వివరించారు.

అప్పులు తీసుకునే అర్హత ఏపీకి లేదు..

రాజ్యసభలో విజయసాయిరెడ్డి ప్రశ్నకు ఆర్థిక మంత్రి జవాబు



సాక్షి,అమరావతి: ఆర్థిక సంఘం విధించిన షరతులకు లోబడి వ్యవహరించనందున 2018–19 ఆర్థిక సంవత్సరంలో 3 శాతం ఎఫ్‌ఆర్‌బీఎం పరిమితికి మించి అదనంగా అప్పులు చేసే అర్హత ఆంధ్రప్రదేశ్‌కు లేదని కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి పొన్ రాధాకృష్ణ మంగళవారం రాజ్యసభలో స్పష్టం చేశారు. తెలంగాణ నిర్దిష్ట పరిమితులకు లోబడి ఉన్నందున 2018–19లో అదనంగా ఎఫ్‌ఆర్‌బీఎం పరిమితి దాటి రూ.2వేల 52 కోట్ల వరకూ రుణాలు సమకూర్చుకోవడానికి అర్హత పొందినట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి రాతపూర్వకంగా జవాబిస్తూ ఈ విషయం వెల్లడించారు. రాష్ట్ర విభజనతో రెవెన్యూలో ఏర్పడిన తీవ్ర అసమతౌల్యం కారణంగా ఎఫ్‌ఆర్‌బీఎం పరిమితిని ఒక శాతం సడలించాలని కోరుతూ ఏపీ ప్రభుత్వం నుంచి తమ మంత్రిత్వశాఖకు విజ్ఞప్తి వచ్చిందని మంత్రి వివరించారు. రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తి (జీఎస్‌డీపీ)పై ద్రవ్య లోటుకు అదనంగా 2018–19లో 0.5 శాతం మేర రుణాలు సమీకరించుకోవడానికి అనుమతించాల్సిందిగా ఏపీ, తెలంగాణలు కోరాయన్నారు. 14వ ఆర్థిక సంఘం సిఫార్సులకు అనుగుణంగా ఈ విజ్ఞప్తులను పరిశీలించాక తెలంగాణకే అదనంగా అప్పులు తీసుకునే అర్హత ఉన్నట్టు నిర్ధారణైందన్నారు. 14వ ఆర్థిక సంఘం నివేదికపై పార్లమెంటు ఉభయ సభల్లో ప్రవేశపెట్టిన యాక్షన్ టేకన్ రిపోర్టు ప్రకారం.. 2015 నుంచి 2020 వరకూ ఏపీ, తెలంగాణతో సహా దేశంలోని అన్ని రాష్ట్రాలూ ఆయా రాష్ట్ర వార్షిక జీఎస్‌డీపీపై 3 శాతం మించి రుణాలు తీసుకునేందుకు వీల్లేదని మంత్రి వెల్లడించారు. రుణాలు, జీఎస్‌డీపీ నిష్పత్తి 25 శాతం మించకుండా గడిచిన సంవత్సరంలో వడ్డీల చెల్లింపు, రెవెన్యూ రాబడులు 10 శాతం లోపు ఉన్న రాష్ట్రాలే ఎఫ్‌ఆర్‌బీఎంలో నిర్దేశించిన 3 శాతం పరిమితిని దాటి 0.5 శాతం వరకూ రుణాలు సమకూర్చుకునే వెసులుబాటును యాక్షన్ టేకన్ రిపోర్టు కల్పించిందని మంత్రి చెప్పారు. అందువల్ల 2018–19 సంవత్సరానికి ఏపీ జీఎస్‌డీపీపై ద్రవ్యలోటు లక్ష్యం మూడు శాతం మించకుండా.. రూ.27,569 కోట్లు మాత్రమే నికరంగా అప్పులు చేయడానికి సీలింగ్ విధించినట్లు మంత్రి వివరించారు.

కేంద్ర పథకాల కింద ఏపీకి రూ.62 వేల కోట్లు ఇచ్చాం

కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాల కింద 2014–15 నుంచి 2019 ఫిబ్రవరి 2 వరకూ ఏపీకి రూ.62 వేల 168 కోట్లు విడుదల చేసినట్లు కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ మంగళవారం రాజ్యసభలో తెలిపారు. విజయసాయిరెడ్డి అడిగిన మరో ప్రశ్నకు ఆయన పైవిధంగా సమాధానమిచ్చారు. కేంద్రం ప్రకటించిన ప్రత్యేక ఆర్థిక చర్య(ప్యాకేజీ)ల్లో భాగంగా ఈ ప్రాయోజిత పథకాల అమల్లో కేంద్రం వాటా 90 శాతం.. రాష్ట్రం వాటా 10 శాతం ఉంటుందన్నారు. 2015–16 నుంచి 2019–20 మధ్య కాలంలో రాష్ట్ర ప్రభుత్వం కుదుర్చుకునే ఎక్స్‌టర్నల్లీ ఎయిడెడ్ ప్రాజెక్టు (ఈఏపీ)ల కోసం తీసుకునే రుణాలు, వాటిపై వడ్డీని కేంద్ర ప్రభుత్వమే భరిస్తుందని మంత్రి చెప్పారు. 2015–16 నుంచి రాష్ట్ర ప్రభుత్వం కుదుర్చుకున్న ఈఏపీ ఒప్పందాలకు సంబంధించి 15.81 కోట్ల వడ్డీని చెల్లించాల్సిందిగా ఏపీ ప్రభుత్వం చేసిన విజ్ఞప్తి మేరకు నిధులు విడుదల చేసినట్లు చెప్పారు. ప్రత్యేక ప్యాకేజీని ఆమోదిస్తూ కేంద్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకున్నందుకు ధన్యవాదాలు తెలుపుతూ ఏపీ సీఎం 2017 మే 2న తమకు లేఖ రాశారని వెల్లడించారు. అలాగే విడుదలచేసిన నిధుల వినియోగానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి యుటిలైజేషన్ సర్టిఫికెట్లు వచ్చిన వెంటనే విడతల వారీగా తదుపరి నిధులను విడుదల చేస్తామని జైట్లీ అన్నారు.

పోలీసుల అదుపులో కిరీటాల దొంగ?

తిరుపతి క్రైం: తిరుపతిలోని టీటీడీ ఆధ్వర్యంలోని గోవిందరాజస్వామి ఆలయంలో మూడు బంగారు కిరీటాలను చోరీ చేసిన దొంగ పోలీసుల అదుపులో ఉన్నట్టు సమాచారం. మూడు రోజుల క్రితం గోవిందరాజస్వామి ఆలయంలో ఉత్సవమూర్తుల విగ్రహాలపై ఉన్న కిరీటాలు చోరీ జరిగిన విషయంపై ఈస్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసు బృందాలు దర్యాప్తు చేపట్టాయి. సోమవారం అనుమానితుడి చిత్రాన్ని పోలీసులు విడుదల చేశారు. అందులోని వ్యక్తి పేరు మస్తయ్యగా గుర్తించినట్టు సమాచారం. ఇతను గతంలోనూ తిరుపతిలోని పలు ఆలయాల్లో చోరీకి పాల్పడినట్టు పోలీసులు గుర్తించారు.

దక్షిణ మధ్య రైల్వేలో నియామకాలు చేపట్టండి

రైల్వే బోర్డు చైర్మన్‌కు మాజీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి వినతి

సాక్షి, న్యూఢిల్లీ: దక్షిణ మధ్య రైల్వేలో గడిచిన మూడేళ్లుగా నియామకాల్లేవని, వెంటనే నియామక ప్రక్రియను ప్రారంభించాలని మంగళవారం కేంద్ర రైల్వే బోర్డు చైర్మన్ వినోద్‌కుమార్‌యాదవ్‌కు మాజీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి విజ్ఞప్తిచేశారు. ఆయన వెంట ఏపీ పీఏసీ చైర్మన్ బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి కూడా ఉన్నారు. ఉద్యోగాల కోసం యువత ఆందోళన వ్యక్తం చేస్తున్నా ఒక్క నోటిఫికేషన్ కూడా వెలువడకపోవడం దారుణమన్నారు. 2014 నోటిఫికేషన్‌కు సంబంధించి ఇప్పటికీ నియామక ప్రక్రియ పూర్తికాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టాన్నను సరించి రైల్వే జోన్ ఏర్పాటుకు ఆరు నెలల్లో అధ్యయనం చేసి వెంటనే నిర్ణయం తీసుకోవాల్సి ఉండగా.. నాలుగున్నరేళ్లయినా ఇంకా నిర్ణయం వెలువడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వానికి రైల్వే జోన్ ఏర్పాటు చేసే ఉద్దేశం లేదని ఏపీ ప్రజలు భావిస్తారని చెప్పారు. వాజ్‌పేయి హయాంలో ఒకేసారి ఏడు జోన్లు ఏర్పాటైన విషయాన్ని గుర్తుచేశారు. ప్రకాశం జిల్లాలో రైల్వే భూముల్లో 1927 నుంచి నివసిస్తున్న అన్నవరప్పాడు హట్ పీపుల్స్ అసోసియేషన్ ప్రజలకు ఆయా స్థలాలలను బదిలీ చేసేందుకు రైల్వేశాఖ అంగీకరించిందని తెలిపారు. రూ.80 వేలుగా నిర్ణయించిన భూమి ధరను.. అనంతరం రూ.1.05 కోట్లకు పెంచిందని, ఇదంతా చెల్లించాక రూ.25 కోట్లుగా నిర్ధారించిందన్నారు. అక్కడి ప్రజల పేదరికాన్ని దృష్టిలో పెట్టుకుని ఇప్పటికే చెల్లించిన ధరకే వారికి పట్టాలివ్వాలని కోరారు.

కృష్ణానదిలో మునిగిన బల్లకట్టు

- తప్పిన ప్రాణనష్టం
- మునిగిపోయిన లారీ, మినీ లారీ, ఆటో



బల్ల మునుగుతున్న సమయంలో బైక్‌లను ఒడ్డుకు తీసుకువస్తున్న సిబ్బంది

అచ్చంపేట(పెదకూరపాడు)/ చందర్లపాడు(నందిగామ): కృష్ణానదిపై భారీ వాహనాలను సైతం తరలించే బల్లకట్టు, దానిపై ఉన్న లోడ్ లారీ, ఒక టాటా ఏస్ మినీ లారీ, ఒక ఆటో పూర్తిగా మునిగిపోయాయి. గుంటూరు జిల్లా అచ్చంపేట మండలంలోని పుట్లగూడెం గ్రామానికి ఆవలి ఒడ్డున ఉన్న కృష్ణా జిల్లా గుడిమెట్ల వద్ద మంగళవారం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కృష్ణా జిల్లా పెద్దారం వద్ద గల బీరు ఫ్యాక్టరీకి గుంటూరు జిల్లా నుంచి మొక్కజొన్న పౌడర్‌ను కృష్ణానదిపై నడిచే బల్లకట్టుపై లారీలలో తరలిస్తూ ఉంటారు. అదే విధంగా ఫ్యాక్టరీ నుంచి వచ్చే వ్యర్థాన్ని లారీలలో గుంటూరు జిల్లాకు తరలిస్తూ ఉంటారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఫ్యాక్టరీ నుంచి వచ్చే లారీని గుడిమెట్ల వద్ద కృష్ణానదిపై నడిచే బల్లకట్టు పైకి ఎక్కించే క్రమంలో బల్లకట్టు జారిపోకుండా కట్టే తాడు తెగిపోయింది. జేసీబీతో ఒడ్డుకు లాగే ప్రయత్నం చేసినప్పటికీ ఫలించలేదు. దీంతో బల్లకట్టు మునిగిపోయింది. దానితో పాటు లారీ, అంతకుముందే ఎక్కించిన టాటా ఏస్ మినీ లారీ, ఒక ఆటో కూడా పూర్తిగా నదిలో మునిగిపోయాయి. ప్రమాదాన్ని గుర్తించిన లారీ, ఆటో డ్రైవర్లు, బల్లకట్టు డ్రైవర్లు నదిలోకి దూకి ఈదుకుంటూ సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. సాధారణంగా బల్లకట్టుపై ప్రయాణికులను కూడా ఎక్కించేవారు. అయితే ప్రమాదం జరిగే సమయంలో బల్లకట్టుపై ప్రయాణికులు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. బల్లకట్టుకు కట్టిన తాళ్లు సక్రమంగా లేకపోవడం, సరైన ఇంధన సదుపాయాలు లేకుండా ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ఉండటమే ప్రమాదానికి కారణమని అధికారులు భావిస్తున్నారు. బల్ల కట్టు మునిగిందన్న సమాచారం అందుకున్న తహసీల్దార్లు ఆంజనేయులు, జి.కరుణకుమార్, ఎస్‌ఐ సుబ్రహ్మణ్యం హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని ప్రమాద కారణాలను తెలుసుకున్నారు. నందిగామ నుంచి ఎక్స్‌కవేటర్‌లను తెప్పించి నీట మునిగిన బల్లకట్టును పైకిలేపే పనులు ప్రారంభించారు.

డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమా?

పంటు మునిగి పోవడానికి దానిని నడుపుతున్న డ్రైవర్ అలసత్వం కూడా కారణంగా కనిపిస్తోంది. లోడ్ లారీలు బల్లకట్టు ఎక్కే సమయంలో దానికి ఉన్న ఇంజన్‌ను రేజ్ చేసి ఒడ్డుకు పట్టి ఉంచుతారు. బల్లకట్టు ఇంజన్ ఆపి ఉన్న సమయంలోనే లారీ ఒక్కసారిగా వెనక్కి వచ్చి ఒక పక్కకు ఎక్కడంతో పంటు కుదుపులకు గురైనట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు.

విజయవాడలో ఏఐసీసీ వర్కింగ్ కమిటీ భేటీ?

సాక్షి, అమరావతి: కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీ (ఏఐసీసీ) సమావేశం విజయవాడలో నిర్వహించేందుకు ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి ఊమెన్ చాందీ, పీసీసీ అధ్యక్షుడు ఎన్.రఘువీరారెడ్డి మంగళవారం ఢిల్లీలో రాహుల్ గాంధీని కలిశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశాన్ని విజయవాడలో నిర్వహించాలని రఘువీరారెడ్డి ప్రతిపాదించారు. అలాగే ప్రత్యేక హోదా పేరిట రాష్ట్రంలో త్వరలో చేపట్టనున్న భరోసా ప్రజాయాత్రలో పాల్గొనాలని ఈ సందర్భంగా రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీలను ఆహ్వానించారు.

ముగిసిన దీదీ ధర్నా

సుప్రీంకోర్టు ఆదేశాలతో మమతా బెనర్జీ నిర్ణయం

- సీబీఐ విచారణకు హాజరు కావాల్సిందిగా కమిషనర్ రాజీవ్‌కు సుప్రీం కోర్టు ఆదేశం
- ఆయనను అరెస్టు చేయడం వంటి బలవంతపు చర్యలొద్దని సీబీఐకి ఉత్తర్వులు
- రాజీవ్‌పై చర్యలకు బెంగాల్ సీఎస్‌ను ఆదేశించిన కేంద్ర హోం శాఖ
- ఈ తీర్పు తమకు నైతిక విజయమని చెప్పుకున్న మమత, బీజేపీ



ధర్నా ముగిశాక అక్కడి నుంచి వెళ్లిపోతున్న బెంగాల్ సీఎం మమతా బెనర్జీ

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీల మధ్య నెలకొన్న వివాదం మంగళవారం సుప్రీంకోర్టు తీర్పుతో తాత్కాలికంగా సద్దుమణిగింది. శారదా చిట్‌ఫండ్ కుంభకోణానికి సంబంధించి సీబీఐ విచారణకు సహకరించాలని కోల్‌కతా పోలీస్ కమిషనర్ రాజీవ్ కుమార్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది. అలాగే రాజీవ్ ను అరెస్టు చేయడం వంటి బలవంతపు చర్యలేవీ చేపట్టకుండా సీబీఐని కోర్టు నిలువరించింది. తీర్పు తమకు అనుకూలంగా ఉన్నందున ఆదివారం రాత్రి నుంచి తాను చేపట్టిన ధర్నాను విరమిస్తున్నట్లు మంగళవారం సాయంత్రం మమతా బెనర్జీ ప్రకటించారు. అయితే ఈ తీర్పు పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ ప్రభుత్వానికి చెంప పెట్టు అనీ, సీబీఐకి లభించిన నైతిక విజయమని బీజేపీ పేర్కొంది. మరోవైపు రాజీవ్ కుమార్‌పై సీబీఐ చర్యలను అడ్డుకోవాలంటూ బెంగాల్ ప్రభుత్వం వేసిన పిటిషన్‌పైన కలకత్తా హైకోర్టు కూడా విచారణ ప్రారంభించి, కేసు సుప్రీం కోర్టులో విచారణలో ఉన్న కారణంగా గురువారం వరకు వాయిదా వేసింది. అయితే రాజీవ్ తన ఉద్యోగ నియమాలను ఉల్లంఘించి క్రమశిక్షణ తప్పి ప్రవర్తించారనీ, ఆయనపై చర్యలు తీసుకోవాలంటూ కేంద్రం బెంగాల్ ప్రభుత్వాన్ని ఆదేశించడం మరో కొత్త వివాదానికి దారి తీసేలా కనిపిస్తోంది.


మా నైతిక విజయమిది: మమత

అరెస్టు చేయడం సహా రాజీవ్ కుమార్‌పై బలవంతపు చర్యలేవీ తీసుకోకుండా సీబీఐని సుప్రీంకోర్టు నిలువరించడం తమకు లభించిన నైతిక విజయమని మమత పేర్కొన్నారు. తీర్పు తమకు అనుకూలంగా ఉంది కాబట్టి ప్రతిపక్షాల సలహా మేరకు మూడ్రోజులుగా చేపట్టిన ధర్నాను విరమించినట్లు ఆమె ప్రకటించారు. 'కోర్టు ఉత్తర్వులు సామాన్యుడికి, ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి లభించిన విజయం. మాది ప్రజా ఉద్యమం. మేం ఐక్యంగా పోరాడతాం. మేం చట్టాన్ని ఎల్లప్పుడూ గౌరవిస్తాం.' అని మమత చెప్పారు. కేంద్ర సంస్థలను ఉపయోగించుకుని బీజేపీ తమను వ్యతిరేకించే వారిని బ్లాక్‌మెయిల్ చేస్తోందని ఆమె ఆరోపించారు. ఈ విషయాన్ని ఇక్కడితో వదిలేయననీ, మోదీని గద్దె దింపేవరకు పోరాడుతానని మమత శపథం చేశారు. ఇక తన పోరాటాన్ని ఢిల్లీలో కొనసాగిస్తానని చెప్పారు. సీబీఐ అంటే తనకు గౌరవం ఉందనీ, రవీంద్రనాథ్ ఠాగూర్ నోబెల్ పతకం దొంగతనం కేసును కూడా ఆ సంస్థ ఇంతే ఉత్సాహంతో దర్యాప్తు చేయాలని మమత కోరారు. అయితే ప్రధాని మోదీ, బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా ఆదేశాలను మాత్రమే సీబీఐ పాటిస్తోందని మమత ఆరోపించారు. 'దీని వెనుక ఓ కథ ఉంది. అదేంటంటే మోదీకి వ్యతిరేకంగా ఎవ్వరూ గొంతెత్తి మాట్లాడకూడదు. ఎవరైనా అలా చేస్తే వారిపై సీబీఐ, ఈడీ, ఐటీ దాడులు జరుగుతాయి. అదే వ్యక్తులు బీజేపీలో చేరగానే ఇక వాళ్ల జోలికి ఎవరూ వెళ్లరు' అని మమత పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏపీ సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, మోదీ ప్రభుత్వంపై పోరుకు ప్రణాళికలు రచించేందుకు ఈనెల 13, 14 తేదీల్లో ఢిల్లీలో విపక్షాల సమావేశం ఉంటుందన్నారు.

మమతకు చెంపపెట్టు: బీజేపీ

సుప్రీం తీర్పు మమతకు చెంపపెట్టు లాంటిదనీ, సీబీఐకి ఇది నైతిక విజయమని బీజేపీ పేర్కొంది. కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ కోర్టు తీర్పును స్వాగతిస్తూ 'పోలీస్ కమిషనర్ సహా చట్టానికి ఎవరూ అతీతులు కారు' అని అన్నారు. ఇదిలాఉండగా, ఉద్యోగ నియమాలను ఉల్లంఘించినందుకు రాజీవ్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని బెంగాల్ ప్రభుత్వాన్ని కేంద్ర హోం శాఖ ఆదేశించింది. కొందరు పోలీసు అధికారులతో కలిసి మమత ధర్నాలో రాజీవ్ కూడా పాల్గొన్నట్లు తమకు సమాచారం వచ్చిందనీ, ఇది నిబంధనలకు విరుద్ధం కాబట్టి ఆయనపై చర్యలు తీసుకోవాలని బెంగాల్ ప్రధాన కార్యదర్శి మలయ్ కుమార్‌ను కోరింది.

చల్లగా ఉంటుంది.. షిల్లాంగ్‌లో విచారించండి



అనవసరమైన వివాదాలకు దూరంగా ఉండేందుకు రాజీవ్ కుమార్‌ను తటస్థ ప్రదేశమైన మేఘాలయ రాజధాని షిల్లాంగ్‌లో విచారించాలని సుప్రీం కోర్టు సీబీఐకి సూచించింది. సీబీఐ పిలిచిన తేదీల్లో షిల్లాంగ్‌కు వెళ్లి విచారణకు హాజరు కావాలని రాజీవ్‌ను ఆదేశించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్‌తోపాటు జస్టిస్ దీపక్ గుప్తా, జస్టిల్ సంజీవ్ ఖన్నాలతో కూడిన బెంచ్ ఈ తీర్పు చెప్పింది. 'షిల్లాంగ్‌కు వెళ్లండి. అక్కడ చల్లగా ఉంటుంది. ఇరుపక్షాలూ ప్రశాంతంగా ఉంటారు' అని న్యాయమూర్తులు సరదాగా అన్నారు. రాజీవ్ కుమార్ విచారణకు గైర్హాజరవడానికి కారణమేమీ లేదనీ, కాబట్టి ఆయనపై బలవంతపు చర్యలేవీ వద్దని కోర్టు పేర్కొంది. శారదా చిట్‌ఫండ్ కుంభకోణం దర్యాప్తుకు సంబంధించిన కీలక ఆధారాలు, సాక్ష్యాలను రాజీవ్ నాశనం చేశారనీ ఆరోపిస్తూ, ఆయనను విచారించేందుకు అనుమతించాల్సిందిగా సీబీఐ సుప్రీంకోర్టులో పిటిషన్ వేయడం తెలిసిందే. ఈ కేసులను ఓ ప్రత్యేక బృందం (సిట్) అప్పట్లో రాజీవే పర్యవేక్షణలోనే దర్యాప్తు చేసింది. రాజీవ్ సాక్ష్యాలను నాశనం చేయడానికి ఏ కొంచెమైనా ప్రయత్నించినట్లు తేలితే ఆయన పశ్చాత్తాప పడేలా తమ చర్యలుంటాయని సుప్రీంకోర్టు సోమవారమే హెచ్చరించింది. కోర్టు ధిక్కారానికి పాల్పడ్డారంటూ రాజీవ్‌తోపాటు బెంగాల్ ప్రధాన కార్యదర్శి, డీజీపీల పేర్లను కూడా సీబీఐ పిటిషన్‌లో పేర్కొంది. దీంతో వీరంతా ఫిబ్రవరి 18లోపు తమ స్పందన తెలియజేయాలనీ, ఆ తర్వాత అవసరమైతే ఫిబ్రవరి 20న వ్యక్తిగతంగా కోర్టుకు రావాల్సి ఉంటుందని న్యాయమూర్తులు పేర్కొన్నారు. కేంద్రం తరఫున అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాలు, బెంగాల్ పోలీస్ తరఫున ఏఎం సింఘ్వీ వాదనలు వినిపించారు. చిట్‌ఫండ్ కుంభకోణాలకు సంబంధించి సీబీఐకి బెంగాల్ పోలీసులు ఇచ్చిన సాక్ష్యాలు, ఆధారాలు అసలైనవి కాదనీ, కాల్‌డేటాలో కొంత సమాచారాన్ని తొలగించడం వంటి అక్రమాలు జరిగాయని సుప్రీంకోర్టుకు సీబీఐ తెలిపింది. అధికార తృణమూల్‌కు సన్నిహితులు, లేదా సంబంధీకులు చిట్‌ఫండ్ కుంభకోణాల కేసుల్లో అరెస్టయ్యారని వేణుగోపాల్ కోర్టుకు తెలిపారు. విచారణకు హాజరు కావాలని రాజీవ్‌కు మూడుసార్లు సీబీఐ నోటీసులు పంపినా ఆయన స్పందించలేదని ఏజీ తెలిపారు.

బెంగాల్ ఎపిసోడ్‌తో ఎవరికి లాభం?

బీజేపీకి లాభిస్తుందని కమలనాథుల ఆశ • మమత ఫైర్ ఓట్లు తెస్తుందనుకుంటున్న తృణమూల్

సాక్షి, నేషనల్ డెస్క్: పశ్చిమబెంగాల్ రాజకీయాల్లో 'దీదీ వర్సెస్ మోదీ' తాజా ఎపిసోడ్ ఎలాంటి మార్పులు తీసుకురాబోతోందన్నది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఈ మొత్తం వ్యవహారంలో రాజకీయంగా లాభపడేది బీజేపీయేనని, బెంగాల్ రాజకీయాల్లో వేళ్లూనుకోవాలనే ఆ పార్టీ ఆకాంక్ష ఈ 'ఘర్షణ'తో తీరనుందని విశ్లేషకుల అంచనా. శారద స్కామ్ విచారణ ఎలా జరగనుంది?, సుప్రీంకోర్టు తీర్పు పరిణామాలేంటి? అనే విషయాలను పక్కనబెట్టి.. కేవలం రాజకీయ కోణంలో ఈ ఘర్షణను విశ్లేషిస్తే.. అంతిమంగా ఇది బీజేపీకి జాక్‌పాట్ లాంటిదేనన్న వాదన వినిపిస్తోంది. రాష్ట్రంలో జీరోతో ప్రారంభమైన బీజేపీ ఉనికికి దీనివల్ల వచ్చే ప్రమాదమేమీ లేదని, పెరిగే సానుకూల ఓటు.. సీట్ల సంఖ్యను పెంచుకునేలా బీజేపీకి లాభిస్తుందని వాదిస్తున్నారు. 'రాష్ట్రంలో కాంగ్రెస్, లెఫ్ట్ ఫ్రంట్‌లు ఇంకా ఉనికిని చాటుకునే ప్రయత్నాల్లోనే ఉన్నాయి. తృణమూల్‌కు బీజేపీ, ఆ పార్టీ అధినేత్రి మమత బెనర్జీకి మోదీ.. బలమైన ప్రత్యర్థులుగా అవతరించారు. ప్రజల్లోనూ ఆ భావన వ్యక్తమవుతోంది. మమతను, తృణమూల్‌ను ఎదుర్కొనే సత్తా మోదీ, షా నేతృత్వంలోని బీజేపీకే సాధ్యమనుకుంటున్నారు. శారద స్కామ్‌లో కోల్‌కతా పోలీస్ కమిషనర్‌ను సీబీఐ ప్రశ్నించడాన్ని మమత అడ్డుకోవడం.. అవినీతికి మద్దతివ్వడమేనన్న భావన కూడా బలంగా వ్యక్తమవుతోంది. ఇదంతా బీజేపీకే లాభిస్తుంది. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ కనీసం 10 నుంచి 15 సీట్లు గెలుచుకోగలదు' అని బెంగాల్ రాజకీయాలపై అవగాహన ఉన్న ఒక విశ్లేషకుడు వివరించారు. బీజేపీని అడ్డుకునేందుకు మమత శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. బీజేపీ జాతీయ నేతల సభలు రాష్ట్రంలో జరగనివ్వకుండా అధికారికంగా, రాజకీయంగా ప్రయత్నిస్తున్నారు. డిసెంబర్‌లో బీజేపీ తలపెట్టిన రథయాత్రకు అనుమతి ఇవ్వలేదు. ఇటీవల ఒక బహిరంగ సభలో పాల్గొనేందుకు బీజేపీ చీఫ్ అమిత్ షా వచ్చిన చాపర్ ల్యాండింగ్‌ను, సోమవారం మరో రాష్ట్ర(యూపీ) ముఖ్యమంత్రి అయిన ఆదిత్యనాథ్ హెలికాప్టర్ ల్యాండింగ్‌ను అడ్డుకున్నారు. మరోవైపు, సీబీఐ అధికారుల విధులను అడ్డుకుని, వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇవన్నీ రాష్ట్రంలో బీజేపీ బలోపేతం కావడాన్ని తట్టుకోలేక, మమత నిరాశ, నిస్పృహలతో చేస్తున్న చర్యలుగా భావిస్తున్నారు. మరోవైపు, లెఫ్ట్‌ఫ్రంట్, కాంగ్రెస్‌ల నిస్తేజం నేపథ్యంలో.. రాష్ట్రంలోని మమత వ్యతిరేక వర్గాలు బీజేపీకి అనుకూలంగా మారే పరిస్థితి కనిపిస్తోంది. వేలాది రాష్ట్ర ప్రజలు బాధితులుగా ఉన్న ఒక కుంభకోణానికి సంబంధించిన విచారణను ఆమె అడ్డుకోవడం సరికాదనే అభిప్రాయం ఉంది. ఆ విచారణలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఒక పోలీసు అధికారికి మద్దతుగా నిలవడం.. రాజకీయంగా తటస్థులైన వారిలోనూ మమత పట్ల వ్యతిరేకత పెంచుతోందని భావిస్తున్నారు.

తెరపైకి ఫైర్ బ్రాండ్..

లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వ హయాంలో మమతలో కనిపించిన ఫైర్, ఉద్యమ వైఖరి, ప్రజా పోరాటాలు నిర్వహించిన నాటి ఆవేశం.. మళ్లీ ఈ ధర్నాతో మరోసారి వెలుగులోకి వచ్చాయని మరికొందరి భావన. ఇన్నాళ్లు స్తబ్దుగా ఉన్న ఈ ఫైర్ బ్రాండ్ వ్యక్తిత్వం.. ఎన్నికల ముందు.. ఒక్కసారిగా తెరపైకి రావడం తృణమూల్‌కు లాభిస్తుందని, కార్యకర్తల్లో మనోస్థైర్యం పెరుగుతుందనే విశ్లేషణ కూడా వినిపిస్తోంది. ఆదివారం రాత్రి నుంచి ధర్నా వేదికపై మమత చూపిన ఆవేశం కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం తెచ్చింది. టాటా నానో ప్లాంట్‌కు వ్యతిరేకంగా సింగూరు రైతుల కోసం 12 ఏళ్ల క్రితం ఇదే వేదికపై 25 రోజులపాటు నిరాహార దీక్ష చేసిననాటి ఉద్యమ నేత మమత ఇప్పుడు ఈ దీక్షతో మళ్లీ ప్రత్యక్షమైందని కార్యకర్తలు అంటున్నారు.



ఐస్‌ల్యాండ్‌లోని గ్రాండార్ఫ్‌జోరార్ గ్రామంలో తెల్లవారుజామున ఆకాశంలో కనువిందుచేసిన ధృవ కాంతులు. భూమి ఉపరితల ఆవరణంలోని వాయు అణువులు, సూర్యకాంతిలోని ఆవేశిత అణువుల తాడనంతో శక్తి ఉద్భవిస్తుంది. దాంట్లో కొంతభాగం ఇలా ప్రకాశవంతంగా మెరుస్తుంది.

ఉద్ధవ్ ఠాక్రేతో ప్రశాంత్ కిశోర్ భేటీ

ముంబై: జనతాదళ్(యు) ఉపాధ్యక్షుడు, రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ మంగళవారం శివసేన అధినేత ఉద్ధవ్ ఠాక్రేతో భేటీ అయ్యారు. సేన– బీజేపీ సంబంధాలు దిగజారిన నేపథ్యంలో ఈ ఎన్డీఏ కూటమి పార్టీల నేతల సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే, ఈ సమావేశంలో చర్చించిన వివరాలను వెల్లడించేందుకు శివసేన నిరాకరించింది. 'ఎన్డీఏలో భాగంగానే, వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించేందుకు మహారాష్ట్రలో మీతో కలిసి పనిచేయాలని ఉంది' అంటూ ప్రశాంత్ కిశోర్ అంతకుముందు ట్విట్టర్‌లో పేర్కొనగా ఆయన్ను ముంబైలోని శివసేన కార్యాలయం 'మాతోశ్రీ'కి ఆహ్వానిస్తూ శివసేన యువజన విభాగం అధ్యక్షుడు ఆదిత్య ఠాకరే బదులిచ్చారు. ఉద్ధవ్, ప్రశాంత్ కిశోర్‌ల భేటీ ఫొటోలను ఆదిత్య ఠాకరే ట్విట్టర్‌లో ఉంచారు. శివసేన మహారాష్ట్రలోని బీజేపీ ప్రభుత్వంతోపాటు కేంద్రంలోనూ భాగస్వామిగా ఉంది.

దీక్ష విరమించిన అన్నా హజారే



హజారేతో దీక్ష విరమింపజేస్తున్న ఫడ్నవిస్

రాలేగావ్‌సిద్ధి: లోక్‌పాల్, లోకాయుక్త వ్యవస్థల ఏర్పాటు కోసం ఆందోళన చేస్తున్న ప్రముఖ సామాజిక కార్యకర్త అన్నా హజారే(81) మంగళవారం తన దీక్షను విరమించారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, కేంద్ర మంత్రులు రాధామోహన్ సింగ్, సుభాష్ భామ్రేలతో సుదీర్ఘంగా జరిపిన చర్చలు విజయవంతం కావడంతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. అహ్మద్‌నగర్ జిల్లాలోని స్వగ్రామం రాలేగావ్‌సిద్ధిలో హజారే జనవరి 30 నుంచి దీక్ష చేస్తున్న సంగతి తెలిసిందే. ఫడ్నవీస్, కేంద్ర మంత్రులతో జరిపిన చర్చలు సఫలమయ్యాయని హజారే విలేకర్లకు చెప్పారు. హజారే డిమాండ్లకు ప్రభుత్వం అంగీకరించిందని, లోక్‌పాల్ ఏర్పాటు ప్రక్రియ త్వరలోనే ప్రారంభమవుతుందని ఫడ్నవీస్ తెలిపారు.

తెల్‌తుంబ్డెను 12 వరకూ అరెస్టు చేయం

ముంబై: ఎల్గార్ పరిషత్– భీమా కోరెగావ్ కేసులో నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న సామాజిక కార్యకర్త ఆనంద్ తెల్‌తుంబ్డెను ఈనెల 12 అర్ధరాత్రి వరకూ అరెస్టు చేయబోమని బాంబే హైకోర్టుకు పుణె పోలీసులు తెలిపారు. విచారణ పేరుతో పుణె పోలీసులు తన హక్కులను కాలరాస్తూ వేధింపులకు పాల్పడుతున్నారని తెల్‌తుంబ్డె దాఖలు చేసిన పిటిషన్‌పై కోర్టు మంగళవారం విచారణ జరిపింది. భీమాకోరెగావ్ కేసులో పోలీసులు అరెస్టు చేయకుండా ముందస్తు బెయిల్‌కోసం ఆనంద్ తెల్‌తుంబ్డె హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 2018 జనవరి 1న పుణె సమీపంలోని కోరెగావ్ భీమా గ్రామంలో జరిగిన హింసాత్మక ఘటనల వెనుక తెల్‌తుంబ్డె విద్వేషపూరిత ప్రసంగాలు ఉన్నట్లు పోలీసులు ఆరోపిస్తున్నారు.

అప్పీల్‌కు వెళ్లనున్న మాల్యా

లండన్: బ్యాంకులను మోసగించిన కేసు విచారణ కోసం తనను భారత్‌కు అప్పగించేందుకు బ్రిటన్ తీసుకున్న నిర్ణయంపై అప్పీల్‌కు వెళ్తానని మద్యం వ్యాపారి విజయ్ మాల్యా స్పష్టం చేశాడు. హైకోర్టులో తీర్పు రావడానికి చాలా కాలమే పడుతుందని న్యాయ నిపుణులు అంటున్నారు. మాల్యాను భారత్‌కు పంపేందుకు వెస్ట్‌మినిస్టర్ మేజిస్ట్రేట్ కోర్టు డిసెంబర్‌లో తీర్పునివ్వగా, అందుకు సంబంధించిన పత్రాలపై బ్రిటన్ హోం మంత్రి సంతకం చేయడం తెలిసిందే. మాల్యా ఈనెల 17లోపు కోర్టులో అప్పీల్ చేసుకోవచ్చు.

అవినీతిని దాచేందుకు సీఎం ధర్నానా: యోగి

- జార్ఖండ్ నుంచి పశ్చిమ బెంగాల్‌కు రోడ్డు మార్గంలో ప్రయాణం

పురూలియా: అవినీతి అధికారిని కాపాడేందుకు పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రయత్నిస్తున్నారని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆరోపించారు. అవినీతి, అక్రమాలను దాచడానికి ఒక ముఖ్యమంత్రే ధర్నాకు దిగడం కన్నా సిగ్గుచేటు, రాజ్యాంగవిరుద్ధ పని మరొకటి లేదని ధ్వజమెత్తారు. బెంగాల్‌లో దిగేందుకు తన హెలికాప్టర్‌కు అనుమతివ్వకపోవడంతో ఆదిత్యనాథ్ మంగళవారం జార్ఖండ్ నుంచి రోడ్డు మార్గం ద్వారా వెళ్లి పురూలియాలో జరిగిన ర్యాలీలో ప్రసంగించారు. కోల్‌కతాలో సీబీఐ– బెంగాల్ పోలీసుల మధ్య హైడ్రామా నడిచిన నేపథ్యంలో ముఖ్యమంత్రి మమతా బెనర్జీని లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించారు. బెంగాల్‌లో బీజేపీ అధికారంలోకి వచ్చాక తృణమూల్ గూండాలను జైలులో పెడతామని, క్షమాభిక్ష కోసం వారు ప్రాధేయపడాల్సి ఉంటుందని హెచ్చరించారు. యూపీ సీఎం పర్యటనపై మమతా బెనర్జీ స్పందిస్తూ.. ఇతర రాష్ట్రాల్లో తిరగడానికి బదులు సొంత రాష్ట్రంపై దృష్టిపెట్టాలని యోగికి హితవు పలికారు.

వాగ్వాదాలు.. నిరసనలు

- పార్లమెంటు ఉభయ సభల్లో అంతరాయం
- మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదంటూ కాంగ్రెస్ వాకౌట్



లోక్‌సభ నుంచి వెళ్లిపోతున్న తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు

న్యూఢిల్లీ: సీబీఐ వివాదంపై మంగళవారం కూడా పార్లమెంట్ కార్యకలాపాలకు అంతరాయం కలిగింది. లోక్‌సభలో అధికార, ప్రతిపక్ష సభ్యులు తీవ్ర వాగ్వాదం చోటుచేసుకోగా విపక్షాల నిరసనలతో రాజ్యసభ కార్యక్రమాలు పూర్తిగా స్తంభించాయి. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యావాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరపాలని లోక్‌సభలో అధికార పక్షం పట్టుబట్టగా సీబీఐని కేంద్రం దుర్వినియోగం చేస్తోందంటూ తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) సభ్యులు నిరసన కొనసాగించారు. దీంతో ఇరుపక్షాల నేతల మధ్య తీవ్ర వాగ్యుద్ధంతో సభ మూడుసార్లు వాయిదాపడింది. ప్రధాన ప్రతిపక్షమైన తమకు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదంటూ మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ సభ్యులు వాకౌట్ చేశారు. ఒకవైపు, ఇలా గందరగోళం కొనసాగుతుండగా స్పీకర్ సుమిత్రా మహాజన్ పదేపదే విజ్ఞప్తులు చేసినప్పటికీ తృణమూల్ కాంగ్రెస్ సభ్యులు వెల్‌లో నినాదాలు కొనసాగించారు. 'అవినీతి– సంఘ వ్యతిరేక శక్తులు' ఏకమై ప్రధాని మోదీకి వ్యతిరేకంగా ఏకమయ్యాయంటూ బీజేపీకి చెందిన హుకుందేవ్ నారాయణ్ యాదవ్ వ్యాఖ్యానించగానే ప్రతిపక్ష సభ్యులంతా లేచి నిలబడి ఆ వ్యాఖ్యలను తొలగించాలంటూ పట్టుబట్టారు. ఇదే సమయంలో అపురూప పొద్దార్ (టీఎంసీ), వీణా దేవి(ఎల్‌జేపీ)లు పరస్పరం బెదిరించుకుంటూ సైగలు చేసుకోవడంతో మిగతా సభ్యులు జోక్యం చేసుకుని వారిని వారించారు. రాజ్యసభలో.. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యావాదాలు తెలిపే తీర్మానాన్ని చర్చకు చేపట్టాలని అధికార పక్షం పట్టుబట్టగా సీబీఐని ప్రభుత్వం వాడుకోవడంపై చర్చించాలంటూ టీఎంసీ, కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ సభ్యులు నినాదాలతో అంతరాయం కలిగించారు. దీంతో డిప్యూటీ చైర్మన్ హరివంశ్ సభను బుధవారానికి వాయిదా వేశారు.

రైతుల స్థితిగతులపై దేశవ్యాప్త సర్వే

న్యూఢిల్లీ: రైతుల స్థితిగతుల వివరాలు తెలుసుకునేందుకు కేంద్రం దేశవ్యాప్తంగా సర్వే చేపట్టనుంది. ఈ ఏడాది పంట కాలంలో రైతుల ఆదాయం, వ్యయం, రుణాలు తదితర వివరాలు సేకరించనుంది. వ్యవసాయదారుల పరిస్థితిపై 77వ రౌండ్ నేషనల్ శాంపుల్ సర్వే (ఎన్‌ఎస్‌ఎస్) కాలంలో అధ్యయనం నిర్వహించనున్నట్లు మంగళవారం కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ లోక్‌సభలో రాతపూర్వకంగా తెలిపారు. దేశవ్యాప్తంగా ఇలాంటి సర్వేను చివరిసారిగా ఎన్‌ఎస్‌ఎస్‌వో 2012–2013 పంట కాలానికి చేపట్టింది. కాబట్టి 2014–2018 మధ్య కాలంలో రైతుల స్థితిగతుల వివరాలు అందుబాటులో లేవని లోక్‌సభకు గజేంద్ర సింగ్ తెలిపారు. అందుబాటులో ఉన్న డేటా, వనరుల, ఉద్యోగుల లభ్యత తదితర అంశాలను బట్టి ఈ సర్వే కాల వ్యవధి ఉంటుందని చెప్పారు. 2020 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేసే ఉద్దేశంతో ఏర్పాటైన కేంద్ర మంత్రుల కమిటీ 70వ రౌండ్ ఎన్‌ఎస్‌ఎస్ అధ్యయనం డేటా వివరాలను లెక్కలోకి తీసుకున్నట్లు ఆయన తెలిపారు.

రాహుల్ ఆఫీస్ పక్కనే ప్రియాంకకు



గది బయట ప్రియాంకా గాంధీ వాద్రా పేరుతో ఉన్న బోర్డు

న్యూఢిల్లీ: కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా ఇటీవల నియమితురాలైన ప్రియాంకా గాంధీ వాద్రాకు అక్బర్ రోడ్‌లోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో ప్రత్యేక గదిని కేటాయించారు. సోదరుడు, పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ కార్యాలయం పక్కనే ఉన్న ఈ చాంబర్‌ను ఆమెకు ఇవ్వడం విశేషం. పార్టీ ఉపాధ్యక్షుడిగా ఉన్న సమయంలో రాహుల్ సైతం ఇదే కార్యాలయం నుంచి పనిచేశారు. అంతకుముందు ఇది కాంగ్రెస్ నేతలు ఏకే ఆంటోనీ, జనార్దన్ ద్వివేది, సుశీల్ కుమార్ షిండేల కార్యాలయంగా ఉండేది. గత నెలలోనే ప్రియాంకను పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమించడంతోపాటు, ప్రధాని మోదీ నియోజకవర్గం వారణాసి, యూపీ సీఎం ఆదిత్యనాథ్‌కు గట్టి పట్టున్న గోరఖ్‌పూర్ ఉన్న ఉత్తరప్రదేశ్ తూర్పు విభాగం ఇన్‌చార్జిగా రాహుల్ ప్రకటించిన విషయం తెలిసిందే. సోమవారమే అమెరికా నుంచి వచ్చిన ప్రియాంక వెంటనే రాహుల్‌తో సమావేశమయ్యారు. ఈ భేటీకి పార్టీ యూపీ తూర్పు ఇన్‌చార్జి జ్యోతిరాదిత్య సింధియా కూడా హాజరయ్యారు. మంగళవారం ఆమె యూపీ సీనియర్ నేతలతో అనధికారికంగా సమావేశమైనట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. పార్టీ పటిష్టానికి తీసుకోవాల్సిన చర్యలు, ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై ఆమె వారితో చర్చించారన్నాయి. గురువారం రాష్ట్రాల ఇన్‌చార్జులు, ప్రధాన కార్యదర్శులతో జరిగే సమావేశంలో ప్రియాంక పాల్గొననున్నారు.

ఇస్లాం గడ్డపై కేథలిక్‌ల బహిరంగ సభ

- 1.70 లక్షల మంది హాజరు
- ప్రసంగించిన పోప్ ఫ్రాన్సిస్

అబుధాబీ: ఇస్లాం గడ్డపై తొలిసారి పర్యటిస్తున్న క్రైస్తవ మత గురువు పోప్ ఫ్రాన్సిస్ చారిత్రాత్మక కేథలిక్‌ల బహిరంగ సభలో పాల్గొన్నారు. మంగళవారం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ రాజధానిలోని జాయేద్ స్పోర్ట్స్ సిటీ స్టేడియంలో జరిగిన ఈ సభకు సుమారు 1.70 లక్షల మంది కేథలిక్‌లు హాజరయ్యారు. ఓపెన్ టాప్ వాహనంలో వాటికన్ జెండాలను ఎగురవేస్తూ పోప్ స్టేడియంలోకి ప్రవేశించారు. స్టేడియంలో సుమారు 50 వేల మంది కేథలిక్‌లు ఉండగా.. స్టేడియం బయట ఏర్పాటుచేసిన పెద్ద పెద్ద స్క్రీన్ల ద్వారా పోప్ ప్రసంగాన్ని మరో 1.20 లక్షల మంది వీక్షించారు. సుమారు 4 వేల మంది ముస్లింలకు కూడా సభకు సంబంధించిన టికెట్లను విక్రయించినట్లు స్థానిక చర్చి అధికారులు తెలిపారు. సభకు భారీగా హాజరైన వలస కార్మికులు, శరణార్థులను ఉద్దేశించి పోప్ ప్రసంగించారు. 'ఇంటిని విడిచిపెట్టి ఇంత దూరంలో జీవనం కొనసాగించడం చాలా కష్టతరమైంది. మిమ్మల్ని ప్రేమించే వారి ఆప్యాయతలను మీరు కోల్పోతున్నారు. అలాగే భవిష్యత్‌కు సంబంధించిన అనిశ్చితి కూడా మీలో నెలకొని ఉంటుంది. కానీ భగవంతుడు చాలా నమ్మదగినవాడు. తనను నమ్ముకున్న వాళ్లను ఎన్నటికీ విడిచిపెట్టడు' అని పోప్ వలస కార్మికులను ఉద్దేశించి ప్రసంగించారు. యూఏఈలో భారత్, ఫిలిప్పీన్స్‌కు చెందిన కేథలిక్ వలస కార్మికులు అధిక శాతంలో ఉన్నారు. దేశంలో సుమారు 10 లక్షల మంది కేథలిక్‌లు నివసిస్తున్నారు. అంటే యూఏఈలో ప్రతీ 10 మందిలో ఒకరు కేథలిక్ కావడం గమనార్హం.

తాలిబాన్ దాడిలో 47 మంది పోలీసుల మృతి

కాబూల్: అఫ్గానిస్తాన్‌లో పోలీసు బలగాలే లక్ష్యంగా తాలిబాన్ దాడులు ముమ్మరం చేశారు. గత రెండు రోజులుగా జరిపిన వేర్వేరు దాడుల్లో 47 మంది పోలీసులతో సహా మొత్తం 57 మందిని పొట్టనబెట్టుకున్నారు. దేశంలో అంతర్యుద్ధం సమసిపోయేందుకు మాస్కోలో చర్చలు ప్రారంభమైన తరుణంలోనే తాలిబాన్ రెచ్చిపోవడం గమనార్హం. ప్రావిన్షియల్ రాజధాని కుందుజ్ సెక్యూరిటీ పోస్ట్‌పై మంగళవారం వేకువజామున విరుచుకుపడ్డ తాలిబన్లు 23 మంది సైనికులు, ముగ్గురు పోలీసులు సహా 26 మందిని చంపేశారు. అంతకుముందు ఉత్తర బఘ్లాన్ ప్రావిన్స్ బఘ్లానీ మర్కాజీ జిల్లాలోని పోలీసు ఔట్‌పోస్ట్‌పై తాలిబన్లు జరిపిన దాడిలో 11 మంది పోలీసులతోపాటు మొత్తం 21 మంది చనిపోయారు. మరో ఐదుగురు పోలీసులు గాయపడ్డారు. అదేవిధంగా ఉత్తర సమంగన్ ప్రావిన్సులో గ్రామ రక్షక దళానికి చెందిన 10 మందిని తాలిబన్లు చంపేశారు. అఫ్గానిస్తాన్‌లో అంతర్యుద్ధం సమసిపోయేందుకు తీసుకోవాల్సిన చర్యలపై రష్యా మధ్యవర్తిత్వంతో మాస్కోలో తాలిబాన్, అఫ్గాన్ ప్రముఖులు, ప్రతిపక్షాల నేతలు, గిరిజన పెద్దలతో సమావేశం ప్రారంభం కానుండగానే తాలిబాన్ ఈ దాడులకు తెగబడటం గమనార్హం. ఈ సమావేశానికి ప్రభుత్వానికి ఆహ్వానం అందలేదు. అయితే, దేశంలో శాంతి స్థాపన సాధనకు జరిగే ఎలాంటి ప్రయత్నమైనా అఫ్గాన్ ప్రభుత్వమే కేంద్రంగా ఉండాలని కీలక నేత అబ్దుల్లా అబ్దుల్లా పేర్కొన్నారు.

పారిస్ అపార్టుమెంట్‌లో మంటలు

10 మంది మృతి



పారిస్‌లోని భవంతిలో మంటలు వ్యాపించిన దృశ్యం

పారిస్: పారిస్‌లోని ఓ అపార్టుమెంట్‌లో సోమవారం రాత్రి సంభవించిన అగ్ని ప్రమాదంలో 10 మంది మృతి చెందగా 30 మంది వరకు గాయపడ్డారు. ఈ ఘటనను విద్రోహ చర్యగా అనుమానిస్తున్నట్లు అధికారులు తెలిపారు. నగరంలోని 16వ డిస్ట్రిక్ట్ ర్యుఎర్లాంగర్ ప్రాంతంలోని 8 అంతస్తుల అపార్టుమెంట్‌లో అర్ధరాత్రి సమయంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. పై అంతస్తుల్లో మంటలు వ్యాపించటంతో వాటిని అదుపులోకి తెచ్చేందుకు అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. సుమారు 200 మంది అగ్ని మాపక సిబ్బంది ఐదు గంటలపాటు శ్రమించి మంటలను ఆర్పివేశారని మేయర్ తెలిపారు. సుమారు 50 మందిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. మంటల్లో తీవ్రంగా గాయపడిన 10 మంది మృతి చెందగా ఆరుగురు అగ్ని మాపక సిబ్బంది సహా మొత్తం 30 మంది గాయపడ్డారని ఆమె వెల్లడించారు. విద్రోహ చర్యగా భావిస్తున్న ఈ ఘటనకు సంబంధించి ఒక మహిళ(40)ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ ఘటనపై అధ్యక్షుడు మేక్రాన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ మాజీ మంత్రి ఖలీల్ బాషా

కండువా కప్పి సాదరంగా ఆహ్వానించిన జగన్

సాక్షి, అమరావతి: వైఎస్సార్ జిల్లాకు చెందిన టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి ఖలీల్ బాషా తన అనుచరులతో మంగళవారం హైదరాబాద్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. కడప నగరం నుంచి తన అనుచరులతో వచ్చిన ఖలీల్ బాషా నేరుగా లోటస్‌పాండ్‌లోని జగన్‌మోహన్‌రెడ్డి నివాసానికి వెళ్లి పార్టీలో చేరారు. ఆయనకు జగన్‌మోహన్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఖలీల్ బాషా వంటి సీనియర్ నాయకుల సేవల్ని పార్టీ పూర్తిగా వినియోగించుకుంటుందని జగన్ ఈ సందర్భంగా చెప్పారు. ఖలీల్‌తో పాటు ఆయన కుమారులు డాక్టర్ షోహెల్ అహ్మద్, డాక్టర్ సుజాధ్, డాక్టర్ థౌసిఫ్, అనుచరులు పార్టీలో చేరారు. అనంతరం ఖలీల్ బాషా మీడియాతో మాట్లాడుతూ దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి అమలు చేసిన పథకాలు, ఆయన తనయుడైన వైఎస్ జగన్‌కు ప్రజలపై ఉన్న నిబద్ధత, చిత్తశుద్ధి, అంకితభావాన్ని చూసి వైఎస్సార్ సీపీలో చేరానన్నారు. వైఎస్ జగన్ తన సుదీర్ఘ పాదయాత్ర ద్వారా కోట్లాది మందిని కలిసి ప్రజలతో సత్సంబంధాలు పెంచుకున్న తీరు అబ్బురమనిపించి పార్టీ వైపు ఆకర్షితుడిని అయ్యానని చెప్పారు. జగన్‌లాంటి వ్యక్తి సీఎం అయితే? ప్రజల కష్టసుఖాలు గమనించి కడుపులో పెట్టుకుని చూసుకుంటారన్నారు. పని చేసే వాళ్లను గుర్తించే సంస్కృతి టీడీపీలో లేదని, వాడుకుని వదిలేయడం మాత్రమే ఆ పార్టీకి తెలుసునన్నారు. మైనారిటీల ఓట్లు రాకపోయినా సీఎంని అయ్యానన్న ధీమా చంద్రబాబులో పెరిగి మైనారిటీలను చిన్న చూపు చూస్తున్నారని విమర్శించారు. వైఎస్సార్ కృషి, పట్టుదల వల్లే ముస్లింలకు రిజర్వేషన్లు వచ్చాయన్నారు. రిజర్వేషన్ల విషయమై ఆవేళ ఢిల్లీకి వెళ్లిన వారిలో తానొకడినని గుర్తు చేసుకున్నారు. తన తండ్రి చేసిన దానికన్నా రెట్టింపు చేస్తానని జగన్ చెప్పిన మాట తనను ఆకట్టుకుందన్నారు. తాము పూర్తి స్థాయిలో పార్టీకి అండదండలు అందిస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అంజాద్ ఖాన్ మాట్లాడుతూ ఖలీల్ బాషా బలమైన నాయకుడని, ఆయన చేరిక తమకు చాలా సంతోషం కలిగించిందన్నారు. ముస్లింలకు మంత్రివర్గంలో ప్రాతినిధ్యం ఇవ్వని ఏకైక ప్రభుత్వం చంద్రబాబుదేనని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వైద్యవిభాగం అధ్యక్షుడు డాక్టర్ జి.శివభరత్‌రెడ్డి, స్థానిక నేత అహ్మద్‌తో పాటు పలువురు జిల్లా నాయకులు పాల్గొన్నారు.

జీవీఎల్‌పై టీడీపీ సభాహక్కుల నోటీసు



సాక్షి, అమరావతి: బీజేపీకి చెందిన రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావుపై తెలుగుదేశం పార్టీ మంగళవారం అసెంబ్లీలో సభా హక్కుల నోటీసును ప్రవేశపెట్టింది. శాసనసభా నాయకుడు, ముఖ్యమంత్రి చంద్రబాబును కించపరిచేలా సామాజిక మాధ్యమంలో పోస్టులు పెట్టారని నోటీసులో పేర్కొంది. ఈ నోటీసులను సభలో టీడీపీకి చెందిన తాడికొండ ఎమ్మెల్యే టి.శ్రావణ్‌కుమార్ ప్రతిపాదించారు. జీవీఎల్‌కు సమన్లు జారీచేయాలని స్పీకర్ కోడెల శివప్రసాదరావును కోరారు. సీఎంను కించపరుస్తూ 'అసెంబ్లీ రౌడీ', చంద్రబాబుకు పిచ్చి పీక్స్‌కు చేరిందంటూ అనుచితంగా పోస్టులు పెట్టారని తెలిపారు. సభాహక్కులను ఉల్లంఘించిన జీవీఎల్‌పై చర్యలు తీసుకోవాలని స్పీకర్‌ను ఆయన కోరారు.

'ఎంపీలకు అసెంబ్లీ స్పీకర్ నోటీసులు ఇవ్వలేరు'

సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంటు సభ్యులకు ఒక అసెంబ్లీ స్పీకర్ నేరుగా నోటీసులు ఇవ్వలేరని బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు అన్నారు. ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ టీడీపీ తనపై సభాహక్కుల నోటీసులు ఇవ్వడంపై జీవీఎల్ మంగళవారం ఢిల్లీలో స్పందించారు. తానేమీ అసెంబ్లీ మొత్తాన్ని తప్పుబట్టలేదని, సభా నాయకుడిగా సీఎం చంద్రబాబు మాట్లాడిన తీరుపైనే మాట్లాడానన్నారు. రాజ్యసభ సభ్యుడినైన తనకు నోటీసులు ఇవ్వాలంటే కచ్చితంగా పార్లమెంటు ద్వారానే ఇవ్వాలన్నారు. ఏపీలో బీజేపీ ఎమ్మెల్యేలను సీఎం చంద్రబాబు బెదిరించడంపై తాము నోటీసులు ఇస్తామన్న భయంతోనే తనపై బెదిరింపులకు పాల్పడుతున్నారని జీవీఎల్ అన్నారు.

ఏపీ పోలీసులపై నమ్మకం లేదు

- జూబ్లీహిల్స్ పోలీసులను ఆశ్రయించిన జయరాం భార్య పద్మశ్రీ
- నా భర్త హత్య కేసు దర్యాప్తు తెలంగాణ పోలీసులే జరపాలి

హైదరాబాద్/సాక్షి, అమరావతి బ్యూరో: కోస్టల్ బ్యాంకు డైరెక్టర్ చిగురుపాటి జయరాం హత్య కేసును తెలంగాణ పోలీసులే దర్యాప్తు చేయాలని కోరుతూ ఆయన భార్య చిగురుపాటి పద్మశ్రీ జూబ్లీహిల్స్ పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు మంగళవారం రాత్రి ఆమె ఫిర్యాదు చేశారు. గత నాలుగు రోజుల నుంచి ఆంధ్రప్రదేశ్ పోలీసులు తన భర్త హత్యపై రకరకాల ప్రచారాలు చేస్తూ, టీవీ సీరియల్స్‌లా సాగదీసి ఏమాత్రం తేల్చలేకపోయారని, ఈ నేపథ్యంలో ఆంధ్రా పోలీసులపై నమ్మకం కోల్పోయానని చెప్పారు. జూబ్లీహిల్స్ పోలీసుస్టేషన్ పరిధిలోనే ఈ హత్య జరిగినందున, ఇక్కడి పోలీసులే దర్యాప్తు జరిపి నిందితులకు శిక్ష వేసి తనకు న్యాయం చేయాలని కోరారు. ఈ హత్య కేసులో తన భర్త మేనకోడలు శిఖాచౌదరి పాత్ర ఉన్నా.. కొంతమంది వ్యక్తులు ఆమెను తప్పించారని ఆరోపించారు. మేనమామ చనిపోయాడని తెలిస్తే శిఖాచౌదరి ఘటనాస్థలికి వెళ్లకుండా తమ ఇంట్లోకి దౌర్జన్యంగా చొరబడి బీరువాలోని విలువైన పత్రాలు తీసుకెళ్లడమే అనుమానాలకు తావిస్తోందని పద్మశ్రీ పేర్కొన్నారు. కేసు నుంచి శిఖాచౌదరిని తప్పించేందుకు ఏపీలోని కొన్ని వర్గాల నుంచి ఒత్తిళ్లు వచ్చి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. 30 ఏళ్ల తమ వైవాహిక జీవితం ఆనందకరంగా ఉండేదని, తన భర్త హత్యతో ఇద్దరు పిల్లలు తండ్రి లేని వారయ్యారని.. తమ కుటుంబం రోడ్డున పడిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. కాగా పద్మశ్రీ ఫిర్యాదు స్వీకరించిన అనంతరం జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీహరిచంద్రరెడ్డి మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాలు, న్యాయ సలహా తీసుకున్న అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

శిఖాచౌదరి ప్రియుడే హంతకుడు..

కేవలం తన వద్ద అప్పుగా తీసుకున్న డబ్బును వసూలు చేయడం కోసమే పథకం ప్రకారం రాకేష్‌రెడ్డి ప్రముఖ వ్యాపారవేత్త, ఎన్నారై చిగురుపాటి జయరాంను హత్య చేశాడని కృష్ణా జిల్లా ఎస్పీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి తెలిపారు. ఐదురోజులుగా 10 బృందాలతో హత్య కేసు దర్యాప్తు చేసిన పోలీసులు హత్యకు సహకరించిన అతని వాచ్‌మెన్ శ్రీనివాస్‌రెడ్డిని రెండో నిందితుడిగా పేర్కొంటూ మంగళవారం వారిద్దరిని నందిగామ పోలీసులు అరెస్టు చేశారు. సాయంత్రం ఆ వివరాలను నందిగామ డీఎస్పీ కార్యాలయంలో ఎస్పీ త్రిపాఠి మీడియాకు వెల్లడించారు. తన వ్యాపార తగాదాల నేపథ్యంలో జయరాం కొన్నాళ్లు జైలుకు వెళ్లాడు. జైలు నుంచి తిరిగి వచ్చాక అవసరం నిమిత్తం శిఖాచౌదరి ప్రియుడి వద్దనుంచి పలు దఫాలుగా రూ. 2.25 కోట్లు, రూ.1.12 కోట్లు, రూ.80 లక్షలు తీసుకున్నాడు. తనవద్ద తీసుకున్న డబ్బు చెల్లించాలని శిఖాచౌదరి ప్రియుడు డిమాండ్ చేయడంతో..తాను తీసుకున్న మొత్తం రూ. 4.17 కోట్లకు గానూ వడ్డీతో కలిపి రూ. 6 కోట్లు 2018 అక్టోబరు నాటికి ఇస్తానని జయరాం ఒప్పందం చేసుకున్నాడు. తరువాత గడువు తీరిపోయినా తిరిగి డబ్బులు చెల్లించలేదు.

అందమైన అమ్మాయి పేరిట వల..

కాగా చిగురుపాటి జయరాం ఈ ఏడాది జనవరి 29న అమెరికా నుంచి ఫార్మా కంపెనీ సమావేశాల కోసం హైదరాబాద్ వచ్చాడు. అదే రోజు రాత్రి తన మేనకోడలు శిఖాచౌదరి ఇంటికి వచ్చాడు. ఈ విషయం అపార్ట్‌మెంట్ మేనేజర్ ద్వారా తెలుసుకున్న శిఖాచౌదరి ప్రియుడు ఫోన్ చేయగా స్పందించలేదు. జయరాం బలహీనతల గురించి పక్కాగా తెలుసుకున్న అతడు వీణా పేరుతో సిమ్‌కార్డు తీసుకుని అతనితో వాట్సాప్ చాటింగ్ చేశాడు. డీపీగా ఓ అందమైన అమ్మాయి ఫొటో పెట్టాడు. హాయ్.. హల్లో.. నుంచి మొదలెట్టి వలపు వలవేసి జయరాంను 30వ తేదీన రోడ్డు నంబర్ 10లోని తన ఇంటికి రప్పించుకున్నాడు.



తన భర్త హత్యపై విచారణ చేపట్టాలంటూ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న జయరాం భార్య పద్మశ్రీ

బంధించి.. చిత్రహింసలకు గురిచేసి..

ఇంట్లో అడుగుపెట్టిన తర్వాత జయరాంను శిఖాచౌదరి ప్రియుడు బంధించాడు. డబ్బులు ఇవ్వమని తీవ్రంగా ఒత్తిడి చేశాడు. అతడిపై ముష్టిఘాతాలకు దిగాడు. ఆ దెబ్బలకు ముక్కు, నోటి నుంచి రక్తం కారుతూ సోఫాపై పడిన జయరాంను ఊపిరాడకుండా చేశాడు. ఆ సమయంలో జయరాం కదలకుండా వాచ్‌మెన్ శ్రీనివాస్‌రెడ్డి కాళ్లు పట్టుకున్నాడు. పిడిగుద్దులు కురిపించడంతో 31వ తేదీన ఉదయం 11–12 గంటల మధ్య మరణించాడు.

పథకం ప్రకారం మృతదేహం విజయవాడకు..

జయరాం మృతదేహాన్ని ఇంట్లోనే పెట్టుకున్న శిఖాచౌదరి ప్రియుడికి.. అదే రోజు రాత్రికి జయరాం విజయవాడ వెళ్లాలనుకున్నాడని తెలుసు. ఈ నేపథ్యంలోనే కేసు నుంచి బయటపడేందుకు హైదరాబాద్ నల్లకుంట సీఐ శ్రీనివాస్, ఇబ్రహీంపట్నం ఏసీపీ మల్లారెడ్డికి సలహా కోసం ఫోన్లు చేశాడు. వారి సలహా మేరకు ప్రమాద ఘటనగా చిత్రీకరించాలని నిర్ణయించుకున్నాడు. తర్వాత వాచ్‌మెన్ సాయంతో మృతదేహాన్ని జయరాం కారు (ఏపీ16ఈజీ 0620)లో వేసుకుని ఒక్కడే హైదరాబాద్ నుంచి బయల్దేరి నందిగామ సమీపంలోని ఐతవరం శివారుకు చేరుకున్నాడు. అక్కడ జాతీయ రహదారి రోడ్డు మార్జిన్‌కు దిగువలో కారును దింపేసి.. తిరిగి హైదరాబాద్ వెళ్లిపోయాడు.

ఈ కేసు ఇప్పటితో ముగిసిపోలేదు: ఎస్పీ

'పోలీసులకు అందిన ప్రాథమిక సమాచారం మేరకే ప్రధాన నిందితుడు రాకేష్‌రెడ్డితోపాటు అతడికి సహకరించిన వాచ్‌మెన్ శ్రీనివాస్‌పై 302, 419, 342, 346, 348, 312, 201, 202 రెడ్‌విత్ 34 ఐపీసీ సెక్షన్ల కింద కేసు నమోదు చేశాం. ఈ కేసును మరింత లోతుగా దర్యాప్తు చేస్తాం. ప్రధాన నిందితుడిని కోర్టు ద్వారా మళ్లీ పోలీసు కస్టడీకి తీసుకుంటాం. ఈ కేసులో చాలా అనుమానాలు ఉన్నాయి. సమగ్రంగా విచారించాక మరిన్ని అరెస్టులు ఉండొచ్చు. న్యాయ నిపుణుల అభిప్రాయం తీసుకున్నాకే కేసును బదిలీ చేసే అంశాన్ని పరిశీలిస్తాం.' అని ఎస్పీ త్రిపాఠి వివరించారు. డీఎస్పీ సుభాష్‌చంద్రబోస్, నందిగామ సీఐ పీవీ రమణ పాల్గొన్నారు.

ఏసీపీ మల్లారెడ్డిపై బదిలీ వేటు

ఎక్స్‌ప్రెస్ టీవీ చైర్మన్, కోస్టల్ బ్యాంక్ డైరెక్టర్ చిరుగుపాటి జయరాం హత్య కేసుతో సంబంధం ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇబ్రహీంపట్నం ఏసీపీ మల్లారెడ్డిపై వేటు పడింది. జయరాం హత్య కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రాకేష్‌రెడ్డికి మృతదేహం తరలింపునకు సంబంధించి సలహాలిచ్చినట్లు నల్లకుంట ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులుతో పాటు మల్లారెడ్డిపై ఆరోపణలు వచ్చాయి. శ్రీనివాసులును సోమవారమే బదిలీ చేసిన విషయం విదితమే. జయరాం హత్య కేసులో ఏపీ పోలీసులు అరెస్టు చేసిన రాకేష్‌రెడ్డి చెప్పిన వాంగ్మూలం ప్రకారం కూడా మల్లారెడ్డి పేరు వినిపించడంతో రాచకొండ సీపీ మహేశ్ భగవత్ బదిలీ వేటు వేశారు. రానున్న రోజుల్లో ఏసీపీ మల్లారెడ్డి, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులును జయరాం హత్య కేసులో అనుమానితులుగా చేర్చి విచారించే అవకాశం ఉంది.

పింఛన్ కోసం వెళ్తే ప్రాణాలే పోయాయి..

గుంటూరు, తూర్పు గోదావరి జిల్లాల్లో ఇద్దరు వృద్ధుల మృతి

గుంటూరు మెడికల్/తాళ్లరేవు (ముమ్మిడివరం): పింఛన్ కోసం కాళ్లరిగేలా తిరిగి విసిగి వేసారిన ఇద్దరు వృద్ధులు మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. గుంటూరుకు చెందిన మోర బ్రహ్మారెడ్డి (70), తూర్పు గోదావరి జిల్లా, ప్రత్తిగొంది గ్రామానికి చెందిన దంగేటి నీలాద్రి (72) మృత్యువాత పడ్డారు. గుంటూరు నగరంలోని గుంటూరువారితోట నాలుగో లైనుకు చెందిన మోర బ్రహ్మారెడ్డి 3 రోజులుగా వృద్ధాప్య పింఛన్ కోసం తిరుగుతున్నాడు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం 9.30 గంటలకు పింఛన్ కోసం స్కూల్ వద్దకు వెళ్లిన బ్రహ్మారెడ్డి తనకు ముందు వరుసలో చాలా మంది ఉన్నారని మళ్లీ ఇంటికి బయలుదేరాడు. స్కూల్ దాటి ఓల్డ్‌క్లబ్ రోడ్డులోని ప్రధాన రహదారిలో ఉన్న తులసి ఆస్పత్రి వద్దకు రాగానే ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులు తులసి హాస్పిటల్‌కు తీసుకెళ్లగా.. అప్పటికే ఆయన మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారు.



రోడ్డు పక్కన విగతజీవిగా పడి ఉన్న బ్రహ్మారెడ్డి

తూర్పు గోదావరి జిల్లా, ప్రత్తిగొందిలోనూ..

తూర్పు గోదావరి జిల్లా తాళ్లరేవు మండలం పి.మల్లవరం పంచాయతీ ప్రత్తిగొందికి చెందిన దంగేటి నీలాద్రి పింఛను తీసుకునేందుకు ఉదయం పంచాయతీ కార్యాలయానికి వెళ్లాడు. అయితే ఎంతకీ పేరు రాకపోవడంతో మధ్యాహ్నం వరకు అక్కడే ఉండిపోయాడు. ఆ సమయంలోనే ఒక్కసారిగా గుండెపోటు రావడంతో కుప్పకూలిపోయాడు. అధికారులు మృతదేహాన్ని ఆటోలో ఇంటికి పంపించివేసి చేతులు దులుపుకున్నారు. గంటల తరబడి వేచి ఉండడం వల్లే నీలాద్రి మృతి చెందాడని కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు.

ఎంపీడీవో కార్యాలయం ముట్టడి

- అసహనంతో చెలరేగిపోయిన టీడీపీలోని ఓ వర్గం
- పింఛన్లు, పసుపు–కుంకుమ చెక్‌లు రచ్చబండ వద్ద ఇవ్వాలని డిమాండ్

పొందూరు: శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలం గోకర్నపల్లి గ్రామంలో టీడీపీకి చెందిన ఒక వర్గం మంగళవారం మండల పరిషత్ కార్యాలయం, వెలుగు కార్యాలయాలను ముట్టడించింది. పింఛన్లు, పసుపు–కుంకుమ చెక్‌లు ప్రభుత్వ విప్ కూన రవికుమార్ ఒక వర్గానికే ఇమ్మన్నారా, ఇదేమి న్యాయమని ఈఓపీఆర్‌డీ మధుసూదనరావు, వెలుగు ఏపీఎం మంగమ్మను నిలదీశారు. మండల పరిషత్ కార్యాలయంలో కుర్చీలను విరగ్గొట్టారు. కార్యాలయాల ముందు బైఠాయించి కార్యాలయాల గేట్లను మూసివేశారు. ఏపీఎంను నిర్బంధించారు. ఇదంతా టీడీపీ నాయకులు చింతాడ ప్రసాద్, కిల్లి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగింది. దీంతో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. సీఐ విశ్వేశ్వరరావు, ఎంపీడీఓ చింతాడ లక్ష్మీభాయ్, మార్కెట్ కమిటీ చైర్మన్ అన్నెపు రాములు వచ్చి రచ్చబండ వద్ద పింఛన్లు, పసుపు–కుంకుమ చెక్‌లు బుధవారం పంపిణీ చేస్తామని హామీనివ్వడంతో వెనుదిరిగారు.



వెలుగు కార్యాలయాన్ని ముట్టడిస్తున్న టీడీపీ కార్యకర్తలు

పోలీస్ శాఖలోనూ బాబు వర్గానికే ప్రోత్సాహం

అందుకే ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశాం: బొత్స



సాక్షి, హైదరాబాద్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఏపీ సీఎం చంద్రబాబు పోలీస్ శాఖలోనూ తన సామాజిక వర్గం వారినే ప్రోత్సహిస్తున్నారని, అందుకే కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశామని వైఎస్సార్ కాంగ్రెస్ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ అన్నారు. ఆయన మంగళవారం హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడారు. పోలీసులను తమ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎప్పుడూ లక్ష్యంగా చేసుకుని విమర్శించలేదని, అయితే చంద్రబాబు పోలీసు వ్యవస్థను భ్రష్టు పట్టించడాన్నే ప్రశ్నిస్తున్నారని వివరించారు. ఎన్నికల సమయంలో టీడీపీ అకృత్యాలు, ఓట్ల తొలగింపు, డబ్బు, మద్యం పంపిణీ వంటి అంశాలను ఎండగడుతున్నామని, ఆ విషయాలన్నింటినీ ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లామని ఆయన అన్నారు. గత ఎన్నికల్లో ఈవీఎంల ద్వారానే గెలిచిన చంద్రబాబు ఇపుడు వాటిని విమర్శించడం దారుణమన్నారు. గత ఎన్నికల్లో టీడీపీ, బీజేపీలు రెండూ టాంపరింగ్ (దుర్వినియోగం) చేసి గెలిచాయేమో, అందుకే ఇపుడు భయపడుతున్నారని బొత్స వ్యంగంగా అన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం తిరుపతిలో సమర శంఖారావం పూరించబోతున్నారని బొత్స వివరించారు.

రాహుల్‌ను ప్రధానిని చేసేందుకే రాష్ట్రం ముక్కలు

జేసీ దివాకర్ రెడ్డి వ్యాఖ్యలు

సాక్షి, న్యూఢిల్లీ: కుమారుడు రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిని చేసేందుకే సోనియా గాంధీ రాష్ట్రాన్ని ముక్కలు చేశారని టీడీపీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. దేశాన్ని మార్చడం కాంగ్రెస్ పార్టీకి చేతకాదని, సోనియా, రాహుల్ పోయి కొత్త వారు వస్తేనే అది సాధ్యమవుతుందన్నారు. మంగళవారం విభజన హామీలు అమలు చేయాలని కోరుతూ ఎంపీ మాగంటి బాబు జంతర్‌మంతర్ వద్ద ఒక పూట దీక్ష చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. రాహుల్‌ను ప్రధానిని చేద్దామని చంద్రబాబు చూస్తున్నారని, అయితే ఆయన కోరిక నెరవేరదన్న అనుమానం ఉందన్నారు. ప్రధాని మోదీ నియంతృత్వ ధోరణితో తనకు అడ్డుగా ఉన్నవారిని జైలుకు పంపే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. రైల్వేజోన్ వల్ల ఏపీకి లాభంలేదని, కేంద్రానికీ నష్టం లేదని వ్యాఖ్యానించారు. దీక్షలో సహచర ఎంపీలు సుజనా చౌదరి, అశోక్‌గజపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

నా హత్యకు టీడీపీ నేతల రెక్కీ!

- చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వెల్లడి
- ఇద్దరికి రూ.30 లక్షల సుపారి ఇచ్చిన పులివర్తి నాని అనుచరులు
- మీడియా ఎదుట నిజాన్ని ఒప్పుకున్న నిందితులు

తిరుపతి రూరల్: తన హత్యకు టీడీపీ నేతలు రెక్కీ నిర్వహించారని చిత్తూరు జిల్లా చంద్రగిరి ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చెప్పారు. తిరుపతి తుమ్మలగుంటలో మంగళవారం సాయంత్రం ఆయన.. నిందితులతో కలిసి మీడియాతో మాట్లాడారు. సాక్ష్యాత్తు చిత్తూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, చంద్రగిరి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి.. పులివర్తి నాని సహకారంతోనే ఇద్దరు రెక్కీ నిర్వహించినట్లు చెప్పారు. ఓటమి భయంతోనే తనను అంతమొందించేందుకు ప్రయత్నిస్తున్నారని అనుమానం వ్యక్తం చేశారు. నేరచరిత్ర కలిగిన ఆ ఇద్దరికి రూ.30 లక్షలు సుపారీ ఇచ్చి డ్రైవర్ల ముసుగులో తమ వద్దకు పంపారని, నెల రోజులుగా వారు తనతో పాటు, తన కుటుంబ సభ్యుల కదలికలను ఎప్పటికప్పుడు వాట్సాప్ ద్వారా పులివర్తి నానికి చేరవేస్తున్నారని చెప్పారు. అయితే ఈ విషయాన్ని పసిగట్టి వారిని పట్టుకుని ఆరా తీయగా.. సుపారీ విషయాన్ని బయటపెట్టినట్టు చెవిరెడ్డి చెప్పారు. మొదటి దశలో ఇల్లు, ఆఫీసుకు సంబంధించి నిఘా పెట్టడంతో పాటు, తనను ఎవరెవరు కలుస్తున్నారు? మా కుటుంబ సభ్యులు ఎప్పుడు, ఎక్కడికి, ఏ దారిలో వెళ్తారు? ఎప్పుడొస్తారు? తదితర సమాచారాన్ని వారు సేకరిస్తున్నట్లు తెలిపారు. సమయాన్ని బట్టి తర్వాత ఏం చేయాలో చెబుతామని నాని అనుచరులు తమకు ఆదేశాలిచ్చారని, నాని సహకారంతోనే తాము రెక్కీ నిర్వహించినట్టు నిందితులు.. చిత్తూరు పంద్రంపల్లికి చెందిన నాగభూషణం, సిసింద్రీలు మంగళవారం తుమ్మలగుంటలో మీడియాతో చెప్పారు.



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న నిందితులు. పక్కన ఎమ్మెల్యే చెవిరెడ్డి

విద్వేషాలు, కక్షతో వ్యవహరించడం బాధాకరం

శ్రీవారు కొలువైన తిరుపతిలో రెక్కీలు, హత్యలు వంటి సంస్కృతి లేదని చెవిరెడ్డి చెప్పారు. రాజకీయల్లో స్నేహపూర్వక పోటీ ఉండాలే తప్ప.. విద్వేషాలతో వ్యక్తిగత కక్షతో వ్యవహరించటం బాధకరమన్నారు. నిందితులను చెవిరెడ్డి అర్బన్ ఎస్పీకి అప్పగించి, తమకు రక్షణ కల్పించాలని వినతిపత్రం ఇచ్చారు. కాగా, తనకు భద్రతను పెంచాలని ఇటీవల పోలీసులకు చెవిరెడ్డి వినతిపత్రం ఇచ్చినా ఇప్పటికీ స్పందించక పోవడం గమనార్హం. ఇప్పటికైనా చెవిరెడ్డికి రక్షణ కల్పించాలని పార్టీ శ్రేణులు కోరుతున్నాయి.

అసెంబ్లీలో చుక్కల భూముల సవరణ బిల్లు

సాక్షి, అమరావతి: ఏపీ చుక్కల భూముల (పునః పరిష్కార రిజిస్టరులో ప్రస్తుత పరిస్థితికి అనుగుణంగా మార్పులు) సవరణ బిల్లును మంగళవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. దీంతో పాటు పలు సవరణ బిల్లులను సభలో ప్రవేశపెట్టారు. సింహాచలం వరాహలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం పంచ గ్రామాలు (గృహాల, ఇంటి స్థలాల ఆక్రమణల క్రమబద్ధీకరణ) బిల్లు, అసైన్డు భూముల (బదిలీల నిషేధం) సవరణ బిల్లు, శ్రీవేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ విశ్వవిద్యాలయ సవరణ బిల్లు, కర్మాగారాల సవరణ బిల్లు, పారిశ్రామిక వివాదాల సవరణ బిల్లు, కార్మిక శాసనాల (అపరాధాల రాజీ కోసం) సవరణ బిల్లులను సంబంధిత శాఖల మంత్రులు అసెంబ్లీలో ప్రవేశపెట్టారు.

పెరుగుతున్న పగటి ఉష్ణోగ్రతలు

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో 1–2 డిగ్రీలు అధికంగా రికార్డవుతున్నాయి. కోస్తాంధ్రలో వీటి పెరుగుదల ఒకింత ఎక్కువగా ఉంది. రాయలసీమలో మాత్రం ఇప్పటికీ 1–2 డిగ్రీలు తక్కువగానే నమోదవుతున్నాయి. మరోవైపు రాత్రి (కనిష్ట) ఉష్ణోగ్రతలు కోస్తాంధ్రలో 1–3 డిగ్రీలు, రాయలసీమలో 1–2 డిగ్రీలు చొప్పున తక్కువగా రికార్డవుతున్నాయి. సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు రాష్ట్రంలో అత్యల్పంగా కళింగపట్నంలో 16 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది.

బాబు మెప్పు కోసమే వ్యాజ్యం

హైకోర్టులో 'లక్ష్మీస్ ఎన్టీఆర్' నిర్మాత రాకేశ్‌రెడ్డి కౌంటర్

సాక్షి, హైదరాబాద్: ఏపీ ముఖ్యమంత్రి, టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు మెప్పు పొందడానికే ఆ పార్టీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ఎన్ వర్మ తమ సినిమాపై పిటిషన్ దాఖలు చేశారని 'లక్ష్మీస్ ఎన్టీఆర్'నిర్మాత రాకేశ్‌రెడ్డి హైకోర్టుకు నివేదించారు. ప్రజాప్రయోజన వ్యాజ్యం పేరుతో రాజకీయ ప్రయోజనాలను ఆశించి ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారని తెలిపారు. తమ చిత్రంలోని 'దగా.. దగా.. కుట్ర' పాటను సీఎం పదవి నుంచి ఎన్‌టీఆర్‌ను దించేయడానికి ముందే శ్రీశ్రీ రాశారని వివరించారు. ఈ పాటలో చూపినవన్నీ కూడా ప్రజాబాహుళ్యంలో ఉన్నవేనని, చంద్రబాబు వెన్నుపోటుదారుడని స్వయంగా ఎన్‌టీఆరే చెప్పారని తెలిపారు. లక్ష్మీపార్వతి, ఎన్‌టీఆర్ పెద్దల్లుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావులు ఈ వ్యవహారంలో పుస్తకాలు కూడా రాశారని ఆయన వివరించారు. పాటపై అభ్యంతరాలుంటే సినిమాటోగ్రఫీ చట్టం కింద ఫిర్యాదు చేసుకోవచ్చునన్నారు. 'లక్ష్మీస్ ఎన్‌టీఆర్' సినిమాలోని 'దగా.. దగా.. కుట్ర' పాటను యూట్యూబ్, ఇతర సోషల్ మీడియా నుంచి తొలగించేలా చిత్ర నిర్మాత రాకేశ్‌రెడ్డిని ఆదేశించాలని కోరుతూ టీడీపీ పిఠాపురం ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ఎన్ వర్మ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన హైకోర్టు, కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశించింది.

సాక్షి
బుధవారం, ఫిబ్రవరి, 6

బాబుతో 'ఓటు'కు చేటు!

ప్రజాస్వామ్యాన్ని, పరిణత జన మనోగతాన్ని భ్రష్టు పట్టించడానికి కంకణం కట్టుకున్నట్టు ఇష్టానుసారం వ్యవహరిస్తున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వ్యవహారశైలిని వైఎస్సార్ కాంగ్రెస్ ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం సోమవారం కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకొచ్చింది. అటు ఓటర్ల జాబితాల్లో అవకతవకలకు పాల్పడటం... ఇటు అధికార యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తూ విపక్షాలను బెదిరించడానికి వినియోగించుకోవడంవంటి పనులకు పాల్పడుతున్న రాష్ట్ర ప్రభుత్వ తీరును పార్టీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నాయకుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని ఆ ప్రతినిధి బృందం ఈసీకి వివరించింది. పౌరులకు రాజ్యాంగం కల్పించిన శక్తిమంతమైన ఆయుధం ఓటు హక్కుకు తూట్లు పొడవడానికి చంద్రబాబు, ఆయన పరివారం బరి తెగిస్తున్నారు. అందుకు వారనుసరిస్తున్న విధానాలు విస్మయం కలిగిస్తాయి. ఎంతో నిశితంగా పరిశీలిస్తే తప్ప వీటినెవరూ పోల్చుకోలేరు.

తెలుగుదేశం వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిన ఓటర్ల జాబితా మరింత ఆశ్చర్యకరమైనది. ఓటర్ల వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగేవిధంగా వారి ఫొటోలు కూడా ఆ జాబితాలో ఉన్నాయి. నిజానికి ఎన్నికల సంఘం పార్టీలకిచ్చే జాబితాల్లో ఓటర్ల ఫొటోలుండవు. మరి ఈ ఫొటోల జాబితా టీడీపీకి ఎలా వెళ్లిందో ఎన్నికల సంఘమే చెప్పాలి. ఓటర్ల జాబితాలను ఏమారుస్తున్న తీరును వైఎస్సార్ కాంగ్రెస్ శ్రేణులు ఒక సవాలుగా తీసుకుని పలు అక్రమాలను వెలికితీయగలిగాయి. ప్రతిపక్షానికి ఓట్లు వేస్తారని అనుమానం వచ్చిన వారి పేర్లను రకరకాల సాకులతో అధికారుల ద్వారా తొలగింప జేయటం, అది వల్లకాకపోతే సర్వేల పేరిట ఇంటింటికీ యువకులను పంపి విపక్ష మద్దతుదార్లని నిర్ధారించుకున్నవారి ఓట్లను గల్లంతు చేయడం ఒక పథకం ప్రకారం చేస్తున్నారు. పర్యవసానంగా ఆంధ్రప్రదేశ్‌లో నిరుడు సెప్టెంబర్ నాటికి ఉన్న 52.67 లక్షల నకిలీ ఓట్ల సంఖ్య ప్రస్తుతం దాదాపు 60 లక్షలకు చేరుకుంది. ఈ ఓట్లలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల్లో నమోదైన ఓట్లు 20 లక్షలు కాగా, ఆంధ్రప్రదేశ్‌లోనే రెండు వేర్వేరు చోట్ల స్వల్ప మార్పులతో నమోదైన ఓట్లు మరో 20 లక్షలున్నాయి. అదే సమయంలో 4 లక్షలమంది నిజమైన ఓటర్ల పేర్లు మాత్రం జాబితానుంచి గల్లంతయ్యాయి. ఇంటింటికీ తిరిగి ఒక యాప్ ద్వారా ఓట్లను తొలగిస్తున్నవారిని పట్టుకుని, స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నా దిక్కూ మొక్కూ లేని దుస్థితి ఏర్పడింది. సహేతుకమైన నిరసనలను పలు సాకులతో అణచేస్తున్న పోలీసులకు ఈ అక్రమాలేవీ తప్పనిపించడం లేదు. సర్వే చేయడానికి ఎవరికైనా హక్కుంటుందని, దాన్ని అడ్డగించకూడదని సుద్దులు వల్లిస్తున్నారు. యాప్ ద్వారా ఓట్లు తొలగించే ఈ సర్వేలకు అక్రమార్కులు పెడుతున్న పేర్లు కూడా చిత్రమైనవి. ప్రజాసాధికార సర్వే, పరిష్కార వేదిక, రియల్ టైమ్ గవర్నెన్స్, పీరియాడిక్ సర్వే వంటి పేర్లతో ఈ మారీచకాన్ని యధేచ్ఛగా కొనసాగిస్తున్నారు. విపక్షాలు ఓర్పుతో వ్యవహరించేంతవరకూ ఈ దొంగ సర్వేలపై పోలీసులకు ఫిర్యాదులు వెళ్తాయి. కానీ వాటిని బుట్టదాఖలా చేస్తున్నారని గ్రహించుకుని, తామే తేల్చుకోవాలనుకుంటే... అవి ఘర్షణలకు దారితీస్తే అందుకు బాధ్యులెవరు?

కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, ఎన్సీపీ, డీఎంకే, సీపీఎం తదితర 23 పార్టీల నాయకులతో పాటు చంద్రబాబు కూడా సోమవారం కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలిశారు. ఈవీఎంల పనితీరుపై వారు అనుమానాలు వ్యక్తం చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న ఈ తరుణంలో ఈవీఎంలకు బదులు బ్యాలెట్ పేపర్లు ప్రవేశపెట్టడం వీలు కాదు గనుక 50 శాతం ఈవీఎంలకు చెందిన వీవీప్యాట్‌లలోని రశీదులను లెక్కించి పోలైన ఓట్లతో వాటిని సరిపోల్చాలని వీరంతా కోరుతున్నారు. సలహా మంచిదే. కానీ తమ ప్రతినిధి బృందంలో భాగస్వామిగా ఉన్న చంద్రబాబు ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తున్న టక్కుటమార విద్యల గురించి వీరంతా తెలియనట్టు నటించడం ఆశ్చర్యం కలిగిస్తుంది. వైఎస్సార్ కాంగ్రెస్ నిరుడు ఆగస్టు నుంచి వీటి గురించి అన్ని వేదికల నుంచీ గళం వినిపిస్తోంది. ప్రజాస్వామ్యాన్ని పట్టపగలు ఖూనీ చేస్తున్న తీరును శాస్త్రీయంగా నిరూపిస్తోంది. ఈ 23 పార్టీల్లో ప్రధానంగా కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ, ఆప్, బీఎస్పీలకు ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర విభాగాలున్నాయి. కనుక జాతీయ నేతలకు అక్కడేం జరుగుతున్నదీ తెలియదనుకోవడానికి లేదు. అయినా ఒక్క పార్టీ నాయకులైనా చంద్రబాబును 'మరి మీరు చేస్తున్నదేమిట'ని ప్రశ్నించినట్టు లేరు. తన విశ్వసనీయత గురించి చంద్రబాబుకు ఏనాడూ పెద్దగా పట్టింపు లేదు. కానీ ఇతర పార్టీల నేతలకేమైంది? సొంత రాష్ట్రంలో ఓటర్ల జాబితాలను భ్రష్టుపట్టిస్తున్న నాయకుడు తమతో ఉన్నందువల్ల ఎన్నికల సంఘం వద్ద నగుబాటు పాలవుతామని, తమ విశ్వసనీయత కూడా ప్రశ్నార్థకమవుతుందని వీరెవ్వరికీ తోచలేదా?


పీడగా మారిన పాలకుల్ని విరగడ చేసుకోవడానికి ప్రజాస్వామ్యంలో పౌరులకుండే ఏకైక ఆయుధం ఓటు. దాన్ని కరెన్సీ నోట్లు విరజిమ్మి, అందుకు లొంగరనుకున్నవారి పేర్లు ఓటర్ల జాబితాల్లో గల్లంతు చేయించి, రకరకాల మార్గాల్లో ఆ జాబితాలను నకిలీ ఓట్లతో నింపి చంద్రబాబు అండ్ కో చేస్తున్న పనులు అత్యంత గర్హనీయమైనవి. ఒకపక్క నీతిబద్ధ రాజకీయాలకు నిలువెత్తు ఉదాహరణనని చంద్రబాబు తరచూ గొప్పలు చెప్పుకుంటారు. ఈమధ్యకాలంలో బీజేపీపై అలుపెరగని పోరాటం చేస్తున్నానని స్వోత్కర్షకు పోతూ ఆయన అన్ని రాష్ట్రాలూ తిరుగుతున్నారు. కానీ జరుగుతున్న అక్రమాలను, అధికార యంత్రాంగాన్ని బాహాటంగా దుర్వినియోగం చేస్తున్న తీరును ఎవరూ గమనించడం లేదని భ్రమపడుతున్నారు. ఈ విషయంలో ఎన్నికల సంఘం నిష్పాక్షికంగా దర్యాప్తు చేయించి తక్షణం చర్యలు తీసుకోవాలి. ఎన్నికలను ప్రహసనప్రాయం చేయడానికి ప్రయత్నించినవారిపై, వారు ఏ స్థాయివారైనా కఠిన చర్యలు తీసుకోవాలి. లేనట్టయితే ప్రజాస్వామ్యానికి అర్థం, పరమార్థం ఉండవు.

గ్రహం అనుగ్రహం

శ్రీ విళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, తిథి శు.విదియ తె.5.43 వరకు (తెల్లవారితే గురువారం), నక్షత్రం ధనిష్ఠ ఉ.7.53 వరకు తదుపరి శతభిషం, వర్జ్యం ప.3.48 నుంచి 5.34 వరకు దుర్ముహూర్తం ప.11.53 నుంచి 12.36 వరకు అమృతఘడియలు... రా.2.25 నుంచి 4.11 వరకు.

సూర్యోదయం : 6.36
సూర్యాస్తమయం: 5.54
రాహుకాలం : ప. 12.00 నుంచి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుంచి 9.00 వరకు

రక్షకుల ముసుగులో భక్షకులు


దేవులపల్లి అమర్

ఏకంగా మూడు రాష్ట్రాల్లో లక్షలాదిమంది పేద, మధ్యతరగతి ప్రజలను ఘోరంగా మోసం చేసిన శారదా స్కాంలో దర్యాప్తును అడ్డుకునేందుకు ముఖ్యమంత్రి మమతా బెనర్జీ దీక్షకు దిగడం విడ్డూరం. కోల్‌కతా పోలీసు కమిషనర్‌ను ప్రశ్నించడానికి సీబీఐ అధికారులు సుప్రీంకోర్టు ఆదేశాల మేరకే వచ్చారు. అయినా వారికి అడ్డుపడి కోర్టు ధిక్కారానికి పాల్పడ్డారు. ఆదాయపన్ను అధికారులకు రక్షణ కల్పించవలసిన పోలీసుల సహాయాన్ని ఉపసంహరించుకుని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పన్నులు ఎగవేసే బడా వ్యాపారులకు కొమ్ము కాసింది. మమత, చంద్రబాబులు తమనూ, తమ వారినీ రక్షించుకునేందుకు వ్యవస్థల రక్షకులం అనే ముసుగులు ధరిస్తారు.

డేట్‌లైన్ హైదరాబాద్



గతంలో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి అజోయ్ ముఖర్జీ తన రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించి పోవడం పట్ల నిరసనగా ఒక రోజు సత్యాగ్రహం చేశాడట. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో ఆయన రెండుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేశారు. కాంగ్రెస్ వీడి బాంగ్ల కాంగ్రెస్ స్థాపించాక ఏర్పడిన సంకీర్ణ ప్రభుత్వంలో బాంగ్ల కాంగ్రెస్‌తో బాటు మార్క్సిస్ట్ పార్టీ కూడా భాగస్వామి. ఆ ప్రభుత్వంలో సీపీఎం నాయకుడు జ్యోతి బసు హోంమంత్రి. తన ప్రభుత్వంలోని లోపాలను ఎత్తి చూపడానికి ఆనాడు అజోయ్ ముఖర్జీ సత్యాగ్రహం చేస్తే, ఇన్నేళ్ళకు తన ప్రభుత్వాన్ని రక్షించుకోవడం కోసం ప్రస్తుత పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నిరసన దీక్ష చేపట్టారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని ఎవరయినా పడగొట్టే ప్రయత్నం చేస్తుంటే , దాన్ని అడ్డుకునే పరిస్థితి లేక నిస్సహాయతకు గురయితే నిరసనకు దిగాలి. ప్రస్తుత పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని పడగొట్టే ప్రయత్నం ఏదీ జరుగుతున్న దాఖలాలు లేవు. ఏకంగా మూడు రాష్ట్రాల్లో లక్షలాదిమంది పేద, మధ్యతరగతి ప్రజలను ఘోరంగా మోసం చేసిన ఒక సంస్థ వ్యవహారంలో దర్యాప్తు ముందుకు సాగకుండా అడ్డుకునేందుకు మమతా బెనర్జీ ఈ దీక్ష చేశారు.

శారదా స్కాంలో పశ్చిమ బెంగాల్ అధికార పక్షం తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన నాయకుల హస్తం ఉన్నదన్న ఆరోపణల మీద అరెస్టులు కూడా జరిగాయి గతంలో. ఈ కుంభకోణాలపైన దర్యాప్తునకు సుప్రీంకోర్టు ఆదేశాల మేరకే సీబీఐ అధికారులు కోల్‌కతా నగర పోలీసు కమిషనర్‌ను విచారించడానికి వెళితే, స్థానిక పోలీసులు ఎదురు తిరిగి వారిని అడ్డుకోవడమే కాదు ఏకంగా ముఖ్యమంత్రి బయలుదేరి ఆ పోలీసు కమిషనర్ ఇంటికి వెళ్లి ధైర్యం చెప్పి సీబీఐ చర్యకు నిరసనగా తాను ధర్నాకు పూనుకున్నారు. ఇంతకంటే విడ్డూరం బహుశా ఇంకోటి ఉండదేమో. ఒక అధికారి మీద ఆరోపణలు వస్తే దాని మీద విచారణకు అంతకంటే పైస్థాయి సంస్థ దర్యాప్తు చేస్తుంటే చట్టాన్ని తన పని తాను చేసుకుపోనివ్వవలసిన ముఖ్యమంత్రే అడ్డుపడటం కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనకు దిగడం అజోయ్ ముఖర్జీ కాలానికీ, మమతా బెనర్జీ కాలానికీ మారిపోయిన రాజకీయ విలువలకు–మారిపోయిన అనడం కంటే దిగజారిపోయిన అంటే బాగుంటుంది–అద్దం పడుతున్నది. కేంద్ర దర్యాప్తు సంస్థలు రాష్ట్రాల్లో కేసులు దర్యాప్తు చెయ్యాలంటే రాష్ట్ర ప్రభుత్వాల అనుమతి తీసుకోవాల్సిందే, అందులో ఎటువంటి వివాదమూ లేదు. అయితే కోర్టులు ఆదేశించినప్పుడు ఆ నిబంధన వర్తించదు. రాష్ట్ర ప్రభుత్వాల ప్రత్యేక అనుమతి అప్పుడు అవసరం ఉండదు. ఇక్కడ మొన్న కోల్‌కతా పోలీసు కమిషనర్‌ను ప్రశ్నించడానికి సీబీఐ అధికారులు సుప్రీంకోర్టు ఆదేశాలమేరకే వచ్చారు. అయినా మమతా బెనర్జీ ప్రభుత్వం వారికి అడ్డుపడి కోర్టు ధిక్కారానికి పాల్పడటమేకాక దీక్షలకు దిగడం విచిత్రం.

మళ్ళీ సుప్రీంకోర్టే కోల్‌కతా పోలీసు కమిషనర్ సీబీఐ అధికారుల ముందు హాజరై కేసు దర్యాప్తునకు సహకరించవలసిందేనని చెప్పాల్సి వచ్చింది. ఒక కేసు దర్యాప్తులో ఒక అధికారిని రక్షించడానికి సాక్షాత్తు ముఖ్యమంత్రే నడుం బిగించడం, అదీ కొన్ని లక్షల కుటుంబాలను నాశనం చేసిన ఒక దుర్మార్గమైన కేసులో కావడం వెనక ఉన్న ప్రయోజనం ఏమిటో సామాన్యులకు కూడా అర్థం అవుతుంది. కోల్‌కతా పోలీసు కమిషనర్‌ను విచారించడానికి సీబీఐ ఎంచుకున్న సమయం కేంద్ర ప్రభుత్వం మీద లేదా కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏకు నాయకత్వం వహిస్తున్న బీజేపీ మీద అనుమానాలకు తావు ఇస్తున్నది. రెండు మాసాల్లో సార్వత్రిక ఎన్నికలు జరగనుండటం, ఎన్డీఏకు ముఖ్యంగా బీజేపీకి వ్యతిరేకంగా జాతీయస్థాయిలో ప్రతిపక్ష ఫ్రంట్ ఒకటి ఏర్పడటం, ఆ ఫ్రంట్ గత వారమే కోల్‌కతాలో ఒక పెద్ద బహిరంగ సభ నిర్వహించడం కూడా ఈ అనుమానాలకు ఊతం ఇస్తున్నది.

ఒకప్పుడు మమతా బెనర్జీ బీజేపీకి మిత్రురాలే. గతంలో ఎన్డీఏ ప్రభుత్వంలో భాగస్వామి కూడా. ఆమెలాగే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా నిన్న మొన్నటి దాకా ఎన్డీఏలో భాగస్వామే. బీజేపీకి మంచి మిత్రుడే. రాజకీయంగా తెగతెంపులు చేసుకున్నాక ఇటీవలే చంద్రబాబు ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో సీబీఐ ప్రవేశానికి అనుమతిని రద్దు చేసింది, చంద్రబాబు అడుగుజాడల్లో నడిచి మమతా బెనర్జీ బెంగాల్‌లో కూడా ఇదే నిర్ణయం తీసుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇంకా సీబీఐ ప్రవేశించనే లేదు, ఆదాయ పన్ను అధికారులు కొన్ని వ్యాపార సంస్థల మీదా సంపన్నుల మీద దాడులు చేస్తేనే సహించలేని చంద్రబాబు ప్రభుత్వం ఏవిధంగా వ్యవహరించిందో చూశాం. ఆదాయ పన్ను అధికారులకు రక్షణ కల్పించ వలసిన పోలీసుల సహాయాన్ని ఉపసంహరించుకుని ఏపీ ప్రభుత్వం పన్నులు ఎగవేసే బడా వ్యాపారులకు కొమ్ము కాసింది.

శారదా స్కాంలో నిందితులను రక్షించడానికి కంకణ బద్ధురాలైన మమతా బెనర్జీకి మద్దతు తెలపడానికి బాబు, కుమారుడు లోకేష్ హుటాహుటిన కలకత్తా వెళ్ళారు. పోలీసు కమిషనర్‌ను ప్రశ్నించడానికి వీలులేదని మమతా బెనర్జీ సీబీఐని అడ్డుకుంటే, సుప్రీంకోర్టు అలా కుదరదని విచారణకు హాజరు కావాల్సిందేనని చెప్తే–అందులో మమత విజయం చంద్రబాబుకు ఏం కనిపించిందో? అధికారంలో ఉన్నవారు చట్టబద్ధ వ్యవస్థలను తమ చెప్పుచేతల్లో పెట్టుకోవడం మామూలైపోయిన మాట నిజం. ఇవ్వాళ బాబు, మమత ఏ కూటమిలో అయితే చేరారో అదే యూపీఏ అధికారంలో ఉండగా సుప్రీంకోర్టే సీబీఐ పంజరంలోని రామ చిలకగా మారిందని వ్యాఖ్యానించింది.

ఎవరు అధికారంలో ఉన్నా చట్టబద్ధ వ్యవస్థలను, రాజ్యాంగ సంస్థలను తమకు అనుకూలంగా, తమ వ్యతిరేకులను రాజకీయంగా వేధించడానికి ఉపయోగించుకోవడం సర్వ సాధారణం అయిపోయింది. దీనికి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలు రావలసిందే తప్ప రాజకీయ పార్టీలు చేస్తామంటున్న, చేస్తున్న పోరాటాల్లో చిత్తశుద్ధి కనిపించదు. జాతిని రక్షిస్తాం, వ్యవస్థలను రక్షిస్తాం, అందుకే కాంగ్రెస్‌తో చేతులు కలుపుతున్నానని చెపుతున్న చంద్రబాబు గతంలో ఇవే వ్యవస్థలను రాజకీయ వేధింపుల కోసం కేంద్రంలో కాంగ్రెస్ నాయకత్వంలోని యూపీఏను అడ్డగోలుగా వాడుకున్నప్పుడు తానూ భాగస్వామి అయిన విషయం ఇంకా ఎవరూ మరిచిపోలేదు.

ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుకున్న శారదా స్కాం వంటిదే ఆంధ్రప్రదేశ్‌లో అగ్రి గోల్డ్ కుంభకోణం. ఇంకా అనేక ఆర్థిక అవకతవకలకు సంబంధించి తెలుగు దేశం ప్రభుత్వం, దాని అధినేత, ఆయన కుమారుడూ, మంత్రులూ, నాయకులూ ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. బహుశా కేంద్ర సంస్థల కన్ను ఈ అక్రమాల మీద పడుతుందన్న అనుమానం కలిగిందేమో కొంత కాలంగా–ముఖ్యంగా బీజేపీతో తెగతెంపులు అయిన దగ్గరి నుండీ– బాబు ప్రజలను తనకు రక్షణగా ఉండాలని పదేపదే కోరుతున్నారు. నిన్నగాక మొన్న శాసన సభలో కూడా నన్ను జైలులో పెడతారా అని గొంతు చించుకుని మాట్లాడారు. ఏ తప్పూ జరగకపోతే జైలులో పెడతారేమో అన్న అనుమానం ఎందుకు కలుగుతున్నది ఏపీ ముఖ్యమంత్రికి? నిజానికి దీక్షలు చెయ్యడంలో మమతకి బాబే ఆదర్శం. నాలుగేళ్ళు ప్రత్యేక ప్యాకేజీ పాటపాడి, తప్పనిసరి పరిస్థితుల్లో మాట మార్చి ప్రత్యేక హోదా పల్లవి అందుకున్నాక ఆయన రోజుకో దీక్ష చేస్తున్నారు. చిత్రం ఏమిటంటే ఆ దీక్షలన్నీ ప్రభుత్వ ఖర్చుతోనే.

అన్ని విషయాల్లో ప్రతిపక్ష పార్టీని కాపీ కొట్టినట్టుగానే మొన్న అసెంబ్లీలో కూడా నల్ల బట్టలు ధరించి నిరసన తెలిపే కార్యక్రమం చేశారు. ప్రతిపక్ష వైఎస్ఆర్‌సీపీ శాసన సభలో నల్ల బట్టలు ధరించి నిరసన తెలిపితే, శాసన సభను అపవిత్రం చేస్తారా అన్న చంద్రబాబు, స్పీకర్ కోడెల శివప్రసాద్ రావు అదే ప్రతిపక్షం నిరసనను కాపీ కొట్టారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నా, బీజేపీ అధికారంలో ఉన్నా వ్యవస్థలను స్వతంత్రంగా పనిచేసుకోనిచ్చే పరిస్థితులు ఇవాళ కనపడటం లేదు. దాన్ని ఆసరాగా తీసుకుని మమత, చంద్రబాబులు తమనూ, తమ వారినీ రక్షించుకునేందుకు వ్యవస్థల రక్షకులం అనే ముసుగులు ధరిస్తారు. ఈ ముసుగులను తొలగించి వారివారి నిజ స్వరూపాలు బయటపెట్టే పని ప్రజలే చెయ్యాలి.

datelinehyderabad@gmail.com

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా


అత్యాచారం



"దాంపత్య అత్యాచారాన్ని నేరంగా పరిగణించే ప్రతిపాదనలను పరిశీలించడం లేదని లోక్‌సభలో నేను అడిగిన ఒక ప్రశ్నకు సమాధానంగా ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. వివాహితకు తన శరీరంపై తనకే హక్కు లేకుండా చేసే ఈ తిరోగమన అభిప్రాయం అసంతృప్తి కలిగించింది. భార్యలు వారివారి భర్తల సొంత ఆస్తి అని బీజేపీ భావిస్తోంది"

– శశిథరూర్, ఎంపీ


నాశనం



"అధికారంలోకి రావడానికి అన్నా హజారేను, అవినీతి వ్యతిరేక ఉద్యమాన్ని బీజేపీ, నరేంద్ర మోదీ వాడుకున్నారనడంలో ఎటువంటి సందేహం లేదు. తరువాత అన్నా హజారేను, లోక్‌పాల్‌ను, అవినీతి వ్యతిరేక ప్రచారాన్ని పూర్తిగా వదిలిపెట్టేశారు. లోక్‌పాల్‌ను నియమించలేదు. అక్రమాలపై ఎలుగెత్తే వారి రక్షణ కోసం చేసిన చట్టానికి విధివిధానాలు రూపొందించలేదు. సీబీఐ, సీవీసీలను నాశనం చేశారు. అవినీతి చట్టాన్ని నిర్వీర్యం చేశారు"

– ప్రశాంత్ భూషణ్, న్యాయవాది

హింస



"జమ్మూకశ్మీర్‌లో మానవత్వం మంటగలిసిపోతోంది. రాష్ట్ర భద్రతా సిబ్బందికి ఎటువంటి విధానాలు లేవు. ఆ హింసాత్మక చర్యలను ఎవరూ సమర్థించుకోలేరు. కశ్మీరీ ప్రజలకి పాక్ ఎప్పటికీ అండగా నిలుస్తుంది. స్వయం నిర్ణయాధికారం కోసం పోరాడుతున్న మీరు ఒంటరిగా లేరు"

– షా మహ్మద్ ఖురేషీ
పాక్ విదేశాంగ మంత్రి


వెనక్కు



"మన దేశం వెనక్కుపోతోంది. ప్రముఖ విదేశీ పెట్టుబడిదారు వాల్‌మార్ట్ మన దేశం నుంచి బిచాణా ఎత్తేయనుంది. ఎందుకంటే ప్రధాని నరేంద్ర మోదీ చెప్పకుంటున్న సులభ వ్యాపార సరళి అనేది ప్రపంచ బ్యాంకు నివేదికలో తప్ప ఎక్కడా కనిపించడం లేదట. ఇది ముకేశ్ అంబానీ విజయమే. మోదీకి కృతజ్ఞతలు"

– రూపా సుబ్రమణ్య, ఆర్థికవేత్త

అవినీతిపరులు



"పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ధర్నాకు కూర్చోగానే చాలా ప్రతిపక్షాలు మద్దతు పలికాయి. వారంతా అధికారం కోసం అర్రులు చాస్తున్నవారే. వారిలో చాలామందిపై ఇప్పటికే దర్యాప్తు, విచారణలు సాగుతున్నాయి. కొన్ని కేసుల్లో అవినీతికి, నేరాలకు పాల్పడినందుకు కొందరికి శిక్షలు కూడా పడ్డాయి"

– అరుణ్ జైట్లీ, కేంద్ర ఆర్థిక మంత్రి

దీదీ దీక్షకు అర్థం ఉందా?

పశ్చిమ బెంగాల్‌లో వేగంగా మారుతున్న రాజకీయ పరిణామాలు వివిధ రంగుల్ని సంతరించుకుంటున్నాయి. అటు మమతా బెనర్జీకి, ఇటు భారతీయ జనతా పార్టీకి కీలక యుద్ధ రంగంగా ఆ రాష్ట్రం తయారై, ప్రస్తుతానికి ప్రతీ సంఘటనలో రాజకీయ లబ్ధికై వైరిపక్షాలు తొందరపడుతున్నాయి. 42 లోక్‌సభ స్థానాలతో, అక్కడి పాలక పక్షంపై ప్రభుత్వ వ్యతిరేక భావనతో, ప్రతిపక్షాల అనైక్యతతో పశ్చిమ బెంగాల్ భాజపాకు ఆకర్షణీయంగా కనబడుతోంది. 23 పార్టీలను కూడగట్టి కోలకతాలో భారీ ర్యాలీ నిర్వహించడంలో విజయవంతమైన మమత రానున్న ఎన్నికలకు మోదీ వ్యతిరేక కూటమి నాయకురాలిగా నిలిచే భావనలో ఉన్నారు కాబట్టి ప్రతీ విషయాన్నీ కేంద్ర రాష్ట్ర సంబంధాల అంశంగా మలిచే పనిలో ఉన్నారు. అయితే ప్రస్తుతం సీబీఐ నేపథ్యంగా సాగుతున్న పోరాటం సమంజసమైనది కాదు. ఎందుకంటే సీబీఐ తనిఖీ చెయ్యాలనుకొన్నది ఒక పెద్ద కుంభకోణంకి సంబంధించిన వ్యవహారంలో. ఇది కేంద్రం, రాష్ట్రం మధ్య ఆధిపత్యానికి సంబంధించినది కాదు. అవినీతికి సంబంధించినది. ఏ ఋజువులూ లేకుండా బలహీనమైన కేసులో లేదా తప్పుడు కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థ అతి చేస్తే అది తప్పు. అంతే కానీ వేల కోట్ల రూపాయల మేరకు ప్రజలకు టోపీ పెట్టి తప్పించుకు తిరుగుతున్న పెద్ద తలకాయలపై 2013 నుంచీ ఉన్న కేసు ఇది. శారదా కుంభకోణం కానీ, రోజ్ వ్యాలీ కుంభకోణం కానీ లక్షలాది పేదల సొమ్ము పోంజీ స్కీమ్ ద్వారా సేకరించి, మనీ లాండరింగు లాంటి తీవ్ర నేరాలతో ముడిపడిన స్కాం వ్యవహారం. ఈ కేసును రాష్ట్ర పోలీసులు సక్రమంగా దర్యాప్తు చేయడం లేదని గ్రహించి సుప్రీంకోర్టు సీబీఐకి అప్పగించింది. ప్రస్తుతం సీబీఐ దర్యాప్తు చెయ్యడానికి సిద్ధపడిన అధికారి గతంలో ఈ కుంభకోణంపై దర్యాప్తు చేసి ఉన్న రాష్ట్ర అధికారి. సీబీఐ గొప్పదేమీ కాకపోవచ్చు. కేంద్రం కక్ష సాధించడం తెలియని, పత్తిత్తు కాకపోవచ్చు. కానీ ఈ వేల కోట్ల అవినీతి కుంభకోణంపై జరుగుతున్న దర్యాప్తుని జరగనివ్వాలి. కేంద్రాన్ని బోనులో నిలబెట్టే అవకాశంగా భావించి దర్యాప్తుని అడ్డుకొంటే అది ప్రజల పట్ల బాధ్యతారాహిత్యమే. అలా నిలదీయడానికి, సవాలు చెయ్యడానికి ఇది సముచితమైన కేసు కాదు. పోరాడ్డానికి సవాలక్ష రాజకీయ ఆయుధాలున్నాయి. ఇది మాత్రం కాదు.

డా॥ డీవీజీ శంకరరావు,
మాజీ ఎంపీ, పార్వతీపురం

ఓట్ల కోసమే సంక్షేమం ఎర

సందర్భం


సి. రామచంద్రయ్య

ఎన్నికల వేళ ఓట్ల రాజకీయంలో భాగంగా ఎడాపెడా సంక్షేమ పథకాల ప్రకటనలు చేస్తూ.. పార్టీ కార్యకర్తల నేతృత్వంలో తన ఫొటోలకు క్షీరాభిషేకాలు చేయించుకొంటున్న ఏపీ సీఎం చంద్రబాబు సంక్షేమ ముఖచిత్రం ఏపాటిదో తెలిసే ఒక నివేదిక ఇటీవల బహిర్గతమైంది. 'అంబేద్కర్ ఫౌండేషన్' అనే సామాజిక సంస్థ ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల స్థితిగతులపై చేసిన అధ్యయనంలో పలు దిగ్భ్రాంతికరమైన చేదు నిజాలు వెల్లడయ్యాయి. పేదలు, బడుగుబలహీన వర్గాల విద్యార్థులు నివాసం ఉంటున్న ప్రభుత్వ వసతి గృహాల్లో 44% వాటికి కనీస మౌలిక వసతులు లేవు. రక్షితనీరు అందుబాటులో లేదు. మరుగుదొడ్లు, స్నానాల గదులు తగినన్ని లేవు. ప్రతి 52 మందికి ఒక్కటే టాయిలెట్, ఒక్కటే స్నానపు గది. చలికాలంలో కప్పుకోవడానికి విద్యార్థులకు కంబళ్లు కాదుకదా దుప్పట్లు కూడా లేవు. వసతి గృహాలు మురికి కూపాలుగా మారాయి. దోమలు, ఈగల బెడదతో విద్యార్థులు అనారోగ్యం బారిన పడుతుంటే, వారికి మందులిచ్చే వారు లేరు. వైద్య పరీక్షలు చేయించే వారు లేరు. 2016–17 ఆర్థిక సంవత్సరంలో వసతి గృహాలకు కేటాయించిన బడ్జెట్ నిధుల్లో 38% కోత విధించారు. రాష్ట్రంలో ఎస్సీలకు అందాల్సిన సంక్షేమ పథకాలను బినామీలు ఎగరేసుకునిపోతున్నారు. ఏజెన్సీ ఏరియాలోని ఎస్టీలకు విద్య, వైద్య సౌకర్యాలు అందడం లేదు. గిరిజన గూడేలకు మంచినీటి వసతి కల్పించలేకపోయారు. మైనార్టీలకు ఏటా బడ్జెట్ నిధులలో రూ. 500 కోట్లు మించి ఖర్చు చేయడం లేదు. బీసీలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయిస్తామని చెప్పిన మాట నీటిమూటగా మారింది. పేదలకు ఐదేళ్లల్లో 13 లక్షల ఇండ్లను కడతామన్న లక్ష్యంలో 30% కూడా నెరవేరలేదు. డాక్టర్ వైఎస్సార్ సీఎంగా ఉండగా ప్రవేశపెట్టిన విశిష్ట పథకం 'ఫీజు రీయింబర్స్‌మెంట్'ను నీరుగారుస్తున్నారు. ఆరోగ్యశ్రీ, 104 వంటి పథకాలని కూడా వ్యూహాత్మకంగా దెబ్బతీశారు.

వ్యవసాయ రుణాలన్నీ.. బ్యాంకుల్లో బంగారం కుదవ పెట్టి తీసుకొన్నవి సైతం బేషరతుగా మాఫీ చేస్తామని, స్వామినాథన్ కమిటీ సిఫార్సుల మేరకు రైతు పెట్టిన ఖర్చుకు 50% అదనంగా కనీస మద్దతు ధర అందిస్తామని, ప్రతి ఇంటికో ఉద్యోగం ఇస్తామని, మద్యం అమ్మకాలు తగ్గిస్తా, బెల్ట్ షాపులన్నీ రద్దు చేస్తాం, పన్నుల భారం తగ్గిస్తాం, గ్యాస్ సిలిండర్‌పై రూ. 100 సబ్సిడీ ఇస్తామని... ఇలా దాదాపు ఓ 100 ప్రధాన హామీలు గుప్పించారు. అధికారంలోకి వచ్చాక.. చెప్పిన వాటికి పూర్తి విరుద్ధంగా.. పెట్రో ధరలపై వ్యాట్‌కు అదనంగా సెస్ విధించడం, మద్యం అమ్మకాల్ని, మద్యం ధరల్ని పెంచారు. అమలు చేస్తున్న ఒకటీ అరా సంక్షేమ పథకాల ఫలాలు అర్హులకు అందకుండా.. రాజ్యాంగ విరుద్ధంగా జన్మభూమి కమిటీలను తమ కార్యకర్తలతో నింపి.. సర్పంచ్ అధ్యక్షత జరిగే గ్రామ సభల్లో కాకుండా జన్మభూమి(పార్టీ) కమిటీల ఎంపిక చేసిన వారికే అందిస్తున్న విషయం ప్రజలకు తెలుసు.

ఇసుక మాఫియాలను, కాల్‌మనీ రాకెట్‌లను పరోక్షంగా ప్రోత్సహించారు. బేషరతుగా రైతు రుణమాఫీ చేస్తామని చెప్పి.. అధికారంలోకి వచ్చాక 'కోటయ్య కమిటీ' అంటూ డ్రామాలు ఆడి మాఫీ జరగాల్సిన రూ. 89,000 కోట్లకుపైగా రుణాలను రూ. 24,000 కోట్లకు కుదించారు. ఇంకా ఇప్పటికీ అందులో రూ. 11,000 కోట్లు రైతులకు చెల్లించలేదు. ఎన్టీఆర్ మానస పుత్రిక అయిన కిలో రూ. 2ల బియ్యంను రూ. 5.50 చేసింది బాబే. మద్యపాన నిషేధాన్ని ఎత్తేశారు. రైతులకు ఉచిత విద్యుత్ ఇవ్వడం కుదరదు పొమ్మన్నారు.

మహిళల సంక్షేమంపట్ల చంద్రబాబుకు చిత్తశుద్ధి లేదు. నాగార్జున యూనివర్సిటీ విద్యార్థిని రితేశ్వరి ఆత్మహత్యకు కారణం అయిన వారిని శిక్షించే బదులు, రక్షించడాన్ని మహిళలు ఏవిధంగా అర్థం చేసుకోవాలి? విజయవాడ కాల్‌మనీ నిందితుల్ని ఎందుకు వదిలేశారు? సీఎం బాబు ప్రజాధనాన్ని మంచినీళ్లలా సొంత పబ్లిసిటీకి, పార్టీ కార్యక్రమాలకు ఖర్చు పెట్టడం చూస్తుంటే గుండె తరుక్కుపోతుంది. నిన్నమొన్నటి వరకు.. ప్రైవేటు విమానాలు, విదేశీ పర్యటనలు, స్టార్ హోటళ్లల్లో కుటుంబ సమేతంగా మకాంలు, సొంత ఇంటికి మెరుగులు, చాంబర్ల సోకులు.. మొదలైనవి చేశారు. కానీ, గత యేడాదిగా కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోదీ మీద యుద్ధం పేరుతో వందలకోట్లు ఖర్చు పెట్టి ధర్మదీక్షలు, నవ నిర్మాణ దీక్షలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల అగ్రకులాల పేదలకు కల్పించిన 10% రిజర్వేషన్ల కోటాలో 5% కాపులకు ఇస్తామని చెప్పడం బాబు నయవంచనకు పరాకాష్ఠ. ఏపీ ప్రజలు చైతన్యాన్ని ప్రదర్శించాల్సిన తరుణం ఇది. ఎన్నికల వేళ ఓట్ల కోసం ఎరవేస్తున్న సంక్షేమ పథకాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

వ్యాసకర్త మాజీ ఎంపీ,
వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి

సత్యనిష్ఠ

పూర్వం సమాజంలో సత్యవాక్కుకు, ధర్మాచరణకు విలువ ఎక్కువ ఉండేది. ఎవరికైనా మాట ఇస్తే దానిని నిలబెట్టుకోవటానికి ఎన్ని కష్టాలనైనా పడేవారు. హరిశ్చంద్రుని కథ నిరూపించేది ఇదే. కృత యుగంలో ధర్మం నాలుగు పాదాలతో నడుస్తుంది. త్రేతాయుగంలో మూడు పాదాలతో, ద్వాపరంలో రెండు పాదాలతో నడుస్తుంది. కలియుగంలో ఒక పాదంతోనే నడుస్తుందని ధర్మరాజుతో మార్కండేయ ముని అంటాడు.

కలియుగంలో మానవులలో సత్యవర్తనం క్షీణిస్తుంది. అధర్మం ప్రబలుతుంది అని మహా భారతం చెబుతుంది. అయినప్పటికీ ధర్మాన్ని అంటిపెట్టుకునే వారికీ, సత్యాన్ని పలికేవారికీ సమాజంలో లభించే విలువ, గౌరవం ఎప్పుడూ గొప్పవే. సత్య వాక్య మహిమను గురించి భారత, భాగవతాలలో ఎన్నో కథలున్నాయి. అవి మనలో సత్యనిష్ఠను పెంపొందిస్తాయి.

మహా భారతం ఆదిపర్వంలో దుష్యంతుని రాజాస్థానానికి శకుంతల బిడ్డనెత్తుకుని వెళుతుంది. కణ్వాశ్రమంలో జరిగిన తమ వివాహాన్ని గుర్తుచేసి, బిడ్డను చూపుతుంది. దుష్యంతుడు ఆమెను గుర్తించనట్టు నటిస్తాడు. అతడు అసత్యమాడుతున్నాడని గ్రహించి ఆమె సత్యవాక్య మహిమను చెబుతూ 'సూనృతవ్రత' అని సంబోధిస్తుంది. సత్యాన్ని వ్రతంగా గల అతడి కీర్తికి, అప్పటి ఆ ప్రవర్తనవల్ల కళంకమేర్పడుతుందని హెచ్చరిస్తుంది.




సత్యవాక్య పాలన ఎంత గొప్పది అంటే 'మంచినీటితో నిండిన వంద నూతుల కంటే ఒక బావి మేలు, వంద బావుల కంటే ఒక మంచి యజ్ఞం మేలు, నూరు యజ్ఞాల కంటే ఒక సుతుడు మేలు. అటువంటి నూరు మంది సుతుల కంటే ఒక సత్యవాక్యం మేలు' అంటుంది శకుంతల. పూర్వం రాజులు పుత్ర సంతానం కోసం యజ్ఞాలు చేసేవారు. అలా చేసి పొందిన సుతుల కన్నా ఒక్క సత్యవాక్యాన్ని పలకటానికి ఉన్న విలువ ఎక్కువ. వేయి అశ్వమేధ యాగాల ఫలితాన్ని ఒక త్రాసులో, ఒక సత్య వాక్య ఫలితాన్ని ఒక త్రాసులో పెట్టి చూస్తే సత్య వాక్యం వైపే ముల్లు చూపుతుందని ఆమె చెప్పటంలో సత్యవాక్య మహిమ ఎంత గొప్పదో తెలుస్తుంది.

మహా భాగవతంలో బలి చక్రవర్తి తనను వామనుడికి మూడడుగుల నేల దానమివ్వమని చెప్పిన శుక్రాచార్యుడితో ఆడినమాట తప్పనని, భూదేవి బ్రహ్మతో ఎట్టి దుష్కర్మలు చేసేవారినైనా భరిస్తానుగానీ ఒక్క సత్యహీనుని కూడా భరించలేనని మొరపెట్టుకుందని చెబుతాడు. నిజాయతీతో కూడిన మాట ఉత్తమ వ్యక్తిత్వానికి నిలువెత్తు అద్దం. సత్యవాక్యాన్ని నిబద్ధతతో పాటిస్తే, ఆ సత్యమే మనని రక్షిస్తుంది.

– వాసంతి

బ్రాహ్మణ కార్పొరేషన్



టీడీపీ ఎన్నికల హామీ
బ్రాహ్మణుల సంక్షేమానికి ఒకే విడతలో రూ.500 కోట్లతో నిధి

- ఎన్నికల హామీ ప్రకారం అయ్యే ఖర్చు
- కేటాయింపులు
- ఖర్చు చేసిన నిధులు

సంవత్సరం	కేటాయింపులు
2014-15	రూ. 25 కోట్లు
2015-16	రూ. 35 కోట్లు
2016-17	రూ. 75 కోట్లు
2017-18	రూ. 75 కోట్లు
2018-19	రూ. 75 కోట్లు
2019-20	రూ. 100 కోట్లు





ఓట్ల కోసమే..

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెల గారడీలకే పరిమితమైంది. ఓట్ల కోసం ప్రజల్ని మోసగించేలా ఉంది. ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే రూ.2,26,177.53 కోట్లతో భారీ బడ్జెట్ ప్రకటించారు. గత బడ్జెట్‌లో సంక్షేమానికి చూపించిన నిధుల్ని ఖర్చు చేయకుండా కోత పెట్టడం ప్రజల్ని మోసగించడమే. రాష్ట్రంలో సగం జిల్లాలు తీవ్రమైన కరువు ఎదుర్కొంటుండగా, ఆయా జిల్లాల్లో సమస్యల పరిష్కారానికి ఎలాంటి పరిష్కారం చూపలేదు. అసంఘటిత రంగ కార్మికుల కోసం బడ్జెట్‌లో ఎలాంటి కేటాయింపులు లేవు
–మధు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి



అంకెల గారడీ..

బడ్జెట్ అమలు కాని అంకెల గారడీలా ఉంది. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రకటించిన బడ్జెట్‌గా తేటతెల్లమవుతోంది. చంద్రబాబు నోటికొచ్చిన హామీలిచ్చి ఏదీ సక్రమంగా అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారు. రైతు, డ్వాక్రా రుణమాఫీ జరగలేదు. మళ్లీ మోసం చేసే ప్రయత్నంలో భాగంగా వైఎస్ జగన్ ప్రకటించిన నవరత్నాలను కాపీ కొట్టి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. దానిలో భాగంగా 'పసుపు – కుంకుమ' అంటూ మహిళలను మభ్యపెడుతున్నారు. గతంలోని 600 హామీలకు ఎన్ని అమలు చేశారు?
– చిర్ల జగ్గిరెడ్డి, ఎమ్మెల్యే, కొత్తపేట, తూర్పుగోదావరి



ప్రజాకాంక్షకు తగ్గట్టుగా..

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా 2019–20 తాత్కాలిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టాం. రాజధానిలో ప్రస్తుతం రూ.43,000 కోట్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. 94 లక్షల మంది డ్వాక్రా మహిళలకు రూ.9,400 కోట్లను పసుపు కుంకుమ నిధులుగా కేటాయించాం. అన్నదాత సుఖీభవ పథకం కోసం ఈ బడ్జెట్లో రూ.5,000 కోట్లు ఇచ్చాం. పేదల ఇళ్ల స్థలాల కోసం రూ.500 కోట్లు, క్షత్రియ కార్పొరేషన్‌కు రూ.50 కోట్లు కేటాయించాం. రూ.29,995 కోట్లతో విద్యారంగానికి పెద్దపీట వేశాం.
–కాల్వ శ్రీనివాసులు, మంత్రి



అప్పుల ఊబిలోకి రాష్ట్రం..

రాష్ట్రాన్ని టీడీపీ ప్రభుత్వం అప్పుల ఊబిలోకి నెట్టింది. ఇది ఎన్నికల కోసం ప్రవేశపెట్టిన బడ్జెట్ మాత్రమే. ఇంతవరకూ ఉమ్మడి రాష్ట్రాన్ని పాలించిన సీఎంలు రూ. 96 వేల కోట్ల అప్పు చేస్తే చంద్రబాబు నాలుగున్నరేళ్లలో రూ.2.49 లక్షల కోట్ల అప్పు మిగిల్చారు. ఒక వైపు ఆర్థిక ఇబ్బందులంటూనే తాత్కాలిక భవనాలకు రూ. కోట్లు ఖర్చు చేస్తూ, శాశ్వత భవనాలకు శంకుస్థాపనలు చేస్తూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారు.
– ఎన్.రఘువీరారెడ్డి, పీసీసీ చీఫ్




బాబు స్తోత్రంలా బడ్జెట్..

యనమల బడ్జెట్ ప్రసంగం చంద్రబాబు స్తోత్రంలా ఉంది. ఇది మధ్యంతర బడ్జెట్టా? లేక పూర్తిస్థాయి బడ్జెట్టా? ఇది రాబోయే ప్రభుత్వానికి ప్రశ్నార్థకంగా మారుతుంది. రాష్ట్ర ప్రభుత్వం కుదించిన రైతు రుణమాఫీలో ఇంకా రూ.8,200 కోట్లు ఇవ్వలేదు. పేద, మధ్య తరగతి వర్గాలకు ఇళ్ల మంజూరుకు రూ.4,099 కోట్లు కేటాయిస్తే ఎలా సరిపోతుంది? ప్రజలు ఇలాంటి మాయలను నమ్మరు.
– రామకృష్ణ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి

సాంఘిక సంక్షేమానికి 6,861.60 కోట్లు

- విద్యార్థుల ఉపకార వేతనాలకు నిధుల ఊసే లేదు
- గురుకుల భవనాలు, అదనపు గదుల నిర్మాణాల పరిస్థితి ఇంతే
- ఎస్సీల ఆర్థిక పథకాలకు రూపాయి కూడా ప్రకటించని వైనం



సాక్షి, అమరావతి: ప్రభుత్వం ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో సాంఘిక సంక్షేమానికి ప్రభుత్వం 2019–20 ఆర్థిక సంవత్సరానికి రూ.6,861.60 కోట్లు కేటాయించింది. విద్యార్థులకు ఉపకార వేతనాల చెల్లింపులకు సంబంధించి నిధుల కొరత ఊసే ఎత్తలేదు. ఏపీ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ సొసైటీలో ఉన్న 188 విద్యా సంస్థలకు కూడా ప్రత్యేక కేటాయింపులు లేవు. ఎస్సీలకు ఆర్థిక మద్దతునిచ్చే పథకాలకు రూపాయి కూడా కేటాయించలేదు. చర్మకారుల జీవనోపాధికి, లిడ్‌క్యాప్‌కు, డప్పు కళాకారుల పెన్షన్‌కు ప్రత్యేకంగా కేటాయించారు. ఎస్సీ కాంపొనెంట్ కింద రూ.14,367.34 కోట్లు ఖర్చు చేస్తారు. ఎస్సీ కాలనీలను అనుసంధానించే రోడ్లు, చంద్రన్న పెళ్లికానుక, భూమి కొనుగోలు వంటి పథకాలకు ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు వినియోగిస్తారు. అద్దె ఇళ్లలో నడుస్తున్న సంక్షేమ హాస్టల్ భవనాలను కొత్తగా నిర్మించడానికి, వసతి గృహాలను గురుకులాల్లో విలీనం చేసిన చోట అదనపు గదులు నిర్మించడానికి నిధులు కేటాయించలేదు.

గిరిజన సంక్షేమానికి రూ.2,309.73 కోట్లు

గిరిజన సంక్షేమం కోసం ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.2,309.73 కోట్లు కేటాయించింది. ఈ మొత్తాన్ని ఎస్టీ రెసిడెన్షియల్ స్కూళ్ల భవన నిర్మాణాలు, రెసిడెన్షియల్ స్కూళ్లకు మెయింటెనెన్స్, ఎస్టీ కార్పొరేషన్ ద్వారా రుణసాయం, గిరిజనులకు పౌష్టికాహారం పంపిణీ, ఐటీడీఏల్లో మార్కెటింగ్ స్టోరేజ్, తదితర మౌలిక సదుపాయాల కోసం ఖర్చు చేస్తామని ప్రకటించింది. గిరిజన హాస్టళ్లను గురుకులాలుగా మార్చిన చోట భవనాల నిర్మాణాలను పట్టించుకోలేదు. ప్రస్తుతం విద్యార్థులు సంక్షేమ హాస్టళ్లలో ఇరుకు గదుల్లో ఉంటూ విద్యాభ్యాసం చేస్తున్నారు. గిరిజన ప్రాథమిక పాఠశాలల్లో తాగునీటి వసతి, మౌలిక సదుపాయాల కల్పన ప్రతిపాదనల్లో ఉన్నా పనులు మాత్రం జరగడం లేదు.

కేటాయింపులు-ఖర్చు (రూ. కోట్లలో)

సంవత్సరం	కేటాయింపు	ఖర్చు
2014-15	1,150.01	950.00
2015-16	1,115.30	816.00
2016-17	1,563.37	1140.06
2017-18	1,815.33	1,818.78
2018-19	2129.13	-



మైనార్టీలకు రూ.1,308.73 కోట్లు

మైనార్టీల సంక్షేమానికి 2019–20 సంవత్సరానికి రూ.1,308.73 కోట్లు కేటాయించారు. మైనార్టీల విదేశీ విద్య, దుల్హన్, ఇమామ్‌లు, మౌజన్లకు ప్రోత్సాహకాలు, బ్యాంకుల రుణాలతో ఆదాయ వనరులు చేకూర్చే పథకాలకు, క్రిస్టియన్ మైనార్టీలకు ఈ నిధులు ఖర్చు చేస్తారు.

కేటాయింపులు-ఖర్చు (రూ. కోట్లలో)

సంవత్సరం	కేటాయింపు	ఖర్చు
2014-15	575.20	384.65
2015-16	468.32	335.31
2016-17	795.61	635.85
2017-18	840.25	465.42
2018-19	1,101.90	-

32 కార్పొరేషన్‌లకు రూ.3,000 కోట్లేనా?!



బడుగు, బలహీన వర్గాల సంక్షేమం పట్టని ప్రభుత్వం
బడ్జెట్‌లో అరకొరగా నిధుల కేటాయింపు

సాక్షి, అమరావతి: బడుగు, బలహీన వర్గాలపై ప్రభుత్వం మరోసారి సవతి తల్లి ప్రేమే కనబరిచింది. ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో అరకొరగా నిధులు విదిల్చి చేతులు దులుపుకుంది. 2018–19 బడ్జెట్‌లో అన్ని రకాల వెనుక బడిన తరగతుల కార్పొరేషన్‌లకు రూ.1,337.81 కోట్లు కేటాయించింది. 2019–20 బడ్జెట్‌లో రూ.3000 కోట్లు కేటాయించింది. నిధుల కేటాయింపులు పెరిగినట్లు గణాంకాలను బట్టి తెలుస్తున్నా.. గతేడాదితో పోలిస్తే ఇప్పుడు కులాల వారీగా కార్పొరేషన్‌ల సంఖ్య భారీగా పెరిగింది. అంటే ఈ నిధులు ఏ మూలకూ చాలని దుస్థితి. అర కొర నిధులతో అన్ని వర్గాల సంక్షేమం ఎలా సాధ్యమో ప్రభుత్వమే చెప్పాలి. ఈ ఏడాది ఓటాన్ అకౌంట్ బడ్జెట్ కావడంతో కార్పొరేషన్‌ల వారీగా ఎంతెంత కేటాయించారనే వివరాలను ప్రభుత్వం బయటపెట్టలేదు. అన్ని కార్పొరేషన్‌లకు కలిపి రూ.3,000 కోట్లు కేటాయించినట్లు వెల్లడించింది. గతేడాది దాకా 11 బీసీ ఫెడరేషన్‌లు ఉన్నాయి. ఇప్పుడు ఈ ఫెడరేషన్‌లను కార్పొరేషన్‌లుగా మార్చారు. ఇవి కాకుండా బ్రాహ్మణ, వైశ్య కార్పొరేషన్‌లు ఇప్పటికే ఉన్నాయి. సోమవారం మరో 10 బీసీ కులాలకు కార్పొరేషన్‌లు ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జీవో ఇచ్చింది. రాష్ట్రంలో బీసీ, ఈబీసీ వర్గాలకు సంబంధించి మొత్తం 32 కార్పొరేషన్‌లు ఉన్నాయి. ఈ బడ్జెట్‌లో కేటాయించిన రూ.3,000 కోట్లను ఈ 32 కార్పొరేషన్‌లు పంచుకోవాల్సి ఉంటుంది.

కేటాయింపులు సరే.. సరుకులేవీ?

సాక్షి, అమరావతి: పౌరసరఫరాల శాఖకు కేటాయింపుల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం మాయ చేస్తోంది. 2018–19లో రూ. 3,495.39 కోట్లు కేటాయించి.. ఇప్పటి వరకు రూ. 1,578.82 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. తాజాగా 2019–20 ఆర్థిక సంవత్సరానికి రూ. 3,763.42 కోట్లు బడ్జెట్‌లో కేటాయించారు. గత ప్రభుత్వ హయాంలో అమ్మహస్తం పథకం పేరిట 9 రకాల సరుకులను సబ్సిడీపై కేవలం రూ. 185లకే పంపిణీ చేసేవారు. ఆ పథకాన్ని చంద్రబాబు ప్రభుత్వం రద్దు చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం బియ్యంతో పాటు అర కిలో చక్కెర, కిలో కందిపప్పు మాత్రమే పేదలకు పంపిణీ చేస్తున్నారు. రాగులు, జొన్నలు తీసుకునే లబ్ధిదారులకు వాటిని ఎన్ని కిలోలు తీసుకుంటే ఆ మేరకు బియ్యంలో కోత విధిస్తున్నారు. తెల్లరేషన్ కార్డుల కోసం 3 లక్షలకు పైగా దరఖాస్తులు వచ్చినా వాటిని పరిశీలించలేదు. ఈ బడ్జెట్‌లో రూ. 4,500 కోట్లు కావాలని పౌరసరఫరాల శాఖ అధికారులు ప్రతిపాదనలు పంపితే అందులో రూ. 3,763.42 కోట్లు కేటాయించారు. రాష్ట్రంలో వంద శాతం గ్యాస్ కనెక్షన్ల కోసం గత బడ్జెట్‌లో రూ. 350 కోట్లు కేటాయిస్తే అందులో సగం నిధులు కూడా ఖర్చు చేయలేదు. దీంతో చాలా మంది పేదలకు గ్యాస్ కనెక్షన్లు అందని పరిస్థితి నెలకొంది.

బీసీల సంక్షేమం అంతంతే..

కేటాయింపులకు, చేసే ఖర్చుకు చాలా తేడా

సాక్షి, అమరావతి: బీసీల సంక్షేమం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చెప్పేదానికి, చేసేదానికి పొంతన లేకుండా పోతోంది. బీసీల సంక్షేమం కోసం ఎంతో చేస్తున్నామన్న రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో చేస్తున్న కేటాయింపులు అంతంత మాత్రమే కాగా.. ఆ కేటాయించిన నిధులను సైతం సరిగా వినియోగించట్లేదు. 2014–15 ఆర్థిక సంవత్సరం నుంచి తాజా బడ్జెట్ వరకు ప్రభుత్వం బీసీల సంక్షేమం కోసం కేటాయింపులు, చేసిన ఖర్చును పరిశీలిస్తే ఈ విషయం తేటతెల్లమవుతోంది. 2014–15లో కేటాయించింది రూ.3,129 కోట్లు మాత్రమే అయితే అందులో రూ.3,122 కోట్లను ఖర్చు పెట్టింది. అయితే 2015–16 కేటాయింపు రూ.3,231 కోట్లు అయితే ఖర్చు చేసింది రూ.2,720 కోట్లు మాత్రమే. 2016–17లోనూ ఇదే పరిస్థితి. బడ్జెట్‌లో రూ.4,430 కోట్లు కేటాయించగా.. ఖర్చు చేసింది కేవలం రూ.3,045 కోట్లు మాత్రమే. ఇక 2017–18లో రూ. 5,013 కోట్లు కేటాయింపు చేయగా.. అందులో ఖర్చు చేసింది 4,783 కోట్లు మాత్రమే. గతేడాది 6,213 కోట్లు కేటాయించగా.. ఈసారి రూ.8,242.46 కోట్లు కేటాయించింది. కాగా, కార్పొరేషన్ల సంఖ్య పెరిగినందున రూ.మూడువేల కోట్లను కార్పొరేషన్లకు కేటాయిస్తున్నట్లు ప్రత్యేకంగా ప్రస్తావించారు. బీసీల జనాభాను పరిగణనలోకి తీసుకుంటే ప్రస్తుతం చేసిన కేటాయింపులు ఏమాత్రం సరిపోవు. బీసీలు, ఈబీసీల ఫీజుల పెరుగుదలకు అనుగుణంగా బడ్జెట్ పెరగలేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

కేటాయింపులు-ఖర్చు (రూ. కోట్లలో)

సంవత్సరం	కేటాయింపు	ఖర్చు
2014-15	3,129.00	3,122.00
2015-16	3,231.00	2,720.00
2016-17	4,430.00	3,045.00
2017-18	5,013.50	4,783.22
2018-19	6,213.16	-

మహిళా సంక్షేమానికి రూ.3,408 కోట్లు..

తాజా ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం మహిళలు, శిశు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్, వయో వృద్ధుల సంక్షేమానికి రూ.3,408.66 కోట్లు మాత్రమే కేటాయించింది. పిల్లలు, తల్లుల ప్రత్యేక పోషకాహార పథకం, ఐసీడీఎస్ ప్రాజెక్టులు, కౌమార దశ బాలికల జీవన విధానం పెంపుదల పథకాలకోసం ఈ మొత్తాన్ని ఖర్చుచేస్తారు. బాలికలకు శానిటరీ నాప్‌కిన్లు, దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు ఏర్పాటు చేసే కార్యక్రమం, దివ్యాంగుల సంక్షేమం, ట్రాన్స్‌జెండర్లు గౌరవప్రదమైన జీవితం సాగించడానికి ఈ నిధులు ఖర్చుచేస్తారు. కేటాయింపుల వివరాలిలా ఉన్నాయి..

కేటాయింపులు-ఖర్చు (రూ. కోట్లలో)

సంవత్సరం	కేటాయింపు	ఖర్చు
2014-15	1,130.00	1,126.00
2015-16	1,137.00	1,403.00
2016-17	1,331.00	1,208.00
2017-18	1,773.05	2,497.98
2018-19	3,007.96	-



కార్మిక సంక్షేమానికి రూ.1,225 కోట్లు..

కార్మిక సంక్షేమానికి 2019–20 బడ్జెట్‌లో రూ.1,225.75 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. ఇందులో చంద్రన్న బీమాకు రూ.354.02 కోట్లు కేటాయించారు. ఇదిలా ఉంటే.. రెండేళ్లక్రితం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధి నుంచి రూ.350 కోట్లు ప్రభుత్వం తీసుకుని చంద్రన్న బీమాకు ప్రీమియం కింద చెల్లించింది. ఈ సొమ్మును తిరిగి భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధికి జమ చేయాల్సి ఉండగా.. దానికి సంబంధించిన ప్రస్తావన తాజా బడ్జెట్‌లో ఎక్కడా కనిపించలేదు.




అరకొర నిధులు

డ్వాక్రా మహిళలకు జీరో వడ్డీ రుణాలు

బకాయిలు, కేటాయిపులు ఇలా (రూ. కోట్లలో)

ఇప్పటికే బకాయిలు	2,350
వచ్చే ఏడాది అవసరం	1,100
మొత్తం కావాల్సింది	3,450
బడ్జెట్‌లో కేటాయించింది	1,100

సాక్షి, అమరావతి: డ్వాక్రా మహిళల జీరో వడ్డీ రుణాలపై చంద్రబాబు ప్రభుత్వం ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లోనూ కనికరం చూపలేదు. ఇప్పటికే డ్వాక్రా మహిళలకు జీరో వడ్డీ రుణాల రూపేణా రూ. 2,350 కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉంది. 2016 అక్టోబరు నుంచి ఇప్పటి వరకూ చెల్లించాల్సిన జీరో వడ్డీ రుణాలకు ప్రభుత్వం బకాయి ఉంది. 2019–20కి మరో రూ.1,100 కోట్లు అవసరముంటుంది. అంటే మొత్తం కావాల్సింది రూ.3,450 కోట్లు. చంద్రబాబు ప్రభుత్వం మాత్రం రూ.1100 కోట్లు మాత్రమే కేటాయించింది. అంటే ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయింపులు జరిపిన మొత్తం విడుదల చేసినా, ఇంకా రూ. 2,350 కోట్లు వడ్డీ డబ్బులు బ్యాంకుల్లో తమ పేరిట అప్పుగానే ఉంటుందని.. దీనిపైనే ఏడాదికి రూ. 250 కోట్లు దాకా అపరాధ వడ్డీ భారం డ్వాక్రా మహిళలపై పడుతుంది. 2014 ఎన్నికల సమయంలో డ్వాక్రా రుణాలన్నీ మాఫీ చేస్తానని చంద్రబాబు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక ఐదేళ్లలో ఆ హామీ అమలు గురించే పట్టించుకోని మహిళలు ఆరోపిస్తున్నారు. ఈ బడ్జెట్‌లో డ్వాక్రా రుణమాఫీకి సరిపడా కేటాయింపులతో పాటు, పాత బకాయిల చెల్లింపులకూ నిధులు పెంచకపోవడం మోసం చేయడం కాదా అని ప్రశ్నిస్తున్నారు. పథకాన్ని పూర్తిగా నీరు గార్చే ప్రణాళిక ఏమైనా ఉందా అన్న అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు.




ఏకమొత్తం నిధి ఏదీ?

ఐదు బడ్జెట్లలో కేటాయించింది రూ. 285 కోట్లే

స్కాలర్‌షిప్పులు సగానికి కోత

సాక్షి, అమరావతి: అధికారంలోకి రాగానే బ్రాహ్మణుల సంక్షేమానికి రూ.500 కోట్ల ఏక మొత్తంతో ప్రత్యేక నిధిని ఏర్పాటు చేస్తానని చంద్రబాబు ఇచ్చిన హామీ.. ఆరు బడ్జెట్లు ప్రవేశపెట్టిన తర్వాత కూడా నెరవేరక పోవడంపై బ్రాహ్మణ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. రాష్ట్రంలో 25 లక్షల వరకు ఉండే బ్రాహ్మణ కుటుంబాలను చంద్రబాబు ఏటా నిరాశకు గురి చేస్తూనే ఉన్నారని, చివరకు ఆఖరి బడ్జెట్‌లోనూ ఉసూరు మనిపించారని మండిపడుతున్నారు. బ్రాహ్మణుల సంక్షేమం నిమిత్తం కార్పొరేషన్‌కు 2014–15 ఆర్థిక సంవత్సరంలో రూ. 25 కోట్లు కేటాయించగా 2015–16లో రూ.35 కోట్లు కేటాయించారు. 2016–17, 2017–18, 2018–19 మూడేళ్లూ రూ.75 కోట్లు చొప్పున కేటాయించారు. తాజాగా ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో రూ.100 కోట్లు కేటాయిస్తున్నట్లు పేర్కొన్నప్పటికీ.. ఈ మొత్తాన్ని అసెంబ్లీ ఎన్నికలకు ముందు విడదల చేసే అవకాశం ఉండదు. ఈ విధంగా బ్రాహ్మణ కార్పొరేషన్‌కు ఐదేళ్లలో రూ.285 కోట్లే కేటాయించినట్టయ్యింది. విడుదల చేసేందుకు అవకాశం లేకపోయినా కేవలం ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రచారం కోసం ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో రూ.100 కోట్లు కేటాయించారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రాష్ట్రవ్యాప్తంగా బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన కుటుంబాలు 20– 25 లక్షల వరకు ఉంటాయని అంచనా. వీరిలో 18 ఏళ్ల వయస్సు నిండిన వారు 45 లక్షల మంది దాకా ఉంటారు. కార్పొరేషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం అరకొర నిధులే విడుదల చేస్తుండడంతో ఐదేళ్లలో 80 వేల మంది కూడా ఆర్థిక సహాయం అందుకోలేదని బ్రాహ్మణ సంఘాలు చెబుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం సరిగ్గా నిధులివ్వకపోవడంతో కార్పొరేషన్ ఏర్పాటు చేసిన తొలి రెండేళ్ల పాటు పీజీ చదువుకునే పేద బ్రాహ్మణ విద్యార్థులకు రూ.20 వేల చొప్పున స్కాలర్‌షిప్పులు ఇచ్చినా.. ఇప్పుడు ఆ మొత్తాన్ని రూ.10 వేల చొప్పున కుదించారు. పాఠశాల విద్యార్థులకు ఇచ్చే స్కాలర్‌షిప్పుల మొత్తాన్ని సగం దాకా తగ్గించారు. గతంలో పదవ తరగతి వరకు చదువుకునే పిల్లలకు ఏడాదికి రూ.10 వేల మేర స్కాలర్‌షిప్పులు మంజూరు చేసిన అధికారులు, ఇప్పుడు ఏడవ తరగతి వరకు విద్యార్థులకు రూ.5 వేలు, 7–10వ తరగతి మధ్య విద్యార్థులకు రూ.7 వేలు మాత్రమే ఇస్తుండటం గమనార్హం.



నిరుద్యోగ భృతికి కేటాయింపులు

సంవత్సరం	కేటాయించింది	ఖర్చు చేసింది
2014-15	------	---
2015-16	------	----
2016-17	----	------
2017-18	రూ.500 కోట్లు	----
2018-19	రూ.1,000 కోట్లు	ప్రస్తావించలేదు
2019-20	రూ.1,200 కోట్లు	





అన్నదాత సుఖీభవకు రూ. 5,000 కోట్లు



సాక్షి, అమరావతి: బడ్జెట్‌లో కొత్త పథకాలకు కొంతమేరకు నిధులు కేటాయించారు. ఎన్నికలు తరుముకొస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టనున్న అన్నదాత సుఖీభవ పథకం కోసం రూ.5,000 కోట్లు బడ్జెట్‌లో పెట్టారు. ఇందుకు సంబంధించి విధివిధానాలు గానీ, రైతుకు ఎంత ఇస్తారనే అంశం గానీ ప్రస్తావించలేదు. ఇళ్ల స్థలాల భూసేకరణకు రూ.500 కోట్లు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు(ఎంఎస్‌ఎంఈ)కు ప్రోత్సాహకాలు ఇవ్వడం కోసమంటూ రూ.400 కోట్లు పెట్టారు. డ్రైవర్ల సాధికార సంస్థకు రూ.150 కోట్లు, పట్టణ స్థానిక సంస్థల మౌలిక సదుపాయాల కల్పనకు రూ.100 కోట్లు, క్షత్రియుల సంక్షేమానికి రూ.50 కోట్లు కేటాయించారు.

రైతును ఆదుకోని ధరల స్థిరీకరణ నిధి



సాక్షి, అమరావతి: రైతులను ఆదుకునేందుకు ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేస్తామని గతంలో పలుమార్లు ప్రకటించినా ఇన్నాళ్లూ వాటి ఊసే ఎత్తని ప్రభుత్వం 2019–20 బడ్జెట్‌లో మాత్రం రూ.1,000 కోట్లు కేటాయించింది. గత ఏడాది రూ.500 కోట్లు కేటాయించినట్టు చెబుతున్న ప్రభుత్వం రైతు ప్రయోజనాల కోసం ఏ మాత్రం నిధులు విడుదల చేయలేదు. మొక్కజొన్న, ఉల్లి, మామిడి, కందుల రైతులు గిట్టుబాటు ధరలు లభించక గత ఏడాది తీవ్రంగా నష్టపోయారు. ఆ సమయంలో ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తాయి. ఒకవైపు ఎన్నికలు సమీపిస్తుండటం, మరో వైపు ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహనరెడ్డి రైతులను ఆదుకునేందుకు ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేస్తామని ప్రకటించడంతో చేసేది ఏమీలేక ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించింది. ఈ నిధులు కూడా రైతులకు పూర్తిస్థాయిలో ఉపయోగపడే అవకాశాలు లేవని వ్యవసాయ రంగ నిపుణులు చెబుతున్నారు.

ఉద్యోగ ఉపాధ్యాయులకు మొండిచేయి




ఏపీటీఎఫ్, వైఎస్సార్‌టీఎఫ్ ధ్వజం

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్లో ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించి ఒక్క అంశాన్నీ ప్రస్తావించకపోవడం అన్యాయమని వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రెడ్డి శేఖరరెడ్డి, వి.వెంకటరెడ్డి, ఏపీటీఎఫ్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి జి.హృదయరాజులు వేర్వేరు ప్రకటనలో ధ్వజమెత్తారు. ఉద్యోగులకు ఐఆర్ మంజూరు, బకాయి ఉన్న డీఏలు, ఇతర డిమాండ్లకు సంబంధించిన అంశాలను బడ్జెట్లో పేర్కొనలేదన్నారు. బడ్జెట్లో విద్యాశాఖకు భారీగా కేటాయింపులు చేసినట్లు చూపుతున్నా వాస్తవ కేటాయింపులకు వచ్చేసరికి కుదిస్తున్నారని, కేటాయించిన నిధుల ఖర్చులో కూడా ప్రభుత్వం మొండిచేయి చూపిస్తోందన్నారు. గత కొన్నేళ్లుగా బడ్జెట్ అంచనా కేటాయింపులు, సవరణ కేటాయింపులు, ఖర్చుల లెక్కలు చూస్తే ఈ విషయం అర్థమవుతుందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు జనవరి నెలకు సంబంధించిన జీతభత్యాలు కూడా ఈసారి పూర్తిస్థాయిలో ఇవ్వకపోవడం చూస్తుంటే ప్రభుత్వానికి ఉద్యోగ, ఉపాధ్యాయులపై ఉన్న చిత్తశుద్ధిని నిరూపిస్తోందని అన్నారు. లక్షలాది మంది రుణాలు, వైద్యచికిత్సలకోసం పెట్టుకున్న దరఖాస్తులు కొన్ని నెలలుగా పరిష్కారం కావడం లేదన్నారు. చివరకు స్కూళ్ల నిర్వహణకు, విద్యార్థులకు అందించాల్సిన పరికరాలకు ఖర్చు చేయాల్సిన నిధుల్ని కూడా ప్రభుత్వం దారిమళ్లిస్తోందని దుయ్యబట్టారు.

పదాలు పలకడంలో మంత్రి యనమల తడబాటు



సాక్షి, అమరావతి: ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు మంగళవారం తన బడ్జెట్ ప్రసంగంలో పలుమార్లు తడబడ్డారు. పలు పదాలను తప్పుగా ఉచ్చరించారు. సవాళ్లను.. శవాలు అని పలికారు. కొన్నిసార్లు చదివిన లైన్లే మళ్లీ చదివారు. కింది లైన్లను పైన, పై వాటిని కింద చదివి కలగాపులగం చేశారు. బడ్జెట్ ప్రసంగాన్ని చదవడం ప్రారంభించిన యనమల ఆదిలోనే పిల్లల బట్టల కుట్టుకూలిని.. కట్టుకూలి అంటూ తడబడ్డారు. ఆ పరంపర చివరి వరకు కొనసాగింది. చక్కటి జీవనాన్ని.. చీకటి అని సంభోదించారు. యువతను యవత, కేటాయింపుల్ని కేటింపుగా చదివారు. చర్చిల నిర్మాణాన్ని చర్చల నిర్మాణాలుగా, ప్రమాదాన్ని ప్రధమంగా చదివారు. చివరకు ఆయన రోజూ ఉచ్చరించే దారిద్ర్య రేఖను, ప్రోత్సాహకాలను, కేంద్రీకృతం వంటి పదాలను సైతం తప్పుగా పలికారు. ఓ దశలో ఈ చర్య అనడానికి బదులు ఈ చర్మ అనేశారు. హాలిడేను హోలీడేగా, షీ టీమ్‌ను టీ టీమ్‌గా, వ్యవసాయాన్ని వ్యవస్థాగతంగా మార్చేశారు. దాదాపు 25 పదాలను ఆయన తప్పుగా చదివారు.



బడ్జెట్‌లో విద్యకు కేటాయింపులు

ఏడాది	మొత్తం బడ్జెట్ (రూ.కోట్లలో)	కేటాయింపు (రూ.కోట్లలో)	శాతం
2014-15	1,11,823.86	14,860.94	13.28
2015-16	1,13,048.98	17,729.02	15.68
2016-17	1,35,688.99	19,428.86	14.31
2017-18	1,56,999.40	20,358.78	12.96
2018-19	1,91,063.60	24,098.74	12.61
2019-20	2,26,177.53	25,955.00	11.47

- గత ఏడాది కేటాయింపుల్ని భారీగా సవరించిన సర్కారు
- ఉన్నత విద్యకు రూ. 2,834 కోట్లను రూ.2734 కోట్లకు కుదింపు
- పాఠశాల విద్యకు రూ.21,612 కోట్లను రూ.18,524 కోట్లకు కుదింపు
- వచ్చే ఏడాదికి ఉన్నత విద్యకు రూ.3,171కోట్లు, పాఠశాల విద్యకు రూ. 22,783 కోట్ల కేటాయింపు

విద్య.. అంతా మిథ్య

సాక్షి, అమరావతి: అసెంబ్లీ ఎన్నికల తరుణంలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్లో మానవవనరుల అభివృద్ధి శాఖకు కేటాయింపుల్లో రాష్ట్ర ప్రభుత్వం అంకెల గారడీ ప్రదర్శించింది. 2018–19 కన్నా 2019–20 ఆర్థిక సంవత్సరానికి కేటాయింపులు పెంచినా.. వాస్తవాల్ని పరిశీలిస్తే డొల్లతనం ప్రస్ఫుటమవుతుంది. రూ.25,955 కోట్లు ఉన్నత విద్య, సెకండరీ విద్యకు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఉన్నత విద్యకు 3171.63 కోట్లు, సెకండరీ విద్యకు 22,783.37 కోట్లుగా కేటాయింపులు చూపారు. గత ఏడాదికన్నా ఉన్నత విద్యకు 11.88 శాతం, సెకండరీ విద్యకు 5.42 శాతం పెంచినట్లు అంకెలు చూపించారు. అదే సమయంలో 2018–19 సంవత్సరం బడ్జెట్ లెక్కల్ని భారీగా సవరించారు. 2018–19లో ఉన్నత విద్యకు 2,834.90 కోట్లు కేటాయించి దానిని 2,734.99కోట్లకు, సెకండరీ విద్యకు 21,612.30 కోట్లు కేటాయించి రూ.18,524 కోట్లకు కుదించారు.

మంత్రి ఒకలా.. బడ్జెట్ వివరాల్లో మరోలా

ఈ సారి కేటాయింపుల్ని బడ్జెట్ ప్రసంగంలో మంత్రి ఒకలా, వివరాల్లో మరో విధంగా చూపించారు. మంత్రి ప్రసంగంలో రూ.29,995 కోట్లు కేటాయించినట్లు పేర్కొనగా కేటాయింపుల్లో రూ. 25,995గా పొందుపరిచారు. బడ్జెట్ కేటాయింపుల వివరాల్లో మరికొన్ని చోట్ల విద్యకు రూ. 26,461 కోట్లు కేటాయించినట్లు చెప్పడం విశేషం. సాధారణ విద్యకు రూ. 25,591.39 కోట్లు, సాంకేతిక విద్యకు రూ.870.32 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు.


రెవెన్యూ ఖర్చులకే 95 శాతం నిధులు

ఈ కేటాయింపుల పెంపులో కూడా విద్యాభివృద్ధికి సంబంధించిన వివిధ మౌలిక వసతులు, ఇతర సదుపాయాల కల్పనకు వెచ్చించే నిధులు చాలా తక్కువగా ఉన్నాయి. సాధారణ విద్య కేటాయింపులనే తీసుకొంటే వేతనాలు, ఇతర ఖర్చులకు సంబంధించిన రెవెన్యూ పద్దుకింద రూ.25116.84 కోట్లు పేర్కొనగా కేపిటల్ పద్దుకింద 474.55 కోట్లు మాత్రమే చూపించారు. సాంకేతిక విద్యలో 699.32 కోట్లు రెవెన్యూ పద్దు కాగా.. కేపిటల్ కింద 171.00 కోట్లు చూపించారు.

క్రమేణా తగ్గుతున్న కేటాయింపులు

మానవవనరుల అభివృద్ధికి సంబంధించి గత కొన్నేళ్లుగా బడ్జెట్‌లో కేటాయింపుల శాతం తగ్గుతూ వస్తోంది. గత ఏడాది 13.06 శాతం కేటాయింపులు చూపగా.. ఈసారి 11.5 శాతానికి కుదించారు.





రాబడి	
రెవెన్యూ వసూళ్లు	- రూ.1,78,269.85 కోట్లు
రుణాలు	- రూ.45,078.7 కోట్లు
రుణ వసూళ్లు	- రూ.600 కోట్లు
నికర ప్రజాపద్దు	- రూ.1,756.6 కోట్లు

వ్యయం	
రెవెన్యూ వ్యయం	- రూ.1,80,369.32 కోట్లు
మూలధన వ్యయం	- రూ.29,596.53 కోట్లు
రుణాల చెల్లింపు	- రూ.14,917 కోట్లు
రుణాలు, అడ్వాన్స్‌లు	- రూ.1,294.7 కోట్లు


గృహ నిర్మాణానికి బడ్జెట్ కేటాయింపులు సరే...

బిల్లులు మాత్రం పెండింగ్



సాక్షి, అమరావతి: గృహ నిర్మాణానికి బడ్జెట్‌లో కేటాయింపులు చేస్తున్నా లబ్ధిదారులకు మాత్రం బిల్లులు సరిగా ఇవ్వడంలేదు. 2019–20 ఆర్థిక సంవత్సరానికి రూ.3,734.60 కోట్లు కేటాయించారు. ప్రభుత్వం ఐదేళ్లలో మంజూరు చేసి 15.94 లక్షల ఇళ్లు పూర్తిచేయాలంటే రూ.20 వేల కోట్లు అవసరం అవుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. ఈ ఆర్థిక సంవత్సరంతో ఐదేళ్ల బడ్జెట్‌లో రూ.8,028 కోట్లు కేటాయించారు. ఈ లెక్కన కేటాయింపులు చూస్తే ప్రభుత్వం ఇప్పటివరకు మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలు మరో ఐదేళ్లయినా పూర్తయ్యే పరిస్థితి కన్పించడం లేదు. రాష్ట్రంలో 7 లక్షల ఇళ్ల నిర్మాణం వివిధ దశల్లో ఉన్నాయి. వీటికి సంబంధించి రూ.1,000 కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఎన్నికల సందర్భంగా ఒక్కో ఇంటి నిర్మాణానికి యూనిట్ ధర రూ.3 లక్షలుగా నిర్ణయిస్తామని చెప్పిన చంద్రబాబు ఆ మొత్తాన్ని రూ.1.50 లక్షలకే కుదించారు. ఐదేళ్లలో బడ్జెట్ కేటాయింపులు ఇలా ఉన్నాయి.

ఆర్థిక సంవత్సరం	బడ్జెట్ (రూ.కోట్లలో)	ఖర్చు చేసిన నిధులు
2014-15	808	298.04
2015-16	897	551.43
2016-17	1,132.83	1,344.83
2017-18	1,457	1,604.03
2018-19	3,734.60	2,980.04
2019-20	4,079.10	---



అంకెల్లో ఘనం... అభివృద్ధిలో అధమం

ఇదీ ఉప ప్రణాళికల తీరు

సాక్షి, అమరావతి: ఎస్సీ సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉప ప్రణాళిక అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోంది. 2019–20 సంవత్సరానికి రూ.14,367.34 కోట్లు బడ్జెట్‌లో కేటాయించారు. గత ఏడాది రూ.11,228.10 కోట్లు కేటాయించగా ఇవన్నీ కేవలం పర్సంటేజీ పనుల కోసమే ఖర్చుచేసినట్టు తీవ్రమైన విమర్శలు ప్రభుత్వంపై ఉన్నాయి. నిధులు ఖర్చుకాని శాఖల నుంచి సేకరించిన సబ్‌ప్లాన్ నిధులను పంచాయతీరాజ్ శాఖకు కేటాయించి నేతలు దండుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. ప్రభుత్వం ఎక్కువ నిధులు పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖకు కేటాయించి ఖర్చు చేయడం విశేషం. గ్రామాల్లో మౌలిక వసతులు కనిపించడం లేదు. కేటాయింపులు మాత్రం ఏడాదికేడాదికి పెంచుతూ పోతున్నారు. జనాభాను బట్టి సబ్‌ప్లాన్‌లో కేటాయింపులు ఉంటాయి. ఈ నిధులతో ఎస్సీల జీవనోపాధి పెరగాలే తప్ప నేతల జేబుల్లోకి డబ్బులు చేరేటట్టు కార్యక్రమాలు జరుగుతున్నాయి.

కేటాయింపులు - ఖర్చు (రూ.కోట్లలో)

సంవత్సరం	కేటాయింపు	ఖర్చు
2014-15	4,576.00	4,059.00
2015-16	5,877.96	5,844.39
2016-17	8,724.26	7,314.04
2017-18	9,847.13	10,098.77
2018-19	11,228.10	---

ఎస్టీ ఉప ప్రణాళిక

ఎస్టీ ఉప ప్రణాళిక కింద నిధులున్నా గిరిజన గూడేలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. ఏజెన్సీ ఏరియాలు, ఐటీడీఏ ప్రాంతాల్లో ఏళ్లు గడుస్తున్నా వారి బతుకులు మారలేదు. ఉప ప్రణాళిక ద్వారా వారి బతుకులు బాగుచేస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం ఆచరణలో మాత్రం లేదు. రోడ్లు, విద్య, వైద్యం పరిస్థితి దారుణంగా ఉంది. ఈ సంవత్సరం ఎస్టీ ఉప ప్రణాళిక కింద ప్రభుత్వం రూ.5,385.31 కోట్లు కేటాయించింది. గత సంవత్సరం బడ్జెట్ రూ.4,176.41 కోట్లు చూపించారు. నిధుల వినియోగంలో తీవ్ర అవినీతి జరుగుతుందనే విమర్శలు ఉన్నాయి.

కేటాయింపులు - ఖర్చు (రూ.కోట్లలో)

సంవత్సరం	కేటాయింపు	ఖర్చు
2014-15	1,500.00	1,442.00
2015-16	1,904.00	1,711.00
2016-17	3,099.00	1,912.00
2017-18	3,528.74	3,653.98
2018-19	4,176.41	---


బీసీ ఉప ప్రణాళిక ఓ మాయ

బీసీ ఉప ప్రణాళిక ద్వారా ప్రజలను మోసం చేయడం తప్ప ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేయడం లేదు. 2017–18 సంవత్సరంలో రూ.10 వేల కోట్లతో బీసీ ఉప ప్రణాళిక ఉందని చెప్పిన ప్రభుత్వం 2018–19లో రూ.12,200 కోట్లు కేటాయించింది. ఇది కాగితాలకే పరిమితమని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. 2019–20 సంవత్సరానికి రూ.16,226.00 కోట్లు కేటాయించారు. బీసీలు నివశించే ప్రాంతాల్లో జరుగుతున్న పనులను లెక్కకట్టి బీసీ ఉప ప్రణాళిక ద్వారా పనులు చేసినట్టు ప్రభుత్వం చెబుతోంది.

మైనార్టీలకూ సబ్‌ప్లాన్ అంటూ మరో మోసం..

మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం 2019–20 సంవత్సరానికి రూ.1,304.43 కోట్లు కేటాయించింది. 2018–19 సంవత్సరానికి రూ.1,100.14 కోట్లు కేటాయించినట్టు బడ్జెట్‌లో ప్రభుత్వం చెప్పుకుంది. కానీ ఈ ఆర్థిక సంవత్సరంలో బడ్జెట్‌లో మైనార్టీ సబ్ ప్లాన్ అంటూ ఏదీ చూపించలేదు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో పూర్తిస్థాయి బడ్జెట్ చూపిస్తూ ఆశ్చర్యకరమైన మైనార్టీ ఉప ప్రణాళికను తెరపైకి తీసుకువచ్చింది. బీసీ సబ్‌ప్లాన్‌కు కాని, మైనార్టీ సబ్‌ప్లాన్‌కు కాని చట్టబద్ధత లేదు. దీనికోసం ప్రభుత్వం ప్రత్యేకంగా మార్గదర్శకాలు తయారు చేయాల్సి ఉంది. జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించాల్సి ఉంది. అవేమీ లేకుండా ఆయా సామాజిక వర్గాలు ఉన్న ప్రాంతాల్లో జరిగిన పనులను లెక్కించి చేసిన నిధుల ఖర్చులు చూపించి ప్రభుత్వం మభ్యపెడుతోంది.

పింఛన్లు (వృద్ధాప్య, వితంతు, వికలాంగులు) 9



ప్రతి నియోజకవర్గంలో వృద్ధాశ్రమాలు ఏర్పాటు. వృద్ధులు,వితంతువుల పింఛను రూ 2 వేలకు పెంపు. వికలాంగుల పింఛను రూ. 3 వేలకు పెంపు

సంవత్సరం	కేటాయించింది (రూ.కోట్లలో)	మంజూరు (రూ.కోట్లలో)
2014-15	1554.71	3,461.57
2015-16	3717.15	5447
2016-17	3061.37	5599.99
2017-18	4376	6108
2018-19	-	-
2019-20	-	10,401







బడ్జెట్‌లో అన్నీ అసత్యాలే

రాష్ట్ర బడ్జెట్ లెక్కలన్నీ వాస్తవ విరుద్ధంగా ఉన్నాయి. డ్వాక్రా సంఘాలకు రుణమాఫీ చేస్తామని చెప్పారే తప్ప కేటాయింపులు చేయలేదు. రాజధాని అమరావతిని పూర్తి చేసినట్టు ప్రసంగంలో చెప్పగా.. ఎక్కడా శాశ్వత కట్టడాలకు ఇటుక కూడా వేయలేదు. గత ఎన్నికల సమయంలో చేసిన వాగ్దానాల్లో కనీసం 30 శాతం అమలు చేయలేదు. ఏ వర్గానికీ న్యాయం జరగలేదు. జననేత జగన్‌మోహన్ రెడ్డి ప్రకటించిన పథకాలను, తమవిగా చెప్పుకునే ప్రయత్నం చేశారు. అంకెల గారడీ తప్ప పేదలకు ఒనగూరిందేమీ లేదు.

– దాడిశెట్టి రాజా, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే



పేదల బతుకుల్లో వెలుగులు

ఓటాన్ అకౌంట్ బడ్జెట్ పేదల బతుకుల్లో వెలుగులు నింపే బడ్జెట్. ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా రూ.2,26,177 కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టాం. ఒక్క సంక్షేమానికే రూ.65,486 కోట్లు కేటాయించడం అభినందించదగ్గ విషయం. ఇంతవరకూ రూ.32,843 కోట్లను ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ కింద వెచ్చించాం. ప్రస్తుత బడ్జెట్లో ఎస్సీలకు రూ.14,367 కోట్లు, ఎస్టీలకు రూ.5,328 కోట్లు కేటాయించాం.

– పల్లె రఘునాథరెడ్డి, ప్రభుత్వ చీఫ్ విప్



కార్మికులకు ఇచ్చిన 42 వాగ్దానాలు ఏమయ్యాయి

తాజా బడ్జెట్‌తో రాష్ట్ర అప్పుల భారం రూ.2.50 లక్షల కోట్లకు చేరింది. పుట్టబోయే బిడ్డపై కూడా దాదాపు రూ.3 నుంచి రూ.5లక్షల అప్పు పడే అవకాశముంది. కార్మికులకు 42 వాగ్దానాలు ఇచ్చిన బాబు ఏ ఒక్క హామీ నెరవేర్చలేదు. ప్రతి జిల్లాలో ఆటో డ్రైవర్లతో సదస్సులు ఏర్పాటు చేసి బాబు మోసపూరిత వైఖరిని ఎండగడతాం. యువతకు 50 లక్షల ఉద్యోగాలు ఎక్కడ కల్పించారో చంద్రబాబు సర్కారు సమాధానం చెప్పాలి. చంద్రబాబు కార్మికుల హామీలు నెరవేర్చడంలో తీవ్రంగా విఫలమయ్యారు. ఆటోడ్రైవర్లకు ట్యాక్స్ రద్దు, కార్మికులకు రూ.10వేలు వేతనాలు చెల్లిస్తామని వైఎస్ జగన్ ప్రకటించడం సంతోషదాయకం. గతంలో ఇచ్చిన 600 హామీలకు ఎన్ని హామీలు అమలు చేశారు? ఎన్ని అమలు చేయలేదు? అనే అంశాలను బడ్జెట్‌లో ప్రకటించలేదు. ప్రతి పథకానికి కేటాయించిన నిధులను మళ్లింపు చేయడం మినహా బడ్జెట్‌లో అసలు పసలేదు.

– గౌతంరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి

పర్యాటక శాఖకు రూ.467 కోట్లు కేటాయింపు

ఓటాన్ అకౌంట్‌లో రూ.155 కోట్లు

సాక్షి, అమరావతి: పర్యాటక శాఖకు 2019–20 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌లో రూ.467 కోట్లు కేటాయించారు. గత ఏడాది రూ.385 కోట్లు బడ్జెట్‌లో కేటాయించగా ఈసారి రూ.82 కోట్లు అదనంగా ఇచ్చారు. ఈ ఏడాది బోట్ రేసింగ్, బెలూన్ ఫెస్టివల్ తదితర వాటిని నిర్వహించినట్టే వచ్చే ఏడాది పర్యాటకపరంగా పలు ఈవెంట్లు నిర్వహించేందుకు అదనంగా నిధులు కేటాయించాలని పర్యాటక శాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈ నాలుగు నెలలకు గాను ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో రూ.155 కోట్లు కేటాయించారు.



రాజధాని నిర్మాణానికి నిధులేవీ?



రూ.లక్ష కోట్లకుపైగా అవసరమవుతాయని బడ్జెట్‌లో ప్రకటించిన ప్రభుత్వం

- మొదటి దశలో దాదాపు రూ.40 వేల కోట్లతో పనులు చేస్తున్నామని వెల్లడి
- గత మూడేళ్లలో కేటాయించింది కేవలం రూ.675 కోట్లే
- ఈ ఏడాది బడ్జెట్‌లో నిధుల విషయమే ప్రస్తావించని మంత్రి యనమల

సాక్షి, అమరావతి బ్యూరో: 'ప్రపంచం గర్వించదగ్గ రాజధానిని నిర్మిస్తాం. ప్రపంచంలో టాప్–5 నగరాల్లో అమరావతిని నిలపడమే నా లక్ష్యం' అంటూ వివిధ సభల్లో చెబుతుండే సీఎం చంద్రబాబు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. రాజధాని నిర్మాణానికి రూ.లక్ష కోట్లు ఖర్చవుతాయని ఒకవైపు చెబుతూనే మరోవైపు బడ్జెట్‌లో ఆ మేరకు కేటాయింపులు చేయడం లేదు. రాజధాని నిర్మాణానికి మూడేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది.. కేవలం రూ.675 కోట్లే. రాష్ట్ర ప్రభుత్వం కంటే ఎక్కువగా కేంద్రమే రూ.1060 కోట్ల నిధులను కేటాయించింది. రాష్ట్ర ప్రభుత్వ కేటాయింపులను పరిశీలిస్తే రాజధాని నిర్మాణంపై ప్రభుత్వానికి ఎంత నిర్లక్ష్యం ఉందో అవగతమవుతోంది.

నిర్మాణాలెక్కడ?

ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు మంగళవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ సందర్భంగా అమరావతి నిర్మాణానికి రూ.1,09,023 కోట్లు ఖర్చవుతాయని ప్రభుత్వం అంచనా వేస్తున్నట్లుగా పేర్కొన్నారు. మొదటి దశలో భాగంగా రూ.39,875 కోట్ల పనులు వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. అయితే ఈ ఏడాది బడ్జెట్‌లో రాజధాని నిర్మాణానికి ఎంత మేర నిధులు కేటాయిస్తున్నారో చెప్పలేదు. విద్య, ఆరోగ్య కేంద్రంగా అమరావతి వేగంగా అభివృద్ధి చెందుతోందని చెప్పిన యనమల ప్రస్తుతం రాజధానిలో వివిధ సంస్థలకు కేటాయించిన భూములు నిర్మానుష్యంగా ఎందుకు ఉన్నాయో సమాధానం చెప్పలేదు. ఇండో–యూకే ఆస్పత్రి, బీఆర్ శెట్టి హాస్పిటల్స్, బసవతారకం మెమోరియల్ క్యాన్సర్ హాస్పిటల్, హైదరాబాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ లాంటి ఆరోగ్య సంస్థలను ఆకర్షించామని యనమల చెప్పారు. అయితే ఆయన పేర్కొన్న వాటిలో ఒక్కటంటే ఒక్క సంస్థ కూడా ఇప్పటివరకు అమరావతిలో నిర్మాణాన్ని చేపట్టకపోవడం గమనార్హం. అదేవిధంగా ఫైవ్‌స్టార్ హోటళ్లకు స్థలాలు కేటాయించినా ఒక్కటి కూడా నిర్మాణాన్ని చేపట్టలేదు.

నిధులు కేటాయించకుండా పనులెలా?

రాజధాని నిర్మాణాలకు ఇప్పటివరకు కేంద్రం రూ.1,060 కోట్ల నిధులు కేటాయించగా రాష్ట్ర ప్రభుత్వం కేవలం రూ.675 కోట్లను మాత్రమే కేటాయించింది. నిధులు కేటాయించకుండా పనులు ఎలా పూర్తవుతాయో రాష్ట్ర ప్రభుత్వానికే తెలియాలి. ప్రభుత్వం చెబుతున్న దాన్ని బట్టి చూస్తే అప్పులతోనే నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. మరోవైపు కొత్త రుణాలు తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి అర్హత లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో కొత్తగా రుణాలు ఎక్కడి నుంచి తెస్తారో అర్థం కావడం లేదని విశ్లేషకులు చెబుతున్నారు. ఇదివరకే రుణాల కోసం ప్రపంచ బ్యాంక్, హడ్కోలను రాష్ట్ర ప్రభుత్వం ఆశ్రయించినా ప్రపంచ బ్యాంక్ ఇంతవరకు ఒక్క రూపాయి కూడా విదల్చలేదు. కాగా, బడ్జెట్ సందర్భంగా ప్రభుత్వం రాజధానికి భూములిచ్చిన రైతులకు అందజేసే లబ్ధిని ఎక్కడా చెప్పలేదు. ఇప్పటికే రైతులకు ఇచ్చిన ప్లాట్లను అభివృద్ధి చేయాల్సి ఉన్నా ఒక్క ప్లాట్‌ను కూడా అభివృద్ధి చేయలేదని రైతులు మండిపడుతున్నారు.

స్పష్టత ఏదీ?

బడ్జెట్‌లో రాజధాని భూసమీకరణ కంటూ ప్రభుత్వం రూ.226.27 కోట్లు కేటాయించింది. వీటిని దేనికి ఖర్చు చేస్తారో స్పష్టత ఇవ్వలేదు. భూసమీకరణ కింద రైతులకు ఈ ఏడాది కౌలు కింద రూ.780 కోట్లకుపైగా చెల్లించాల్సి ఉంది. గతేడాది రూ.600 కోట్ల వరకూ చెల్లింపులు చేశారు. 2020, అక్టోబర్ నాటికి సచివాలయం, శాఖాధిపతుల కార్యాలయాల భవనాల నిర్మాణం పూర్తవుతుందని యనమల చెప్పారు.

ప్రస్తావనే లేని అంబేడ్కర్ స్మృతివనం

టీడీపీ ప్రభుత్వానికి దళితులపై ఉన్న వివక్ష అసెంబ్లీ సాక్షిగా మరోసారి నిరూపితమైంది. రాజధాని గ్రామమైన శాఖమూరులో 20 ఎకరాల్లో రూ.240 కోట్లతో అంబేడ్కర్ స్మృతివనం, 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం నిర్మిస్తామని 2017, ఏప్రిల్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా సీఎం చంద్రబాబు ప్రకటించారు. అయితే రెండేళ్లవుతున్నా ఇంతవరకు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. కనీసం విగ్రహ నమూనాను కూడా రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించలేదు. ఇప్పటికీ అంబేడ్కర్ విగ్రహ నమూనా ఎలా ఉండాలి? అనే విషయంపై ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతూనే ఉంది. 2017–18 ఆర్థిక సంవత్సరంలో నిధులు కేటాయించినా అవి ఖర్చు చేయకపోవడంతో మురిగిపోయాయి. గతేడాది కేటాయించిన నిధుల పరిస్థితి ఇదే మాదిరిగా ఉంది. తాజా బడ్జెట్‌లోనూ అంబేడ్కర్ స్మృతివనాన్ని ప్రస్తావించక పోవడంపై రాష్ట్రంలోని దళిత సంఘాలు సర్కారు తీరుపైతీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.



పట్టణాభివృద్ధి అరకొరే..



- మొత్తం కేటాయింపు రూ.7,979.34 కోట్లు
- అవసరాలకు ఏమాత్రం చాలని కేటాయింపులు
- నిధుల కొరతతో పట్టణాల్లో ముందుకు సాగని ఇళ్ల పథకం, మురుగునీటి కాలువలు, స్మార్ట్‌సిటీల పనులు..

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పట్టణాభివృద్ధికి ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో రూ.7,979.34 కోట్లను కేటాయిస్తూ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు ప్రతిపాదించారు. గతేడాదితో పోల్చితే ఈ కేటాయింపులు 3.08 శాతమే అధికం. ఇందులో రెవెన్యూ వ్యయం కింద రూ.6,990.04 కోట్లను, పెట్టుబడి వ్యయం కింద రూ.989.29 కోట్లను కేటాయించారు. ఈ నాలుగు నెలల కాలానికి రూ.2,659.78 కోట్లను కేటాయించారు. అయితే మంత్రి తన ప్రసంగంలో పట్టణ మౌలిక సదుపాయాలకు గత నాలుగున్నరేళ్లలో రూ.4,707 కోట్లు వ్యయం చేశామని, రూ.68,084 కోట్ల విలువైన ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయని చెప్పారు.

- 5.24 లక్షల ఇళ్లను పట్టణాల్లో నిర్మించాలని లక్ష్యంగా తీసుకుంటే.. ఇప్పటివరకు 76 వేల ఇళ్లు నిర్మించామని, మిగిలినవన్నీ వివిధ దశల్లో ఉన్నాయని బడ్జెట్‌లో పేర్కొన్నారు. పలు నగరాల్లో ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వ భూముల్లేనందున అధికారులు రైతులనుంచి భూసేకరణకు ప్రయత్నాలు చేపట్టారు. ఆ మేరకు ఇంకా 786 ఎకరాల కొనుగోలుకు రూ.1100 కోట్లు అవసరమవుతాయి. అయితే ఈ బడ్జెట్‌లో కేటాయించింది రూ.500 కోట్లే.
- విజయవాడ, కాకినాడ, తిరుపతి, అమరావతి, శ్రీకాకుళం, ఒంగోలు, నెల్లూరు, అనంతపురం, కర్నూలు, ఏలూరులను స్మార్ట్‌సిటీలుగా అభివృద్ధి చేస్తున్నామని మంత్రి చెప్పారు. అయితే కేంద్రం విడుదల చేసిన నిధులకు మ్యాచింగ్ గ్రాంటుగా రాష్ట్రప్రభుత్వం నిధులు కేటాయించలేకపోతోంది. దీంతో శ్రీకాకుళం, ఒంగోలు, ఏలూరు, అనంతపురాల్లో స్మార్ట్‌సిటీ పనులు ముందుకు సాగట్లేదు.
- 3,055 కిలోమీటర్ల నిడివిలో మురుగునీటి కాలువలను నిర్మించినట్టు మంత్రి పేర్కొన్నారు. 2018–19 ఆర్థిక సంవత్సరంలో 17,252.78 కిలోమీటర్ల మురుగునీటి కాలువలను నిర్మించాలని లక్ష్యంగా తీసుకోగా.. నిధుల కొరతతో 3,055 కిలోమీటర్ల నిడివిలోనే మురుగునీటి కాలువల నిర్మాణాలు జరగడం గమనార్హం. మరోవైపు 2,381 కిలోమీటర్ల మేరకు వరద నీటి కాలువలు నిర్మించినట్టు మంత్రి చెప్పినప్పటికీ.. విజయవాడ నగరంలో ఆ పనులు పొందిన నిర్మాణ సంస్థ అసమర్థత కారణంగా ప్రాజెక్టును కుదించారు.
- 110 మున్సిపాలిటీలు, 14 నగర పాలక సంస్థల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో రూ.100 కోట్లు కేటాయించింది. అవి ఏ పట్టణానికి, ఏ నగరానికి ఎంత కేటాయించాలో అర్థంకాని పరిస్థితి ఉందని అధికారులు వ్యాఖ్యానిస్తున్నారు.

పరిశ్రమలకు భారీ కోత



- గతేడాదితో పోలిస్తే 35 శాతం తగ్గిన కేటాయింపులు
- రూ. 6,290.29 కోట్ల నుంచి రూ. 4,114.92 కోట్లకు తగ్గింపు

సాక్షి, అమరావతి: ఉపాధి కల్పనలో కీలకమైన పరిశ్రమల రంగానికి బడ్జెట్ కేటాయింపుల్లో భారీగా కోత కోశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం కేటాయింపులతో పోలిస్తే వచ్చే ఏడాదికి 35 శాతం తగ్గిస్తూ రాష్ట్ర ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు ప్రతిపాదనలు చేశారు. 2018–19లో రూ. 6,290.29 కోట్లు కేటాయించిన ప్రభుత్వం 2019–20 సంవత్సరానికి రూ. 4,114.92 కోట్లకు తగ్గించింది. ఇందులో ఓటాన్ అకౌంట్ బడ్జెట్ కాలానికి రూ. 1,371.64 కోట్లు ప్రతిపాదించారు. మొత్తంగా రూ. 2,674.90 కోట్లు రెవెన్యూ వ్యయం కోసం కేటాయిస్తే.. ఆస్తుల కల్పనకు వినియోగించే క్యాపిటల్ వ్యయం కింద కేవలం రూ. 1,440.02 కోట్లే ప్రతిపాదించడం గమనార్హం. 2018–19లో రూ. 1,472.47 కోట్లుగా ఉన్న పెట్టుబడి వ్యయాన్ని 2019–20కి రూ. 839.52 కోట్లకు తగ్గించేశారు. వాస్తవ పరిస్థితులు ఇలా ఉంటే యనమల తన బడ్జెట్ ప్రసంగంలో మాత్రం రాష్ట్రంలో లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చినట్లు అబద్ధాలను యథేచ్ఛగా కొనసాగించారు. రాష్ట్రంలో రూ. 1.82 లక్షల కోట్ల విలువైన 820 మెగా ప్రాజెక్టులు ఉత్పత్తి ప్రారంభించేశాయని, వీటివల్ల 2.8 లక్షల మందికి ఉపాధి లభించిందన్నారు. పరిశ్రమల ఆకర్షణకు కీలకమైన విశాఖ–చెన్నై కారిడార్, చెన్నై–బెంగళూరు కారిడార్ పనులు గత ఐదేళ్లుగా మొదలు కాలేదు. వీటికి ఇంకా పునాదులు వేస్తున్నామంటూ యనమల వ్యాఖ్యానించారు. ఈ బడ్జెట్‌లో చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు కేటాయింపులను గతంతో పోలిస్తే పెంచారు. ఎంఎస్ఎంఈల కోసం మొత్తం రూ. 1,000 కోట్లు కేటాయించారు. ఇందులో ప్రోత్సాహకం కోసం రూ. 400 కోట్లు, ఒత్తిడిలో ఉన్న సంస్థలను ఆదుకోవడానికి రూ. 100 కోట్లు, ఎంఎస్ఎంఈ పార్కుల కోసం రూ. 500 కోట్లు కేటాయించారు.

ఇన్‌ఫ్రా, ఐటీపై దాగుడు మూతలు




- గత కేటాయింపుల్లో సగం కోత
- ఈ బడ్జెట్‌లో ఇంధన,మౌలిక వసతులకు రూ.5,473.83 కోట్లు
- ఐటీ రంగానికి రూ. 1,006.81 కోట్లు కేటాయింపు

సాక్షి, అమరావతి: బడ్జెట్ ఘనంగా కనిపించడానికి భారీగా కేటాయింపులు చేసి, ఆ తర్వాత భారీగా కోత పెడుతూ ప్రజలను మభ్యపెట్టడంలో ఆరితేరిన చంద్రబాబు ప్రభుత్వం ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లోనూ అదే పంథాను కొనసాగించింది. ముఖ్యంగా ఇంధన మౌలిక వసతులు, ఐటీ రంగాల్లో గత బడ్జెట్ అంచనాల్లో కోత వేశారు. 2018–19 సంవత్సరంలో ఇంధన, మౌలిక వసతుల రంగానికి రూ. 5,139.90 కోట్లు ప్రతిపాదించగా ఆ తరువాత దాన్ని రూ. 2,964.90 కోట్లకు తగ్గించేశారు. అంటే గత బడ్జెట్ ప్రతిపాదనల్లో 42 శాతం కోత పెట్టినట్లు. కానీ 2019–20 బడ్జెట్‌లో మాత్రం గతేడాది తొలి ప్రతిపాదనల కంటే అధికంగా రూ. 5,473.83 కోట్లు కేటాయించడంలో యనమల సంఖ్యా విన్యాసం తెలుస్తోంది. ఇందులో రెవిన్యూ వ్యయం కింద రూ. 4,273.75 కోట్లు, పెట్టుబడి వ్యయం కింద రూ. 1,200.07 కోట్లు చూపించారు. నాలుగు నెలల ఓటాన్ అకౌంట్ బడ్జెట్ కాలానికి రూ. 1,826.95 కోట్లు కేటాయించారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ విభాగానికి గతేడాది బడ్జెట్ కేటాయింపుల ప్రతిపాదనలో కోత పడింది. ఐటీ విభాగానికి 2018–19 సంవత్సరంలో రూ. 1,006.90 కోట్లు ప్రతిపాదించి సవరించిన అంచనాల్లో ఈ మొత్తాన్ని రూ. 954.55 కోట్లకు తగ్గించారు. 2019–20 సంవత్సరానికి రూ.1.006.81 కోట్లు కేటాయిస్తూ బడ్జెట్‌లో ప్రతిపాదించారు. ఇందులో రెవిన్యూ వ్యయం కింద రూ. 801.08 కోట్లు, పెట్టుబడి వ్యయం కింద రూ. 205.73 కోట్లుగా చూపించారు. నాలుగు నెలల ఓటాన్ అకౌంట్ బడ్జెట్ కాలానికి ఐటీ, టెలీకమ్యూనికేషన్ విభాగానికి రూ. 335.60 కోట్లు కేటాయించారు.

ఓటాన్ కాదు.. ఓటమి భయం బడ్జెట్


- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొలుసు పార్థసారథి
- వైఎస్ జగన్ ప్రకటించిన నవరత్నాలను కాపీ కొట్టారు
- కాకి లెక్కలు చూపించి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేశారు



విజయవాడ సిటీ: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో జవాబుదారీతనం లేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొలుసు పార్థసారథి విమర్శించారు. ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన నవరత్నాలను కాపీ కొట్టి, వాటిని ఎలా అమలు చేసారో చెప్పలేక ప్రభుత్వం తికమకపడిందని ఎద్దేవా చేశారు. ఎప్పటిలాగే కాకి లెక్కలు చూపించి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. ఇది ఓటాన్ అకౌంట్ బడ్జెట్ కాదు.. ఓటమి భయంతో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లా ఉందని పేర్కొన్నారు. పార్థసారథి మంగళవారం విజయవాడలోని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఎలాగూ ఎన్నికలు వస్తాయి, ప్రజలు ఇంటికి పంపిస్తారు, ఇక ఎవరికీ జవాబు చెప్పాల్సిన అవసరం లేదనే ఉద్దేశంతో టీడీపీ ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టినట్లుగా ఉందన్నారు. ''రెవెన్యూ రాబడి 2017–18లో రూ.1,05,062 కోట్లు, 2018–19కి రూ.1,56,364 కోట్లుగా చూపించారు. దాన్ని సంవత్సరంలో అమాంతం పెంచేసి రూ.1.78 లక్షల కోట్లు వస్తున్నాయని చూపిస్తున్నారు. మొత్తం రాబడి 2017–18లో రూ.1,91,950 కోట్లు ఉంటే, 2018–19లో రూ.1,97,727 కోట్లు చూపించారు. ఈసారి రూ.2,25,705 కోట్లు వస్తుందని అంటున్నారు. దాదాపు రూ.30 వేల కోట్ల ఆదాయం ఏ విధంగా పెరుగుతుందని ఆశిస్తున్నారో చెప్పాలి' అని పార్థసారథి ప్రశ్నించారు. 2016 అక్టోబర్ నుంచి డ్వాక్రా మహిళలకు రూ.2,400 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉండగా, ఈ బడ్జెట్‌లో కేటాయించింది రూ.1,100 కోట్లు మాత్రమేనని అన్నారు. 2014 సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న మొత్తం అప్పు రూ.96 వేల కోట్లు కాగా, నాలుగున్నరేళ్లలో ఆ అప్పు ఏకంగా రూ.2.9 లక్షల కోట్లకు చేరిందని విమర్శించారు.

నిరుద్యోగ భృతి లోనూ మోసమే..

2017–18లో నిరుద్యోగ భృతి కోసం రూ.500 కోట్లు కేటాయించగా పైసా కూడా ఖర్చు చేయలేదని, 2018–19లో రూ.1,000 కోట్లు కేటాయించి ఖర్చు చేసింది రూ.116 కోట్లు మాత్రమేనని పార్థసారథి చెప్పారు. 'ఈ బడ్జెట్‌లో రూ.1,200 కోట్లు అంటున్నారు. ఈ నిధులు రూ.1,000 కి సరిపోతుందా? రూ.2,000 కు సరిపోతుందా? సమాధానం చెప్పాలి. నిరుద్యోగ భృతిని రూ.2,000 చేసే ఆలోచన ఉంటే ఈ బడ్జెట్‌లో రూ.2,000 కోట్లు కేటాయించాలి. కేవలం రూ.1,200 కోట్లు కేటాయించారు. రెవెన్యూ రూ.1.8 లక్షల కోట్లు, క్యాపిటల్ రూ.29 వేల కోట్లుగా చూపించారు. మొత్తం రూ.2.09 లక్షల కోట్లు మాత్రమే. బడ్జెట్ మొత్తం రూ.2.26 లక్షల కోట్లుగా చూపిస్తున్నారు. బీసీ సబ్‌ప్లాన్‌కు రూ.50 వేల కోట్లు అంటూ ఊదరగొడుతున్నారు. ఐదేళ్లలో కేటాయించింది రూ.26 వేల కోట్లు, ఖర్చు చేసింది రూ.16 వేల కోట్లు మాత్రమే. ప్రజా సంక్షేమంపై ఏమాత్రం చిత్తశుద్ధి లేదని స్పష్టంగా అర్థమవుతోంది' అని అన్నారు.




సంవత్సరం	కేటాయించింది (రూ.కోట్లలో)	మంజూరు (రూ.కోట్లలో)
2014-15	1,130.00	1,126.00
2015-16	1,137.00	1,403.00
2016-17	1,331.00	1,208.00
2017-18	1,773.05	2,497.98
2018-19	3,007.96	-
2019-20	3,408.66	-





పోలవరానికి గ్రహణం



రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించని సర్కారు

- ఇప్పటికే కేంద్ర బడ్జెట్‌లోనూ నిధులివ్వని వైనం
- ప్రాజెక్టు పూర్తి కావాలంటే ఇంకా రూ.38,053 కోట్లు అవసరం
- ఇప్పుడు రాష్ట్ర సర్కారూ నిధులు కేటాయించనందున ప్రాజెక్టు భవిత ప్రశ్నార్థకం

సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టును 2018 నాటికి పాక్షికంగానూ.. 2019 నాటికి పూర్తి స్థాయిలో పూర్తి చేసి గ్రావిటీ ఆయకట్టుకు నీటిని అందిస్తామని 2014లో చంద్రబాబు హామీ ఇచ్చారు. అయితే ఈ హామీ నెరలేదు. దీంతో 2019 మే నాటికి పాక్షికంగా పూర్తి చేసి గ్రావిటీపై ఆయకట్టుకు నీటిని సరఫరా చేస్తామని ఇటీవల ఆయన మాటమార్చారు. పోనీ.. అప్పటికైనా పోలవరం ప్రాజెక్టు పాక్షికంగా పూర్తవుతుందా? అంటే లేనే లేదని స్పష్టమవుతోంది. ఈ నెల 1న కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పోలవరానికి పైసా కూడా కేటాయించలేదు. రాష్ట్ర బడ్జెట్‌లోనూ దీనికి నిధులు కేటాయించలేదు. ప్రాజెక్టుకు ఇప్పటివరకు రూ.15,681.66 కోట్లు ఖర్చు చేయగా.. పూర్తవ్వాలంటే జలవిద్యుదుత్పత్తి వ్యయం మినహాయించినా రూ.38,053.54 కోట్లు అవసరం. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు నిధులు కేటాయించనందున పోలవరం ప్రాజెక్టు భవితవ్యం అంధకారంలో పడింది. దీని నిర్మాణ బాధ్యతల్ని పునర్విభజన చట్టం ప్రకారం కేంద్రానికే అప్పగించివుంటే ఈపాటికి పూర్తయ్యేది. కమీషన్లకోసం నిర్మాణ బాధ్యతల్ని రాష్ట్రప్రభుత్వం దక్కించుకోవడం వల్లే.. ఆ ప్రాజెక్టుకు గ్రహణం పట్టుకుందని అధికారవర్గాలే స్పష్టం చేస్తుండడం గమనార్హం.

రాష్ట్ర సర్కారు చేపట్టడంతోనే గ్రహణం...

తొలుత పోలవరం ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.16,010.45 కోట్లు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో రూ.5,135.87 కోట్లతో 40 శాతం మేరకు పనుల్ని పూర్తిచేశారు. ఆయన మరణం ప్రాజెక్టుకు శాపమైంది. రాష్ట్ర విభజన నేపథ్యంలో దీన్ని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన కేంద్రం.. తామే వందశాతం ఖర్చుతోపూర్తి చేస్తామని విభజన చట్టంలో హామీనిచ్చింది. ఆ హామీ అమల్లో భాగంగా పోలవరం ప్రాజెక్టు అథారిటీ(పీపీఏ)ని ఏర్పాటు చేసిన కేంద్రం.. దానితో ఒప్పందం చేసుకోవాలని రాష్ట్రానికి సూచించింది. పీపీఏతో ఒప్పందం చేసుకుంటే కమీషన్లు వసూలు చేసుకోవడానికి సమస్యలుంటాయని భావించిన చంద్రబాబు.. ప్రాజెక్టును రాష్ట్రప్రభుత్వానికే అప్పగించాలని ఒత్తిడి తెచ్చారు. ఇందుకోసం ప్రత్యేక హోదాను సైతం కేంద్రానికి తాకట్టు పెట్టేందుకు సిద్ధమయ్యారు. దీంతో సెప్టెంబర్ 7, 2016న పోలవరం ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతల్ని కేంద్రం రాష్ట్రానికి అప్పగించింది. ఏప్రిల్ 1, 2014 వరకు చేసిన వ్యయం పోను మిగిలిన దాంట్లో నీటిపారుదల విభాగానికయ్యే వ్యయాన్ని మాత్రమే నాబార్డు ద్వారా విడుదల చేస్తామని ప్రకటించింది. దీనివల్ల ఏప్రిల్ 1, 2014 వరకూ చేసిన వ్యయం రూ.5,135.87 కోట్లు, జలవిద్యుదుత్పత్తి ప్రాజెక్టుకయ్యే వ్యయం రూ.2,868.40 కోట్లు వెరసి రూ.8,004.27 కోట్లను కోల్పోవాల్సి వచ్చింది. నిర్మాణ బాధ్యతలు దక్కించుకున్నాక హెడ్ వర్క్స్, కుడి, ఎడమ కాలువల వ్యయాన్ని అడ్డగోలుగా పెంచేసి.. పనులన్నీ సబ్ కాంట్రాక్టర్లకు అప్పగించి భారీ ఎత్తున కమీషన్లు దండుకున్నారు. ఏప్రిల్ 1, 2014 నుంచి ఇప్పటి వరకు రూ.10,545.79 కోట్లు ఖర్చు చేస్తే.. కేంద్రం రూ.6,727.26 కోట్లను రీయింబర్స్ చేసింది. మరో రూ.3,818.53 కోట్లు విడుదల చేయాల్సి ఉంది.

కేంద్రం అభ్యంతరాలను నివృత్తి చేయడంలో విఫలం..

ఇదిలా ఉండగా పోలవరం అంచనా వ్యయాన్ని రూ.16010.45 కోట్ల నుంచి రూ.57,940.86 కోట్లకు పెంచుతూ పంపిన ప్రతిపాదనల్లో కేంద్రం లేవనెత్తిన అభ్యంతరాలను నివృత్తి చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైంది. పనుల్లో.. అంచనా వ్యయ ప్రతిపాదనల్లో భారీగా అక్రమాలు చోటుచేసుకున్నట్లు పీపీఏ, కాగ్‌లు లేవనెత్తాయి. అనుమానాల్ని నివృత్తి చేయడంలో రాష్ట్రసర్కారు విఫలమైనందువల్లే తాజా కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదని అధికారవర్గాలు చెబుతున్నాయి. అదే సమయంలో రాష్ట్రప్రభుత్వమూ నిధులు కేటాయించకపోవడం.. సాగునీటి ప్రాజెక్టులకు కేటాయించని నిధుల్లోనే కొంత మొత్తాన్ని సర్దుబాటు చేసే వీలుండడాన్నిబట్టి చూస్తే ఈ ప్రాజెక్టు 2019 నాటికి పూర్తయ్యే అవకాశం లేదనేది స్పష్టమవుతోంది.

పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం బడ్జెట్‌లో కేటాయించిన, విడుదల చేసిన నిధుల తీరిది..

సంవత్సరం	బడ్జెట్‌లో కేటాయింపు (రూ.కోట్లలో)	పీపీఏకు విడుదల చేసింది (రూ.కోట్లలో)	రాష్ట్ర ప్రభుత్వానికి విడుదల చేసింది (రూ.కోట్లలో)
2014-15	250.00	250.00	245.00
2015-16	600.00	600.00	590.00
2016-17	2,514.16	2,514.14	2,514.70
2017-18	1,000.00	1,794.66	1,794.66
2018-19	కేటాయింపుల్లేవు	1,582.90	1,582.90
2019-20	---	---	---

రాష్ట్రం అప్పల కుప్ప

- రాష్ట్ర విభజన నాటికి రూ.96 వేల కోట్ల అప్పు
- 2017–18 నాటికి అప్పులు రూ.2.59 లక్షల కోట్లకు చేరాయని ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ నివేదిక
- 2018–19లో రూ.37 వేల కోట్ల అప్పుతో రూ.2.96 లక్షల కోట్లకు రుణం చేరుతుందని అంచనా
- 2019–20 బడ్జెట్‌లో రూ.45,078.73 కోట్ల రుణాలు సేకరించాలని రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం




సాక్షి, అమరావతి

రాష్ట్రాన్ని టీడీపీ ప్రభుత్వం అప్పులకుప్పగా మార్చుతోంది.ఏటా అప్పులు పెంచుకుంటూ పోవడమే ఈ దుస్థితి కారణం. దీని వల్ల రాష్ట్ర తలసరి అప్పు కూడా పెరిగిపోతోంది. జూన్ 2, 2014 నాటికి 13 జిల్లాలపై అప్పు రూ.96 వేల కోట్లు ఉండేది. చంద్రబాబు సీఎంగా బాధ్యతలు స్వీకరించాక అప్పులు చేయడమే అజెండాగా పెట్టుకున్నారు. 2017–18 నాటికి రాష్ట్ర అప్పులు రూ.2.59 లక్షల కోట్లకు చేరుకున్నాయని ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ ఇటీవల ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. 2018–19 బడ్జెట్‌లో రూ.37,272 కోట్లు అప్పు చేశారు. తాజా బడ్జెట్‌లో రూ.45,078.73 కోట్లను రుణంగా తీసుకోవాలని ప్రతిపాదించారు. దాంతో అప్పుల భారం మొత్తం రూ.3.41 లక్షల కోట్లకు చేరుకుంటుందని అంచనా.

రాష్ట్ర అప్పులు పెరుగుతున్న తీరు ఇదీ..

ఆర్థిక సంవత్సరం	మొత్తం అప్పు (రూ.కోట్లలో)	రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో అప్పుల శాతం
2014-15	1,48,743.45	28.25
2015-16	1,73,853.60	28.50
2016-17	2,01,314.04	28.79
2017-18	2,59,000.00	28.80
2018-19(అంచనా)	2,96,000	28.99
2019-20(అంచనా)	3,41,000	29.12

కేటాయింపులు (శాతాల్లో..)



పేద రోగులపై చిన్నచూపు

- ఆరోగ్యశ్రీకి రూ.1,200 కోట్లు
- గత ఏడాది బకాయిలు రూ. 650 కోట్లు పైనే
- రూ.1,972 కోట్లు ప్రతిపాదిస్తే రూ.772 కోట్ల కోత




సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం పేద రోగులపై కనికరం చూపలేదు. బడ్జెట్‌లో నామమాత్రపు నిధులే కేటాయించింది. పేదరోగుల పాలిట వరప్రదాయినిగా ఉన్న ఆరోగ్యశ్రీని చిన్నచూపు చూసింది. ఇప్పటికే బకాయిలతో ఆరిపోయే దీపంలా ఉన్న ఈ పథకానికి ప్రస్తుత కేటాయింపులు ఏమూలకూ సరిపోవని నిపుణులంటున్నారు. 2018–19 ఆర్థిక సంవత్సరానికి ఆరోగ్యశ్రీకి రూ.1,000 కోట్లు కేటాయించగా, 2019–20 ఆర్థిక సంవత్సరానికి రూ.200 కోట్లే పెంచి రూ.1,200 కోట్లు కేటాయించారు. వివిధ ఆస్పత్రులకు గతేడాది చెల్లించాల్సిన బకాయిలే రూ.650 కోట్లకు పైగా ఉన్నాయి. ఈ ఏడాది కవరేజ్ సొమ్ము రూ.2.50 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచామని చెబుతున్న ప్రభుత్వం దానికి తగ్గ నిధులు మాత్రం కేటాయించలేదు. వాస్తవానికి ఆరోగ్యశ్రీకి రూ.1,972 కోట్లు అవసరమని వైద్య ఆరోగ్యశాఖ ప్రతిపాదించింది. కానీ రూ.772 కోట్లు కోత వేసి రూ.1,200 కోట్లే కేటాయించారు. దీంతో పథకం మనుగడ ప్రశ్నార్థకమవుతుందని వైద్య నిపుణులంటున్నారు. ఓవైపు ప్రసవాలను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తేవడం, కవరేజ్ సొమ్ము పెంచడం, నిధులు కేటాయించకపోవడం చూస్తుంటే ఈ పథకాన్ని సజావుగా నడిపే ఉద్దేశం ప్రభుత్వానికి లేనట్లు కనిపిస్తోంది. ఓవైపు ఆరోగ్యశ్రీ ద్వారా ఇతర రాష్ట్రాల్లో వైద్యానికి అనుమతించడంలేదు. ప్రమాదంలో గాయపడి వచ్చిన వారినీ పట్టించుకోవడం లేదు, గుండె, న్యూరో జబ్బులకు వైద్యం అందడం లేదు. ఈ పరిస్థితుల్లో నిధులను ఎక్కువగా కేటాయించి పథకాన్ని సజావుగా నడపాల్సింది పోయి అవసరమైన నిధుల్లో 50 శాతం కూడా కేటాయించకుండా కోతలు వేయడం వల్ల పేదరోగులకు సరైన వైద్యం అందని పరిస్థితి.

ప్రభుత్వాసుపత్రులకు అరకొరే..

వైద్య, ఆరోగ్య శాఖకు 2018–19 ఆర్థిక సంవత్సరానికి రూ. 8,463 కోట్లు కేటాయించగా ఆ తర్వాత రూ. 8,910 కోట్లకు పెంచారు. ప్రస్తుత బడ్జెట్‌లో రూ. 10,032 కోట్లు కేటాయించారు. దీనిలో రూ. 8 వేల కోట్లు వేతనాలకు, నిర్వహణకే సరిపోతుంది. ఇతర పథకాలకు నిధులు ఎక్కడ్నుంచి తెస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికే ప్రభుత్వాసుపత్రుల్లో మందులు, సూది, దూది వంటివి లేక సామాన్య రోగులు అల్లాడుతున్న పరిస్థితి. ఈ ఏడాది బడ్జెట్ కేటాయింపులు చూస్తే 108, 104 పథకాల నిర్వహణ కూడా సాధ్యం కాదని ఆరోగ్యశాఖకు చెందిన నిపుణులు చెబుతున్నారు. ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు బడ్జెట్ ప్రసంగంలో డయాలసిస్ రోగులకు నెలకు రూ. 2,500 పెన్షన్ ఇస్తున్నామని చెప్పారు. కానీ 12 వేల మంది డయాలసిస్ చేయించుకుంటుండగా కేవలం 3 వేల మందికి మాత్రమే పెన్షన్‌లు ఇస్తున్నారు.

ఆరోగ్యశ్రీకి నిధులు ఇలా

2018-19కి కేటాయింపులు-	రూ.1000 కోట్లు
ప్రస్తుత బకాయిలు	రూ.650 కోట్లు
అధికారులు ప్రతిపాదించింది-	రూ.1,972 కోట్లు
ప్రస్తుత బడ్జెట్ కేటాయింపులు	రూ.1,200 కోట్లు
గతంలో ఇస్తున్న కవరేజ్-	రూ.2.50 లక్షలు
ఏప్రిల్ 1 నుంచి పెంచింది-	రూ.5 లక్షలు
మొత్తం అవసరం	రూ.2 వేల కోట్లు పైనే



ప్రాజెక్టుల పనులన్నీ పెండింగే!

జూన్ 8, 2014 నుంచి ఇప్పటిదాకా సాగునీటి ప్రాజెక్టులకు రూ.64,334 కోట్లు వ్యయం

- కేవలం రూ.17,368 కోట్లతోనే పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తామని 2014 శ్వేతపత్రంలో చంద్రబాబు ప్రకటన
- కొత్తగా ఒక్కటంటే ఒక్క ప్రాజెక్టు పూర్తి చేయని వైనం.. కొత్తగా ఒక్క ఎకరాకూ నీళ్లందించని ప్రభుత్వం
- కమీషన్ల కోసం అంచనా వ్యయం పెంచడం వల్లే ఈ దుస్థితి అంటోన్న నిపుణులు
- తాజా బడ్జెట్‌లో సాగునీటి ప్రాజెక్టులకు రూ.16,852.27 కోట్లు



పోలవరం ప్రాజెక్టు, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకం మినహా పెండింగ్ ప్రాజెక్టుల పనులను కేవలం రూ.17,368 కోట్లతోనే పూర్తి చేస్తాం. కొత్తగా 35.04 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీళ్లు అందిస్తాం.. రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేస్తాం.


–సాగునీటి ప్రాజెక్టులపై జూలై 28, 2014న విడుదల చేసిన శ్వేతపత్రంలో సీఎం చంద్రబాబు ప్రకటన

జూన్ 8, 2014 నుంచి ఇప్పటివరకు సాగునీటి ప్రాజెక్టులకు రూ.64,334 కోట్లు ఖర్చు చేశారు. పోలవరం, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, నీరు–చెట్టు పథకం పోను పెండింగ్ ప్రాజెక్టులకు రూ.38 వేల కోట్లు ఖర్చు చేశారు. కానీ.. ఒక్కటంటే ఒక్క ప్రాజెక్టునూ పూర్తి చేయలేకపోయారు. కొత్తగా ఒక్క ఎకరాకూ నీళ్లందించలేకపోయారు.

సాక్షి, అమరావతి: సాగునీటి ప్రాజెక్టులకు 2019–20 బడ్జెట్లో రూ.16,852.27 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. ఇందులో రూ.15,558.90 కోట్లు పెట్టుబడి వ్యయం కాగా రూ.1293.37 కోట్లు రెవెన్యూ వ్యయం. ఓటాన్ అకౌంట్ బడ్జెట్ కావడంతో జూలై వరకు ఇందులో రూ.5,621.80 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. ప్రస్తుతం పనులు జరుగుతున్న ప్రాజెక్టులతోపాటు కొత్తగా రూ.17,061 కోట్లతో ప్రాజెక్టులను చేపట్టడానికి ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఇందులో ఇప్పటికే రూ.13,061 కోట్లతో చేపట్టిన పనులకు టెండర్లు పిలిచింది. కొత్త ప్రాజెక్టుల పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లకు మొబిలైజేషన్ అడ్వాన్సులు చెల్లించడానికి ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో కేటాయించిన నిధులను విడుదల చేసి, వాటిని కమీషన్ల రూపంలో వసూలు చేసుకుని ఎన్నికల్లో వ్యయం చేసేందుకు ప్రభుత్వ పెద్దలు ఎత్తుగడ వేశారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి.

వైఎస్ హఠాన్మరణంతో ప్రాజెక్టులకు బ్రేక్

రాష్ట్రం నుంచి కరువు రక్కసిని శాశ్వతంగా తరిమికొట్టడమే లక్ష్యంగా వైఎస్సార్ 2004లో జలయజ్ఞాన్ని చేపట్టారు. రూ.1,33,730 కోట్ల అంచనా వ్యయంతో 86 ప్రాజెక్టుల పనులు చేపట్టారు. వాటిని పూర్తి చేయడం ద్వారా 1.21 కోట్ల ఎకరాలకు నీళ్లందించాలని నిర్ణయించారు. ఐదేళ్లలో రూ.53,205.29 కోట్లు ఖర్చు చేశారు. 16 ప్రాజెక్టులను పూర్తిచేసి మరో 25 ప్రాజెక్టులను పాక్షికంగా పూర్తి చేసిన వైఎస్ 18.48 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీళ్లందించడంతో పాటు 2.07 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించడం సాగునీటి రంగం చరిత్రలో రికార్డుగా నిపుణులు అభివర్ణిస్తున్నారు. కానీ వైఎస్ మృతితో ప్రాజెక్టుల పనులకు బ్రేక్ పడింది. విభజన తర్వాత రాష్ట్రంలో అధికారం చేపట్టిన తొలి రోజుల్లోనే పోలవరం, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి మినహా మిగిలిన ప్రాజెక్టులను కేవలం రూ.17,368 కోట్లతో పూర్తి చేస్తామని చంద్రబాబు ప్రకటించారు.ప్రాజెక్టు నిర్మాణంపై దృష్టి పెట్టకుండా కమీషన్లే లక్ష్యంగా పెట్టుకున్నారు. గతంలో గవర్నర్ అబయన్స్ (తాత్కాలిక నిలుపుదల)లో పెట్టిన ఉత్తర్వులను అమల్లోకి తెస్తూ ఫిబ్రవరి 23, 2015న జీవో 22ను జారీచేసి ధరల సర్దుబాటు, పనుల పరిమాణం పెరిగితే కాంట్రాక్టర్లకు అదనపు బిల్లులు చెల్లించేలా జీవో 63ను జారీచేశారు. ఈ రెండు ఉత్తర్వులను అడ్డుపెట్టుకుని రూ.37,952.92 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన 23 ప్రాజెక్టుల అంచనా వ్యయాన్నిరూ.96,060.73 కోట్లకు పెంచేశారు. అంటే 23 ప్రాజెక్టుల్లోనే అంచనా వ్యయాన్ని రూ.58,107.86 కోట్లు పెంచేశారు. అనుకూలురైన కాంట్రాక్టర్లకు పనులు అప్పగించి ప్రజాధనాన్ని దోచుకున్నట్లు ఆరోపణలొచ్చాయి. ఇప్పటివరకు రూ.64,334 కోట్లు ఖర్చు చేసినా ఒక్కటీ పూర్తి కాకపోవడం ఈ ఆరోపణలకు బలం చేకూరుస్తోంది. కొత్తగా గోదావరి–పెన్నా తొలి దశ, రాజోలిబండ డైవర్షన్ స్కీం కుడి కాలువ, అప్పర్ పెన్నార్ ఎత్తిపోతల, బీటీపీ ఎత్తిపోతల, వేదవతి ఎత్తిపోతల, సీబీఆర్–హంద్రీ–నీవా రెండో దశ ఎత్తిపోతల, మేర్లపాక–మల్లెమడుగు రిజర్వాయర్ ఎత్తిపోతల, ఉరవకొండ సామాజిక సూక్ష్మనీటిపారుదల పథకాలకు టెండర్లు పిలిచి.. కాంట్రాక్టర్లకు అప్పగించారు. కేటాయిం చిన నిధులు పనులు జరుగుతున్న ప్రాజెక్టులకే సరిపోవు. కొత్తగా చేపట్టిన ప్రాజెక్టులకు ప్రత్యేకంగా నిధులు కేటాయించలేదు. దీన్నిబట్టి ఆ ప్రాజెక్టులను పూర్తి చేయడంపై సర్కార్‌కు చిత్తశుద్ధి లేదని, మొబిలైజేషన్ అడ్వాన్సుల కోసమే ప్రాజెక్టులను చేపట్టారని స్పష్టమవుతోంది.



చంద్రబాబు రుణాలు కట్టొద్దు అన్నందుకు రైతులు ఇవాళ ఏడాదికి రూ.16,000 కోట్ల వడ్డీ కడుతున్నారు. వడ్డీలో పావు వంతు కూడా ఇవ్వని స్థితి

- బేషరతు మాఫీ చేస్తామని ఎన్నికల హామీ
- కేటాయింపులు
- ఖర్చు చేసిన నిధులు

2014లో రైతు రుణాలు 87,612 కోట్లు, వడ్డీలతో కలసి ప్రస్తుతం 1.26 లక్షల కోట్లకు చేరుకున్నాయి.

సంవత్సరం	ఇచ్చింది (రూ.కోట్లలో)
2014-16	రూ.10,867 కోట్లు
016-17	గతంలో కేటాయించినవే విడతల వారీగా జమ చేశారు
2017-18	రూ.3,069 కోట్లు
2018-19	రూ.4,100 కోట్లు
2019-20	---



వ్యవసాయ విద్యుత్‌కు చీకట్లే

- 9 గంటల విద్యుత్‌కు అదనంగా ఒక పైసా కేటాయింపు లేదు..
- కావాల్సింది రూ.13,962 కోట్లు.. ఇచ్చింది రూ. 4,800 కోట్లు

సాక్షి, అమరావతి: ఎన్నికల వేళ వ్యవసాయానికి తొమ్మిది గంటల ఉచిత విద్యుత్ ఇస్తానని గొప్పగా ప్రకటించిన చంద్రబాబు ప్రభుత్వం.. ఆ దిశగా కనీసం ఒక్క పైసా కూడా అదనంగా కేటాయించలేదు. బడ్జెట్ సందర్భంగా కనీసం ఈ విషయాన్ని కూడా ప్రస్తావించకపోవడం గమనార్హం. గత నాలుగేళ్ల మాదిరిగానే ఈ చివరి బడ్జెట్‌లోనూ నిరాశే ఎదురయింది. దివంగత సీఎం వైఎస్సార్ హయాంలో ఇచ్చిన 15 లక్షల ఉచిత విద్యుత్ కనెక్షన్లు ప్రస్తుతం 17 లక్షలకు చేరాయి. ఒక్కో పంపుసెట్ (5హెచ్‌పీ సామర్థ్యం) రోజుకు ఏడు గంటలకు 35 యూనిట్ల విద్యుత్ వినియోగిస్తుంది. మరో రెండు గంటలు పెంచితే రోజుకు 45 యూనిట్లు అవసరం. అంటే 17 లక్షలకు 27,922.5 మిలియన్ యూనిట్లు అవసరం. దీనికి రూ. 13,962.5 కోట్లు కేటాయించాల్సి ఉంటుంది. కాగా, ప్రభుత్వం ప్రస్తుతం 10,831 మిలియన్ యూనిట్లు మాత్రమే విద్యుత్ సరఫరా చేస్తోంది. ఇది చచ్చీ చెడీ రోజుకు మూడున్నర గంటల సరఫరా కూడా కాదు. అదనంగా మరో 2,800 మిలియన్ యూనిట్లు ఇస్తానని ప్రభుత్వం ప్రకటించింది. దీన్ని లెక్కించినా రోజుకు 4 గంటలకు మించి విద్యుత్ సరఫరా ఉండే వీల్లేదు. ఇక అదనపు కేటాయింపు విషయానికొస్తే రూ. 1,200 కోట్లు ఇస్తానని స్వయంగా ముఖ్యమంత్రే ఈ ఏడాది సంక్రాంతి సందర్భంగా అన్నారు. ప్రస్తుతం ఏటా రూ. 6,030.17 కోట్లు ఇస్తున్నారు. 9 గంటలకు వాస్తవంగా రూ. 13,962 కోట్లు అవసరం ఉంటే, ప్రభుత్వం కేవలం రూ. 7,230 కోట్లు ఇస్తానని చెప్పింది. అదీ కూడా బడ్జెట్‌లో కేవలం రూ. 4,800 కోట్లకే పరిమితం చేసింది. దీన్నిబట్టి 9 గంటల విద్యుత్ ఓ ఉత్తుత్తి వాగ్దానమని తేలిపోయింది.

అదనపు సామర్థ్యం ఎక్కడ?

రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 9,529 నుంచి 19,680 మెగావాట్లకు పెరిగినట్టు ప్రభుత్వం బడ్జెట్ ప్రసంగంలో గొప్పలు చెప్పుకుంది. దీనివల్ల రూ. 36,604 కోట్ల పెట్టుబడులు వచ్చినట్టు, 13 వేల మందికి ఉపాధి లభించినట్టు పేర్కొంది. ఈ నాలుగేళ్ల కాలంలో ఏపీలో ఏ ఒక్క థర్మల్, జల విద్యుత్ కేంద్రం ఉత్పత్తిలోకి రాలేదు. నెల్లూరు జిల్లా దామోదరం సంజీవయ్య థర్మల్ విద్యుత్ కేంద్రం (కృష్ణపట్నం) వైఎస్సార్ హయాంలో పూర్తయిందే. 1,600 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం ఉన్నప్పటికీ ఏ ఒక్క రోజూ పూర్తిస్థాయి ఉత్పత్తి జరగలేదు. ప్రైవేటు విద్యుత్ కొనుగోలు వల్ల ఏపీ జెన్‌కోకు భారీగా నష్టం జరుగుతోందని, ఉత్పత్తి నిలిపివేయాల్సి వస్తోందని విమర్శలు వస్తున్నా దీన్ని ప్రభుత్వం పురోభివృద్ధిగా చెప్పుకోవడం విశేషం.

ఎన్నికల వేళ రైతులపై మరో వల!



- బడ్జెట్‌లో 'అన్నదాత సుఖీభవ'కు రూ.5,000 కోట్లే
- ఎకరాకు రూ.10 వేలు ఇస్తామని గతంలో సీఎం చంద్రబాబు ప్రకటన
- 1.60 కోట్ల ఎకరాలకు రూ.16,000 కోట్లు అవసరం.
- రూ.5,000 కోట్లే కేటాయించిన సర్కారు
- అరకొరగా నిధులిచ్చి... వ్యవసాయాన్ని పండగ చేస్తామంటున్న ముఖ్యమంత్రి

సాక్షి, అమరావతి: రైతుల వ్యవసాయ రుణాలన్నీ బేషరతుగా మాఫీ చేస్తామని హామీ ఇచ్చి గత ఎన్నికల్లో అధికారం దక్కించుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వచ్చే ఎన్నికలే లక్ష్యంగా రైతన్నలపై మరో వల విసిరారు. కిందటిసారి రుణమాఫీ పేరిట దగా చేసిన బాబు ఇప్పుడు అన్నదాత సుఖీభవ పేరిట ఎన్నికలకు రెండు నెలల ముందు మరో ఘరానా మోసానికి తెరతీస్తున్నారు. చంద్రబాబుకు రాజకీయ ప్రయోజనాలు తప్ప రైతన్నల సంక్షేమంపై ఏమాత్రం చిత్తశుద్ధి లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మంగళవారం ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో అన్నదాత సుఖీభవ పథకానికి రూ.5 వేల కోట్లు ఇస్తామని ప్రభుత్వం ప్రతిపాదించింది. రైతులకు ఎకరాకు రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం చేస్తామని చంద్రబాబు గతంలో లీకులిచ్చారు. రాష్ట్రంలో 1.60 కోట్ల ఎకరాల వ్యవసాయ భూములు ఉన్నాయి. చంద్రబాబు చెప్పినట్లు ఎకరాకు రూ.10 వేలు ఇవ్వాలంటే రూ.16,000 కోట్లు అవసరం. ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన నవరత్నాలను చంద్రబాబు కాపీ కొడుతున్నారు. ప్రతి రైతు కుటుంబానికి ఏటా రూ.12,500 చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని జగన్ ప్రకటించిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో 85 లక్షల రైతు కుటుంబాలు ఉన్నాయి. ఒక్కో కుటుంబానికి రూ.12,500 చొప్పున ఏడాదికి రూ.10,600 కోట్లు అవసరం. రైతులను ఆదుకుంటామని నమ్మబలుకుతూ తాజా బడ్జెట్‌లో చంద్రబాబు కేటాయించిన నిధులు కేవలం రూ.5 వేల కోట్లు మాత్రమే. ఈ నిధులు ఏమూలకూ చాలని దుస్థితి. ఓట్ల యావ తప్ప రైతన్నల బతుకులను మార్చాలనే ఆలోచన చంద్రబాబుకు లేదని దీన్నిబట్టి స్పష్టమవుతోంది. కేంద్ర ప్రభుత్వం ప్రతిఏటా రైతులకు ఇస్తానన్న రూ.6 వేలు ఏమాత్రం చాలవని విమర్శించిన సీఎం చంద్రబాబు ఈ రూ.5 వేల కోట్లతో రైతు సంక్షేమం ఎలా సాధ్యమో బయటపెట్టలేదు.

కౌలు రైతులకు రుణాలపై అవాస్తవాలు

తమ పార్టీ అధికారంలోకి రాగానే ప్రతి రైతు కుటుంబానికి ఏటా రూ.12,500 చొప్పున నాలుగేళ్లపాటు రూ.50 వేలను ఖరీఫ్ కంటే ముందే పెట్టుబడి సాయంగా అందిస్తామని వై?ఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వై?ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2017 జూలైలో పార్టీ ప్లీనరీలో నవరత్నాలలో భాగంగా ప్రకటించిన సంగతి తెలిసిందే. ఎన్నికల నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అదే పథకాన్ని కాపీ కొట్టారన్న వాదన వినిపిస్తోంది. 2018-19లో 11.06 లక్షల మంది కౌలు రైతులకు రూ.4,957 కోట్ల రుణాలు ఇచ్చామని బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు చెప్పారు. వాస్తవానికి గతేడాది డిసెంబర్ 7వ తేదీ వరకు కేవలం 7 లక్షల మందికే రుణాలు ఇచ్చారు. 2019-20లో ఎంతమందికి ఇస్తారో చెప్పలేదు.

అంతా అంకెల గారడీ

అభివృద్ధి శాతాల్లోనూ ఆర్థిక మంత్రి యనమల అంకెల గారడీ చేశారు. 33 శాతం వర్షపాతం లోటులోనూ 15 శాతం అభివృద్ధి సాధించినట్టు చెప్పారు. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన శ్వేతపత్రంలో 12 శాతంగా చూపిన అభివృద్ధి నెల తిరక్కుండానే 15 శాతానికి ఎగబాకడం సర్కారు మాయాజాలానికి నిదర్శనం.

వ్యవసాయ బడ్జెట్‌లో ప్రతిపాదనలు

వ్యవసాయం, మార్కెటింగ్, సహకార రంగాలు రూ.12,732.97 కోట్లు	పాడి, పశు సంవర్థక, మత్స్య శాఖ రూ.2,030.87 కోట్లు	2019-20కి అన్నదాత సుఖీభవ పథకం రూ.5,000 కోట్లు
వ్యవసాయ యాంత్రీకరణ రూ.300.17 కోట్లు	పశువుల బీమా రూ.200 కోట్లు	మత్స్యశాఖ కార్యకలాపాలకు రూ.100 కోట్లు
ఊరూరా పశుగ్రాసం పెంపునకు రూ.200 కోట్లు	ధరల స్థిరీకరణ నిధి రూ.500 కోట్ల నుంచి రూ.1,000 కోట్లకు పెంపు	ఉద్యాన శాఖ కార్యక్రమాల ప్రోత్సాహకానికి రూ.124 కోట్లు

ఆక్వా, హార్టికల్చర్‌లో అభివృద్ధిని వ్యవసాయంతో కలగలిపి అంకెల గారడీ చేయడం గమనార్హం. గత ఏడాది(2018-19) వ్యవసాయ బడ్జెట్‌లో రూ.7,607.49 కోట్లు కేటాయించగా, ఈ ఏడాది తాత్కాలిక బడ్జెట్‌లో రూ.12,732 కోట్లు ప్రతిపాదించారు. ఇందులో అన్నదాత సుఖీభవ కార్యక్రమానికి రూ.5 వేల కోట్లు పోగా, వ్యవసాయ, అనుబంధ రంగాలకు కొత్తగా కేటాయించింది కేవలం రూ.7,732 కోట్లు. ఈ నిధులతో వ్యవసాయాన్ని పండగ చేస్తానని చంద్రబాబు నమ్మబలుకుతున్నారు. వ్యవసాయ యాంత్రీకరణకు గత ఏడాది రూ.258.16 కోట్లు ఇవ్వగా, ఈ ఏడాది దాన్ని రూ.310.17 కోట్లుగా ప్రకటించి మిగతా పథకాల్లో కోత వేశారు.

సెరీ కల్చర్‌కు నిధులేవీ?

నీళ్లు లేక ఉన్న పంటల్ని వదిలిపెట్టి రాయలసీమ వాసులు పొట్ట చేతబట్టుకుని పొరుగు రాష్ట్రాలకు వలస వెళ్లుండగా, ఆ ప్రాంతాన్ని హార్టికల్చర్ హబ్‌గా మారుస్తామని, కోటి ఎకరాల్లో ఉద్యాన పంటలు పండించి ప్రపంచ దేశాలకు ఎగుమతి చేస్తామని ప్రభుత్వం చెప్పడం విడ్డూరం. వ్యవసాయ అనుబంధ రంగమైన సెరీ కల్చర్‌కు గత ఏడాది రూ.175.12 కోట్లు కేటాయించగా, ఈ ఏడాది ఆ ఊసే లేకుండా పోయింది. పశు సంవర్థక, పాడి అభివృద్ధి, మత్స్యశాఖలకు గత ఏడాది రూ.1,743 కోట్లు కేటాయించగా, ఈ ఏడాది స్వల్పంగా పెంచి రూ.2030.87 కోట్లుగా ప్రతిపాదించారు. గత ఏడాది వ్యవసాయం, మార్కెటింగ్, సహకార రంగాలకు కేటాయించిన మొత్తం కంటే ఈ ఏడాది 26 శాతం పెంచినట్టుగా చెబుతున్నా అందులో ఏమేం పద్దులు ఉన్నాయో ఆర్థిక మంత్రి ప్రకటించలేదు.

రుణమాఫీ... పెద్ద మాయ

ఎన్నికలు వచ్చినప్పుడల్లా ఏదో విధంగా రైతులను బురిడీ కొట్టించడం చంద్రబాబుకు అలవాటు. గత ఎన్నికల సందర్భంగా రైతులకు రూ.87,612 కోట్ల పంట రుణాలను పూర్తిగా మాఫీ చేస్తానని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక మాట తప్పారు. ఇప్పటికీ మూడు విడతలుగా సర్కారు ఇచ్చిన అరకొర సొమ్ము అసలు రుణాలపై వడ్డీలకు కూడా సరిపోక రైతులు నానా అవస్థలు పడుతున్నారు. వ్యవసాయ రుణాలను ప్రభుత్వం మాఫీ చేయకపోవడంతో లక్షలాది మంది రైతులు బ్యాంకు డిఫాల్డర్లుగా మారారు. తాజా బడ్జెట్‌లో రుణమాఫీకి నయాపైసా కూడా కేటాయించలేదు.

ఎన్నికల స్టంట్

- పథకాలకు, ఈ బడ్జెట్‌లో నిధులకు పొంతనే లేదు
- ఈ బడ్జెట్ గాల్లో లెక్కలు తప్ప మరేమీ కాదు
- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పీఏసీ సభ్యుడు దువ్వూరి కృష్ణ ధ్వజం
- జగన్ నవరత్నాలను దృష్టిలో పెట్టుకుని బడ్జెట్‌ను ప్రవేశపెట్టినట్టు కనిపిస్తోందని ఎద్దేవా
- రైతు రుణమాఫీ, డ్వాక్రా రుణమాఫీ ఊసే లేదు
- పసుపు-కుంకుమకు రూ.9,300 కోట్లు అవసరమైతే బడ్జెట్‌లో పెట్టింది రూ.4వేల కోట్లే
- అన్నదాత సుఖీభవకు కేటాయింపులు ఏమాత్రం సరిపోవు

సాక్షి, అమరావతి: రాష్ట్రప్రభుత్వం ప్రకటిస్తున్న పథకాలకు, మంగళవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన 2019-20 బడ్జెట్‌లోని కేటాయింపులకు ఎలాంటి పొంతన లేదని, దీన్నిబట్టే ప్రభుత్వానికి ఆయా పథకాల అమలు పట్ల ఎంత చిత్తశుద్ధి ఉందో స్పష్టమవుతోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పీఏసీ సభ్యుడు దువ్వూరి కృష్ణ ధ్వజమెత్తారు. జీతాలు, ఇతర ప్రభుత్వ నిర్వహణ అవసరాలకోసమే ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెడుతుంటారని, కానీ ఈ బడ్జెట్‌లో పథకాలు ప్రకటించడమే సరైన సంప్రదాయం కాదని తప్పుపట్టారు. చంద్రబాబు ప్రభుత్వం ఈ బడ్జెట్‌ను ఎన్నికల స్టంట్‌గా వాడుకుందని దుయ్యబట్టారు. మంగళవారం హైదరాబాద్‌లోని లోటస్‌పాండ్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి చేసిన వాగ్దానాలు, నవరత్నాలను దృష్టిలో పెట్టుకొని బడ్జెట్‌ను ప్రవేశపెట్టినట్లు కనిపిస్తోందని ఎద్దేవా చేశారు. బడ్జెట్‌లో వ్యవసాయ రుణమాఫీ గురించి ఊసే లేదన్నారు. వ్యవసాయ శాఖ బడ్జెట్‌ను రూ.15 వేల కోట్లే పెట్టారని విమర్శించారు. అందులో రూ.5 వేల కోట్లు 'అన్నదాత సుఖీభవ'కు కేటాయించారని, ఇవి ఆ పథకం అమలుకు ఏమాత్రం సరిపోవన్నారు. కాగా రూ.8,500 కోట్ల మేరకు ఇంకా వ్యవసాయ రుణమాఫీ చేయాల్సి ఉన్నా దాని ప్రస్తావనే బడ్జెట్‌లో లేదన్నారు. డ్వాక్రా రుణాల మాఫీ ఊసు కూడా లేదన్నారు. 'సీఎం యువనేస్తం' పథకం కింద నెలకు రూ.2 వేల చొప్పున 60 నెలలకు రూ.1.20 లక్షల కోట్లు ఇవ్వాల్సి ఉందన్నారు. కానీ గత రెండు నెలల నుంచి కేవలం రూ.1000 చొప్పునే కొద్దిమందికి ఇస్తున్నారన్నారు. పసుపు-కుంకుమలో రూ.10 వేల చొప్పున డ్వాక్రా మహిళలకు పోస్టు డేటెడ్ చెక్కులు ఇస్తున్నారని, వీటికి



రూ.9,300 కోట్లు బడ్జెట్లో కేటాయించాల్సి ఉందని స్పష్టం చేశారు. అయితే 2018-19లో 1,700 కోట్లు కేటాయింపులు చూపి, ఈ బడ్జెట్లో రూ.4 వేల కోట్లు మాత్రమే పెట్టిందన్నారు. ప్రభుత్వానికి ఈ నిధులిచ్చే ఉద్దేశం ఉంటే మొత్తం నిధులు కేటాయించాల్సి ఉందన్నారు. ఈ నిధులు కూడా మొత్తం ఉచితంగానా, తిరిగి చెల్లించాలా? అన్న స్పష్టత లేదన్నారు.

అంచనా ఖర్చు ఒక్కసారిగా పెంచేశారు

మొత్తం బడ్జెట్ రూ.2,26,177.53 కోట్లల్లో అప్పులపై వడ్డీ మినహాయిస్తే రూ.2,11,260 కోట్లే అసలు బడ్జెట్‌గా ఉంటుందని కృష్ణ అన్నారు. 2017-18కు సంబంధించి రూ.1,37,484 కోట్లు ఖర్చు చూపించారని, దాన్ని ఈ బడ్జెట్‌లో ఒక్కసారిగా రూ.2.11 లక్షల కోట్లకుపైగా పెంచి చూపించారని, ఇది ఏవిధంగా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. 2015-16లో బడ్జెట్‌లో ఖర్చు రూ.1.11 లక్షల కోట్లు ఉందని, అదే 2017-18లో రూ.1.35 లక్షల కోట్లుగా చూపించారని అంటే దాదాపు రూ.20 వేల నుంచి రూ.25 వేల కోట్ల వరకు పెరిగిందని వివరించారు. ఇది కొంతవరకు నమ్మశక్యంగా ఉన్నా రూ.2.11 లక్షల కోట్లకు అంచనాలు ఎలా తీసుకువచ్చారో ప్రభుత్వ విజ్ఞతకే వదిలేస్తున్నామని వ్యాఖ్యానించారు.

గాల్లో లెక్కలు తప్ప మరేమీ కాదు..

చంద్రబాబు ప్రవేశపెట్టిన బడ్జెట్ గాల్లో లెక్కలు తప్ప మరేమీ కాదని ఆయన విమర్శించారు. ట్యాక్స్ రెవెన్యూ 2018-19లో రూ.50 వేల కోట్లుంటే 2019-20లో రూ.70 వేల కోట్లకు తీసుకెళ్లారని, ఇదెలా సాధ్యమని ప్రశ్నించారు. బడ్జెట్‌లో ద్రవ్యలోటు(ఫిస్కల్ డెఫిసిట్) రూ.33 వేల కోట్లుగా చూపుతున్నారని, అదనంగా ఆదాయం వచ్చినా వేలకోట్లల్లో ద్రవ్యలోటును చూపించడం విశేషమన్నారు. ఎఫ్‌ఆర్‌బీఎం చట్టం ప్రకారం ద్రవ్యలోటు కేవలం 3 శాతమే ఉండాలని, జీఎస్‌డీపీ ప్రకారం చూసినా ఇది రూ.30 వేల కోట్లకు దాటడానికి వీల్లేదని స్పష్టం చేశారు. ఇప్పటికే రాష్ట్ర ప్రజలపై రూ.2 లక్షల కోట్ల అప్పు ఉందని, దీనిపై వడ్డీలే రూ.18 వేల కోట్లు చెల్లించాల్సి వస్తోందన్నారు. అయినా ఇంకా అప్పులు చేస్తూ ప్రజలపై భారం పెంచేస్తున్నారని దుయ్యబట్టారు. అప్పు చేసినా ఆ డబ్బుతో కనీసం పెట్టుబడి వ్యయం అయినా చేస్తున్నారా? అంటే అదేమీ లేదన్నారు. దేశంలోనే మన రాష్ట్రం పెట్టుబడి వ్యయంలో దిగువస్థానంలో ఉందన్నారు.

ఆర్టీసీలో సమ్మె విరమణ

డిమాండ్ల పరిష్కారంతో కార్మిక సంఘాల నిర్ణయం



సాక్షి, అమరావతి: ఆర్టీసీ ఐక్య కార్యాచరణ నాయకులతో యాజమాన్యం మంగళవారం రాత్రివరకు జరిపిన చర్చలు ఫలించడంతో బుధవారం నుంచి తలపెట్టిన సమ్మెను విరమించారు. ఆర్టీసీ తొమ్మిది కార్మిక సంఘాలతో మంత్రి అచ్చెన్నాయుడు, ఆర్టీసీ ఎండీ సురేంద్రబాబు, ఉన్నతాధికారులు ఈ చర్చలు జరిపారు. సమ్మె నోటీసులోని 18 డిమాండ్ల పరిష్కారంపై హామీ ఇచ్చినట్టు ఐక్య కార్యాచరణ నాయకులు తెలిపారు. ఆర్టీసీ కార్మికులకు తాత్కాలికంగా 25 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వడంతోపాటు భవిష్యత్తులో ఎన్జీవోలతో సమానంగా ఫిట్‌మెంట్ ఇచ్చేందుకు హామీ ఇచ్చినట్టు తెలిపారు. పాత బకాయిలను 2020 నాటికి చెల్లించాలని కార్మికులు కోరారు. ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వైవీరావు మాట్లాడుతూ విడుదల చేసిన 25 శాతం ఫిట్మెంట్ ఏప్రిల్ నెల 1 నుంచి కార్మికులు అందుకుంటారని చెప్పారు.

దగా చేశారు.. ఎన్‌ఎంయూ ప్రకటన

ఐక్య కూటమి పేరుతో ఆర్టీసీ కార్మికులను దగా చేశారని నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్‌ఎంయూ) మంగళవారం రాత్రి ఒక ప్రకటనలో ఆరోపించింది. డిమాండ్లను పూర్తిగా సాధించుకోకుండా సమ్మెను విరమించారన్నారు. కార్మికుల జీవితాల్లో బుధవారం బ్లాక్‌డే అని ఎన్‌ఎంయూ పేర్కొంది. 50% ఫిట్ మెంట్ ఇప్పిస్తామన్న హామీని తుంగలో తొక్కి 25%కు అంగీకరించారని, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనంపై ఎటువంటి చర్చ లేకుండానే సమ్మెను విరమించారని ఎన్‌ఎంయూ పేర్కొంది.

ఆర్టీసీని ఆదుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం..

చంద్రబాబు సర్కారు తొలినుంచి ఆర్టీసీని నిర్లక్ష్యం చేస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ ఏపీఎస్ ఆర్టీసీ మజ్దూర్ యూనియర్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.రాజారెడ్డి మండిపడ్డారు. మంగళవారం రాత్రి ఆయన సాక్షితో మాట్లాడుతూ.. గత తొమ్మిదేళ్ల పాలనలో, ప్రస్తుత నాలుగున్నరేళ్ల పాలనలో ఆర్టీసీని ఆదుకునే చర్యలు చేపట్టలేదన్నారు. ప్రభుత్వ తీరుతో నష్టాల భారిన పడిన ఆర్టీసీ విలీనం గురించి చర్చల్లో ప్రస్తావించలేదని దుయ్యబట్టారు. చర్చల పేరుతో కార్మికులను, ఆర్టీసీ సంస్థను చంద్రబాబు ప్రభుత్వం మరోసారి నమ్మించి దగా చేసిందని ఆరోపించారు.

బుచ్చిరాములుకు కన్నీటి వీడ్కోలు



సూర్యాపేట: సీపీఎం సీనియర్ నేత వర్ధెల్లి బుచ్చిరాములుకు పార్టీ నేతలు, కుటుంబ సభ్యులు, బంధువులు మంగళవారం కన్నీటి వీడ్కోలు పలికారు. సూర్యాపేటలోని హిందూ శ్మశానవాటికలో అంతిమ సంస్కారాలనుఆయన తనయుడు, సాక్షి ఎడిటర్ వర్ధెల్లి మురళి నిర్వహించారు. అంతకుముందు సీపీఎం కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు, మాజీ ఎమ్మెల్యేలు నంద్యాల నర్సింహారెడ్డి, జూలకంటి రంగారెడ్డి, రాష్ట నేతలు ఎల్.రమణ, బి.వెంకట్ తదితరులు ఆయన పార్థివదేహంపై పార్టీ జెండా కప్పి శ్రద్ధాంజలి ఘటించారు. సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, తెలంగాణ జనసమితి అధ్యక్షుడు కోదండరాం, సాక్షి ఎడిటోరియల్ డైరెక్టర్ రామచంద్రమూర్తి, మాజీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గట్టు శ్రీకాంత్‌రెడ్డి, తెలంగాణ ఇంటిపార్టీ అధ్యక్షుడు చెరుకు సుధాకర్‌తో పాటు పలువురు నివాళులర్పించారు. తన జీవితాన్ని పేద ప్రజల కోసం ధారపోసి కమ్యూనిస్టు యోధుడిగా మిగిలారని.. నమ్మిన సిద్ధాంతం కోసం ఏనాడూ రాజీపడని వ్యక్తి బుచ్చిరాములు అని వారు కొనియాడారు.

ఆ ఎనిమిది మంది డిటెన్షన్‌పై విచారణ

- మిచిగాన్ ఫెడరల్ న్యాయస్థానంలో ప్రారంభం
- న్యాయసాయం అందిస్తున్న అమెరికన్ తెలంగాణ అసోసియేషన్
- తొలిరోజు వాదనలు వినిపించిన అటార్నీ ఎడ్వర్డ్ బజూకా
- 8 మంది ట్రయల్ పూర్తయ్యాకే 156 మందిపై విచారణ..

సాక్షి, హైదరాబాద్: ఫార్మింగ్టన్ యూనివర్సిటీ కేసులో అమెరికా పోలీసులు అదుపులోకి తీసుకున్న 8 మంది మధ్యవర్తుల విచారణ ప్రారంభమైంది. అమెరికా కాలమానం ప్రకారం మిచిగాన్ ఫెడరల్ న్యాయస్థానంలో సోమవారం విచారణ మొదలైంది. యూఎస్ పోలీసుల అదుపులో ఉన్న 8 మంది తెలుగు విద్యార్థుల తరపున వాదనలు వినిపించేందుకు గాను అమెరికన్ తెలంగాణ అసోసియేషన్ ఏర్పాటు చేసిన అటార్నీ ఎడ్వర్డ్ బజూకా తొలిరోజు వాదనలు వినిపించారు. విచారణ పూర్తయ్యేంతవరకు ఆ ఎనిమిది మందిని ఫెడరల్ కస్టడీలోనే ఉంచాలని, వారు బెయిల్‌పై బయటకు వస్తే యూఎస్ ఐసీఈ, స్టేట్స్ ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్ అధికారులు వారిని అరెస్టు చేసే అవకాశముందని బజూకా కోర్టుకు విన్నవించారు. యూఎస్ఐఎస్ కస్టడీలో ఉంటే అది శిక్షగా పరిగణనలోకి తీసుకోరని, ఫెడరల్ కస్టడీలో ఉంటేనే శిక్షాకాలం కింద పరిగణనలోకి తీసుకుంటారని, ఈ కారణంతోనే అలా కోర్టుకు విన్నవించారని సమాచారం. అటార్నీ విన్నపాన్ని కోర్టు సానుకూలంగా తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయని తెలుస్తోంది. కాగా, ఈ కేసులో అరెస్టయిన ఈ3 (డిఫెండెంట్) ఫణీంద్ర కర్ణాటికి న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసింది. కానీ అతను ఏ1 వీసా కలిగి ఉండటంతో యూఎస్ఐఎస్ అదుపులోకి తీసుకోలేదని తెలుగు అసోసియేషన్లు వెల్లడించాయి. గతంలో ఈ కేసులో 156 మంది విద్యార్థులను అరెస్టు చేసిన సమయంలో సేకరించిన ఫైళ్లు, ఫోన్ కాల్ డేటా వివరాలను కూడా పరిశీలించేందుకు కోర్టుకు సమయం పట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. విచారణలో చాలా విశ్వసనీయ విషయాలు వెల్లడవుతున్నాయని తెలుస్తోంది. తదుపరి విచారణ ఎప్పుడనేది కూడా న్యాయమూర్తి నిర్ణయం మేరకు ఉంటుందని, అది వచ్చే వారం ఉండే అవకాశముందని సమాచారం. కాగా, ఈ ఎనిమిది మంది మధ్యవర్తుల ట్రయల్ పూర్తయిన తర్వాతే అరెస్టయిన 156 మంది విషయంలో కోర్టు విచారణ చేపట్టనుంది.

'ఆదిత్య' శేషారెడ్డికి బ్రెయిన్ ఫీడ్ జీవిత సాఫల్య పురస్కారం




బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఉభయ గోదావరి, ఉత్తరాది జిల్లాల ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డికి బ్రెయిన్ ఫీడ్ 6వ జాతీయ సమావేశంలో 2018-19 సంవత్సరానికి జీవిత సాఫల్య పురస్కారం లభించింది. గత నెల 31వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఢిల్లీ వర్సిటీ మాజీ వీసీ దినేష్‌సింగ్, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ చుక్కా రామయ్య, ఇంటెలిజెన్స్ డీఐజీ శివకుమార్, జేఎన్‌టీయూహెచ్ ప్రొఫెసర్ ఎం.అంజిరెడ్డి సమక్షంలో అవార్డు అందజేశారని శేషారెడ్డి సోమవారం విలేకరులకు తెలిపారు. ఆదిత్య విద్యాసంస్థల్లో విద్యాప్రమాణాల పెంపు, 60 సంస్థల్లో 60 వేల మంది విద్యార్థులకు విద్య, ఆరువేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించడం వంటి అంశాలను ప్రామాణికంగా తీసుకుని అవార్డు ప్రదానం చేశారని తెలిపారు. ఈ సందర్భంగా శేషారెడ్డిని ఆదిత్య విద్యాసంస్థల కార్యదర్శి కృష్ణదీపక్ రెడ్డి, హాస్టల్స్ డైరెక్టర్ లక్ష్మీరాజ్యం, డైరెక్టర్ సుగుణారెడ్డి అభినందించారు.

విద్యుత్ రంగంలో నష్టాలు తగ్గించాం..

ఏపీ విద్యుత్తు రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్ జస్టిస్ భవానీ ప్రసాద్

సాక్షి, అమరావతి : విద్యుత్ రంగంలో నష్టాలను తగ్గించి డిస్కంల ఆదాయం పెంచడంతో వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను ందించగలుగుతున్నామని ఏపీ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్ జస్టిస్ భవానీ ప్రసాద్ అన్నారు. విజయవాడలో మంగళవారం జరిగిన ఏపీ ఎనర్జీ ఇన్నోవేషన్ సమ్మిట్-2019లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యుత్ కొనుగోలు ఖర్చును 86 నుంచి 76 శాతానికి తగ్గించినట్టు చెప్పారు. ఈ ఏడాది స్వల్పకాలిక విద్యుత్ కొనుగోలుకు ప్రయత్నిస్తున్నామన్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తదితర ప్రమాదాల్లో చనిపోయిన, గాయపడిన వారికి నష్టపరిహారం అందించడంలో కమిషన్ ప్రాధాన్యం ఇస్తుందన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు



ఉడిపి మఠపీఠాధిపతి సుగుణేంద్ర తీర్థస్వామీజీ



ఆలయం వద్ద ఏపీ డీజీపీ ఠాకూర్, తమిళనాడు డీజీపీ టీకే రాజేంద్రన్, కర్నాటక డీజీపీ నీలమణిరాజు తదితరులు

తిరుమల: తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వీరిలో ఉడిపి మఠం పీఠాధిపతి సుగుణేంద్ర తీర్థస్వామీజీ, ఏపీ డీజీపీ ఆర్‌పీ ఠాకూర్, తమిళనాడు డీజీపీ టీకే రాజేంద్రన్, కర్ణాటక డీజీపీ నీలమణిరాజు, తెలంగాణా హోం సెక్రటరీ రాజుత్రివేది, టీటీడీ సీవీఎస్‌వో గోపినాథ్‌జట్టి, పలు రాష్ట్రాలకు చెందిన ఐపీఎస్ అధికారులు ఉన్నారు. ఆలయాధికారులు వీరికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామివారి దర్శనానంతరం ఆలయంలోని రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టీటీడీ అధికారులు తీర్థప్రసాదాలు, శ్రీవారి చిత్రపటంతో సత్కరించారు.

11, 12 తేదీల్లో వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో ఈ నెల 12న రథసప్తమిని పురస్కరించుకుని సామాన్య భక్తుల సౌకర్యార్థం 11, 12 తేదీల్లో వీఐపీ బ్రేక్ దర్శనాలను ప్రొటోకాల్ ప్రముఖులకు మాత్రమే టీటీడీ పరిమితం చేసింది. చంటిపిల్లల తల్లిదండ్రులకు, వయోవృద్ధులకు, దివ్యాంగులకు, దాతలకు సుపథం మార్గంలో కల్పించే ప్రత్యేక దర్శనాలను సైతం రద్దు చేసింది. అలాగే రథసప్తమి నాడు శ్రీవారి ఆలయంలో నిర్వహించే ఆర్జిత సేవలైన అష్టదళపాదపద్మారాధన, కల్యాణోత్సవం, ఆర్జిత బ్రహ్మోత్సవం, ఊంజల్‌సేవ, వసంతోత్సవం, సహస్రదీపాలంకార సేవలు రద్దయ్యాయి. సుప్రభాతం, తోమాల, అర్చన సేవలను ఏకాంతంగా నిర్వహిస్తారు.

వర్గీకరణపై సీఎం నోరు మెదపరే?

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

ములకల చెరువు: ఎస్సీ వర్గీకరణ చేస్తామని చెప్పి నాలుగున్నరేళ్లు గడుస్తున్నా దీనిపై సీఎం చంద్రబాబు నోరు మెదపడంలేదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ధ్వజమెత్తారు. మంగళవారం ఆయన చిత్తూరు నుంచి అనంతపురానికి వెళుతూ ములకలచెరువులో దళితులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంద కృష్ణ మాట్లాడుతూ.. చంద్రబాబు బీసీ వర్గీకరణ చేశారని, మరి ఎస్సీ వర్గీకరణ చేయడానికి అభ్యంతరమేంటని ప్రశ్నించారు. దళితులను విస్మరిస్తున్న చంద్రబాబుకు వచ్చే ఎన్నికల్లో గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నేత నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో అగ్రిగోల్డ్ బాధితుడు మృతి



సురేష్ (ఫైల్)

పోరుమామిళ్ల: వైఎస్సార్ జిల్లా పోరుమామిళ్ల మండలంలోని టేకూరుపేటకు చెందిన అగ్రిగోల్డ్ బాధితుడు గాధంశెట్టి సురేష్ (48) సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. చిరు వ్యాపారైన సురేష్ అగ్రిగోల్డ్‌లో రూ.50 వేలు డిపాజిట్ చేశాడు. అయితే ఆ సంస్థ బోర్డు తిప్పేయడంతో కొంత కాలంగా ఆందోళనకు చెందుతున్నాడు. రెండ్రోజుల క్రితం అనారోగ్యానికి గురికావడంతో చెన్నై ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. సురేష్‌కు భార్య నాగలక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు.


‘జీడిపప్పు పరిశ్రమలకు 25% సబ్సిడీ’

సాక్షి, అమరావతి: ఉత్తరాంధ్రాలో అత్యధిక మందికి ఉపాధి కల్పిస్తున్న జీడిపప్పు పరిశ్రమలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నట్లు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి ఎన్.అమరనాథ్‌రెడ్డి తెలిపారు. కొత్తగా జీడిపప్పు యూనిట్లు స్థాపించే వారికి 25 శాతం సబ్సిడీ ఇవ్వాలనే ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఫుడ్ పార్కు పనుల పురోగతిపై మంగళవారం మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ.. ఆహారశుద్ధి పరిశ్రమతో రైతుల ఆదాయం రెట్టింపు అవుతుందన్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా పాలసీని తీసుకురావడమే కాకుండా.. రూ.350 కోట్ల సబ్సిడీని విడుదల చేసినట్లు తెలిపారు.

నన్ను అవినీతిపరుడు అంటావా?

- నీవి, నీకొడుకివి ఆస్తులు రూ.16 వేల రెట్లు ఎలా పెరిగాయి?
- అమిత్‌షాపై సీఎం చంద్రబాబు మండిపాటు
- నాలుగేళ్లకు ముందు మోదీ, షాలు ఎక్కడున్నారు?
- ఢిల్లీకి రాగానే కళ్లు నెత్తికెక్కాయా?
- ఎన్డీయేలోకి వస్తానని నేనెప్పుడూ అడుక్కోలేదు
- మీరు రమ్మంటేనే వచ్చాను.. నేను నిబద్ధత కలిగిన నేతను
- అబ్దుల్ కలాంను నేనే రాష్ట్రపతిని చేశా

సాక్షి, అమరావతి: ''నన్ను అవినీతిపరుడు అంటారా.. నీది, నీ కొడుకు ఆస్తులు 16 వేల రెట్లు పెరిగాయి. నువ్వా నా గురించి మాట్లాడేది?'' అంటూ సీఎం చంద్రబాబు బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షాపై మండిపడ్డారు. వ్యవసాయ రంగంపై లఘు చర్చలో భాగంగా సీఎం మంగళవారం అసెంబ్లీలో మాట్లాడారు. వేల కోట్లు దాచుకున్న వాళ్లందరినీ విదేశాలకు పంపిన ఘనత మీదేనని ఆరోపించారు. న్యాయం చెయ్యమని అడిగితే సీబీఐ, ఈడీ దాడులకు పాల్పడతారా? పశ్చిమబెంగాల్‌లో ఇలాగే చేసి చేతులు కాల్చుకున్నారని వ్యాఖ్యానించారు. అహంభావంతో ఉన్నవారికి పతనం తప్పదన్నారు.



అది నా ఘనత..

నాలుగేళ్లక్రితం మోదీ, అమిత్‌షా ఎక్కడున్నారు? ఢిల్లీకి రాగానే కళ్లు నెత్తికెక్కాయా? అని చంద్రబాబు మండిపడ్డారు. ''నలభై ఏళ్లుగా నేను రాజకీయాల్లో ఉన్నాను, నా గురించి మాట్లాడతారా? నేను అవినీతిపరుడని మాట్లాడుతున్నారు.. మీరు రఫెల్ మీద ఎందుకు విచారణ జరపట్లేదు? నేను ఎన్డీఏలోకి వస్తానని అడుక్కోలేదు. మీరే కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా అందరం కలిసి పోరాడదామంటే వచ్చాను. నేనేదో బతిమాలుతున్నట్టు.. మీరు వద్దంటున్నట్టు చవకబారు విమర్శలు చేస్తున్నారు. ఇది ఒకప్పటి బీజేపీ కాదు. ఇది మోదీ–షా బీజేపీ. అప్పట్లో పీసీ అలెగ్జాండర్‌ను రాష్ట్రపతిని చేద్దామని వాజ్‌పేయి నాకు ఫోన్ చేస్తే వ్యతిరేకించా. తర్వాత నేను అబ్దుల్ కలాం పేరు ప్రతిపాదిస్తే ఆయన్నే రాష్ట్రపతిని చేశారు. అది నా ఘనత'' అని చెప్పారు. ఏపీకి అన్యాయం చేసిన బీజేపీకి విష్ణుకుమార్‌రాజు, కామినేని శ్రీనివాస్ రాజీనామా చేసి బయటకు వచ్చివుంటే అంతా హర్షించేవారన్నారు. ఐదేళ్లలో రూ.2.44 లక్షల కోట్లు ఇచ్చామని చెబుతున్నారని, ఎక్కడిచ్చారు, ఎప్పుడిచ్చారు, వీటన్నిటికీ జవాబు చెప్పాకే మోదీ, షా ఏపీకి రావాలన్నారు. ''నిన్న పలాసలో అమిత్‌షాకు ఏమి జరిగిందో చూడలేదా... ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి, భవిష్యత్‌లోనూ ఇలాంటి ఘటనలే పునరావృతమవుతాయి'' అని అన్నారు.

నాది రైట్ టర్న్.. మీది వంకర టింకర్ టర్న్: ప్రత్యేక హోదాపై తాను ఎప్పుడూ యూటర్న్ తీసుకోలేదని, రైట్ టర్నే తీసుకున్నానని చంద్రబాబు చెప్పారు. బీజేపీవాళ్లే వంకరటింకర టర్న్‌లు తీసుకున్నారని ఆరోపించారు. జాతీయ రహదారులకు నిధుల కేటాయింపు, రాజధానికి నిధుల కేటాయింపు వంటి వాటిపై చర్చకు తానిప్పటికీ సిద్ధమన్నారు. తనపై ఆడవాళ్లందరూ(డ్వాక్రా మహిళలు) కోపంగా ఉన్నారని అమిత్‌షా అంటున్నారు... నామీద ఈగవాలినా డ్వాక్రా అక్కచెల్లెమ్మలందరూ తోలు తీస్తారని చెప్పారు. ఈ రాష్ట్రానికి మీరే 650 అవార్డులు ఇచ్చారు కదా మీరా నన్ను విమర్శించేది అని మండిపడ్డారు. నన్ను విమర్శించే నైతిక హక్కు మీకు లేదని, నిబద్ధత కలిగిన రాజకీయ నాయకుడినని చెప్పుకొచ్చారు. 2014కు ముందు రాష్ట్రంలో రైతుల పరిస్థితి దారుణంగా ఉందని, టీడీపీ ప్రభుత్వం అధికారంలోకొచ్చాక వ్యవసాయరంగంలో రాష్ట్రం అగ్రగామిగా ఉందన్నారు. ఫసల్ బీమా యోజన పెద్ద ఫార్సు అని, దీనిపై కేంద్రం డబ్బా కొట్టుకుంటోందని విమర్శించారు. దేశంలోనే రైతులకు రుణవిముక్తి కల్పించింది ఏపీయేనని, ఇప్పటివరకూ రూ.24,500 కోట్లు రుణవిముక్తి చేశామని చెప్పారు. ఇంకా చేయాల్సి ఉందని, అది చేశాకే ఎన్నికలకు వెళతానని చెప్పారు. కరువు వచ్చినా, వర్షపాతం తగినంత లేకపోయినా కరువును జయించామని, అన్ని ప్రాజెక్టులూ పూర్తిచేశామని పేర్కొన్నారు. త్వరలోనే 'అన్నదాత సుఖీభవ' పథకాన్ని అమలు చేయబోతున్నట్టు ప్రకటించారు. అంతకుముందు వ్యవసాయ మంత్రి సోమిరెడ్డి మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలవల్లే వ్యవసాయ దిగుబడి అద్భుతంగా ఉందని, రైతుల్ని ఆదుకున్న ప్రభుత్వం ఇదేనని చెప్పారు.

కల్యాణకట్ట పైనుంచి పడి చిన్నారి మృతి



మృతిచెందిన చిన్నారి చంద్రిక

తిరుమల: తిరుమల కళ్యాణకట్ట వద్ద విషాదం చోటు చేసుకుంది. చంద్రిక (7) అనే చిన్నారి కల్యాణకట్ట మూడో అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు జారిపడి మృతిచెందింది. పోలీసులు చెప్పిన కథనం మేరకు.. కర్ణాటకకు చెందిన చంద్రకాంత్, దుర్గాదేవి దంపతులు ఎనిమిదేళ్లుగా తిరుమలలోని పలు హోటల్స్‌లో పనిచేస్తూ, కళ్యాణకట్ట వద్ద ఉన్న షెడ్‌లో నివాసముంటున్నారు. వారి మూడో సంతానం చంద్రిక.. మంగళవారం ఉదయం కల్యాణకట్ట మూడో అంతస్తులో ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తు జారిపడింది. కల్యాణకట్టలోని ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌కు తీసుకెళ్లగా, పల్స్ లేకపోవడంతో అశ్విని ఆస్పత్రికి తరలించారు. అశ్విని ఆస్పత్రిలో డాక్టర్ నర్మద ఆఖరు నిమిషం వరకు ప్రయత్నించినా లాభం లేకపోయింది. చిన్నారి మృతి చెందినట్లు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.

‘పచ్చ’ ప్రభుత్వానికి అంతిమ ఘడియలు

- క్షమించరాని నేరస్థుడు సీఎం చంద్రబాబు
- సమర శంఖారావమే వైఎస్సార్‌సీపీ విజయనాదం
- జగన్ ప్రజా సంకల్పయాత్రతో ప్రజల్లో విశ్వాసం
- 175 స్థానాల్లో 140 స్థానాల్లో గెలుపు
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి



కడప కార్పొరేషన్: చరిత్ర క్షమించరాని నేరాలు చేసిన సీఎం చంద్రబాబునాయుడి ప్రభుత్వానికి అంతిమ ఘడియలు సమీపించాయని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాయలసీమ ఇన్‌చార్జి సజ్జల రామకృష్ణారెడ్డి ధ్వజమెత్తారు. వైఎస్సార్ జిల్లా కేంద్రం కడపలోని మున్సిపల్ స్టేడియంలో గురువారం జరుగనున్న సమర శంఖారావం సభ ఏర్పాట్లను మాజీ ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డితో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. రామకృష్ణారెడ్డి మీడియాతో మాట్లాడుతూ రెండు, మూడు నెలల్లో ఎన్నికలు రాబోతున్నాయన్నారు. 2014 ఎన్నికల్లో కేవలం 5 లక్షల ఓట్ల తేడాతో ప్రతిపక్షానికి పరిమితం కావాల్సి వచ్చిందని చెప్పారు. పార్టీని సంస్థాగతంగా పటిష్టం చేసే ప్రక్రియలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లాల్లో ఉన్న బూత్ కమిటీలను సూక్ష్మస్థాయిలో సంఘటితం చేస్తున్నామన్నారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు అన్ని రకాల ఎత్తుగడలు వేసి, చేయరాని పనులన్నీ చేసి, అనేక అబద్ధాలాడి..అవకాశవాద పొత్తులు పెట్టుకున్నారని తెలిపారు. ఒక నిబద్ధత, నిజాయితీ, సిద్ధాంతాలు లేకుండా డబ్బులను విచ్చలవిడిగా వెదజల్లి అత్తెసరు ఓట్లతో అధికారంలోకి వచ్చారన్నారు. నాలుగున్నరేళ్లు వైఎస్సార్‌సీపీ చేసిన పోరాటాల వల్ల లక్షలాది మంది కొత్త నాయకులు, కార్యకర్తలు తయారయ్యారని చెప్పారు. చంద్రబాబు చేసిన నేరాల వల్ల రాష్ట్రం పదేళ్లు వెనక్కి పోయిందన్నారు. తమ పార్టీ చేసిన పోరాటాలు, 14 నెలలుగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన ప్రజా సంకల్ప యాత్ర వల్ల 175 స్థానాల్లో 140 స్థానాలను కైవసం చేసుకుంటామని విశ్వాసం వ్యక్తం చేశారు. తమ పార్టీ విజయానికి ఈ సమర శంఖారావం సభలే నాంది పలకబోతున్నాయని తెలిపారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఇంటర్వ్యూలను చేపట్టాలి

స్క్రీనింగ్ టెస్ట్‌లో అర్హత సాధించిన అభ్యర్థుల డిమాండ్



ధర్నాలో పాల్గొన్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు

సాక్షి, అమరావతి బ్యూరో: రాష్ట్రంలోని 14 విశ్వవిద్యాలయాల్లో 1,108 సహాయ ఆచార్యుల పోస్టుల భర్తీకి వెంటనే ఇంటర్వ్యూలను నిర్వహించి నియామకాలను చేపట్టాలని స్క్రీనింగ్ టెస్ట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు డిమాండ్ చేశారు. విజయవాడ ధర్నా చౌక్‌లో నిర్వహిస్తున్న నిరసన దీక్ష రెండోరోజుకు చేరింది. దీక్షకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు వైవీ రావు, ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.పాండురంగా వరప్రసాద్‌రావు సంఘీభావం ప్రకటించారు. పి.మధు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహించిన స్క్రీనింగ్ టెస్ట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు ఇంటర్వ్యూల కోసం ఎదురుచూస్తున్నారన్నారు. ప్రభుత్వం దాని గురించి ముందడుగు వేయకపోవటం దారుణమన్నారు. ఇప్పటికే వేల సంఖ్యలో విశ్వవిద్యాలయ అధ్యాపకుల పోస్టులు ఖాళీగా ఉండి, రకరకాల సమస్యలతో కునారిల్లుతున్న విశ్వవిద్యాలయాలకు ఈ పోస్టుల నియామకం వల్ల కాస్త ఉపశమనం కలుగుతుందన్నారు. షెడ్యూల్ ప్రకటించి, కాల్‌లెటర్లను అర్ధాంతరంగా వాయిదా వేయటం సరికాదన్నారు. ఈ విషయమై తక్షణమే ముఖ్యమంత్రికి లేఖ రాస్తానని తెలిపారు. కార్యక్రమంలో స్క్రీనింగ్ టెస్ట్‌లో అర్హత సాధించిన అభ్యర్థుల అసోసియేషన్ అధ్యక్షుడు బి.రవికుమార్, సహాయ కార్యదర్శి విజయకుమార్, మహిళా ప్రతినిధులు పుష్పవతి, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

శకుంతలమ్మకు కన్నీటివీడ్కోలు

- గానగంధర్వుడి ఇంట శోకరాగం
- ఘన నివాళులర్పించిన బంధుమిత్రులు, ప్రముఖులు



మాతృమూర్తికి శాస్త్రోక్తంగా అంత్యక్రియలు నిర్వహిస్తున్న ఎస్పీబాలసుబ్రహ్మణ్యం

నెల్లూరు (బృందావనం): సినీ నేపథ్య గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం మాతృమూర్తి శ్రీపతి పండితారాధ్యుల శకుంతలమ్మ అంతిమయాత్ర మంగళవారం శోకతప్త హృదయాలతో నెల్లూరులో నిర్వహించారు. 89 ఏళ్ల శకుంతలమ్మ సోమవారం తుదిశ్వాస విడిచారు. లండన్ పర్యటనలో ఉన్న ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం మంగళవారం ఉదయం నెల్లూరుకు చేరుకున్నారు. తిప్పరాజువారివీధిలో ఉన్న ఆమె స్వగృహం వద్ద కుమారుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం శాస్త్రోక్తంగా అంత్యక్రియలు నిర్వహించారు. తన మాతృమూర్తి పార్థివదేహాన్ని చూసి బాలసుబ్రహ్మణ్యం కన్నీటిపర్యంతమయ్యారు. ఒక దశలో తల్లితో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ ఉద్వేగానికి గురయ్యారు. ఎస్పీ బాలును బంధుమిత్రులు ఓదార్చారు. అంతిమయాత్ర అనంతరం పవిత్ర పినాకినీ నదీతీరాన ఉన్న బోడిగాడితోటలో శకుంతలమ్మ పార్థివదేహాన్ని ఖననం చేశారు. బాలసుబ్రహ్మణ్యం సోదరీమణులు పార్వతి, వసంత, శైలజ, సినీనటుడు శుభలేక సుధాకర్‌తో పాటు కుటుంబసభ్యులు, బంధువులు, ప్రముఖ సినీ సంగీత దర్శకుడు సాలూరు వాసురావు, సినీ గేయ రచయితలు భువనచంద్ర, వెన్నెలకంటి, శాంతా బయోటెక్ అధినేత వరప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ ఫ్లోర్‌లీడర్ పి.రూప్‌కుమార్ యాదవ్‌లతో పాటు సినీరంగ ప్రముఖులు అంతిమయాత్రలో పాల్గొన్నారు.

జనసేన అడ్వైజరీ కౌన్సిల్ చైర్మన్‌గా విష్ణురాజు

సాక్షి, అమరావతి: జనసేన పార్టీ అడ్వైజరీ కౌన్సిల్ చైర్మన్‌గా కేవీ విష్ణురాజు నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ ఒక ప్రకటనలో పేర్కొంది. ఆయన మంగళవారం హైదరాబాద్‌లో పవన్‌కల్యాణ్ సమక్షంలో జనసేనలో చేరారు. పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ భీమవరం పర్యటనకు వెళ్లినపుడు విష్ణురాజును కలిసి.. పార్టీలోకి రావాలని ఆహ్వానించినట్లు చెప్పారు.

పింఛన్లపై ‘పచ్చ’ గద్దలు

- తెప్పించింది.. ఇప్పిస్తున్నది తామేనంటూ టీడీపీ నేతల దౌర్జన్యం
- లబ్ధిదారుల నుంచి రూ.1,000 చొప్పున అక్రమంగా వసూలు
- ఇవ్వకపోతే వచ్చేనెల నుంచి పింఛను రాదని బెదిరింపులు

వెల్దుర్తి(మాచర్ల): నాలుగున్నరేళ్లుగా అవినీతి, అక్రమార్జనలో ఆరితేరిపోయిన అధికార తెలుగుదేశం పార్టీ నేతలు ఆఖరికి పింఛనుదారులను సైతం వదడం లేదు. నూతనంగా పింఛను మంజూరైన వారి నుంచి రూ.1,000 చొప్పున దౌర్జన్యంగా వసూలు చేస్తున్నారు. గుంటూరు జిల్లా వెల్దుర్తి మండలం లోయపల్లి గ్రామంలో మంగళవారం ఈ ఘటన చోటుచేసుకుంది. సరిగ్గా ఎన్నికల రాష్ట్ర ప్రభుత్వం పింఛన్‌ను పెంచిన విషయం తెలిసిందే. లోయపల్లిలోని 28 మందికి కొత్తగా పింఛను మంజూరైంది. మంగళవారం నగదు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. గ్రామ కార్యదర్శి ఆధ్వర్యంలో చేపట్టాల్సిన ఈ కార్యక్రమాన్ని అధికార పార్టీ నేతలు దగ్గరుండి మరీ పర్యవేక్షించారు. పంపిణీ పూర్తి కాగానే వృద్ధులు, వితంతువులు, వికలాంగులు అని తేడా లేకుండా అందరి వద్ద రూ.1,000 చొప్పున వసూలు చేశారు. ఇదేం దౌర్జన్యమని ప్రశ్నిస్తే.. పింఛను తెప్పించింది మేమే, ఇప్పిస్తున్నది మేమే, మాకు రూ.1,000 చొప్పున ఇవ్వాల్సిందే అంటూ బెదిరింపులకు దిగారు. అడిగినంత ఇవ్వకపోతే వచ్చేనెల నుంచి పింఛను రాదని భయపెట్టారు. దరఖాస్తు చేసినప్పుడు కూడా తమ వద్ద రూ.500 చొప్పున వసూలు చేశారని, ఇప్పుడు మళ్లీ ఎందుకివ్వాలని ప్రశ్నించినవారిపై బెదిరింపులకు దిగారు. దీంతో దిక్కుతోచని పింఛనుదారులు ఒక్కొక్కరూ రూ.1,000 చొప్పున సమర్పించుకుని వెనుతిరిగారు. ఉప్పలపాడు, ఎర్రబాలెం, వెల్దుర్తి గ్రామాల్లోనూ అధికార పార్టీ నాయకులు పింఛన్లు పొందిన వారి వద్ద నుంచి నగదు వసూలు చేయడం గమనార్హం. అధికార పార్టీ నేతల అరాచకాలపై చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

డబ్బులివ్వకపోతే పింఛను రాదన్నారు



''నేను కొత్తగా పింఛను కోసం దరఖాస్తు చేసుకున్నా. పింఛను వచ్చింది. డబ్బులు తీసుకోగానే మేమే మంజూరు చేయించాం, మాకు డబ్బులివ్వాలని టీడీపీకి చెందిన నాయకులు బెదిరించారు. డబ్బులివ్వకపోతే వచ్చే నెల నుంచి పింఛను రాదన్నారు. భయపడి వారు అడిగినట్లు రూ.1,000 ఇచ్చాను. అంతకుముందు దరఖాస్తు చేసుకున్నప్పుడు 500 వసూలు చేశారు''

– గాలి నారాయణ, పింఛన్ లబ్ధిదారుడు, లోయపల్లి, గుంటూరు జిల్లా.

ప్రజాదరణ ఉంది.. ప్రభుత్వ ఆదరణే లేదు

నియామకాలు చేపట్టని సర్కారు • ఆయుష్ వైద్యుల ఆవేదన



సచివాలయం వద్ద నిరీక్షిస్తున్న ఆయుష్ వైద్యులు

సాక్షి, అమరావతి: హోమియో, ఆయుర్వేద, యునాని వైద్యానికి మంచి ప్రజాదరణ ఉండగా.. ప్రభుత్వం నుంచి మాత్రం ఎలాంటి ఆదరణ లేదని ఆయుష్ వైద్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయుష్ వైద్యుల నియామకాలను ప్రభుత్వం పూర్తిగా గాలికొదిలేసిందని మండిపడ్డారు. మంగళవారం వివిధ జిల్లాల నుంచి ఆయుష్ వైద్యులు ఉండవల్లిలోని తాత్కాలిక సచివాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ పూనం మాలకొండయ్యను కలిస్తే కనీసం సమాధానం కూడా చెప్పలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి ఫరూక్‌ను కలిసినా ఎలాంటి హామీలు రాలేదన్నారు. రాష్ట్రంలో 450 డిస్పెన్సరీల్లో వైద్యులు లేరని, కానీ నియామకాల కోసం ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 20 వేల మంది ఆయుష్ వైద్యులు నిరుద్యోగులుగా వీధుల్లో తిరుగుతున్నా.. ప్రభుత్వానికి చీమకుట్టినట్లయినా లేదని ఆరోపించారు. ఓవైపు కేంద్ర ప్రభుత్వం ఆయుష్ శాఖకు నిధులిచ్చి, జాతీయ ఆరోగ్య మిషన్ కింద నియామకాలు చేపట్టాలని చెబుతున్నా.. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం పట్టించుకోకుండా, తమ జీవితాలతో చెలగాటమాడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియామకాలు చేపట్టలేని ప్రభుత్వం, ఆయుష్ వైద్య కళాశాలలను కూడా మూసేస్తే సరిపోతుంది కదా అంటూ వైద్యులు కన్నీటి పర్యంతమయ్యారు.

కొత్తవారిని పరీక్షిస్తాం...



“ కొన్ని కొత్త ముఖాలతో మా బృందం భిన్నంగా ఉంది. ఈ టి20 సిరీస్‌లో కొందరిని పరీక్షిస్తాం. పొట్టి ఫార్మాటే అయినా భారత్ వంటి అగ్రశ్రేణి జట్టుపై ఆడనుండటం వారికి మంచి అనుభవం ఇస్తుంది. మున్రో టాపార్డర్‌లో వస్తాడు. ప్రపంచ కప్ ఎంతో దూరంలో లేనందున ప్రస్తుతం ప్రతి అవకాశమూ ఉపయుక్తమే.

–విలియమ్సన్, న్యూజిలాండ్ కెప్టెన్.

విదేశాల్లో కుల్దీపే బెస్ట్!

- అశ్విన్, జడేజాలకంటే మెరుగు
- కోచ్ రవిశాస్త్రి ప్రశంస

వెల్లింగ్టన్: విదేశీ గడ్డపై భారత జట్టు ప్రధాన స్పిన్నర్‌గా చైనామన్ బౌలర్ కుల్దీప్ యాదవ్‌కే తన ఓటని జట్టు హెడ్ కోచ్ రవిశాస్త్రి స్పష్టం చేశారు. కుల్దీప్ ఇప్పటికే అశ్విన్, జడేజాలను దాటి భారత నంబర్‌వన్ స్పిన్నర్‌గా ఎదిగాడని ఆయన అభిప్రాయపడ్డారు. ఇటీవలే సిడ్నీ టెస్టులో ఆస్ట్రేలియాపై కుల్దీప్ ఐదు వికెట్లు తీశాడని కోచ్ గుర్తు చేశారు. ‘విదేశీ గడ్డపై టెస్టు ఆడటమే తరువాయి అతను ఐదు వికెట్లతో చెలరేగాడు. కాబట్టి విదేశాల్లో జట్టు ప్రధాన స్పిన్నర్‌గా స్థానం ఖాయమైంది. సిడ్నీలో అతని ప్రదర్శన నన్ను ఎంతో ఆకట్టుకుంది. గతంలో అశ్విన్ తదితరులకూ అవకాశం ఉండేది. కానీ ఇప్పుడు మాత్రం మా నంబర్‌వన్ స్పిన్నర్ కుల్దీపే. విదేశాల్లో భారత్ ఒకే స్పిన్నర్‌తో ఆడాల్సి వస్తే అది కచ్చితంగా కుల్దీపే అవుతాడు’ అని శాస్త్రి ప్రశంసలతో ముంచెత్తారు. మరోవైపు ఇంగ్లండ్‌తో బర్మింగ్‌హామ్‌లో జరిగిన తొలి టెస్టునుంచి పుజారాను తప్పించడం అన్ని విధాలా ఆలోచించి తీసుకున్న నిర్ణయమేనని కోచ్ స్పష్టం చేశారు. అతను క్రీజ్‌లో నిలబడే విషయంలో చిన్నపాటి సమస్య కనిపించిందని, దానిని సరిదిద్దకుండా ఆడిస్తే తర్వాత 7–8 టెస్టుల పాటు అదే ఇబ్బందికరంగా మారేదన్న కోచ్... ఆ సమస్యను అధిగమించేందుకు తగిన సమయం ఇవ్వాలని భావించినట్లు చెప్పారు. మరోసారి కెప్టెన్ విరాట్ కోహ్లిపై ప్రశంసలు కురిపించిన శాస్త్రి...అతడిని నాటి దిగ్గజాలు రిచర్డ్స్, ఇమ్రాన్ ఖాన్‌లతో పోల్చారు.





ఇక ధనాధన్‌లో అమీతుమీ

అందరూ ఊహించిన దానికంటే భిన్నంగా న్యూజిలాండ్ గడ్డపై వన్డే సిరీస్‌ను సునాయాసంగా గెల్చుకున్న టీమిండియా... అదే ఆత్మ విశ్వాసంతో టి20ల్లోనూ దుమ్ము రేపేందుకు సిద్ధమవుతోంది. ఇక్కడ ఒక్క టి20 కూడా నెగ్గలేదన్న చరిత్రను చెరిపేసి... ప్రతిష్ఠాత్మక ప్రపంచ కప్‌నకు ముందు చివరి విదేశీ పర్యటనను ఘనంగా ముగించాలని యోచిస్తోంది. కొత్త కొత్త ప్రయోగాలతో అన్ని విభాగాల్లో తమను తాము పరీక్షించుకుంటోంది. ప్రత్యర్థి జట్టు ఇటీవల ఫామ్‌లో లేనందున మన జట్టును సిరీస్‌లో ఫేవరెట్‌గా భావించొచ్చు.

0 న్యూజిలాండ్‌లో టీమిండియా ఇంతవరకు ఒక్క టి20 కూడా గెలవలేదు. 2009 పర్యటనలో 0-2తో పరాజయం పాలైంది.

2 గత ఏడు టి20 సిరీస్‌లలో కివీస్ రెండే గెలిచింది.

1 రోహిత్ శర్మ 12 టి20ల్లో భారత్‌కు సారథ్యం వహించగా... ఒక్కదాంట్లో జట్టు ఓడింది.

10 ఆడిన గత పది టి20 సిరీస్‌లలో టీమిండియా అన్నింటిని గెలిచింది.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ శర్మ (కెప్టెన్), ధావన్, గిల్, పంత్, దినేశ్ కార్తీక్, ధోని, హార్దిక్, కృనాల్/జాదవ్, భువనేశ్వర్, ఖలీల్, చహల్/కుల్దీప్.
న్యూజిలాండ్: విలియమ్సన్ (కెప్టెన్), మున్రో, సీఫ్రెట్, రాస్ టేలర్, నీషమ్, గ్రాండ్‌హోమ్, సాన్‌ట్నర్, స్కాట్ కుగ్లీన్, బ్రాస్‌వెల్, ఫెర్గూసన్/సౌథీ, సోధి.

పిచ్, వాతావరణం

స్వింగ్‌కు అనుకూలించినా పైకి కనిపించిన దానికంటే భిన్నంగా ఉండటం వెస్ట్‌పాక్ మైదానంలోని పిచ్ స్వభావం. మంచు ప్రభావం ఉంటుంది. ఇంగ్లండ్‌తో చివరిసారిగా ఇక్కడ జరిగిన టి20లో కివీస్ 196 పరుగుల లక్ష్యాన్ని కాపాడుకునేందుకు శ్రమించింది. ఇంగ్లండ్ పోరాటంతో 184 పరుగులు చేసింది.

నేడు వెల్లింగ్టన్‌లో తొలి టి20
- వన్డే సిరీస్ నెగ్గిన ఊపులో టీమిండియా
- పలు మార్పులతో బరిలోకి కివీస్

వెల్లింగ్టన్: ఆస్ట్రేలియాపై టి20 సిరీస్‌తో ప్రారంభమైన టీమిండియా మూడు నెలల సుదీర్ఘ విదేశీ పర్యటన న్యూజిలాండ్‌తో టి20 సిరీస్ ద్వారా ఆఖరి అంకానికి వచ్చింది. మూడు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో భాగంగా కివీస్‌తో బుధవారం ఇక్కడ తొలి టి20 జరుగనుంది. భారత్‌లాగే అటు ఆతిథ్య జట్టు కూడా కూర్పుపరంగా భిన్నంగా కనిపిస్తుండటం ఈ సిరీస్‌లో ఓ విశేషం. రెగ్యులర్ కెప్టెన్ విరాట్ కోహ్లికి విశ్రాంతితో సారథ్యంతో పాటు బ్యాటింగ్‌లోనూ రోహిత్ శర్మ మెరవాల్సి ఉంటుంది. వెస్టిండీస్, ఆస్ట్రేలియాలపై టి20 సిరీస్‌లకు తప్పించిన వెటరన్ మహేంద్ర సింగ్ ధోని పొట్టి ఫార్మాట్‌లో పునరాగమనం చేయనున్నాడు. గాయం, సస్పెన్షన్‌తో కొన్నాళ్లుగా అంతర్జాతీయ టి20లు ఆడని ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ఈసారి ఎలా రాణిస్తాడనేది ఆసక్తికరం కానుంది.

భారత్ కూర్పు ఎలా?

బ్యాటింగ్‌లో రెగ్యులర్ కెప్టెన్ విరాట్ కోహ్లి, బౌలింగ్‌లో పేసర్ షమీ ఈ సిరీస్‌కు జట్టులో లేరు. దీంతో టీమిండియా కూర్పు కొంత కొత్తగా కనిపించనుంది. ఓపెనర్లు రోహిత్, ధావన్ తర్వాత యువ శుబ్‌మన్ గిల్ మూడో స్థానంలో వస్తాడు. అంచనాల ప్రకారం చూస్తే జట్టులో రిషభ్ పంత్, దినేశ్ కార్తీక్, ధోని రూపంలో ముగ్గురు స్పెషలిస్ట్ వికెట్ కీపర్లు ఉండే అవకాశం ఉంది. అన్నదమ్ములు కృనాల్ పాండ్యా, హార్దిక్ పాండ్యా ఆల్ రౌండర్ల కోటాను భర్తీ చేయనున్నారు. ఇద్దరు స్పిన్నర్లు కావాలనుకుంటేనే కృనాల్‌ను దింపుతారు. చహల్ రూపంలో ఒక్క స్పిన్నర్ సరిపోతాడనుకుంటే కృనాల్ స్థానంలో కేదార్ జాదవ్‌ను తీసుకోవచ్చు. సిద్ధార్థ్ కౌల్, మొహమ్మద్ సిరాజ్ ఉన్నా భువనేశ్వర్‌కు తోడు రెండో పేసర్‌గా ఖలీల్‌నే ఎంచుకోవచ్చు. ప్రయత్నించి చూద్దామని భావిస్తే కౌల్ తుది జట్టులో ఉంటాడు. ఈ అంచనా ప్రకారం చూస్తే బౌలింగ్ తేలిపోతోంది. కాబట్టి గిల్, పంత్‌లలో ఒకరిని పక్కనపెట్టి కృనాల్, జాదవ్ ఇద్దరినీ బరిలో దింపొచ్చు. రోహిత్, ధావన్ రాణింపుపైనే మన జట్టు ప్రదర్శన ఆధారపడి ఉంటుంది.

గప్టిల్, బౌల్ట్ లేకుండానే...

ఆతిథ్య జట్టు డాషింగ్ ఓపెనర్ గప్టిల్, ప్రధాన పేసర్ ట్రెంట్ బౌల్ట్ లేకుండానే ఆడనుంది. మున్రోతో పాటు కెప్టెన్ విలియమ్సన్ ఇన్నింగ్స్ ఆరంభిస్తాడు. వన్డేల్లో విఫలమైన విలియమ్సన్ రాణించాలని పట్టుదలతో ఉన్నాడు. మిడిలార్డర్ భారం మళ్లీ రాస్ టేలర్‌దే. నీషమ్, వికెట్ కీపర్ సీఫ్రెట్‌లతో అతడు బండి నడిపించాల్సి ఉంటుంది. సౌథీ, బ్రాస్‌వెల్‌తో పాటు స్కాట్ కుగ్లీన్ పేస్ బాధ్యతలు పంచుకుంటారు. ఇద్దరు స్పిన్నర్లు సాన్‌ట్నర్, సోధిలను ఆడించేందుకు కివీస్ మొగ్గు చూపుతోంది.

మధ్యాహ్నం12.30 నుంచి స్టార్ స్పోర్ట్స్-1లో ప్రత్యక్ష ప్రసారం

అమ్మాయిలు అదరగొడతారా?

నేడు న్యూజిలాండ్‌తో తొలి టి20

వెల్లింగ్టన్: వెటరన్ మిథాలీ రాజ్‌ను ఆడించక పోవడంతో పాటు ఓటమి కారణంగా చేదు జ్ఞాపకంగా మిగిలిన టి20 ప్రపంచ కప్ సెమీఫైనల్ తర్వాత... భారత మహిళల క్రికెట్ జట్టు తొలిసారిగా పొట్టి ఫార్మాట్ బరిలో దిగుతోంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా డాషింగ్ బ్యాటర్ హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలో న్యూజిలాండ్‌తో బుధవారం ఇక్కడ తొలి టి20 ఆడనుంది. ఇదే వేదికపై మహిళల మ్యాచ్ అనంతరం భారత్, న్యూజిలాండ్ పురుషుల టి20 మ్యాచ్‌ను నిర్వహిస్తారు. కివీస్‌తో మ్యాచ్‌లో మిథాలీ రాజ్‌ను ఈసారి ఏ స్థానంలో దింపుతారనేది ఆసక్తికరం కానుంది. ఈ హైదరాబాదీ వెటరన్ బ్యాటర్ మిథాలీ రాజ్ త్వరలో అంతర్జాతీయ టి20లకు వీడ్కోలు చెప్పనున్నట్లు తెలుస్తోంది. వచ్చే నెలలో స్వదేశంలో ఇంగ్లండ్‌తో జరుగనున్న టి20 సిరీస్ ఇందుకు వేదిక కానున్నట్లు సమాచారం. ఈ విషయాన్ని బీసీసీఐ అధికారి ఒకరు తెలిపారు. మరోవైపు ప్రస్తుత న్యూజిలాండ్ సిరీస్‌లో మిథాలీని పూర్తిగా ఆడిస్తే... ఆ వెంటనే ఆమె టి20లకు రిటైర్మెంట్ ప్రకటిస్తుందని భావిస్తున్నారు.


స్మృతి

ఉదయం 8.30 నుంచి స్టార్ స్పోర్ట్స్-1లో ప్రత్యక్ష ప్రసారం

యు ముంబాపై కాలికట్ హీరోస్ గెలుపు

కొచ్చి: ప్రొ వాలీబాల్ లీగ్‌లో కాలికట్ హీరోస్ వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. మంగళవారం హోరాహోరీగా జరిగిన పోరులో కాలికట్ జట్టు 15–10, 12–15, 15–13, 14–15, 15–9తో యు ముంబాపై గెలిచింది. హీరోస్ తరఫున అజిత్ లాల్ అద్భుత ప్రదర్శన కనబరిచాడు. 15 స్పైక్ పాయింట్లు, ఒక బ్లాక్‌తో కలిపి 16 పాయింట్లు చేశాడు. ఇతనితో పాటు జెరోమ్ వినిత్ 14 పాయింట్లు (10 స్పైక్, 1 బ్లాక్, 3 సర్వీస్), పాల్ లాట్మన్ 10 పాయింట్లు (7 స్పైక్, 2 బ్లాక్, 1 సర్వీస్) రాణించారు. ముంబై తరఫున కెప్టెన్ దీపేశ్ కుమార్ సిన్హా 11 పాయింట్లు (7 స్పైక్, 3 బ్లాక్, 1 సర్వీస్)తో ఆకట్టుకున్నాడు. శుభమ్ చౌదరి, టామిస్లావ్ కాస్కొవిచ్ చెరో 9 పాయింట్లు చేశారు. బుధవారం జరిగే పోరులో కొచ్చి బ్లూ స్పైకర్స్‌తో అహ్మదాబాద్ డిఫెండర్స్ తలపడుతుంది.

ప్రపంచ కప్‌కు స్మిత్ అనుమానమే!

గాయం నుంచి కోలుకోని ఆసీస్ స్టార్

సిడ్నీ: బాల్ ట్యాంపరింగ్ కారణంగా స్టీవ్ స్మిత్, డేవిడ్ వార్నర్‌లపై విధించిన నిషేధం మార్చి 29న ముగుస్తుంది. జట్టులోకి వీరిద్దరి పునరాగమనంపై ఎంతో మంది ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. టెస్టు కెప్టెన్ టిమ్ పైన్ ఇప్పటికే ఎన్నోసార్లు బహిరంగంగా వారు రావాల్సిన అవసరం గురించి పదే పదే చెబుతున్నాడు. వన్డే వరల్డ్ కప్‌లో కూడా వారిద్దరు ఆడతారని అంచనాలు ఉన్నాయి. అయితే స్మిత్ విషయంలో ఇది నిజమయ్యే పరిస్థితి కనిపించడం లేదు. చాలా కాలంగా మోచేతి గాయంతో బాధపడుతున్న స్మిత్ చికిత్స పొందుతున్నాడు. అతను కూడా వరల్డ్ కప్ కోసం తొందరపడకుండా ఎక్కువ సమయం పట్టినా సరే పూర్తి స్థాయిలో కోలుకునే వరకు ఆగాలనే ఆలోచనతో ఉన్నాడు. పైగా ఫస్ట్ క్లాస్ క్రికెట్‌పై కూడా నిషేధం ఉండటంతో చాలా కాలంగా మ్యాచ్ ప్రాక్టీస్‌కు దూరమైన స్మిత్ నేరుగా వరల్డ్ కప్ ఆడటం కష్టమే. అదే సమయంలో అతను ఇంగ్లండ్ కౌంటీల్లో గానీ, ఆసీస్ ‘ఎ’ తరఫున గానీ ఆడాలని భావిస్తున్నాడు. మరో వైపు వార్నర్ పరిస్థితి కొంత మెరుగ్గా ఉంది. మోచేతి గాయంనుంచి కోలుకున్న అతను యూఏఈలో పాక్‌తో జరిగే సిరీస్‌కు ఎంపికయ్యే అవకాశాలు ఉన్నాయి. అందులో చివరి రెండు మ్యాచ్‌లు నిషేధం ముగిసిన తేదీ తర్వాత జరుగుతాయి కాబట్టి వార్నర్‌కు మ్యాచ్ ప్రాక్టీస్ దక్కవచ్చు.



సాకేత్–అర్జున్ జంట ఓటమి

చెన్నై: ఏటీపీ చాలెంజర్ టెన్నిస్ టోర్నమెంట్ చెన్నై ఓపెన్‌లో రెండో రోజు భారత ఆటగాళ్లకు మిశ్రమ ఫలితాలు లభించాయి. పురుషుల డబుల్స్‌లో సాకేత్ మైనేని–అర్జున్ ఖడే... అనిరుధ్ చంద్రశేఖర్–అభినవ్ జోడీలు తొలి రౌండ్‌లోనే నిష్క్రమించాయి. మూడో సీడ్ సాకేత్–అర్జున్ ద్వయం 6–7 (4/7), 3–6తో గియాన్లుకా మాగెర్–ఆండ్రీ పెల్లెగ్రిని (ఇటలీ) జోడీ చేతిలో ఓడిపోయింది. 77 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో భారత జంట ఐదు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తమ సర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయింది. మరో మ్యాచ్‌లో అనిరుధ్–అభినవ్ జంట 7–6 (7/5), 2–6, 5–10తో సిద్ధార్థ్ రావత్–మనీశ్ (భారత్) ద్వయం చేతిలో పరాజయం పాలైంది. పురుషుల సింగిల్స్ రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో శశికుమార్ ముకుంద్ (భారత్) 6–3, 6–1తో సెబాస్టియన్ ఫాన్సెలు (జర్మనీ)పై గెలుపొందగా... సుమీత్ నాగల్ (భారత్) 3–6, 4–6తో డకీ లీ (కొరియా) చేతిలో ఓడిపోయాడు.


సాకేత్

హోరాహోరీగా రంజీ ఫైనల్

తొలి ఇన్నింగ్స్‌లో సౌరాష్ట్రపై విదర్భకు 5 పరుగుల స్వల్ప ఆధిక్యం

నాగపూర్: దేశవాళీ ప్రతిష్ఠాత్మక టోర్నీ రంజీ ట్రోఫీ తుది సమరం ఆసక్తికరంగా సాగుతోంది. మ్యాచ్ మూడో రోజు మంగళవారం విదర్భకు దీటుగా సమాధానమిచ్చిన సౌరాష్ట్ర చివర్లో తడబడింది. ఫలితంగా తొలి ఇన్నింగ్స్‌లో విదర్భకు 5 పరుగుల స్వల్ప ఆధిక్యం లభించింది. ఓవర్‌నైట్ స్కోరు 158/5తో ఆట కొనసాగించిన సౌరాష్ట్ర తమ తొలి ఇన్నింగ్స్‌లో 307 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ స్నెల్ పటేల్ (209 బంతుల్లో 102; 15 ఫోర్లు) సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అయితే జట్టు లోయర్ ఆర్డర్ పట్టుదలగా ఆడటంతో సౌరాష్ట్ర తొలి ఇన్నింగ్స్ ఆధిక్యానికి చేరువగా రాగలిగింది. 7 నుంచి 11వ బ్యాట్స్‌మెన్ వరకు చెప్పుకోదగ్గ పరుగులు చేశారు. కెప్టెన్ జైదేవ్ ఉనాద్కట్ (101 బంతుల్లో 46; 4 ఫోర్లు)తో పాటు ప్రేరక్ మన్కడ్ (62 బంతుల్లో 21; 2 ఫోర్లు), కమలేశ్ మక్వానా (61 బంతుల్లో 27; 3 ఫోర్లు), ధర్మేంద్ర జడేజా (32 బంతుల్లో 23; 2 ఫోర్లు, సిక్స్), చేతన్ సకరియా (82 బంతుల్లో 28 నాటౌట్; 4 ఫోర్లు) రాణించారు. వీరందరూ కలిసి 145 పరుగులు చేయడం విశేషం. ముఖ్యంగా పదునైన బౌలింగ్‌తో ఉమేశ్ యాదవ్... ప్రధాన బ్యాట్స్‌మన్ స్నెల్ పటేల్‌ను ఔట్ చేసిన తర్వాత సౌరాష్ట్ర చివరి మూడు వికెట్లకు 123 పరుగులు జోడించగలిగింది. ఆఖరి వికెట్‌కు ఉనాద్కట్, మక్వానా 60 పరుగులు జత చేశారు. విదర్భ స్పిన్నర్లు ఆదిత్య సర్వతే (5/98), అక్షయ్ వాఖరే (4/80) జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం దక్కడంతో కీలక పాత్ర పోషించారు.


స్నెల్ పటేల్


ఆదిత్య సర్వతే

అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో విదర్భ 2 వికెట్ల నష్టానికి 55 పరుగులు చేసింది. రామస్వామి సంజయ్ (16), ఫైజ్ ఫజల్ (10) ఔట్ కాగా... గణేశ్ సతీశ్ (24 బ్యాటింగ్), వసీం జాఫర్ (5 బ్యాటింగ్) క్రీజ్‌లో ఉన్నారు. లెఫ్టార్మ్ స్పిన్నర్ ధర్మేంద్ర జడేజాకే ఈ 2 వికెట్లు దక్కాయి. పిచ్‌పై పగుళ్లు ఏర్పడి అనూహ్యంగా స్పందిస్తున్న స్థితిలో నాలుగో రోజు ధర్మేంద్ర జడేజా బౌలింగ్ కీలకం కానుంది. ప్రస్తుతం 60 పరుగుల ఆధిక్యంలో ఉన్న విదర్భ గట్టిగా నిలబడి ప్రత్యర్థికి ఎంత లక్ష్యం నిర్దేశిస్తుందో చూడాలి. మరోవైపు క్వార్టర్ ఫైనల్లో యూపీపై 372 పరుగులు, సెమీస్‌లో కర్ణాటకపై 279 పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన సౌరాష్ట్ర...మరోసారి నాలుగో ఇన్నింగ్స్‌లో బాగా ఆడగలమనే ఆత్మవిశ్వాసంతో కనిపిస్తోంది.

ఉదయం గం. 9.30 నుంచి స్టార్ స్పోర్ట్స్-2లో ప్రత్యక్ష ప్రసారం

సర్ఫరాజ్‌కే నాయకత్వ పగ్గాలు

వరల్డ్ కప్‌కు కెప్టెన్‌గా ప్రకటించిన పీసీబీ



కరాచీ: పాకిస్తాన్ జట్టుకు తొలిసారి చాంపియన్స్ ట్రోఫీని అందించిన సర్ఫరాజ్ అహ్మద్ నాయకత్వంపై పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) నమ్మకముంచింది. ఈ ఏడాది ఇంగ్లండ్‌లో జరిగే వన్డే వరల్డ్ కప్‌లో పాల్గొనే పాక్ జట్టుకు సర్ఫరాజ్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడని పీసీబీ చైర్మన్ ఎహ్‌సాన్ మణి మంగళవారం ప్రకటించారు. 2017లో ఇంగ్లండ్ గడ్డపైనే పాక్ చాంపియన్స్ ట్రోఫీ గెలిచింది. ఇటీవల దక్షిణాఫ్రికాతో మ్యాచ్ సందర్భంగా వర్ణ వివక్ష వ్యాఖ్యలు చేసి నాలుగు మ్యాచ్‌ల సస్పెన్షన్‌కు గురైన సర్ఫరాజ్ స్వదేశం తిరిగొచ్చాడు. అతని స్థానంలో షోయబ్ మాలిక్ కెప్టెన్‌గా వ్యవహరించాడు. వరల్డ్ కప్‌కు కూడా మాలిక్‌కే అవకాశం దక్కుతుందని వార్తలొచ్చాయి. అయితే తాజా ప్రకటనతో దానికి ముగింపు లభించింది. సర్ఫరాజ్ కెప్టెన్సీలో 35 వన్డేలు ఆడిన పాకిస్తాన్ జట్టు 21 మ్యాచ్‌లు గెలిచి, 13 మ్యాచ్‌ల్లో ఓడింది.

చండిమాల్‌పై వేటు

కొలంబో: ఆస్ట్రేలియాతో ఇటీవల జరిగిన టెస్టు సిరీస్ వరకు శ్రీలంక కెప్టెన్‌గా వ్యవహరించిన దినేశ్ చండిమాల్‌కు తర్వాతి సిరీస్‌కు జట్టులోనే చోటు లభించలేదు. దక్షిణాఫ్రికా గడ్డపై జరిగే రెండు టెస్టుల సిరీస్‌లో పాల్గొనే లంక జట్టులో చండిమాల్‌ను సెలక్షన్ కమిటీ ఎంపిక చేయలేదు. ఈ సిరీస్‌కు దిముత్ కరుణరత్నే కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. 0–2తో లంక ఓడిన సిరీస్‌లో చండిమాల్ వరుసగా 5, 0, 15, 4 స్కోర్లు చేశాడు. దాంతో దేశవాళీ క్రికెట్ ఆడి ఫామ్‌లోకి రావాలని అతనికి సెలక్టర్లు తేల్చి చెప్పారు. మరోవైపు సఫారీ పర్యటనకు నలుగురు కొత్త ఆటగాళ్లకు చోటిచ్చారు. బ్యాట్స్‌మెన్‌లు ఏంజెలో పెరీరా, ఒషాడా ఫెర్నాండోలతో పాటు లెఫ్టార్మ్ స్పిన్నర్ లసిత్ ఎంబుల్‌డెనియా, పేస్ బౌలర్ మొహమ్మద్ షిరాజ్‌లకు తొలిసారి అవకాశం లభించింది. ఈ సిరీస్‌లో భాగంగా ఫిబ్రవరి 13 నుంచి డర్బన్‌లో తొలి టెస్టు జరుగుతుంది.



పార్లమెంట్ ఎన్నికలను విజయవంతంగా నిర్వహిస్తాం

- ఆరు రాష్ట్రాల సమీక్షా సమావేశంలో ఏపీ డీజీపీ ఆర్పీ ఠాకూర్
- సరిహద్దుల్లో మావోలను సమర్థంగా ఎదుర్కొంటాం
- మద్యం అక్రమ రవాణాపై దృష్టి




సమావేశంలో మాట్లాడుతున్న డీజీపీ ఠాకూర్

తిరుపతి క్రైం : దక్షిణ భారతదేశంలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికలను సమన్వయంతో విజయవంతంగా నిర్వహిస్తామని ఏపీ డీజీపీ ఆర్పీ ఠాకూర్ చెప్పారు. తిరుపతిలోని మానస్‌సరోవర్ హోటల్లో మంగళవారం ఆయనతో పాటు.. తమిళనాడు డీజీపీ టీకే రాజేంద్రన్, కర్ణాటక డీజీపీ నీలమణిరాజు, తెలంగాణ హోం సెక్రటరీ రాజుత్రివేది, ఏపీ హోం సెక్రటరీ ఏఆర్ అనురాధ, ఐబీ జాయింట్ డైరెక్టర్ ఆర్యచంద్రశేఖర్, ఒడిశా, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాల పోలీసు ఉన్నతాధికారులు సమావేశమయ్యారు. త్వరలో రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఆరు రాష్ట్రాల్లో భద్రతా చర్యలు, మావోయిస్టులు, మద్యం అక్రమ రవాణాను అడ్డుకోవడం వంటి ప్రధాన సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఏపీ డీజీపీ విలేకరులతో మాట్లాడారు. ప్రతి రాష్ట్రం తన పక్కన ఉన్న రాష్ట్రాల పోలీసులను సమన్వయం చేసుకుని మావోయిస్టులను అదుపుచేసుకోవాలన్న చర్యలపై చర్చించినట్లు చెప్పారు. తెలంగాణ, కర్ణాటక, ఆంధ్ర, ఒడిశా రాష్ట్రాల సరిహద్దుల మార్గాల్లో అక్రమ మద్యం, ఎర్రచందనం రవాణాపై దృష్టిసారించినట్లు తెలిపారు. మావోల కదలికలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు పంచుకునేందుకు సమావేశం దోహదపడుతుందన్నారు.

నాటుసారా అక్రమ రవాణా నియంత్రణపై చర్చ

తమిళనాడు డీజీపీ మాట్లాడుతూ ఏపీ, తమిళనాడు రాష్ట్రాల మధ్య జరుగుతున్న నాటుసారా అక్రమ రవాణాను ఎన్నికల నాటికి పూర్తిగా నియంత్రించడంపై చర్చించినట్లు చెప్పారు. కర్ణాటక డీజీపీ మాట్లాడుతూ అంతర్‌రాష్ట్ర నేరస్తులు, నేరాలపై చర్చించినట్లు వివరించారు. ఈ సమావేశంలో ఏపీ ఆపరేషన్ ఏడీజీ నళిన్‌ప్రభాత్, తెలంగాణ ఏడీజీ ఎల్ అండ్ వో జితేందర్, హైదరాబాద్ వెస్ట్‌జోన్ ఐజీ ఎం.స్టీఫెన్‌రవీంద్ర, హైదరాబాద్ సౌత్‌జోన్ సీఆర్‌పీఎఫ్ ఐజీ ఎస్‌కే మహంతి, ఏపీ డీఐజీలు శ్రీనివాస్, క్రాంతిరాణాటాటా, తిరుపతి ఎస్పీ అన్బురాజన్, చిత్తూరు ఎస్పీ విక్రాంత్‌పటేల్‌తో పాటు ఆయా రాష్ట్రాల పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

దక్షిణ మధ్య రైల్వే జీఎంగా గజానన్ మాల్యా



సాక్షి, హైదరాబాద్: దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌గా గజానన్ మాల్యా మంగళవారం బాధ్యతలు చేపట్టారు. రైల్వే రంగంలో వివిధ హోదాల్లో ఆయన కీలకమైన విధులు నిర్వర్తించారు. ఇండియన్ రైల్వే సర్వీస్‌లో మెకానికల్ ఇంజనీర్స్ పూర్తి చేసిన గజానన్ 1979 స్పెషల్ క్లాస్ రైల్వే అప్రంటీస్ బ్యాచ్ అధికారి. ఈ క్రమంలోనే ఆయన జబల్పూర్‌లోని ఇండియన్ రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెకానికల్ అండ్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ సంస్థకు డైరెక్టర్‌గా పని చేశారు. అనంతరం దక్షిణమధ్య రైల్వేలో సీనియర్ డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా పని చేశారు. రాంచీ డివిజనల్ రైల్వే మేనేజర్, ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ చీఫ్ ప్రాజెక్టు మేనేజర్, రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనమిక్ సర్వీస్‌లో సీనియర్ ప్రొఫెసర్, సదరన్ రైల్వేలో చీఫ్ మెకానికల్ ఇంజనీర్‌గా విధులు నిర్వర్తించారు.

యువ రైతు ఆత్మహత్య

నెల్లిపాక (రంపచోడవరం): అప్పుల బాధతో ఓ యువ రైతు పురుగు మందు తాగి తనువు చాలించిన విషాద ఘటన మంగళవారం తూర్పు గోదావరి జిల్లా ఎటపాక మండలం నెల్లిపాకలో జరిగింది. మానికల రాజా (32) మూడెకరాల భూమిని కౌలుకు తీసుకుని మిర్చి సాగు చేశాడు. రూ.3 లక్షల వరకు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టాడు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా మిర్చి తోట ఆశించిన స్థాయిలో లేకపోవటంతో గత కొద్ది రోజుల నుంచి తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. భార్య రాజ్యలక్ష్మి మంగళవారం పొలంలో ఉన్న సమయంలో ఇంటికి వచ్చి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

మమ్మల్ని ఏపీకి తీసుకురండి

తెలంగాణలో పనిచేస్తున్న రాష్ట్ర ఉపాధ్యాయుల వినతి

సాక్షి, అమరావతిబ్యూరో: రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణలో పని చేయాలంటే ఇబ్బందిగా ఉందని, వెంటనే తమను స్వరాష్ట్రానికి తీసుకురావాలంటూ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయులు కోరుతున్నారు. విజయవాడ ధర్నా చౌక్‌లో మంగళవారం నాన్ లోకల్ టీచర్స్ ఆఫ్ తెలంగాణ (ఎన్ఎల్‌టీఏ) సంఘం న్యాయ పోరాట దీక్ష చేపట్టింది. 5 రోజుల పాటు జరగనున్న ఈ రిలే నిరాహార దీక్షల్లో దాదాపు 200 మంది తెలంగాణలో పనిచేస్తున్న ఆంధ్ర స్థానికత కలిగిన టీచర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్ఎల్‌టీఏ అధ్యక్షుడు ఎం.మోహన్‌రావు మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో డీఎస్సీ ద్వారా స్థానికేతర కోటాలో తాము తెలంగాణలో ఉపాధ్యాయ పోస్టులు సాధించామన్నారు. అయితే తమను ఏపీకి బదిలీ చేయాలంటూ నాలుగేళ్లుగా వివిధ రూపాల్లో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంతో 84 మందికి పరస్పర, దంపతుల బదిలీల కింద అవకాశం లభించిందన్నారు. ఇంకా 350 మంది ఏపీ ఉపాధ్యాయులు బదిలీల కోసం ఎదురుచుస్తున్నారని తెలిపారు. దీనిపై వెంటనే ప్రభుత్వం స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. దీక్షకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు, ఉత్తరాంధ్ర ప్రజా వేదిక, ఏపీటీఎఫ్ సంఘాలు మద్దతు తెలిపాయి.



విజయవాడ ధర్నాచౌక్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న ఏపీ స్థానికత కలిగిన తెలంగాణ ఉపాధ్యాయులు

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director, on behalf of Jagati Publications Limited, Published at Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP), and D. No. 5- 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503. Editor: V. Murali, Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23794.

శరణ్య రోదన

ఇంటికి వెళ్లాలని ఉంది

టీనేజీ యువత పట్ల తల్లిదండ్రులు తగిన శ్రద్ధ కనబరచనట్లయితే లియోనారా లాగే మరికొంత మంది ఐఎస్ కబంధ హస్తాల్లో చిక్కుకోవాల్సి ఉంటుందని ఈ ఘటన హెచ్చరిస్తోంది. 'ఐఎస్' ఎక్కడో ఉంటుందని అనుకోకండి. ప్రేమ రూపంలోనో, డబ్బు ఆశ చూపిస్తూనో అది మన వీధిలోనే మన పిల్లల కోసం వల పట్టుకుని తిరుగుతుండవచ్చు.

ఇప్పుడు తెలుస్తోంది..
అవును ఇప్పుడే తెలుస్తోంది..
నేను పెద్ద తప్పు చేశాను...
ఆ తప్పు దిద్దుకునే మార్గం కోసం
రోజూ వెదుకుతూనే ఉన్నాను..
ఇంటికి వెళ్లాలని ఉంది..
పూర్వపు జీవితం గడపాలని ఉంది..

ఉగ్రవాద సంస్థ ఇస్లామిక్ స్టేట్ (ఐఎస్) లో భాగమైన ఓ జర్మన్ యువతి ఆవేదన ఇది. ఉగ్రవాదికి మూడో భార్యగా ఉంటూ 19 ఏళ్లకే ఇద్దరు పిల్లలకు తల్లిగా మారినందుకు తీరని వేదన అనుభవిస్తున్న ఆమె.. విముక్తి లభిస్తే స్వదేశానికి వెళ్తానంటూ పశ్చాత్తాపపడుతోంది.

ఇస్లాం స్వీకరించి.. సిరియాకు

లియోనారా జర్మనీకి చెందిన యువతి.



పదిహేనేళ్ల ప్రాయంలో ఇస్లాం మతం స్వీకరించింది. ఆ తర్వాత అప్పటికే ఇద్దరు భార్యలు కలిగి ఉన్న జర్మన్ జీహాదిస్టు మార్టిన్ లెమ్కే (28) అనే వ్యక్తిని పెళ్లి చేసుకుంది. అనంతరం అతడి కుటుంబంతో కలిసి సిరియాకు పారిపోయింది. అయితే... సిరియాను వశం చేసుకునేందుకు ఐఎస్ సాగిస్తున్న మారణకాండను కళ్లారా చూసేంతవరకు .. ఆ ఉగ్రమూక పట్ల ఆమెకు సానుభూతి వైఖరే ఉంది. కానీ ఎప్పుడైతే అంత ర్యుద్ధంలో తన కుటుంబం భాగస్వామ్యమైందో అప్పుడే తాను ఎంత పెద్ద తప్పు చేశానన్న విషయం లియోనారాకు బోధపడింది.

భర్త, ఇద్దరు సవతులతో కలిసి లియోనారా మొదట ఐఎస్ రాజధాని రాకాలో నివాసం ఉండేది. ఆ సమయంలో భర్త తనను కేవలం ఒక పని మనిషిగానే చూసేవాడు. వంట చేయడం, ఇంటిని శుభ్రంగా ఉంచడం, అందరికీ సపర్యలు చేయడం ఇదే ఆమె రోజు వారీ దినచర్య. అలా నాలుగేళ్లుగా గృహిణిగా తన వంతు బాధ్యతలు నిర్వర్తిస్తున్న లియోనారా.. ఇద్దరు పిల్లలకు తల్లయింది. తన ఇంట్లో తానే ఓ పనిమనిషిలా కాలం వెళ్లదీసింది.

వారానికో ఇంట్లో నివాసం

బహిరంగ శిరచ్ఛేదనలు, అత్యాచారాలతో సిరియా ప్రజలకు భీతికొల్పుతున్న ఐఎస్ నుంచి రాకాను స్వాధీనం చేసుకునేందుకు.. స్థానిక కుర్దిష్ వర్గాలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. సిరియాలో ప్రజాస్వామ్య పాలనే లక్ష్యంగా... ఐఎస్‌కు మద్దతుగా నిలుస్తున్న 'జీహాదీ' లను ఏరివేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయి. ఇందులో భాగంగా రాకాను స్వాధీనం చేసుకుని సగం విజయం సాధించాయి. ఈ క్రమంలో వేలాది మంది ఐఎస్ సానుభూతిపరుల కుటుంబాలకు నిలువ నీడ లేకుండా పోయింది. ఇదే అదనుగా దొరికిన వాళ్లను దొరికినట్టుగా అదుపులోకి తీసుకున్న సిరియన్ డెమొక్రటిక్ ఫోర్సెస్ (ఎస్‌డీఎఫ్) వారిని క్యాంపులకు తరలించడం మొదలుపెట్టాయి. మరోవైపు తమదేశంలో ఉన్న విదేశీ జీహాదీలను ఈ క్యాంపు నుంచి తిరిగి స్వదేశానికి తీసుకువెళ్లాలంటూ పశ్చిమ దేశాలకు విజ్ఞప్తి చేస్తున్నాయి.

ఈ క్రమంలో ఎస్‌డీఎఫ్ నుంచి తప్పించుకునేందుకు లియోనారా కుటుంబం వారానికో ఇంట్లో తలదాచుకునేది. అయితే ఆ సమయంలో ఐఎస్ వీరి గురించి పట్టించుకునేది కాదు. ఐఎస్ గురించి పూర్తిగా తెలిసిన తర్వాత వారి కంటే కుర్దిష్‌దళాలే నయమని భావించి లియోనారా.. భర్త, ఇద్దరుపిల్లలు, భర్త రెండోభార్యతో కలిసి ఎస్‌డీఎఫ్ క్యాంపునకు బయల్దేరింది. ఇందులో భాగంగా వారు ఇరాక్ సరిహద్దులోని బాగోజ్ గ్రామానికి చేరుకున్నారు. అయితే తూర్పు సిరియాలో గస్తీ కాస్తున్న అమెరికా మద్దతు దేశాల బలగాలు లియోనారా భర్త మార్టిన్‌ను గత గురువారం అదుపులోకి తీసుకున్నాయి.

నా భర్త ఉగ్రవాది కాదు

'నా భర్త కంప్యూటర్లు రిపేర్ చేసేవాడు. అదే విధంగా కంప్యూటర్ విడిభాగాలు, ఫోన్లు ఐఎస్‌కు సరఫరా చేసేవాడని మాత్రమే నాకు తెలుసు. 'రాకా'ను కోల్పోయిన ఐఎస్ మమ్మల్ని పూర్తిగా వదిలించుకోవాలని చూసింది. తినడానికి తిండి ఉండేది కాదు. పిల్లలు ఆకలితో అలమటిస్తుంటే అలా చూస్తూ ఉండటం తప్ప నేను చేయగలిగింది ఏమీ లేదు. టీనేజ్‌లో నేను చేసిన తప్పు నా పిల్లల పాలిట శాపంగా మారుతుందని ఊహించలేకపోయాను. ఇప్పుడు నా సొంత ఇంటికి వెళ్లాలని ఉంది' అంటూ లియోనారా తన పరిస్థితి గురించి అంతర్జాతీయ మీడియా ముందు మొరపెట్టుకుంటోంది.

అయితే లియోనారా భర్త ఐఎస్‌లో కీలక బాధ్యతలు నిర్వర్తించేవాడని, వేలాదిమంది ప్రాణాలు గాల్లో కలిసిపోవడానికి అతడే సూత్రధారి అని జర్మన్ మీడియా అంటోంది. ఏదేమైనప్పటికీ లియోనారా గనుక నిజంగా పశ్చాత్తాపడితే మాత్రం ఆమెను స్వదేశానికి తీసుకువచ్చి ఆశ్రయం కల్పించాల్సి ఉంటుందని మానవ హక్కుల కార్యకర్తలు అంటున్నారు.

- యాళ్ల సుష్మారెడ్డి, సాక్షి వెబ్

బ్లాక్ డే



విదేశీ యువతి, మురికి నీళ్లలో ప్రతిబింబిస్తున్న ఇండియా గేట్ (ప్రతీకాత్మక చిత్రాలు)

రాజధానికి మకిలీ తగలకూడదు. దేశానికి కిరీటం లాంటి రాజధాని తలవంచుకోకూడదు. ప్రపంచానికి భారతదేశం అంటే ఉన్న గౌరవం వల్ల సింగిల్ ఉమన్ టూరిస్టులు కూడా వస్తారు. అంతే గౌరవంగా తిరిగి వెళ్లాల్సిన ఒక విదేశీ మహిళ.. మళ్లీ ఇండియా రాను అని ఎందుకు అంటోంది? మహిళ నిర్భీతిగా మసలలేని రోజు ఏదైనా.. అది 'బ్లాక్ డే'నే!

ఆ యువతికి మొదటిసారి అనుమానం వచ్చింది. తనేదైనా ట్రాప్‌లో చిక్కుకుపోతున్నానా అని భయానికి లోనైంది. అప్పటికే ఐదు గంటలుగా ఆమె తన ప్రమేయం లేకుండానే ఢిల్లీ ఆటోల్లో తిరుగుతోంది. బాగా అలసటగా ఉంది. చీకటిపడి చాలా సేపే అయింది.

ఇండియాను చూసేందుకు వచ్చిన ఒక విదేశీ యువతి, ఇరవై నాలుగ్గంటల్లోనే ఇండియాను వదిలి వెళ్లిపోయిందంటే కారణం ఏమై ఉంటుంది? 'స్టార్ట్ ఇమీడియట్‌లీ' అనే కాల్ ఆమెకు ఆమె కుటుంబ సభ్యుల నుంచి వచ్చి ఉండాలి. లేదంటే, 'ఇండియా నుంచి వెంటనే పారిపో' అనే సంకేతం ఆమె మనసుకు అంది ఉండాలి. గత ఏడాది డిసెంబర్ 6 సాయంత్రం నాలుగు గంటలకు ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో దిగిన ఒక బెల్జియం యువతి.. ఇరవై నాలుగ్గంటల్లోపే ఇండియా నుంచి తప్పించుకుని వెళ్లింది. బెల్జియం వెళ్లిన కొన్నాళ్లకు రాయబార కార్యాలయానికి వెళ్లింది. ఇండియాలో ఆ రోజు ఏం జరిగిందీ వెల్లడించింది. ఆ విషయాన్ని బెల్జియం.. భారత విదేశీ వ్యవహారాల శాఖ దృష్టికి తెచ్చింది. వెంటనే భారత ప్రభుత్వం 'హంట్' మొదలు పెట్టింది. ఇండియాలో ఆ రోజు ఫ్లయిట్ దిగగానే తనకు తారసపడిన వారు అడుగడుగునా తననెంత అయోమయంలో పడేసిందీ, తననెలా మోసం చేయాలని ప్రయత్నించిందీ, తనెంత మానసిక ఒత్తిడికి లోనైందీ వివరిస్తూ బెల్జియం యువతి చేసిన ఫిర్యాదుపై భారత ప్రభుత్వం ఇప్పుడు ఢిల్లీ పోలీసులను పరుగులు తీయిస్తోంది. ఆమెను ఇరవై నాలుగ్గంటల్లోపు పారిపోయేలా చేసి, దేశ ప్రతిష్టను దెబ్బతీసిన వారందరినీ ఇరవై నాలుగ్గంటల్లో పట్టుకోవాలని ఆదేశాలు వెళ్లాయి మరి. నిందితులను పట్టుకుంటే దేశం పరువు దక్కేదేం ఉండదు. కానీ నిందితులను పట్టుకోలేకపోతే మాత్రం అది ఇంకో పరువుపోయే విషయం అవుతుంది!

జరిగిందేమిటి?



ఆ సాయంత్రం ఢిల్లీలో దిగిన వెంటనే బెల్జియం యువతి ఒక సిమ్ కార్డు కొనుగోలు చేసింది. అక్కడే ఆటో ఎక్కి, న్యూఢిల్లీ రైల్వేస్టేషన్‌కు పోనివ్వమంది. మింటో రోడ్డుకు వెళ్లాలి తను. అయితే ఆటోవాలా ఆమె మింటో రోడ్డు వైపు కాకుండా ఇంకో రూట్‌లో తీసుకెళ్లి ఇద్దరు మగ మనుషుల ముందు ఆటో ఆపాడు. వాళ్లు ఆ యువతికి తమ పోలీస్ ఐడెంటిటీ కార్డులు చూపించారు. ''ఇటువైపు నిరసన ప్రదర్శనలు జరుగుతున్నాయి. అయినప్పటికీ ముందుకు వెళ్లాలంటే, మీరు టూరిస్టు పోలీసుల అనుమతి తీసుకోవాలి'' అని ఆమెకు ఒక అడ్రెస్ ఇచ్చారు, టూరిస్టు పోలీసులు ఆ అడ్రస్‌లో ఉంటారని! ఆటోవాలా అమెను ఆ అడ్రెస్‌కు తీసుకెళ్లాడు. అక్కడ మళ్లీ ఆరుగురు మగవాళ్లు ఉన్నారు. వాళ్లంతా పోలీస్ యూనిఫామ్‌లో ఉన్నారు. ''మీరు వెళ్లాలని అనుకుంటున్న వైపు వెళ్లడం అసంభవం. వెంటనే మీరు ఈ ప్రాంతాన్ని వదిలివెళితే మంచిది'' అని చెప్పారు. ఆమెకేవో హింసాత్మక నిరసన ప్రదర్శనల లైవ్ వీడియోలను కూడా చూపించారు. తర్వాత ఆమె మెడలోని ఆభరణాలను చూస్తూ, ''గోల్డేనా?'' అని అడిగారు. ఆమె బుక్‌చేసిన హోటల్ ఫోన్ నంబర్ అడిగి తీసుకుని, హోటల్‌కి ఫోన్ చేసి,''మీ రూమ్ బుకింగ్ క్యాన్సిల్ అయిందట! చెప్పాం కదా, పరిస్థితి బాగోలేదని'' అన్నారు. అక్కడే ఉన్న ఒక ఆటోను చూపించి, ''అందులో ఎక్కి సెంట్రల్ ఢిల్లీలోని ఫలానా ట్రావెల్స్‌కు వెళ్లండి'' అని సలహా ఇచ్చారు. మొదటి ఆటోవాలా పక్కకు తప్పుకున్నాక, రెండో ఆటోవాలా ఆమెను ఎక్కించుకుని ఎన్.డి.ఎం.సి.మార్కెట్ (న్యూఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్ మార్కెట్) ఏరియాలో ఉన్న ట్రావెల్ ఏజెన్సీ దగ్గర ఆపాడు. అక్కడ ఇద్దరు మనుషులు ఆమెను రిసీవ్ చేసుకున్నారు. ఒక వ్యక్తికి లైన్ కలిపి ఫోన్‌ని ఆమె చేతికి ఇచ్చారు. హోటల్ బుకింగ్ గురించి ఆ వ్యక్తికి తెలుస్తుందని చెప్పారు.

యువతికి మొదటిసారి అనుమానం వచ్చింది. తనేదైనా ట్రాప్‌లో చిక్కుకుపోతున్నానా అని భయానికి లోనైంది. అప్పటికే ఐదు గంటలుగా ఆమె తన ప్రమేయం లేకుండానే ఢిల్లీ ఆటోల్లో తిరుగుతోంది. అలసటగా ఉంది. చీకటి కూడా పడింది.

''నిజమే, మీ బుకింగ్ క్యాన్సిల్ అయింది. వీటిల్లో కొన్ని రూములు ఉన్నాయట'' అని ఆమెకు కొన్ని హోటళ్లు, రెంట్‌ల వివరాలు ఇచ్చారు. అవన్నీ ఖరీదైనవి. చివరికి విసుగెత్తి, రోజుకు నలభై డాలర్ల రెంట్ (సుమారు మూడు వేల రూపాయలు) ఉన్న హోటల్ గదిని బుక్ చేయమంది. చేశారు. అక్కడి నుంచి ఆటో ఆమెను ఆ హోటల్ ఉన్న ప్రాంతానికి తీసుకెళ్లింది. ఆమె గది థర్డ్ ఫ్లోర్‌లో ఉంది. కిటికీల్లేవు. ఇంటర్నెట్ లేదు! వెంటనే గది తలుపులు వేసుకుని లోపల లాక్ చేసుకుంది. ఈలోపు కొత్త సిమ్ కార్డ్ యాక్టివేట్ అయింది. రిషికేష్‌లో తెలిసినవాళ్లుంటే వాళ్లకు ఫోన్ చేసి, జరిగిందంతా చెప్పింది. రిషికేష్ నుంచి అక్కడి వాళ్లు, ఈ యువతి మొదట బుక్ చేసిన హోటల్‌కి ఫోన్ చేసి అడిగితే, ''క్యాన్సిల్ ఏమీ కాలేదే. ఆమె పేరు మీదే ఇప్పటికీ రూమ్ ఉంది'' అని చెప్పారు. అది తెలిసి యువతి నిశ్చేష్టురాలైంది. కొద్ది నిమిషాల్లోనే ఆ హోటల్ సిబ్బంది (మొదట ఆమె బుక్ చేసిన హోటల్) వచ్చి యువతిని సురక్షితంగా తమతో తీసుకెళ్లారు. తెల్లారి లేచీ లేవగానే రూమ్ ఖాళీ చేసి, అప్పటికి అందుబాటులో ఉన్న ఫ్లయిట్ ఎక్కి ఆ యువతి తన స్వదేశానికి వెళ్లిపోయింది.

ఈ వివరాలన్నీ బాధితురాలు తమ రాయబార కార్యాలయానికి ఇచ్చిన ఫిర్యాదులో పొందుపరిచింది. మళ్లీ ఇండియా వెళ్లేది లేదని అంటోంది. బెల్జియం ఆ ఫిర్యాదును ఇండియాకు ఫార్వర్డ్ చేసింది. ఆ యువతిని వేధించిన ఆగంతకుల మీద, ఆటో రిక్షాల డ్రైవర్ల మీద, ట్రావెల్ ఏజెన్సీ మీద, హోటల్ మీద, దొంగ పోలీసుల మీద భారత విదేశీ వ్యవహారాల శాఖ.. ఢిల్లీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుష్మా స్వరాజ్. మహిళలకు సంబంధించిన ఏ కేసైనా ఆమె దృష్టికి వెళితే త్వరగా పరిష్కారం అవుతుందని పేరు. మీరు ఈ వార్తా కథనాన్ని చదివే సమయానికి దాదాపు నిందితులంతా చట్టం చేతికి చిక్కినా ఆశ్చర్యం లేదు.

ఒక్కరే వెళ్తున్నారా?

ఒంటరిగా ప్రయాణిస్తున్నప్పుడు ముఖ్యంగా.. దేశం దాటాల్సి వస్తే తీసుకోవల్సిన కనీస జాగ్రత్తలు..

- ఒంటరిగా హోటల్‌లో గది బుక్ చేసుకునే కంటే ట్రావెలర్స్ హాస్టల్స్‌లో బస చేయడం మంచిది. ఇంటర్నెట్‌లో ఇలాంటి వివరాలు ఉంటాయి. చూసుకొని బుక్ చేసుకోవాలి.
- మీరు వెళ్లే ప్రాంతానికి సంబంధించిన పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ వివరాలనూ ఇంటర్నెట్ ద్వారా తెలుసుకోవాలి. ఒకవేళ హోటల్లో రూమ్ బుక్ చేసుకునుంటే పికపింగ్, డ్రాపింగ్ సౌకర్యం ఉందేమో తెలుసుకుని మీ ఫ్లయిట్ వివరాలు వాళ్లకు ఇచ్చి.. పికప్ చేసుకోవడానికి వెహికల్ పంపమని కోరాలి. ఆ సౌకర్యం లేకపోతే వెహికల్ అరేంజ్ చేయమని రిక్వెస్ట్ చేయాలి. ట్రావెల్స్ హాస్టల్స్‌లో బస ఏర్పాటు చేసుకున్నట్లయితే హాస్టల్‌లో ఉన్న వాళ్ల నంబర్ తీసుకొని పికప్ చేసుకోవడానికి వాళ్లను రమ్మని కోరవచ్చు.
- ఏ ప్రాంతానికి వెళ్తున్నారో ఆ ప్రాంతానికి తగ్గట్టే డ్రెస్ వేసుకోవడం మంచిది.
- కాలక్షేపానికి తిరుగుతున్నట్టు కనపడకండి.
- మీరు ఆ ప్రాంతానికి కొత్తవారని పసిగట్టి స్థానికులు మీ గురించి ఆరా తీస్తే ఏమీ చెప్పకూడదు. అంటే మీ ఒంటరి ప్రయాణం, బస చేస్తున్న ప్రదేశాల వివరాలు వగైరా బయటపెట్టవద్దు.
- స్థానిక హెల్ప్‌లైన్స్ నంబర్లను దగ్గర పెట్టుకోవాలి.



- అరటిపండులో చక్కెర... సుక్రోజ్, ఫ్రక్టోజ్, గ్లూకోజ్ వంటివి సహజరూపంలో ఉంటాయి. పీచు పదార్థాలు కూడా సమృద్ధిగా ఉంటాయి. రెండు అరటిపండ్లు తింటే 90 నిమిషాల సేపు పని చేయవచ్చని పరిశోధనల్లో రుజువైంది. అందుకే క్రీడాకారులు ఎక్కువగా అరటిపండు తీసుకుంటారు. అనారోగ్యం నుంచి త్వరగా కోలుకోవడానికి అరటిపండు మంచి ఆహారం. కాబట్టి ప్రతి రోజూ అరటిపండు తింటే శక్తితో పాటు జీర్ణవ్యవస్థ పని తీరు మెరుగవుతుంది.
- ప్రీ మెన్‌స్ట్రువల్ సిండ్రోమ్ (పిఎంఎస్) సమస్య ఉన్న వాళ్లు పీరియడ్స్‌కు కనీసం వారం ముందు నుంచి ప్రతి రోజూ అరటిపండు తింటుంటే ఆ సమయంలో ఆందోళన, ఉద్వేగం వంటి లక్షణాలు అదుపులో ఉంటాయి.
- ఇందులో ఐరన్ సమృద్ధిగా ఉంటుంది. ఎనీమియాను అరికడుతుంది. బ్లడ్‌ప్రెజర్‌ను అదుపులో ఉంచుతుంది. గుండెపోటును నివారించడంలో బాగా పని చేస్తుంది.

బిగ్ ఫైట్

లెక్కలు నేర్చుకుని.. రెక్కలు కట్టుకుని..!

ఊరు కాని ఊరు.. చివరిదాకా తోడుగా నిలుస్తానని బాస చేసి పెళ్లి చేసుకున్న భర్త నలుగురు పిల్లలు పుట్టాక వారి మానాన వారిని వదిలేసి చెప్పాపెట్టకుండా వెళ్లిపోయాడు. చేతిలో చిల్లిగవ్వ లేదు.. పొట్ట పొడిస్తే అక్షరం ముక్క రాదు. అయినప్పటికీ మొక్కవోని పట్టుదలతో కష్టాల కడలిని ధైర్యంగా ఈదుతూ ముందుకు సాగుతోందామె. ఎటూ దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్న ఆమె రెక్కలు ముక్కలు చేసుకునేలా కష్టపడుతున్నప్పటికీ బ్యాంకర్లు రుణమిచ్చి చేయూతనిచ్చేందుకు నిరాకరించగా, మరోవైపు స్వయం సహాయక పొదుపు గ్రూపుల్లోనూ ఆమెను చేర్చుకోలేదు. అయినప్పటికీ అన్ని బాధలను అధిగమిస్తూ ముందుకు సాగుతోంది 'సవిడిబోయిన వెంకాయమ్మ'.



గ్రామాల్లో వస్త్రాలు అమ్ముతూ...



ఇద్దరు కుమారులతో వెంకటాయమ్మ



సైకిల్‌పై బట్టల మూటలతో గ్రామాలకు తిరుగుతున్న వెంకాయమ్మ

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం సీతానగరం గ్రామానికి చెందిన వెంకాయమ్మ ఎవరిపై ఆధారపడకుండా గత 16 ఏళ్లుగా చుట్టుపక్కల గ్రామాల్లో ప్రతిరోజూ సుమారు 30 కిలోమీటర్లు సైకిల్‌పై తిరుగుతూ వస్త్రాలు అమ్ముకుంటూ పలువురికి ఆదర్శంగా నిలుస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా వినుకొండకు చెందిన వెంకాయమ్మ 27 సంవత్సరాల క్రితం పెళ్లి అయిన 16 రోజులకే భర్త వెంకటేశ్వరరావుతో కలిసి సీతానగరం వచ్చింది. వెంకటేశ్వరరావు ఊరూరూ తిరిగి స్టీలుగిన్నెలు అమ్మే వ్యాపారం చేసేవాడు. ఇక్కడే వీరికి ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు పుట్టారు. అయితే 16 సంవత్సరాల క్రితం భర్త వెంకటేశ్వరరావు వెంకాయమ్మను, నలుగురు పిల్లలను వదిలేసి వెళ్లిపోయాడు. దీంతో ఒక్కసారిగా వెంకాయమ్మపై కోలుకోలేని భారం పడింది. నిరక్షరాస్యురాలైన వెంకాయమ్మకు తూకాలు, కొలతలు సరిగా తెలియక పోవడంతో భర్త చేసిన స్టీలు గిన్నెలు అమ్మే వ్యాపారం జోలికి పోకుండా వస్త్రాలు అమ్ముకునే పని మొదలుపెట్టింది. అలా మూడేళ్ల పాటు వస్త్రాల మూటలు నెత్తిన పెట్టుకుని చుట్టుపక్కల ఊర్లలో తిరిగి అమ్ముకునేది. దీంతో మాడు నొప్పి విపరీతంగా బాధించేది. ఇలా లాభం లేదని కష్టపడి సైకిల్ తొక్కడం నేర్చుకుంది. ఈ క్రమంలో అనేక దెబ్బలు తగిలినా పిల్లల కోసం అన్నింటినీ మౌనంగా భరించి సైకిల్‌పై తిరుగుతూ వస్త్రాలు అమ్మడం ప్రారంభించింది. రాత్రి బడికి వెళ్లి అక్షరాలు, అంకెలు నేర్చుకుంది వెంకాయమ్మ. 43 ఏళ్ల వయస్సులోనూ ఇప్పటికీ ఎండా, వాన, చలిని లెక్కచేయకుండా సైకిల్‌పై రోజూ 30 కిలోమీటర్లకు పైగా తిరుగుతూ జీవనపోరాటం చేస్తోంది. గ్రామాల్లో కూలీలు పనులకు వెళ్లకముందే వెళ్లి వస్త్రాలు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఉండడంతో తెల్లవారుజామునే సైకిల్ మీద బయటకు వెళ్లి చుట్టుపక్కల 10 నుంచి 15 ఊర్లు తిరిగి మధ్యాహ్నం 2 గంటలకు ఇంటికి తిరిగి వస్తుంది. మధ్యలో వరికోతలు, కలుపులు, ఇతర వ్యవసాయ కూలీ పనులకు సైతం వెళ్లేది. పైగా ఆడపిల్లలనే తేడా లేకుండా కుమార్తెలిద్దరి చదువులకే ఎక్కువ ప్రాధాన్యతనిచ్చింది వెంకాయమ్మ.

పిల్లలు ప్రయోజకులయ్యారు

పెద్దకుమార్తె నాగలక్ష్మిని బీఎస్సీ నర్సింగ్ చదివించింది. నాగలక్ష్మి ఇప్పుడు హైదరాబాద్‌లోని ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీలో ఉద్యోగం చేస్తోంది. రెండో కుమార్తె శ్రీలతను ఈసీఈ విభాగంలో డిప్లొమా చదివించింది. శ్రీలత ప్రస్తుతం హైదరాబాద్‌లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో ఉద్యోగం చేస్తోంది. మూడో సంతానమైన సందీప్ ఐటీఐ పూర్తి చేసి ప్రస్తుతం ఓపెన్ డిగ్రీ చదువుతున్నాడు. నాలుగో సంతానం చంద్రకిరణ్ 9వ తరగతి వరకు చదివి తల్లికి ఆసరాగా ఉంటున్నాడు.


బ్యాంకర్ల చిన్నచూపు

కష్టాన్నే నమ్ముకున్న వెంకాయమ్మకు రుణం ఇచ్చేందుకు బ్యాంకర్లు ముఖం చాటేశారు. రెండేళ్ల క్రితం వరకు రోడ్డు పక్కన ఆర్అండ్‌బీ స్థలంలో వేసుకున్న చిన్న గుడిసెలో వీరి కుటుంబం నివాసం ఉండేది. అయితే పక్కనే ఉన్న పొలం యజమాని ఖాళీ చేయించడంతో తల్లి ఏగమ్మ బంగారాన్ని తాకట్టు పెట్టి ఊరి చివరన కొద్దిపాటి స్థలం కొని, ఆ భూమిలో రేకులషెడ్డు వేసుకుంది. ప్రస్తుతం వెంకాయమ్మ అక్కడే ఉంటున్నారు. పిల్లలను చదివించడానికి, ఇంటి కోసం చేసిన అప్పులు తీరకపోగా ఇప్పటికీ వడ్డీలు కడుతున్నారు. రుణం కోసం బ్యాంకుల చుట్టూ తిరిగితే తిరిగి అప్పు ఎలా తీరుస్తావంటూ ఎద్దేవా చేసి తన దరఖాస్తును నిరాకరించినట్లు చెప్పింది. అదేవిధంగా మహిళలు డబ్బులు పొదుపు చేసుకునే స్వయం సహాయక సంఘాలు (డ్వాక్రా) గ్రూపుల్లోనూ తనను చేర్చుకోలేదని వాపోయింది. ఆడపిల్లలకు వివాహం చేయాల్సిన నేపథ్యంలో అన్ని కష్టాలనూ భారంగా ఎదుర్కొంటూ ముందుకు సాగుతోన్న వెంకాయమ్మ చిన్న చిన్న సమస్యలు ఉన్నవారిలో ఆత్మవిశ్వాసం నింపుతోంది.

- తూమాటి భద్రారెడ్డి, సాక్షి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ ॥ బుధవారం
6-2-2019

లవ్ డాక్టర్ — నన్నడగొద్దు ప్లీజ్


ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ అన్నయ్యా! మా కాలేజీలో నన్నొక అబ్బాయి ఫాలో చేస్తున్నాడు. తను మా సీనియర్. వన్ ఇయర్ బ్యాక్ నాకు కాలేజీలోనే పరిచయమయ్యాడు. ప్రతి విషయానికీ చాలా సపోర్ట్‌గా ఉంటాడు. నేనొక అక్కతో... 'తను నన్ను ఫాలో అవుతున్నాడా?' అని అడిగాను. తనేమో 'అదేమీ లేదు' అని చెప్పింది. తను ఆల్‌రెడీ తన కంటే సీనియర్ అక్కని లవ్ చేస్తున్నాడట. ఆ విషయం నాకు తర్వాత తెలిసింది. కానీ తను నన్ను ఫాలో అవుతూనే ఉన్నాడు. తనంటే నాకు చాలా ఇష్టం అన్నయ్యా! ఏం చెయ్యాలో అర్థం కావట్లేదు. మంచి సలహా ఇవ్వండి ప్లీజ్!
– ప్రియ

వాడికో జబ్బు ఉందమ్మా!
వాడు మనకు వద్దే వద్దు తల్లీ!!
వాడు నిలవడు!
వాడికి నిలకడ లేదు!!
వీడు శుద్ధ తోక...
వంకర టింకర తోక....
ఇస్త్రీ చేసినా స్ట్రెయిట్ కాదు..
ఏ.. స్త్రీ కనపడ్డా తోకలా తిరుగుతాడు..
అస్సలు లవ్‌లో పడకు...
అనవసరంగా కుక్క తోక పట్టుకుని ప్రేమ గంగ ఈదినంత పని అవుతుంది.
ఎప్పటికీ తీరం చేరము..!
'ఏంటి సార్! ఇవ్వాళ ఏదైనా కవి సమ్మేళనం అటెండ్ అయ్యి వచ్చారా ఏంటీ? అంతా పొయిట్రీలోనే మీ చెల్లెలిని బుజ్జగిస్తున్నారు?' అని నవ్వింది నీలూ!

lovedoctorram@sakshi.com

అంచనాలను అందుకోలేకపోయాం

జనవరి 11... రామ్‌చరణ్ నటించిన 'వినయ విధేయ రామ' విడుదలైన రోజు. బోయపాటి శ్రీను దర్శకత్వంలో డీవీవీ దానయ్య నిర్మించిన ఈ చిత్రం భారీ అంచనాల నడుమ విడుదలైంది. ఆ అంచనాలను అందుకోలేకపోయామని మంగళవారం రామ్‌చరణ్ మీడియాకి ఓ లేఖ విడుదలచేశారు. ఆ లేఖ సారాంశం...

ప్రియమైన అభిమానులు, ప్రేక్షకులకు,

నా పట్ల, మా సినిమాల పట్ల మీరు చూపిస్తున్న ప్రేమాభిమానాలకు వినమ్రపూర్వక ధన్యవాదాలు. మా 'వినయ విధేయ రామ' సినిమా కోసం రేయింబవళ్లు కష్టించిన సాంకేతిక నిపుణులందరికీ నా ధన్యవాదాలు. నిర్మాత దానయ్యగారు అందించిన సహకారం మాటల్లో వర్ణించలేనిది. మా చిత్రాన్ని నమ్మిన పంపిణీదారులు, ప్రదర్శనదారులకి కృతజ్ఞుడనై ఉంటాను. మీ అందరికీ నచ్చి, మిమ్మల్ని వినోదింపచేసే సినిమా అందించటానికి మేమంతా ఎంతగానో శ్రమించాం. దురదృష్టవశాత్తు అన్ని వర్గాలనూ ఆకట్టుకునేలా ఈ సినిమాని అందించలేకపోయాం. మీ అంచనాలని అందుకోలేకపోయాం. మీరు చూపించే ఈ ఆదరణ, అభిమానాన్ని ప్రేరణగా తీసుకుని భవిష్యత్తులో మీకు నచ్చే, మీరు మెచ్చే సినిమాలు చేయటానికి శక్తివంచన లేకుండా కృషిచేస్తాను. అన్ని వేళలా తమ మద్దతు నాకు అందించిన మీడియా మిత్రులకు నా ప్రత్యేక కృతజ్ఞతలు. మీరు ఎల్లప్పుడూ చూపించే ఈ ప్రేమకు, అభిమానానికి ధన్యవాదాలు.

– ప్రేమతో
మీ రామ్‌చరణ్



జోడీ కుదిరిందా?


● వరుణ్ తేజ్ ● ఈషా రెబ్బా

వెండితెర 'వాల్మీకి' చిత్రంలో వరుణ్ తేజ్‌కి జోడీ కుదిరిందట. వరుణ్ తేజ్ హీరోగా హరీష్ శంకర్ దర్శకత్వంలో 'వాల్మీకి' అనే చిత్రం రూపొందుతున్న సంగతి తెలిసిందే. 14 రీల్స్ ప్లస్ పతాకంపై రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో హీరోయిన్ పాత్ర కోసం పలువురి పేర్లను పరిశీలిస్తున్నారు. రేస్‌లో తెలుగు అమ్మాయి ఈషా రెబ్బా ముందు వరుసలో ఉన్నారని సమాచారం. ఈషా కాకుండా ఈ చిత్రంలో మరో హీరోయిన్ ఉంటారట. ఇటీవల వచ్చిన 'అరవింద సమేత వీరరాఘవ, సుబ్రహ్మణ్యపురం' సినిమాల్లో మంచి నటనను కనబరిచారు ఈషా. ఈ సంగతి ఇలా ఉంచితే... 'వాల్మీకి' చిత్రం కోలీవుడ్ హిట్ 'జిగర్‌దండా'కి రీమేక్ అని సమాచారం. ఆ సినిమాలో బాబీ సింహా చేసిన పాత్రలో వరుణ్ తేజ్ కనిపిస్తారట. అలాగే తమిళంలో సిద్ధార్థ్ చేసిన పాత్ర కోసం శ్రీవిష్ణు, నాగశౌర్య పేర్లు తెరపైకి వచ్చాయి. అధికారిక సమాచారం అందాల్సి ఉంది. 'వాల్మీకి' సినిమాకు దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తారు.

అంజలి.. చాలా పవర్‌ఫుల్


● నయనతార

నయనతార లీడ్ రోల్‌లో తెరకెక్కిన చిత్రం 'ఇమైక్క నొడిగల్'. అథర్వ, రాశీఖన్నా కీలక పాత్రల్లో నటించగా, బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ కశ్యప్ ప్రతినాయకుడిగా నటించారు. నయనతార భర్త విక్రమాదిత్యగా అతిథి పాత్రలో విజయ్ సేతుపతి నటించారు. ఆర్. అజయ్‌జ్ఞానముత్తు దర్శకత్వంలో క్యామియో ఫిల్మ్స్ పతాకంపై సీజే జయకుమార్ నిర్మించిన ఈ సినిమా గత ఏడాది తమిళంలో ఘన విజయం సాధించింది. ఇప్పుడు ఈ చిత్రాన్ని విశ్వశాంతి క్రియేషన్స్ బ్యానర్‌పై సీహెచ్ రాంబాబు, ఆచంట గోపీనాథ్‌లు 'అంజలి సీబీఐ ఆఫీసర్' పేరుతో తెలుగులోకి అనువదిస్తున్నారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాతలు మాట్లాడుతూ– ''క్రైమ్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన చిత్రమిది. పవర్‌ఫుల్ సీబీఐ ఆఫీసర్‌గా నయనతార టైటిల్ రోల్‌లో చాలా బాగా నటించారు. ప్రస్తుతం అనువాదకార్యక్రమాలు వేగంగా జరుగుతున్నాయి. ఈ నెల 22న ఈ సినిమాను విడుదల చేస్తున్నాం'' అన్నారు. రమేష్ తిలక్, దేవన్ తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: హిప్ హాప్ తమిళ, కెమెరా: ఆర్.డి. రాజశేఖర్.

4 లెటర్స్ హిట్ కావాలి

– వెంకటేశ్


● వెంకటేశ్, ఈశ్వర్

ఈశ్వర్ హీరోగా, టువ చక్రవర్తి, అంకిత మహారాణా హీరోయిన్లుగా ఆర్. రఘురాజ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం '4 లెటర్స్'. 'కుర్రాళ్ళకి అర్థమవుతుందిలే' అన్నది ఉప శీర్షిక. దొమ్మరాజు హేమలత, దొమ్మరాజు ఉదయ్‌కుమార్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 22న విడుదలవుతోంది. ఈ సినిమా టీజర్, ట్రైలర్‌లను హీరో వెంకటేశ్ చూసి, కథానాయకుడు, దర్శక, నిర్మాతలను అభినందించారు. ఈ సినిమా మంచి హిట్ కావాలని ఆకాంక్షించారు. దొమ్మరాజు హేమలత, దొమ్మరాజు ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ– ''ఓం శ్రీచక్ర క్రియేషన్స్ పతాకంపై నిర్మించిన తొలి చిత్రమిది. మా సినిమా టీజర్‌ని దర్శకులు రాఘవేంద్రరావుగారు విడుదల చేయటం మాకెంతో ఆనందంగా ఉంది. కమర్షియల్ హంగులతో యూత్ సహా అన్ని వర్గాలను ఆకట్టుకునే ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా రూపొందించాం'' అన్నారు. ''కలుసుకోవాలని' సినిమా తర్వాత తెలుగులో నేను డైరెక్ట్ చేసిన చిత్రం '4 లెటర్స్'. ప్రేమ, పెళ్లి విషయాల్లో నేటితరం ఆలోచనలు, అభిప్రాయాలు, వాస్తవాలు ఏమిటనే విషయాలను వాస్తవానికి దగ్గరగా ఉండేలా చిత్రీకరించాం. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో పాటు ఆలోచన రేకెత్తించేలా సినిమా ఉంటుంది'' అని ఆర్. రఘురాజ్ అన్నారు. ''మా సినిమా ప్రేక్షకులకు నచ్చుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు ఈశ్వర్. ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, కెమెరా: చిట్టిబాబు.కె.

నవ్వులు పంచే పోలీస్ స్టేషన్


● సాన్వీ, శ్రీనాథ్

మాగంటి శ్రీనాథ్, సాన్వీ మేఘనా జంటగా, గోరేటి వెంకన్న కీలక పాత్రలో నటించిన చిత్రం 'బిలాల్‌పూర్ పోలీస్ స్టేషన్'. నాగసాయి మాకం దర్శకత్వంలో ఎంఎస్ క్రియేషన్స్ పతాకంపై మహంకాళీ శ్రీనివాస్ నిర్మించిన ఈ సినిమా మార్చి రెండో వారంలో విడుదల కానుంది. ఈ సందర్భంగా మహంకాళీ శ్రీనివాస్ మాట్లాడుతూ– ''పూర్తి వినోదాత్మకంగా రూపొందిన చిత్రమిది. ప్రస్తుత సమాజం ఎదుర్కొంటున్న ఒక సమస్యను ఇందులో చూపించాం. తప్పకుండా ప్రేక్షకులను ఆలోచింపజేసే సినిమా అవుతుంది. మంచి కథకు నిర్మాణ విలువలు తోడైతేనే ఆ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. పెద్ద నిర్మాణ సంస్థలకు ఏమాత్రం తీసిపోకుండా మా సినిమా ఉంటుంది. మార్చి రెండో వారంలో ఓ పెద్ద పంపిణీ సంస్థ ద్వారా ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నాం'' అన్నారు. ''బిలాల్‌పూర్ అనే ఊరి పోలీస్ స్టేషన్‌కు వచ్చే వింత వింత కేసులు కడుపుబ్బా నవ్విస్తాయి. కుటుంబంతో కలిసి హాయిగా నవ్వుకునే సినిమా ఇది. ఎలాంటి అసభ్యత, అశ్లీలత లేకుండా తెరకెక్కించాం. సినిమా చూస్తున్న వాళ్లకు తమ ఊరిలో జరిగే సంఘటనలు గుర్తొస్తాయి'' అని నాగసాయి మాకం అన్నారు. ప్రణవి, ఆర్ఎస్ నందా, వెంకట్ గోవాడ, మల్లేష్, వైభవ్ తదితరులు నటించిన ఈ చిత్రానికి కెమెరా: తోట వి. రమణ, సంగీతం: సాబూ వర్గీస్.

కాసుకో సుడోకు

3	6	4	7	8		1		
9	5					6		4
							3	
		3		7	8		6	5
7			5		4			3
4	2		6	1		8		
	3							
8		7					2	6
		2		4	6	7	8	9

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా,నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

4	9	1	3	7	6	2	8	5
5	6	3	8	2	1	9	7	4
2	8	7	5	9	4	6	3	1
1	4	6	7	8	3	5	2	9
8	2	5	6	4	9	7	1	3
7	3	9	1	5	2	4	6	8
6	7	8	4	1	5	3	9	2
3	5	2	9	6	8	1	4	7
9	1	4	2	3	7	8	5	6

శత్రువు కూడా ముఖ్యమే


● సాయికృష్ణ పెండ్యాల

''డిస్ట్రిబ్యూటర్ నుంచి ప్రొడ్యూసర్ అయ్యాను. నిర్మాతగా 'దండుపాళ్యం- 3', అర్జున్ 150వ సినిమా 'కురుక్షేత్రం', 'మారి-2' విడుదల చేశా. ఇప్పుడు 'సీమరాజా' నా నాలుగో చిత్రం. ఇది మంచి హిట్ అవుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు సాయికృష్ణ పెండ్యాల. శివకార్తికేయన్ హీరోగా, సమంత, కీర్తి సురేశ్ హీరోయిన్లుగా పొన్‌రాం దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'సీమరాజా'. ఈ సినిమాను లక్ష్మీ పెండ్యాల సమర్పణలో సాయికృష్ణా ఫిలిమ్స్ పతాకంపై సాయికృష్ణ పెండ్యాల తెలుగులో ఈ నెల 8న విడుదల చేస్తున్నారు. సాయికృష్ణ పెండ్యాల మాట్లాడుతూ– ''సీమరాజా' సినిమాను తెలుగులో విడుదల చేయడానికి కారణం చెన్నైలో ఉండే నా మిత్రుడు. తను ఈ సినిమాలోని 'మనిషి బతకాలంటే మిత్రుడు ఎంత ముఖ్యమో.. శత్రువు కూడా అంతే ముఖ్యం'' అనే డైలాగ్ నాకు పంపించాడు. ఆ డైలాగ్ విని ఈ సినిమాని తమిళ్‌తో పాటు తెలుగులో ఒకేసారి విడుదల చేద్దామనుకున్నాను.. కుదరలేదు. చంద్రబోస్‌గారు, వెన్నెలకంటి గారు రాసిన పాటలకు, ఇటీవల విడుదలైన ట్రైలర్‌కి మంచి స్పందన వస్తోంది. ఈ చిత్రంలో సమంత యాక్షన్ సీన్స్‌లో బాగా నటించారు. కీర్తీసురేశ్ 30 నిమిషాలపాటు యువరాణి గెటప్‌లో కనిపిస్తారు. సిమ్రాన్‌గారు నెగటివ్ పాత్రలో అలరించారు. డిస్ట్రిబ్యూటర్‌గా 18 సంవత్సరాల్లో 300లకుపైగా సినిమాలు విడుదల చేశాను. 'సీమరాజా' సినిమాను ఏపీ, తెలంగాణల్లో 400 థియేటర్స్‌కుపైగా విడుదల చేస్తున్నాం'' అన్నారు.


మనస్సాక్షే దారి చూపుతుంది!


● ఏఆర్ రెహమాన్


● తనయ ఖతీజా ప్రసంగాన్ని వింటున్న రెహమాన్

ఏఆర్ రెహమాన్ గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. ఆయన పాటలు నిత్యం ప్రేక్షకులను పలకరిస్తూనే ఉంటాయి. రెహమాన్‌ను గుర్తు చేస్తూనే ఉంటాయి. పదేళ్ల క్రితం 'స్లమ్ డాగ్ మిలియనీర్' చిత్రానికిగాను రెండు ఆస్కార్ అవార్డులను అందుకున్నారు రెహమాన్. 81వ ఆస్కార్ వేడుకలో పది అవార్డ్స్‌కు నామినేట్ అయిన ఈ చిత్రం ఎనిమిది అవార్డులను గెలుచుకుంది. అందులో రెహమాన్‌కు రెండు వచ్చాయి. ఈ చిత్రం ఆస్కార్ సాధించి పదేళ్లయిన సందర్భంగా ముంబైలో ఓ వేడుక జరిగింది. ఈ వేడుకలో ఏఆర్ రెహమాన్, ఆయన కుమార్తె ఖతీజాల ఎమోషనల్ స్పీచ్ అందరినీ ఆకట్టుకుంది. ''ఎన్నో పెద్ద పెద్ద అవార్డులను సాధించిన ప్రముఖ సంగీత దర్శకునిగా మా నాన్నగారు ప్రపంచానికి తెలుసు. మా నాన్న రెండు ఆస్కార్ అవార్డులు సాధించి పదేళ్లు అవుతోంది. ఈ పదేళ్లలో ఆయనలో ఏ మార్పు రాలేదు. అయితే కుటుంబానికి కేటాయించే సమయం తగ్గింది. అయినప్పటికీ మధ్య మధ్య మమ్మల్ని విహారయాత్రలకు తీసుకెళుతూ ఆ లోటు కూడా తెలియకుండా చేస్తున్నారు. మా నాన్నగారు గొప్ప మానవతావాది. ఎందరికో సహాయం చేస్తుంటారు. కానీ వాటిని మాతో కూడా పంచుకోరు'' అని ఖతీజా అన్నారు. ఆ తర్వాత 'మాతో పాటు ఇప్పటి యువతీ యువకులు పాటించేలా ఏవైనా సలహాలు ఇస్తారా?' అని తండ్రిని ఖతీజా అడిగితే ''నిజానికి నాకు సలహాలు ఇవ్వడం నచ్చదు. నేను పెరుగుతున్నప్పుడు మా అమ్మ చెప్పిన విలువలనే మీకు (తన బిడ్డలను ఉద్దేశించి) చెబుతూ వచ్చాను. ఇప్పుడు మీరు మీ హార్ట్‌ని ఫాలో అయ్యే టైమ్ వచ్చింది. జీవితంలో నీ మనస్సాక్షి మీకు మంచి మార్గనిర్దేశకం అవుతుంది. ఆ భగవంతుడు కూడా మీకు దారి చూపించాలని కోరుకుంటున్నాను'' అని భావోద్వేగంగా బదులిచ్చారు ఏఆర్ రెహమాన్. ఈ వేడుకలో నటుడు అనిల్ కపూర్, రచయిత గుల్జార్ తదితరులు పాల్గొన్నారు. ''పదేళ్ల క్రితమే రెహమాన్ ఆస్కార్ సాధించడం చాలా ఆనందంగా ఉంది'' అని ఏ పాటకైతే రెహమాన్ అవార్డు సాధించారో ఆ పాటను రచించిన గుల్జార్ అన్నారు.

లాకింగ్ అండ్ పాపింగ్!


● శ్రద్ధా కపూర్

యూకేలో ఉండే ఆ పాకిస్థానీ అమ్మాయి, పంజాబ్ కుర్రాడు డ్యాన్స్‌లో పోటీపడాల్సి వచ్చింది. ఒకరు విజేతగా నిలుస్తారు. ఆ తర్వాత వీరిద్దరికీ పోటీగా మరో డ్యాన్సర్ సవాల్ విసిరాడు. ఫైనల్‌గా విజేత ఎవరు? అనే విషయం తెలుసుకోవాలంటే చాలా టైమ్ పడుతుంది. కానీ ఈ సినిమా లండన్ షెడ్యూల్ చిత్రీకరణ కోసం మాత్రం టైమ్ దగ్గర పడింది. రెమో డిసౌజా దర్శకత్వంలో వరుణ్ ధావన్, శ్రద్ధాకపూర్, నోరా ఫతేహీ ముఖ్య తారలుగా రూపొందుతున్న సినిమాకు 'స్ట్రీట్ డ్యాన్సర్స్ 3' అనే టైటిల్ ఖరారు చేశారు. అలాగే ఈ సినిమాలో వరుణ్ ధావన్, శ్రద్ధా కపూర్‌లకు చెందిన లుక్స్‌ను కూడా రిలీజ్ చేశారు. ఇందులో పంజాబ్ కుర్రాడి పాత్రలో వరుణ్ ధావన్, పాకిస్థానీ అమ్మాయి పాత్రలో శ్రద్ధాకపూర్ నటిస్తున్నారు. ఈ సినిమా కోసం శ్రద్ధా ఐదురకాల కొత్త డ్యాన్సులు నేర్చుకున్నారు. 'అఫ్రో, లాకింగ్ అండ్ పాపింగ్, క్రంప్, టుట్టింగ్ అండ్ యానిమేషన్, అర్బన్'.. ఈ ఐదు రకాల నృత్యాలను యూకేలో ఉంటున్న భారతీయ నృత్యకారుడు ప్రశాంత్ షిండే, టానియా టోరియాల నుంచి నేర్చుకున్నారు. శ్రద్ధాకి డ్యాన్స్ నేర్పించడం కోసం ఈ ఇద్దరూ ఇండియా వచ్చారు. ఇక ఈ సినిమా నెక్ట్స్ షెడ్యూల్ ఈ నెల 10న లండన్‌లో జరగనుంది. మార్చి 25 వరకు ఈ షెడ్యూల్ జరుగుతుంది. ఇంతకుముందు రెమో డిసౌజా దర్శకత్వంలోనే 2013లో 'ఏబీసీడీ' (ఏనీ బడీ కేన్ డ్యాన్స్), 2015లో 'ఏబీసీడీ 2' చిత్రాలు వచ్చిన సంగతి తెలిసిందే. 'స్ట్రీట్ డ్యాన్సర్స్ 3' చిత్రాన్ని ఈ ఏడాది నవంబర్ 8న విడుదల చేయాలనుకుంటున్నారు.

తప్పుచేస్తే శిక్ష తప్పదు


● గురు చిందేపల్లి ● జి. సీతారెడ్డి

అద్వైత్, జహీదా శ్యామ్, అలోక్ జైన్, సీతారెడ్డి ముఖ్య తారలుగా తెరకెక్కుతోన్న చిత్రం 'ఎంతవారలైనా'. గురు చిందేపల్లి దర్శకత్వంలో రామదూత ఆర్ట్స్ పతాకంపై జి.సీతారెడ్డి నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ తుది దశకు చేరుకుంది. గురు చిందేపల్లి మాట్లాడుతూ– ''ఎంతవారలైనా కాంత దాసులు కావచ్చు, కనకదాసులు కావచ్చు. కానీ, తప్పు చేసినప్పుడు ఎంతవారలైనా కచ్చితంగా శిక్షార్హులే అనే పాయింట్‌తో తెరకెక్కుతోన్న థ్రిల్లర్ హారర్ మూవీ ఇది. అన్ని వర్గాల వారికి నచ్చేలా ఉంటుంది'' అన్నారు. ''గురు చిందేపల్లి నా క్లాస్‌మేట్, చిరకాల మిత్రుడు. నాకు సినిమా మీద ఉన్న ప్యాషన్‌తో నిర్మాతనయ్యా. నటన మీద ఉన్న ఆసక్తితో డైరెక్టర్ ప్రోత్సాహంతో ఈ సినిమాలో ఒక పాత్ర కూడా చేశాను. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా స్టార్ట్ అయ్యాయి. త్వరలోనే ఫస్ట్ లుక్ రిలీజ్ చేస్తాం. మంచి కథాంశంతో సాగే ఈ చిత్ర ప్రేక్షకులను ఆకట్టుకుంటుందనే నమ్మకం ఉంది'' అని జి.సీతారెడ్డి అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సుక్కు, కెమెరా: ఎస్.మురళీమోహన్‌రెడ్డి.

భయం వేసింది!


● మేఘా ఆకాశ్

కథానాయిక మేఘా ఆకాశ్ పేరు మారింది. ఒక్క నిమిషం... ఆమె మార్చుకోలేదు. హ్యాకర్స్ మార్చారు. అవును.. మేఘా ఆకాశ్ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను హ్యాకర్స్ హ్యాక్ చేసి రష్యాకి చెందిన ఓ డీజే ఆర్టిస్టు పేరు పెట్టారు. అంతటితో ఆగకుండా కొన్ని అభ్యంతరకరమైన ఫొటోలను కూడా అప్‌లోడ్ చేశారు. అయితే ఆ ఫొటోలు మేఘా ఆకాశ్‌వి కాదు. ఈ విషయంపై మేఘా ఆకాశ్ స్పందించారు. ''నా ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌ను హ్యాక్ చేశారు. మా టీమ్ చాలా కష్టపడి మళ్లీ నా అకౌంట్ యాక్సెస్‌ను తిరిగి తెచ్చారు. కానీ నా వ్యక్తిగత ఖాతాను హ్యాకర్స్ హ్యాక్ చేయడంతో చాలా భయం వేసింది. నాకు సపోర్ట్ చేసిన అందరికీ థ్యాంక్స్'' అన్నారు. ఇటీవల కమల్‌హాసన్ చిన్న కుమార్తె అక్షరా హాసన్, హీరోయిన్ హన్సిక సోషల్ మీడియా అకౌంట్స్ కూడా హ్యాక్ అయిన విషయం తెలిసిందే. ఇలా వరుసగా హీరోయిన్ల సోషల్ మీడియా ఖాతాలు హ్యాక్ అవుతుండటం గమనించాల్సిన విషయం. ఇక మేఘా సినిమాల విషయానికి వస్తే... ఇటీవల రజనీకాంత్ 'పేట' సినిమాలో కీలక పాత్ర చేసిన ఈ బ్యూటీ 'శాటిలైట్ శంకర్' అనే సినిమాతో హిందీ చిత్ర పరిశ్రమకు పరిచయం కానున్నారు.

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ ॥ బుధవారం
6-2-2019

సీరియల్

సంగీతమే ప్రాణంగా 'కోయిలమ్మ' సీరియల్‌లోని చిన్ని పాత్ర ఉంటుంది. స్టార్ మా టీవీలో వచ్చే ఈ సీరియల్ ద్వారా చిన్ని పాత్రతో తెలుగింటికి పరిచయం అయ్యింది తేజస్విని. అందంలోనూ, అభినయంలోనూ భేష్ అనిపించుకుంటున్న ఈ కన్నడ కోకిల 'సాక్షి'తో పంచుకున్న ముచ్చట్లు...

కన్నడ కోయిలమ్మ



● మీరు కన్నడ, తెలుగు బుల్లి తెరకు ఎలా పరిచయం అయ్యారు?

బెంగుళూరులోని థియేటర్ ఆర్ట్స్‌లో జాయిన్ అయ్యాను. అంతకు మూడునెలల ముందు 'బిలీ హెన్నీ' అనే కన్నడ ప్రాజెక్ట్‌లో వర్క్ చేశాను. థియేటర్ ఆర్ట్స్ నుంచే నాకు 'కోయిలమ్మ' సీరియల్ ఆఫర్ వచ్చింది. తెలుగింటికి పరిచయం చేసిన 'స్టార్ మా' వాళ్లకు ముందుగా థాంక్స్. ఈ ప్రాజెక్ట్‌కు ముందు 'కోయిలమ్మ' సీరియల్ చూశాను. బాగా నచ్చింది. పెద్దయ్యాక 'చిన్ని'గా నేను ఎలా ఉంటానో, ఆ పాత్ర ద్వారా తెలుగువారు నన్ను రిసీవ్ చేసుకుంటారోలేదో నని నాలుగు వారాలు చాలా టెన్షన్ పడ్డాను. ఇప్పుడు బయటకు వెళితే 'చిన్ని చిన్ని' అని పిలుస్తున్నారు. ఈ పాత్ర ద్వారా నాకు మంచి పేరు వస్తున్నందుకు ఆనందంగా ఉంది.



తల్లి భ్రమరాంబతో...

● మీ ఫ్యామిలీ గురించి..

నేను, అమ్మ భ్రమరాంబ బెంగుళూరులో ఉంటాం. అమ్మ సివిల్ ఇంజనీర్‌గా జాబ్ చేస్తున్నారు. అమ్మనాన్నలకు నేను ఒక్కత్తే కూతురుని. ఐదేళ్ల క్రితం మా నాన్నగారు(మల్లికార్జున్) చనిపోయారు. టీవీ ఇండస్ట్రీకి రాకముందు సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని. సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనడంలో ఆసక్తి ఉండటం వల్ల డ్యాన్స్ నేర్చుకున్నాను. జాబ్ మానేసి థియేటర్ ఆర్ట్స్‌లో జాయిన్ అయ్యాను.

● సీరియల్‌లో మాదిరిగానే లైఫ్‌లో మలుపులు..


(నవ్వుతూ) సీరియల్‌లో చాలా ట్విస్టులు ఉన్నాయి. నా జీవితంలో అలాంటివేవీ లేవు. చాలా సింపుల్‌గా గడిచిపోతోంది. నన్ను ఈ రంగంలోకి పంపే ముందు అమ్మ కొంత ఆలోచించారు. కానీ, సాంస్కృతిక రంగం పట్ల నాకుండే ఆసక్తిని గమనించి ప్రోత్సహించారు. ఇక్కడ షూటింగ్ వారం విడిచి వారం ఉంటుంది. అందువల్ల వారానికి ఓసారి హైదరాబాద్ వచ్చి వర్క్ చేసుకొని వెళతాను.

● 'చిన్ని'పాత్ర సింగర్.. బయట ?

నాకు సంగీతంలోనూ ప్రవేశం ఉంది. మ్యూజిక్ నేర్చుకున్నాను. 'కోయిలమ్మ' కూడా సింగింగ్ రిలేటెడ్ కాన్సెప్ట్. నాకు నచ్చిన కాన్సెప్ట్ అవడంతో మరింత హ్యాపీ. ఈ పాత్ర ద్వారా తెలుగింటి వారినుంచి మంచి పేరు తెచ్చుకోవాలని ఉంది. జనాలంతా గుర్తించాలి. ఈ ఇండస్ట్రీకి రాక ముందు డ్యాన్స్, మ్యూజిక్ ..అంటే ఇష్టం ఉండేది. ఇప్పుడు వీటితో పాటు ఈ ఇండస్ట్రీయే నా ఇంట్రెస్ట్ గా మారిపోయింది. ఇప్పుడు మా ఫ్రెండ్స్ అంటుంటారు. 'సాఫ్ట్‌వేర్ రొటీన్ ఫీల్డ్. నువ్వు లక్కీ. నచ్చిన క్రియేట్ ఫీల్డ్‌ను ఎంచుకున్నావు..' అంటూ మెచ్చుకుంటూ ఉంటారు. వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ మీ అందరి మనసుల్లో నిలిచిపోవాలన్నదే నా లక్ష్యం.

– నిర్మలారెడ్డి





● బునియాద్

కదిలించిన పునాది

ఇటుక పునాది మీద ఇల్లు నిలబడుతుంది. అనుబంధం పునాది మీద కుటుంబం నిలబడుతుంది. కాని పునాది కదిలే పరిస్థితులు వస్తూ ఉంటాయి. అప్పుడు గెలిచేది ఎవరు? నిలిచేది ఎవరు? భారత్, పాక్ విభజన తర్వాత లాహోర్ నుంచి ఢిల్లీకి ప్రయాణించిన ఒక కుటుంబ కథే బునియాద్. బునియాద్ అంటే పునాది అని అర్థం. అందరి మనసులనూ కదిలించిన పునాది ఈ సీరియల్.

లైవ్ షో బిగ్‌బాస్ సీజన్స్, అతీంద్రియ శక్తులతో సాగే నాగిని వంటి సీరియల్స్‌ను ఆవిష్కరించే టీవీ గురించి ఈ రోజుల్లో ఇంతే తెలుసు మనకు. కానీ, టీవీకి స్వర్ణయుగం అనిపించే కాలం ఒకటుంది. అవి దూరదర్శన్ వచ్చిన తొలినాటి రోజులు.

ఇండియన్ టెలివిజన్‌లో రెండవ సీరియల్ అడుగుపెట్టిన 'బునియాద్' అతి కొద్ది కాలంలోనే తన సత్తా ఏంటో చూపింది. అప్పుడప్పుడే దూరదర్శన్ అడ్వర్టైజింగ్ కంపెనీలకు టైమ్ స్లాట్‌లను అమ్ముతోంది. సంపన్న కుటుంబాలు టీవీ సెట్స్‌ను కొనుగోలు చేస్తున్నాయి. మధ్యతరగతి వర్గం టీవీని సొంతం చేసుకోవాలనే ఆలోచనలో ఉంది. ఆ రెండు వర్గాలని ఆకట్టుకునేలా రిచ్ స్టోరీస్ ప్లానింగ్ దూరదర్శన్‌లో జరుగుతోంది. ఆ క్రమంలో ఇండియన్ ఆడియన్స్ నాడిని పట్టుకున్నారు దర్శకుడు రమేష్ సిప్పి. దేశీయ మూలాల్లోకి వెళ్లాడు. మనసు తడిని కళ్లలో చూపించే బలమైన కుటుంబాన్ని పట్టుకున్నాడు. 'బునియాద్' పేరుతో టీవీగా ముందుకొచ్చాడు. గుండె గుండెలో ఇది మేమే అనిపించాడు. ఇది మాదే అనిపించాడు. జ్యోతి స్వరూప్ తన దర్శకత్వ ప్రతిభనూ జత కలిపారు.

కథలోకి వస్తే...

ఇండియా – పాకిస్థాన్ విడిపోకముందు అంతా ఒకే దేశం. అన్నదమ్ముల్లా కలిసి మెలిసి ఒకే కుటుంబంగా జీవించారు. విడిపోయాక.. ఏమైంది? ఇదే కథ. అందుకే విడిపోకముందు.. (1916 నుంచి 1978)తర్వాత పరిస్థితులను ఈ సీరియల్‌లో చూపించారు. అప్పటికి దేశమంతటా నాటకాలంటే విపరీతమైన పిచ్చి ఉంది. ఆ పిచ్చిని 'బునియాద్' తన వైపు తిప్పుకుంది. దీంతో నాటకం తెర తీయడానికే తీవ్రమైన కృషి చేయాల్సి వచ్చింది.

బునియాద్ ఒక స్టోరీ కాదు

సీరియల్ మొదలవడమే 1915 నాటి పాకిస్థాన్‌లోని లాహోర్‌లో ఒక అందమైన కుటుంబం... స్వాతంత్ర్యానంతరం జరిగిన పరిణామాలను కళ్లకు కడుతుంది. దేశవిభజన ఆ అందమైన కుటుంబాలను ఎలా ఛిద్రం చేసిందో చిత్రిస్తుంది. లాహోర్ నుంచి అనేక మలుపులు తిరుగుతూ కథ 1986లో ఢిల్లీ చేరుతుంది. అక్కడ శరణార్థ శిబిరాలలో తలదాచుకున్న వారి కష్టాలను పరామర్శిస్తుంది. నిజానికి బునియాద్ కొన్ని కుటుంబాల కథల సమాహారం. అయినా ప్రధానంగా మాస్టర్ హవేలీరామ్, లాజోజీ (అలోక్‌నాథ్, అనితా కన్వర్)ల కుటుంబం చుట్టూతా తిరుగుతుంటుంది. హవేలీరామ్, లజోజీ దంపతులకు ముగ్గురు కొడుకులు భూషణ్, రోషన్, సత్బీర్. హవేలీరామ్ భార్య లాజోజీ. తల్లి, తండ్రి, అన్న–వదిన, పిల్లలతో తన పూర్వీకుల కాలం నుంచి వుంటున్న ఇంట్లో సంతోషంగా జీవిస్తుంటాడు. హవేలీ రామ్‌ది ఏం జరిగినా అంతా మనమంచికే అనుకునే తత్త్వం. కుల మతాలకు అతీతంగా ఉంటాడు. రాజకీయాలంటే మాత్రం ఆసక్తి చూపుతుంటాడు. స్వాతంత్ర్యోద్యమంలోనూ పాల్గొంటాడు. ఇరుగుపొరుగుతోనూ, దేశంతోనూ వివిధ బంధాల మధ్య అల్లుకున్న అనుబంధాలెన్నో ఆ కుటుంబంలోని వ్యక్తుల మధ్య ఉంటాయి. చీకూచింతా లేకుండా హాయిగా జీవించే చక్కటి కుటుంబం దేశ విభజన సుడిగుండంలో చిక్కుకుని ఎన్ని మలుపులు తిరుగుతుందో, ఎన్ని అగచాట్ల పాలవుతుందో ఈ సీరియల్ చూపిస్తుంది.

స్వతంత్రం వచ్చింది. దేశమంతటా వేడుకలు. ప్రతి మదిలో ఆనందోత్సాహాలు. స్వేచ్ఛాతరంగాలు అంతటా ప్రవహిస్తున్నాయి. అలాంటి సమయంలో దేశ విభజన అనివార్యమైంది. కుటుంబరక్షణ వ్యవస్థలో ఆనందంగా గడిపే హవేలీరామ్ సాదా సీదా జీవితాన్ని ఛిన్నాభిన్నం చేసింది. జీవితకాలపు బాధలకు లోనయ్యేలా చేసింది. ఆ కుటుంబాన్ని విషాదంలో ముంచెత్తింది. దేశ విభజన సమయంలో జరిగిన అల్లర్లలో కుటుంబం విచ్ఛిన్నం అవడం, పూర్వీకులంతా నివసించిన ఇంటిని వదిలి శరణార్థుల శిబిరాల్లో తలదాచుకోవాల్సిన పరిస్థితి ఎదరవుతుంది.

హవేలీరామ్ పాత్రను ఈ కథ కోసం తీర్చినట్టు అనిపించదు. మనమే ఆ పరిస్థితుల్లో ఉండి, కుటుంబాన్ని కోల్పోయి పడే బాధను అనుభవిస్తున్నట్టు ఉంటుంది. హిందూ–ముస్లిమ్ సమానత్వం కోసం ఆరాటపడే విధానం కళ్లకు కడుతుంది. భారతీయ సగటు తల్లికి ప్రతీకగా లాజోజీ అత్యంత సాధారణంగా ఉంటుంది. కుటుంబాన్ని పోగొట్టుకున్న ఆమె ఆ తర్వాతి కాలంలో ఒక అనాథ బిడ్డను దత్తత తీసుకొని పెంచుకునేంత పరిస్థితికి చేరుతుంది.

ఈ కథలో కంటతడిపెట్టించే మరో కథనం వీరన్‌వలిది. హవేలిరామ్ చెల్లెలు ఈమె. లాహోర్‌లో గడిపిన మధుర క్షణాలు, వృషభన్‌తో ప్రేమకు ప్రతిఫలంగా పుట్టిన కన్న కొడుకును అక్రమసంతానంగా భావించిన సమాజాన్ని తట్టుకోలేని విధానం, పిరికి ప్రేమికుల భావోద్వేగాలు కంటతడిపెట్టిస్తాయి. బాబ్లీజీగా పేరు మార్చుకొన్నప్పటికీ తన బిడ్డను సింగిల్ పేరెంట్‌గా పెంచే ధైర్యం ఉండదు. కష్టపడి పనిచేయడంలో వచ్చే సంపాదన కన్నా గ్లామరస్‌గా ఉంటూ, డబ్బు సులువుగా వచ్చే క్యాబరే డ్యాన్సర్‌గా వృత్తిని ఎంచుకుంటుంది.

ఒక కుటుంబం నుంచి మరికొన్ని కుటుంబాలను కలుపుతూ కథలు కథలుగా బునియాద్ సాగుతుంది. ప్రతి కుటుంబానికీ అందులోని కథ చేరువయ్యేలా పక్కా స్క్రిప్ట్‌ను ప్లాన్ చేసుకున్నాడు దర్శకుడు. ఒకరకంగా చెప్పాలంటే మహాభారత్‌లో కౌరవులు–పాండవుల మధ్య నడిచిన కథలా అదే సమయంలో వారి చుట్టూతా ఉన్న లెక్కలేనన్ని కుటుంబకథలు వచ్చి చేరినట్టుగా బునియాద్ ఉంటుంది. ఆశ్చర్యం ఏమిటంటే, ఈ సీరియల్‌లోని ప్రతి పాత్రా నటించినట్లు కాకుండా సజీవ చిత్రణమే అన్నంత సహజంగా అనిపిస్తుంది.

- ఎన్.ఆర్.

కొన్ని మూలాలు

● బునియాద్ సీరియల్ 105 ఎపిసోడ్లుగా దూరదర్శన్‌లో 1986 నుంచి 1987 వరకు వారానికి రెండుసార్లు (మంగళ, శనివారాల్లో) ఏడాది పాటు ప్రసారమయ్యింది ● బునియాద్ సీరియల్ ప్రసారమైన 27 ఏళ్ల తర్వాత 'బునియాద్ రిటర్న్'పేరుతో జులై 25, 2013లో ప్రతి గురు, శుక్రవారాల్లో రాత్రి 8 గంటలకు సహారా ఒన్, 8:30కు దూరదర్శన్‌లో ప్రసారం చేశారు ● ఈ సీరియల్‌లో నటించిన నటీనటులు చాలావరకు అంతకుముందు పేరొందిన డ్రామా ఆర్టిస్టులు ● మన ఇళ్లలో మామూలుగా మాట్లాడుకునే సాధారణ వాడుక భాషను ఈ సీరియల్ ద్వారా తీసుకువచ్చారు ● ఈ సీరియల్ దర్శకులు రమేష్ సిప్పి బిగ్ స్క్రీన్ మీద.. షోలే, షాన్, సాగర్.. వంటి సినిమాలతో ఓ వెలుగు వెలిగారు.

పరి పరిశోధన

సోలార్ ప్యానెల్స్ ముద్రించవచ్చు



కిటికీలతోనే ఇంటికి కావాల్సిన విద్యుత్తు అంతా ఉత్పత్తి చేయగలిగితే ఎలా ఉంటుంది. సౌరశక్తితో కొంత విద్యుత్తు సాధ్యమేగానీ.. అంతా ఎలా అని ఆశ్చర్యపోనక్కరలేదు. ఆ అద్భుతం త్వరలోనే నిజం కానుంది. అంతా పోలండ్ శాస్త్రవేత్త ఓల్గా మలినికివజ్ పరిశోధనల ఫలితం. అత్యంత చౌక సోలార్ ప్యానెల్స్‌ను తయారు చేసేందుకు ఈ లేడీ శాస్త్రవేత్త ఓ వినూత్న పద్ధతిని ఆవిష్కరించారు మరి. పెరోవోస్‌స్కైట్స్ అనే సేంద్రీయ పదార్థం ద్వారా సౌరశక్తిని ఒడిసిపట్టవచ్చునని చాలాకాలంగా తెలిసినప్పటికీ అవన్నీ వ్యయప్రయాసలతో కూడుకున్నవి. ఈ నేపథ్యంలో ఓల్గా పెరోవోస్‌స్కైట్స్ సోలార్ సెల్స్‌ను అతితక్కువ ఉష్ణోగ్రతల్లోనే తయారు చేసేందుకు కొత్త పద్ధతిని సిద్ధం చేశారు. సాధారణ ఇంక్ జెట్ ప్రింటర్ ద్వారా మనం అక్షరాలను ముద్రించినంత సులువుగా సోలార్ సెల్స్‌ను, ప్యానెల్స్‌ను ముద్రించుకునే అవకాశం లభిస్తుంది. అంతేకాకుండా.. అన్నిరకాల ఉపరితలాలపై దీన్ని అతికించుకోవచ్చు. స్వీడన్‌కు చెందిన స్కాన్‌స్కా ఈ కొత్త పద్ధతి ద్వారా తయారు చేసిన సోలార్ ప్యానల్స్‌ను పోలండ్‌లోని వార్సా నగరంలోని భవనంపై అతికించి పరిశీలిస్తోంది. దాదాపు 1.3 చదరపు మీటర్ల సైజున్న ప్యానెల్‌తో ఒక పీసీ రోజంతా పనిచేసేంత విద్యుత్తు ఉత్పత్తి చేయవచ్చునని. తయారీకయ్యే ఖర్చు 4 – 4.5 వేలకు మించదని అంచనా.

గుండెజబ్బులను గుర్తించేందుకు కొత్త పద్ధతి



గుండెజబ్బు వచ్చే అవకాశాన్ని ముందుగా గుర్తించగలిగితే ఎన్నో విలువైన ప్రాణాలను కాపాడవచ్చునన్నది అందరికీ తెలిసిన విషయమే. కాకపోతే ఇప్పటివరకూ ఆ అవకాశం లేకుండా పోయింది. ఛాతి, భుజం లేదా ముఖంలోని ఒక పార్శ్వంలో నొప్పి వస్తే.. అర్జెంటుగా ఆసుపత్రిలో చేరడమే ప్రస్తుతం మనం చేయగలిగిన పని. అయితే డ్యూక్ యూనివర్శిటీ శాస్త్రవేత్తలు చేపట్టిన ఒక పరిశోధన పుణ్యమా అని ఇప్పుడు ఈ పరిస్థితి మారనుంది. రక్తనాళాలల్లో పూడికలను చాలాముందుగానే గుర్తించేందుకు వీరో ఒక పద్ధతిని ఆవిష్కరించారు. ట్రెడ్‌మిల్ పరీక్షల తరువాత రెండు గంటలకు కొంతమంది రక్తాన్ని పరిశీలించినప్పుడు కనీసం ఐదు రకాల జీవ రసాయనాల్లో మార్పులు గుర్తించారు శాస్త్రవేత్తలు. కొవ్వులు, అమినోయాసిడ్ల వంటి ఈ రసాయనాల్లో వచ్చిన మార్పులను మరింత కచ్చితత్వంతో గుర్తిస్తే రక్తప్రసరణలో ఏదో తేడా ఉన్నట్లు స్పష్టమవుతుందని... ప్రస్తుతం ఉపయోగిస్తున్న పద్ధతులకు ప్రత్యామ్నాయంగా దీన్ని వాడవచ్చునని ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త అలెగ్జాండర్ టి. లింకాకెంగ్ అంటున్నారు. శరీరంలోకి నాళాన్ని పంపించాల్సిన అవసరం తగ్గుతుందని వివరించారు. మరింత విస్తత స్థాయిలో అధ్యయనం చేసేందుకు డ్యూక్ శాస్త్రవేత్తలు ప్రస్తుతం ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆర్థోపెడిక్ కౌన్సెలింగ్


ఏసీఎల్ టేర్ అంటే ఏమిటి?

నా వయసు 27 ఏళ్లు. నేను మంచి స్పోర్ట్స్ పర్సన్‌ను. ఇష్టంగా ఆటలాడుతుంటాను. ఏడాది కిందట ఒక సారి హైజంప్ చేసే సమయంలో మోకాలిలో తీవ్రమైన నొప్పివచ్చింది. డాక్టర్‌ను కలిస్తే 'పార్షియల్ ఏసీఎల్ టేర్' జరిగిందని వివరించారు. కొన్ని రోజులు ఫిజియోథెరపీ తీసుకొమ్మనీ, ఆ తర్వాత ఎప్పట్లాగే ఆటలాడవచ్చని చెప్పారు. నాకు ఇప్పటికీ నాకు అప్పుడప్పుడూ ఇంకా నొప్పిగానే ఉంటోంది. అసలీ ఏసీఎల్ టేర్ అంటే ఏమిటి? నాకు తగిన సలహా ఇవ్వండి.

- ఆర్. సంజేయ్, హైదరాబాద్

ఆటలు ఆడే సమయంలో మీరు చెప్పిన యాంటీరియర్ క్రూసియేట్ లిగమెంట్ (ఏసీఎల్) గాయపడటం చాలా సాధారణంగా జరిగేదే. పాశ్చాత్యదేశాల వారు స్పోర్ట్స్ సమయంలో దీనికి ఏసీఎల్‌కు లోనవుతుంటారు. కానీ మనదేశంలో సాధారణంగా టూవీలర్ నడిపేవారు యాక్సిడెంట్‌కు గురైనప్పుడు ఈ లిగమెంటు దెబ్బతింటుంది. ఇది మోకాలిలో ఉండే కీలకమైన లిగమెంటు. ఒకసారి ఇది గాయపడితే దీనికి రక్తసరఫరా జరగదు కాబట్టి ఇది ఒక శాశ్వతనష్టం చేకూర్చే ప్రమాదంగా పరిణమిస్తుంది. ఈ లిగమెంట్ దెబ్బతిన్న వారు... అంటే ఏసీఎల్‌కు గాయం అయిన వారు సరిగా నిలబడలేకపోవడం మామూలే. కొన్నేళ్ల తర్వాత అది ఆర్థరైటిస్‌గా మారడం కూడా జరుగుతుంది.

సాధారణంగా 50 ఏళ్ల కంటే పెద్ద వయసు ఉన్న వారిలో ఏసీఎల్ గాయపడితే సాధారణ సంప్రదాయ చికిత్స చేస్తూ, మోకాలి కదలికలు తగ్గించుకొమ్మని చెబుతూ, వ్యాయామాలను సూచిస్తుంటాం. కానీ చిన్న వయసు వారిలో అంటే... 40 ఏళ్ల కంటే తక్కువ వారికి మాత్రం శస్త్రచికిత్స సూచిస్తుంటాం. ఇందులో కొత్త లిగమెంటు పునర్నిర్మాణం చేస్తుంటాం. దీనివల్ల వారిలో ఆర్థరైటిస్ రాకుండా నివారించడం సాధ్యమవుతుంది. మీరు ఎమ్మారైను బట్టి పార్షియల్ టేర్ అంటున్నారనుకుంటాను. కానీ మీరు చెబుతున్న లక్షణాలను బట్టి చూస్తే ఆ లిగమెంట్ పూర్తిగా చిరిగిపోయి ఉంటుందని ఊహించవచ్చు. కాబట్టి మీరు ఇప్పట్లో జంపింగ్స్, రన్నింగ్ వంటి వ్యాయామాలు, స్పోర్ట్స్ మొదలుపెట్టకండి. మీ పరిస్థితిని పూర్తిగా సమీక్షించేలా ఒకసారి మీకు దగ్గరలో ఉన్న ఆర్థోపెడిక్ నిపుణుడిని కలిసి, తగిన సలహా తీసుకోండి.



ఫ్యామిలీ డాక్టర్

ఇంత చిన్న వయసులోనే మోకాళ్ల నొప్పులా?

నా వయసు 29 ఏళ్లు. గత కొద్ది నెలలుగా నేను రెండు మోకాళ్లలోనూ తీవ్రమైన నొప్పితో బాధపడుతున్నాను. మెట్లు ఎక్కుతున్నప్పుడు నొప్పి మరీ ఎక్కువగా వస్తోంది. నేను చాలారకాల మందులు వాడాను. ఇప్పటికీ వాడుతూనే ఉన్నాను. ఈ చిన్న వయసులోనే ఇలా మోకాళ్ల నొప్పులు రావడం ఆందోళన కలిగిస్తోంది. నాకు తగిన సలహా ఇవ్వండి.

- ఆర్. సుధాకర్, ఏలూరు

మీ సమస్యను నిశితంగా విశ్లేషించాక మీకు మోకాలిచిప్ప ముందు భాగంలో ఉండే పటెల్లా అనే ఎముకపై ఒత్తిడి పడుతున్నట్లుగా అనిపిస్తోంది. చాలామంది యువకుల్లో వచ్చే సమస్యే ఇది. ఇది కొందరిలో కొన్ని నెలల నుంచి కొన్నేళ్ల వరకు ఉంటుంది. ఏదైనా బరువులు ఎత్తినప్పుడు దానిపై పడే అదనపు భారం వల్లనే ఈ సమస్య వస్తుంటుంది. లేదా అతిగా మెట్లు ఎక్కుతుండటం, ఎప్పుడూ బాసిపట్లు (సక్లంముక్లం) వేసుకొని కూర్చోవడం వల్ల కూడా ఈ సమస్య రావచ్చు. ఇది చాలా తాత్కాలికమైన సమస్య. ఇదేమీ ఆర్థరైటిస్ వంటి దీర్ఘకాలిక సమస్య కాబోదు. కాబట్టి అతిగా ఆందోళన పడకుండా మీకు దగ్గర్లోని ఆర్థోపెడిక్ సర్జన్‌ను సంప్రదించి, తగిన చికిత్స తీసుకోండి.



డాక్టర్ కె. సుధీర్‌రెడ్డి,
చీఫ్ ఆర్థోపెడిక్ సర్జన్,
ల్యాండ్‌మార్క్ హాస్పిటల్స్ కేపీహెచ్‌బీ,
హైదరాబాద్

పాతరోచితం

పాత(ర) ధాన్యం... పోషకం

'పాతర' అనే మాట నేటి తరానికి కొత్తగా అనిపించినా, తరతరాల నుండి వినిపిస్తున్న పాత మాటే. భూమిని తవ్వి అందులో ధాన్యాన్ని లేదా ఏదైనా వస్తువును పెట్టి మళ్లీ మట్టిని కప్పేదాన్ని 'పాతర' అని అంటారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన పంటను కళ్లాల్లోకి తెచ్చి నూర్పులు చేస్తారు. ఏడాది పొడుగునా కుటుంబం తినేందుకు సరిపడే ధాన్యం దాచుకునేందుకు, పెళ్లీ, పేరంటాలు, గ్రామదేవతా ఉత్సవాలు వంటి శుభ కార్యాలలో బియ్యం కొరత లేకుండా ముందస్తు జాగ్రత్తగా పాతర వేసి ధాన్యం నిల్వ ఉంచుకుంటారు. సంక్రాంతి అనంతరం కళ్లాల్లోని ధాన్యలక్ష్మిని పూజించి ఇంటికి తెచ్చి వాటిని పాతర వేస్తారు. అలా మే నెలాఖరు వరకు పాతర్లలో ధాన్యం నిల్వ చేస్తారు. అనంతరం బయటకు తీసిన ధాన్యాన్ని ఎండలో ఆరబెట్టి మిల్లు చేస్తారు. ఇలా పాతర వేసిన బియ్యం నాణ్యంగా, ఆరోగ్యకరమైన పోషక విలువలుండేలా, రుచికరంగా ఉంటాయని పాత తరం వారు చెబుతున్నారు. సంక్రాంతి నుండి నెల రోజుల పాటు నిత్యం పాతరను ఆవుపేడతో ఆవు పేడతో అలుకుతారు. ఉదయం, సంధ్యవేళల్లో రంగురంగుల ముగ్గులతో అలకంరించి, వాటిపై గొబ్బెమ్మలు పెట్టి ధాన్యలక్ష్మీ అవతారంగా భావించి దీపారాధన చేస్తారు.



పాతర వేయడంలో ఆంతర్యం ఇదే...

పాతర ధాన్యం తిన్న పాపలు పుష్టిగా ఉంటారని గ్రామీణ ప్రాంతాల్లో నానుడి ప్రచారంలో ఉంది. ఈ ధాన్యం ఆరోగ్యవంతంగా ఉండటమే కాకుండా భూస్వాముల ప్రతిష్టకు గౌరవం తెచ్చేవిగా చెబుతారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే రైతులు అధికంగా పూరింట్లో నివాసం ఉండే వారు. జనవరి నెల నుంచి మే, జూన్ నెల వరకు అగ్ని ప్రమాదాలు సంభవించే సమయంలో ఆరుగాలం శ్రమించి పండించిన పంట ఇళ్లల్లో దాచిన సమయాల్లో అగ్నికి ఆహుతి కాకుండా ముందస్తు జాగ్రత్తగా ఇళ్ల ముందు గొయ్యి తీసి అందులో ధాన్యం ఉంచడం వల్ల అవి సురక్షితంగా ఉండే అవకాశం ఉంటుంది.



మే నెలలో అధికంగా వివాహాలు, గ్రామదేవత ఉత్సవాలు రోజుల తరబడి నిర్వహించే నేపథ్యంలో ఇంటికి వచ్చిన అతిథులకు, స్నేహితులకు, బంధువులకు మూడు పూటలా భోజనాలు అవసరమైనపక్షంలో వెంటవెంటనే పాతర్ల నుండి అవసరం మేర ధాన్యం తీసి వినియోగించేవారు. అంతేకాకుండా కరువు కాటకాలు ఏర్పడిన సమయంలో పాతర్లలో ధాన్యం వినియోగించేవారు.

– మద్దిలి కేశవరావు, సాక్షి, ఇచ్ఛాపురం రూరల్

పాతర ఎత్తును బట్టి...

గ్రామాల్లో రైతుల ఇళ్ల ముందు వేసిన పాతర ఎంత ఎత్తులో ఉంటే ఆతను ఎన్ని ఎకరాల భూస్వామిగా అప్పట్లో నిర్ధారించేవారు. అంతేకాదు, సదరు రైతు హుందాకు చిహ్నంగా పాతరను చెప్పవచ్చు. ఆ ఏడాది పొడవునా అన్నదాతగా ఆ రైతుకు గౌరమర్యాదలు దక్కేవి.

పిల్లాడి పాదంలో ఉండాల్సిన ఒంపు లేదు... ప్రమాదమా?

మా బాబు వయసు నాలుగున్నరేళ్లు. వాడి ఎదుగుదల, ఆకృతి అన్నీ బాగానే ఉన్నాయి. కానీ కొంతమంది వాడి పాదాలు చూసి... పాదంలో సహజంగా ఉండే ఒంపు లేదనీ, పాదం పూర్తిగా ఫ్లాట్‌గా ఉందని అన్నారు. భవిష్యత్తులో నడకగానీ, ఆటలాడటం గానీ కష్టమవుతుంది అన్నారు. దాంతో మేము ఆందోళనతో డాక్టర్‌కు చూపించాం. బాబును చూసి, డాక్టర్‌గారు ప్రత్యేకమైన షూ సూచించారు. భవిష్యత్తులో సర్జరీ అవసరం కావచ్చని కూడా చెప్పారు. మా బాబుకు ఆ ప్రత్యేకమైన షూ తొడిగించాలని ప్రయత్నించాం. కానీ వాడు ఆ షూస్ తొడుక్కోడానికి ఇష్టపడటం లేదు. పైగా అవి లేకుండానే మామూలుగా నడవడం, పరుగెత్తడం చేస్తున్నాడు. వాడికి భవిష్యత్తులో ఏదైనా సమస్య వస్తుందేమోనంటూ ఇప్పుడు తీవ్రంగా ఆందోళన చెందుతున్నాం. దయచేసి మాకు తగిన సలహా ఇవ్వగలరు.

- కె. వెంకటేశ్, చిత్తూరు

మీరు పాదం మధ్యలో ఒంపు లేకుండా ఉంటే ఫ్లాట్ ఫీట్ గురించి పూర్తిగా అపోహపడుతున్నారు. అలా పాదం మధ్య ఒంపు ఉండాలన్నది కేవలం ఒక దురభిప్రాయం మాత్రమే. మన జనాభాలోని 6 – 8 శాతం మందిలో పాదంలో ఒంపు (ఆర్చ్) ఉండదు. పైగా అప్పుడే పుట్టిన నవజాత శిశువుల్లో పాదం మధ్యలో ఉండాల్సిన ఒంపు సరిగా కనిపించదు. మూడు నుంచి ఐదేళ్ల వయసు నుంచి ఆ ఒంపు పెరుగుతూ పోతుంటుంది. కేవలం కొద్దిమంది పిల్లల్లోనే పాదంలో ఉండాల్సిన ఎముకలన్నీ కలిసిపోయి, అది చాలా బాధాకరమైన సమస్యగా పరిణమిస్తుంది. కానీ ఇలా జరగడం చాలా అరుదైన సందర్భాల్లో మాత్రమే కనిపిస్తుంది. చిన్నారులు పెరుగుతున్న కొద్దీ ఒంపు లేని పాదాలు (ఫ్లాట్ ఫీట్) ఉన్న చాలామందికి ఎలాంటి చికిత్స లేకుండానే ఆ సమస్య సరైపోతుంది. ఇలాంటి పిల్లలు భవిష్యత్తులో ఆటలాడలేరన్నది కూడా పూర్తిగా తప్పుడు అభిప్రాయం. వాళ్లు కూడా అందరు పిల్లల్లాగానే ఆడుకోగలరు. ఉదాహరణకు సయీద్ ఓవుటా అనే మొరాక్ ఆటగాడు ఒలిపింక్స్‌లో 1984లో ఒలిపింక్స్‌లో బంగారు పతకం సాధించాడు. అలాన్ వెబ్ అనే అమెరికన్ అథ్లెట్ పరుగులో ప్రపంచ రికార్డును నెలకొల్పాడు. వాళ్లంతా ఫ్లాట్ ఫీట్‌తో పుట్టిన వాళ్లే. కాబట్టి మీరు మీ బాబు గురించి ఆందోళనపడటం మానేయండి. అతడు బాగా నొప్పి అని ఫిర్యాదు చేస్తే తప్ప... సాధారణంగా అతడికి ఎలాంటి సర్జరీ అవసరం ఉండకపోవచ్చు. మీకు ఉన్న దురభిప్రాయమే చాలా కాలం కిందట చాలమందిలో ఉండేది. ఇప్పటి ఆధునిక వైద్యవిజ్ఞాన పరిశోధనల్లో అది తప్పు అని తేలింది.



మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com



ఎన్‌సీహెచ్‌ఎం-జేఈఈ-2019
ఆతిథ్యం.. ఆహ్వానం!

ఇంటర్మీడియెట్ పూర్తి చేసుకోబోతున్నారా.. ఇంజనీరింగ్, మెడిసిన్ వంటి కోర్సులు కాకుండా.. విభిన్నమైన కెరీర్ గురించి అన్వేషణ సాగిస్తున్నారా.. ఆ కోర్సుతో బెస్ట్ ఫ్యూచర్ సొంతం చేసుకోవాలనేది మీ లక్ష్యమా.. అయితే..మీకు సరైన కోర్సు..హోటల్ మేనేజ్‌మెంట్ అంటున్నారు నిపుణులు! అందుకు చక్కటి వేదికలు.. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్(ఐహెచ్‌ఎం) క్యాంపస్‌లు!! వీటిలో అడుగుపెట్టడానికి మార్గం.. ఎన్‌సీహెచ్‌ఎం-జేఈఈ. తాజాగా 2019-20 విద్యా సంవత్సరంలో.. జాతీయ స్థాయిలోని ఐహెచ్‌ఎంలలో ప్రవేశానికి.. ఎన్‌సీహెచ్‌ఎం-జేఈఈ 2019 నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నేపథ్యంలో.. హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులు..కెరీర్ అవకాశాలు.. ఐహెచ్‌ఎంల ప్రత్యేకత.. ఎన్‌సీహెచ్‌ఎం-జేఈఈ పరీక్ష విధానం గురించి తెలుసుకుందాం...

- ఇంటర్ విద్యార్థులకు ఉత్తమ ప్రత్యామ్నాయంగా హోటల్‌మేనేజ్‌మెంట్ కోర్సులు
- ఎన్‌సీహెచ్‌ఎం-జేఈఈ ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న ఇన్‌స్టిట్యూట్స్‌లో ప్రవేశాలు
- ఆన్‌లైన్ విధానంలో ఏప్రిల్ 27న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్న ఎన్‌టీఏ
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది మార్చి 15, 2019

ఐఐటీలు.. ఇంజనీరింగ్‌లో నిపుణులను తీర్చిదిద్దే వేదికలు!
ఐఐఎంలు... భవిష్యత్తు మేనేజ్‌మెంట్ ప్రొఫెషనల్స్‌కు మార్గం!
ఇదే బాటలో.. హోటల్ మేనేజ్‌మెంట్ రంగానికి అవసరమైన నిపుణులను అందించేందుకు.. ఐహెచ్‌ఎంలు..!!

ఇవి.. హోటల్ మేనేజ్‌మెంట్ రంగానికి ఉపయోగపడేలా నిపుణులైన మానవ వనరులను తీర్చిదిద్దాలనే సంకల్పంతో కేంద్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాటైన ఇన్‌స్టిట్యూట్‌లు. స్వదేశీ, విదేశీ పర్యాటకుల సంఖ్య ఏటా లక్షల సంఖ్యలో పెరుగుతుండటం.. ఫలితంగా హోటల్ మేనేజ్‌మెంట్ రంగం ఏటా సగటున 12 శాతం వృద్ధి సాధిస్తోంది. దీంతో పర్యాటకులకు ఆతిథ్యం ఇచ్చేందుకు అవసరమైన హాస్పిటాలిటీ రంగం విస్తరిస్తోంది.

ఐహెచ్‌ఎం క్యాంపస్‌లలో ప్రవేశం

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ క్యాంపస్‌లలో.. బ్యాచిలర్ ఆఫ్ సైన్స్(హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్) కోర్సుల్లో ప్రవేశానికి జాతీయ స్థాయిలో నిర్వహించే పరీక్షే.. ఎన్‌సీహెచ్‌ఎం-జేఈఈ(నేషనల్ కౌన్సిల్ ఫర్ హోటల్ మేనేజ్‌మెంట్-జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్). ఈ ఎంట్రెన్స్‌లో ఉత్తీర్ణత సాధించి ఆయా ఇన్‌స్టిట్యూట్స్‌లో.. హాస్పిటాలిటీ, హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులు పూర్తి చేసిన వారికి కెరీర్ అవకాశాలు కోకొల్లలు. 2022 నాటికి ఈ రంగంలో దాదాపు రెండు లక్షల మంది నిపుణుల అవసరం ఉంటుందంటున్న పలు సర్వేల గణాంకాలే ఇందుకు నిదర్శనం.

నిర్వహించనున్న ఎన్‌టీఏ

ఎన్‌సీహెచ్‌ఎం జేఈఈని ఈ ఏడాది నుంచి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ఆధ్వర్యంలో ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తున్నారు. ఒక్కో ప్రశ్నకు నాలుగు మార్కులు చొప్పున మొత్తం 200 ప్రశ్నలతో ఆబ్జెక్టివ్ తరహాలో పరీక్ష జరుగనుంది. పరీక్షకు లభించే వ్యవధి మూడు గంటలు. మెరిట్ జాబితా రూపకల్పనలో ముందుగా ఇంగ్లిష్ విభాగంలో అత్యధిక మార్కులు సాధించిన వారిని పరిగణనలోకి తీసుకుంటారు. కాబట్టి ఇంగ్లిష్ విభాగంలో మెరుగ్గా రాణించేందుకు కృషి చేయాలి.

ఎన్‌సీహెచ్‌ఎం-జేఈఈ-2019 ఇలా

ఎన్‌సీహెచ్‌ఎం జేఈఈ ఎంట్రెన్స్ మొత్తం అయిదు విభాగాల్లో 200 మార్కులకు నిర్వహిస్తారు. వివరాలు..

విభాగం	ప్రశ్నలు
న్యూమరికల్ ఎబిలిటీ అండ్ అనలిటికల్ ఆప్టిట్యూడ్	30
రీజనింగ్ అండ్ లాజికల్ డిడక్షన్	30
జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్	30
ఇంగ్లిష్ లాంగ్వేజ్	60
ఆప్టిట్యూడ్ ఫర్ సర్వీస్ సెక్టార్	50
మొత్తం ప్రశ్నలు	200

63 ఇన్‌స్టిట్యూట్‌లు.. తొమ్మిది వేలకు పైగా సీట్లు

ఎన్‌సీహెచ్‌ఎం జేఈఈ ద్వారా కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని 21 ఐహెచ్‌ఎం క్యాంపస్‌లు.. ఆయా రాష్ట్రాల ప్రభుత్వాల ఆధ్వర్యంలోని 21 ఇన్‌స్టిట్యూట్‌లతోపాటు ఎన్‌సీహెచ్‌ఎం గుర్తింపు పొందిన మరో 20 ప్రైవేటు ఇన్‌స్టిట్యూట్‌లలో తొమ్మిది వేలకుపైగా సీట్లు అందుబాటులో ఉన్నాయి. దీంతోపాటు ఇండియా టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నేతృత్వంలోని ఢిల్లీలో అశోకా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హాస్పిటాలిటీ అండ్ టూరిజం మేనేజ్‌మెంట్‌లోని 90 సీట్లను కూడా ఎన్‌సీహెచ్‌ఎం కౌన్సెలింగ్ ఆధారంగానే కేటాయిస్తారు. ఈ ఏడాది మరో మూడు ప్రభుత్వ ఇన్‌స్టిట్యూట్‌లకు అనుమతి లభించే అవకాశముంది. వీటిలో అధిక శాతం ఇన్‌స్టిట్యూట్‌లు బీఎస్‌సీ (హాస్పిటాలిటీ అండ్ అడ్మినిస్ట్రేషన్) కోర్సును అందిస్తున్నాయి. మరికొన్ని ఇన్‌స్టిట్యూట్‌లు కేటరింగ్ టెక్నాలజీ, టూరిజం వంటి కోర్సుల్లోనూ ప్రవేశం కల్పిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వ ఇన్‌స్టిట్యూట్‌లైన ఐహెచ్‌ఎం క్యాంపస్‌లలో ప్రవేశానికి ఆన్‌లైన్ విధానంలో ఉమ్మడి కౌన్సెలింగ్ ద్వారా సీట్ల కేటాయింపు జరుగుతుంది. ఇతర ఇన్‌స్టిట్యూట్‌లు ఎన్‌సీహెచ్‌ఎం-జేఈఈలో ర్యాంకు ప్రాతిపదికగా వేర్వేరుగా కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లు భర్తీ చేస్తాయి.



ఎన్‌సీహెచ్‌ఎం-జేఈఈ-2019 సమాచారం

- **అర్హత:** ఇంగ్లిష్ ఒక సబ్జెక్ట్‌గా ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత. ప్రస్తుతం ద్వితీయ సంవత్సరం చదువుతున్న అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- **వయోపరిమితి:** జూలై1,2019 నాటికి 25 ఏళ్లు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు మూడేళ్ల సడలింపు.

దరఖాస్తు విధానం

అభ్యర్థులు ఆన్‌లైన్ విధానంలోనే దరఖాస్తు చేయాలి. ఇందుకోసం.. **www.ntanchm.nic.in** వెబ్‌సైట్‌లో లాగిన్ ఐడీ క్రియేట్ చేసుకోవాలి.

ఎన్‌సీహెచ్‌ఎం-జేఈఈ-2019 ముఖ్య తేదీలు

- **ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు:** జనవరి 15, 2019- మార్చి 15, 2019
- **ఆన్‌లైన్‌లో దరఖాస్తు ఫీజు చెల్లింపు చివరి తేదీ:** మార్చి 16, 2019
- **అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్ సదుపాయం:** ఏప్రిల్ 3, 2019
- **ఎన్‌సీహెచ్‌ఎం-జేఈఈ ఆన్‌లైన్ టెస్ట్ తేదీ:** ఏప్రిల్ 27, 2019
- **ఫలితాల వెల్లడి:** మే 15, 2019.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** **www.ntanchm.nic.in**

ప్రిపరేషన్... పటిష్టంగా...

న్యూమరికల్ ఎబిలిటీ, అనలిటికల్ ఆప్టిట్యూడ్

మ్యాథమెటిక్స్ బేసిక్ నైపుణ్యాలను పరీక్షించేలా ప్రశ్నలు అడుగుతారు. కాబట్టి అభ్యర్థులు హైస్కూల్ స్థాయిలోని మ్యాథమెటిక్స్ ప్రాథమిక అంశాలపై అవగాహన పెంచుకోవాలి. వీటిలోనూ ముఖ్యంగా శాతాలు, లాభ-నష్టాలు, నెంబర్ సిస్టమ్, సగటు, కాలం-పని, సాధారణ వడ్డీ, బారు వడ్డీ, కాలం-వేగం-దూరం, నిష్పత్తులు, జామెట్రీ వంటి అంశాల్లో మరింత పట్టు సాధించాలి. అనలిటికల్ ఆప్టిట్యూడ్ విషయంలో నిర్దిష్టంగా డేటాను విశ్లేషించగలిగే సామర్థ్యం, డేటాలోని ముఖ్య సమాచారాన్ని క్రోడీకరించి ఇచ్చిన ప్రశ్నకు సమాధానం ఇచ్చే నైపుణ్యం సొంతం చేసుకోవాలి. ఇందుకోసం గ్రాఫ్‌లు, పై చార్ట్‌లు, ఫ్లో చార్ట్‌లు వంటి వాటిని ప్రాక్టీస్ చేయాలి.

రీజనింగ్, లాజికల్ డిడక్షన్

అభ్యర్థుల్లోని సునిశిత పరిశీలన, తార్కిక విశ్లేషణ నైపుణ్యాలను పరీక్షించే విభాగమిది. ఇందులో మెరుగైన ప్రతిభ కనబర్చాలంటే.. మ్యాథమెటికల్ ఆపరేషన్స్, కోడింగ్-డీకోడింగ్, నంబర్ సిరీస్, బ్లడ్ రిలేషన్ వంటి రీజనింగ్ ఆధారిత అంశాలపై పట్టు సాధించాలి. ఇందుకోసం ప్రిపరేషన్ సమయంలో ప్రాక్టీస్‌కు ప్రాధాన్యమివ్వాలి. డేటాసఫీషియన్సీ, వెన్ డయాగ్రమ్స్ ప్రాక్టీస్ చేయడం కూడా ప్రయోజనకరంగా ఉంటుంది.

జనరల్ నాలెడ్జ్ ,కరెంట్ అఫైర్స్

అభ్యర్థులకు సామాజిక అంశాలు, సమకాలీన పరిణామాలపై ఉన్న అవగాహనను పరీక్షించే విభాగం ఇది. ఇందులో మంచి మార్కులు పొందాలంటే.. హైస్కూల్ స్థాయి పుస్తకాల్లోని చరిత్ర, రాజ్యాంగం, జాగ్రఫీ, ఎకనామిక్స్ పాఠ్యాంశాలు చదవాలి. హిస్టరీలో ముఖ్యమైన యుద్ధాలు-పరిణామాలు-పర్యవసానాలు, స్వాతంత్ర్యోద్యమం వంటి అంశాలపై అవగాహన లాభిస్తుంది. జాగ్రఫీలో ముఖ్యమైన ప్రదేశాలు, ఖనిజ వనరులు-అవి ఎక్కువగా లభించే ప్రాంతాలు, నదులు, సరస్సులు, పర్వతాల గురించి క్షుణ్నంగా అధ్యయనం చేయాలి. కరెంట్ అఫైర్స్ పరంగా ముఖ్యమైన సదస్సులు, సమావేశాలు, వార్తల్లోని వ్యక్తులు, ఇటీవల కాలంలో అంతర్జాతీయ ప్రాముఖ్యం సంతరించుకున్న అంశాలపై అవగాహన ఏర్పరచుకోవాలి.

ఇంగ్లిష్ లాంగ్వేజ్

ఇంగ్లిష్ లాంగ్వేజ్ విభాగంలో రాణించడానికి అభ్యర్థులు గ్రామర్‌ను ఔపోసన పట్టాలి. టెన్సెస్, ప్రిపోజిషన్స్, వన్ వర్డ్ సబ్‌స్టిట్యూట్స్, ఇడియమ్స్ అండ్ ఫ్రేజెస్, యాంటానిమ్స్, సినానిమ్స్, సెంటెన్స్ ఫార్మేషన్, స్పాటింగ్ ద ఎర్రర్స్, సీక్వెన్స్ ఆఫ్ వర్డ్స్‌పై పూర్తి స్థాయిలో పట్టు సాధించాలి. దీని కోసం బేసిక్ గ్రామర్ పుస్తకాలను చదవడంతో పాటు దినపత్రికలు చదవడం, వాటిలోని కొత్త పదాలకు అర్థాలు తెలుసుకోవడం, ఆ పదాలను వినియోగించిన తీరుపై అవగాహన ఏర్పరచుకోవడం వంటివి లాభిస్తాయి. పదోతరగతి స్థాయి ఇంగ్లిష్ పుస్తకాలను అధ్యయనం చేయడం ద్వారా ఈ విభాగంలో పేర్కొన్న అధిక శాతం సిలబస్‌ను పూర్తి చేసుకోవచ్చు.

ఆప్టిట్యూడ్ ఫర్ సర్వీస్ సెక్టార్

ఎన్‌సీహెచ్‌ఎం జేఈఈలో ప్రత్యేకమైన విభాగంగా ఆప్టిట్యూడ్ ఫర్ సర్వీస్ సెక్టార్ విభాగాన్ని పేర్కొనొచ్చు. ఇందులో ప్రధానంగా అభ్యర్థికి ఆతిథ్య, పర్యాటక రంగాల్లో ఉన్న ఆసక్తి, దృక్పథాన్ని పరీక్షించే ప్రశ్నలు ఉంటాయి. వాస్తవ సంఘటన లేదా ఏదైనా ఒక అంశం ఇచ్చి దానికి ఎలా స్పందిస్తారు? అనే తరహా ప్రశ్నలు అడుగుతారు. ఈ ప్రశ్నలు అభ్యర్థుల్లో ఎదుటి వారిని మెప్పించే తీరు, సందర్భానికి తగినట్లు వ్యవహరించే శైలికి సంబంధించి ఉంటాయి.

ఉపయోగపడే పుస్తకాలు

- **అరిహంత్ జనరల్ ఇంగ్లిష్ ఫర్ కాంపిటీటివ్ ఎగ్జామ్స్**
- **వెర్బల్ అండ్ నాన్ వెర్బల్ రీజనింగ్:** ఆర్.ఎస్. అగర్వాల్
- **క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్:** ఆర్.ఎస్.అగర్వాల్
- **ఆప్టిట్యూడ్ ఫర్ హోటల్ మేనేజ్‌మెంట్:** హోటల్ మేనేజ్‌మెంట్ -ఆర్.గుప్తా

హోటల్ మేనేజ్‌మెంట్.. లభించే కొలువులు



- గెస్ట్ రిలేషన్ ఎగ్జిక్యూటివ్స్
- ఫ్రంట్ డెస్క్ మేనేజర్
- క్రూయిజ్ మేనేజర్
- కిచెన్ ఎగ్జిక్యూటివ్
- మార్కెటింగ్ మేనేజర్
- సర్వీస్ ఎగ్జిక్యూటివ్
- అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్
- ట్రిప్ అడ్వైజర్
- చెఫ్స్
- బ్యాక్ ఎండ్ ఎగ్జిక్యూటివ్స్

కొలువు ఖాయం

ఎన్‌సీహెచ్‌ఎం-జేఈఈలో ర్యాంకు ద్వారా ఉత్తమ ఇన్‌స్టిట్యూట్‌లలో ప్రవేశం లభిస్తుంది. ఈ కోర్సులు పూర్తి చేసుకున్న వారికి స్టార్ హోటల్స్, టూరిజం ఏజెన్సీల్లో కొలువులు ఖాయం. ప్రారంభంలోనే రూ.4లక్షల నుంచి రూ.5లక్షల వార్షిక వేతనం అందుకోవచ్చు. ఐటీసీ, ఒబెరాయ్, తాజ్ గ్రూప్ వంటి హోటల్ ఇండస్ట్రీలోని ప్రముఖ సంస్థలు క్యాంపస్ డ్రైవ్స్ నిర్వహిస్తున్నాయి. ఈ రంగంలో రాణించాలంటే.. ఓర్పు, ఎదుటివారిని మెప్పించే తత్వం ఎంతో అవసరం.

– సంజయ్ ఠాకూర్, ప్రిన్సిపాల్, ఐహెచ్‌ఎం-హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వంలో...

జూనియర్ ఇంజనీర్ కొలువులు



ఎస్‌ఎస్‌సీ-జూనియర్ ఇంజనీర్లు

కేంద్రప్రభుత్వ రంగ సంస్థల్లోని జూనియర్ ఇంజనీర్ (జేఈ) పోస్టుల భర్తీకి స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ప్రకటన విడుదల చేసింది. జూనియర్ ఇంజనీర్ ఎగ్జామినేషన్-2018 ద్వారా కేంద్ర ప్రభుత్వంలోని వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న జూనియర్ ఇంజనీర్ (సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్, క్వాంటిటీ సర్వేయింగ్) పోస్టులను భర్తీ చేస్తారు.

- **అర్హత:** సంబంధిత విభాగాల్లో డిప్లొమా లేదా ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణత.
- **ఎంపిక:** రాత పరీక్ష (పేపర్-1, పేపర్-2), ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఆధారంగా.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **దరఖాస్తు ఫీజు:** రూ.100.
- **దరఖాస్తుకు చివరితేదీ:** ఫిబ్రవరి 25, 2019.
- **ఫీజు చెల్లించడానికి చివరితేదీ:** ఫిబ్రవరి 27, 2019
- **పేపర్-1 పరీక్ష (సీబీటీ) తేదీ:** 2019, సెప్టెంబర్ 23 నుంచి 27 వరకు.
- **పేపర్-2 పరీక్ష (కన్వెన్షనల్) తేదీ:** డిసెంబర్ 29, 2019.
- **వెబ్‌సైట్:** **https://ssc.nic.in**

ఐసీఎంఆర్-ఎన్‌ఐఆర్ఈహెచ్



ఖాళీలు 57

భోపాల్‌లోని ఐసీఎంఆర్-నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ రీసెర్చ్ ఇన్ ఎన్విరాన్‌మెంటల్ హెల్త్ (ఎన్ఐఆర్ఈహెచ్) 57 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. **టెక్నికల్ అసిస్టెంట్-34**
2. **టెక్నీషియన్-19**
3. **ల్యాబ్ అటెండెంట్-4.**

- **అర్హత:** పోస్టుల ఆధారంగా డిగ్రీ, ఇంటర్మీడియట్, పదో తరగతి ఉత్తీర్ణత.
- **ఎంపిక:** రాతపరీక్ష ఆధారంగా.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో.
- **దరఖాస్తుకు చివరితేదీ:** ఫిబ్రవరి 28, 2019.
- **వెబ్‌సైట్:** **https://icmr.nic.in**

పీఎన్‌బీ

ఖాళీలు 325

పంజాబ్ నేషనల్ బ్యాంక్ వివిధ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న 325 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాల వారీ ఖాళీలు:** సీనియర్ మేనేజర్ (క్రెడిట్)-51, మేనేజర్ (క్రెడిట్)-26, సీనియర్ మేనేజర్ (లా)-55, మేనేజర్ (లా)-55, మేనేజర్ (హెచ్ఆర్‌డీ)-18, ఆఫీసర్ (ఐటీ)-120.
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సంబంధిత విభాగాల్లో బ్యాచిలర్ డిగ్రీ/పీజీ/డిప్లొమా/సీఏ/ఐసీడబ్ల్యూఏ, ఎంబీఏ, పీజీడీఎం, బీఈ/బీటెక్, ఎంసీఏ ఉత్తీర్ణతతో పాటు అనుభవం ఉండాలి.
- **వయసు:** ఆఫీసర్ (ఐటీ) పోస్టులకు 21-28 ఏళ్లు, మేనేజర్ (లా) పోస్టులకు 25-32 ఏళ్లు, మిగతా పోస్టులకు 25-35 ఏళ్లు ఉండాలి.
- **ఎంపిక:** ఆన్‌లైన్ పరీక్ష, ఇంటర్వ్యూ.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో.
- **దరఖాస్తుకు చివరితేదీ:** ఫిబ్రవరి 15, 2019.
- **ఆన్‌లైన్ పరీక్ష తేదీ:** మార్చి 17, 2019.
- **వెబ్‌సైట్:** **www.pnbindia.in**

హెచ్‌ఏఎల్

ఖాళీలు 77

లక్నోలోని హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) యాక్ససరీస్ డివిజన్ టెన్యూర్ పద్ధతిలో 77 అసిస్టెంట్, ఆపరేటర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. **అసిస్టెంట్-43.**
   - **విభాగాలు:** అడ్మినిస్ట్రేషన్/అకౌంట్స్, క్యూసీ/ఇన్‌స్పెక్షన్, కమర్షియల్, సివిల్ వర్క్స్.
2. **ఆపరేటర్-34.**
   - **విభాగాలు:** ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, ఇన్‌స్ట్రుమెంటేషన్ మెకానిక్.

- **అర్హత:** సంబంధిత విభాగాల్లో ఐటీఐ, ఇంజనీరింగ్ డిప్లొమా, మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణత.
- **వయసు:** జనవరి 1, 2019 నాటికి 28 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక:** రాత పరీక్ష, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో.
- **దరఖాస్తుకు చివరితేదీ:** ఫిబ్రవరి 13, 2019.
- **వెబ్‌సైట్:** **https://halindia.co.in**

బొకారో స్టీల్ ప్లాంట్

ఖాళీలు 275

స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలోని బొకారో స్టీల్ ప్లాంట్ (జార్ఖండ్) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 275 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. **ఆపరేటర్ కమ్ టెక్నీషియన్ (ట్రైనీ)-95.**
2. **ఆపరేటర్ కమ్ టెక్నీషియన్ (బాయిలర్)-10.**
3. **అటెండెంట్ కమ్ టెక్నీషియన్ (ట్రైనీ)- 170.**

- **అర్హత:** పదో తరగతితో పాటు సంబంధిత ట్రేడులు/బ్రాంచుల్లో ఐటీఐ, డిప్లొమా ఉత్తీర్ణత.
- **వయసు:** ఆపరేటర్ కమ్ టెక్నీషియన్ (బాయిలర్) పోస్టులకు 30 ఏళ్లు, మిగిలిన వాటికి 28 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక:** రాతపరీక్ష/ట్రేడ్ టెస్ట్ ఆధారంగా.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో.
- **దరఖాస్తుకు చివరితేదీ:** ఫిబ్రవరి 18, 2019.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** **www.sail.co.in**

ప్రవేశాలు

ఎయిమ్స్‌ల్లో ఎంఎస్సీ ప్రోగ్రామ్స్

దేశంలోని వివిధ ఎయిమ్స్ సంస్థల్లో 2019కిగాను ఎంఎస్సీ ప్రోగ్రాముల్లో ప్రవేశాలకు ఎయిమ్స్-న్యూఢిల్లీ దరఖాస్తులు కోరుతోంది.

1. **ఎంఎస్సీ-నర్సింగ్**
   - **అర్హత:** బీఎస్సీ-ఆనర్స్/నర్సింగ్(పోస్ట్-సర్టిఫికెట్)/పోస్ట్‌బేసిక్/బీఎస్సీ నర్సింగ్ ఉత్తీర్ణత. నర్సు, రిజిస్టర్డ్ నర్స్, రిజిస్టర్డ్ మిడ్ వైఫ్‌గా రిజిస్ట్రేషన్ ఉండాలి.
2. **ఎంఎస్సీ-బయోటెక్నాలజీ**
   - **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో బీఎస్సీ/బీటెక్ ఉత్తీర్ణత.

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో.
- **బేసిక్ రిజిస్ట్రేషన్‌కు చివరితేదీ:** ఫిబ్రవరి 21, 2019.
- **ఫైనల్ రిజిస్ట్రేషన్ ప్రారంభం:** మార్చి 29, 2019.
- **చివరితేదీ:** ఏప్రిల్ 5, 2019.
- **వెబ్‌సైట్:** **www.aiimsexams.org**

యూజీసీ నెట్ (జూన్)-2019



దేశంలోని యూనివర్సిటీలలో అసిస్టెంట్ ప్రొఫెసర్, జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ అర్హత కోసం నిర్వహించే యూజీసీ నెట్ (జూన్)-2019 నోటిఫికేషన్‌ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) విడుదల చేసింది.

- **అర్హత:** కనీసం 55% మార్కులతో పీజీ ఉత్తీర్ణత. పీజీ చివరి ఏడాది చదువుతున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- **ఎంపిక:** కంప్యూటర్ బేస్డ్ రాత పరీక్ష.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో.
- **దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** మార్చి 1, 2019.
- **దరఖాస్తుకు చివరితేదీ:** మార్చి 30, 2019.
- **నెట్ పరీక్ష తేదీలు:** 2019, జూన్ 20 నుంచి 28 వరకు.
- **ఫలితాల వెల్లడి:** జులై 9, 2019.
- **వెబ్‌సైట్:** **https://ntanet.nic.in**

సీటెట్-జులై 2019

జాతీయస్థాయిలో ఉపాధ్యాయ ఉద్యోగాల అర్హతకు నిర్వహించే సెంట్రల్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (సీటెట్)-జులై 2019 ప్రకటనను సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) విడుదల చేసింది.

- **అర్హత:** (1) 1-5 తరగతులకు (ప్రైమరీ స్టేజ్): సీనియర్ సెకండరీ ఉత్తీర్ణతతో పాటు ఎలిమెంటరీ ఎడ్యుకేషన్‌లో డిప్లొమా (డీఎడ్) ఉండాలి. డీఎడ్ చివరి ఏడాది చదువుతున్న వారూ దరఖాస్తు చేసుకోవచ్చు. (2) 6-8 తరగతులకు (ఎలిమెంటరీ స్టేజ్): గ్రాడ్యుయేషన్‌తో పాటు బీఎడ్ లేదా డీఎడ్ ఉత్తీర్ణత. చివరి ఏడాది చదువుతున్న వారూ దరఖాస్తు చేసుకోవచ్చు.
- **ఎంపిక:** రాత పరీక్ష ఆధారంగా. ఇందులో రెండు పేపర్లుంటాయి. ప్రైమరీ స్టేజ్ అభ్యర్థులు పేపర్-1, ఎలిమెంటరీ స్టేజ్ అభ్యర్థులు పేపర్-2 రాయాల్సి ఉంటుంది. దేశ వ్యాప్తంగా 97 నగరాల్లో ఈ పరీక్ష ఉంటుంది.
- **రాత పరీక్ష తేదీ:** జులై 7, 2019.
- **ఫీజు:** జనరల్/ఓబీసీ అభ్యర్థులకు ఏదో ఒక పేపర్ అయితే రూ.700, (ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.350); జనరల్/ఓబీసీ అభ్యర్థులకు రెండు పేపర్లకు కలిపి రూ.1200, (ఎస్సీ,ఎస్టీ,దివ్యాంగులకు రూ.600)
- **దరఖాస్తుకు చివరితేదీ:** మార్చి 5, 2019.
- **ఫీజు చెల్లించడానికి చివరితేదీ:** మార్చి 8, 2019.
- **వెబ్‌సైట్:** **https://ctet.nic.in**

సాక్షి బిజినెస్

బుధవారం
6-2-2019

WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
34 ▲	22 ▲
36,617	10,934

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30గం॥లకు)

సూచీ	ముగింపు	మార్పు
నాస్‌డాక్	7,377	▲ 30
డోజోన్స్	25,357	▲ 118
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,177	▲ 143
డాక్స్	11,368	▲ 191
షాంఘై (శుక్రవారం ముగింపు)	2,618	▲ 34
నికాయ్	20,844	▲ 39

●అమెరికా ●బ్రిటన్ ●జర్మనీ ●చైనా ●జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			● కొనుగోలు	● అమ్మకం
$	యూఎస్ డాలర్	థామస్‌కుక్	70.95	72.6
£	బ్రిటన్ పౌండ్	థామస్‌కుక్	92.6	94.65
€	యూరో	థామస్‌కుక్	81.1	83.1
¥	జపాన్ ఎన్ (100)	థామస్‌కుక్	63.00	68.00
AUS	ఆస్ట్రేలియా డాలర్	థామస్‌కుక్	51.3	53.35
SS	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	51.45	54.75
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	17.75	20.85
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	--	--
¥	చైనా యువాన్	థామస్‌కుక్	9.55	11.3

నానో తయారీ లేదు... అమ్మకాలూ లేవు

- జనవరిలో పరిస్థితి ఇది...
- ఇది నిలిచిపోవచ్చన్న అంచనాలకు బలం



న్యూఢిల్లీ: టాటా మోటార్స్ చిన్న కారు నానో జనవరిలో ఒక్కటీ అమ్ముడుపోలేదు. అంతే కాదు, ఒక్క నానోను కూడా తయారు చేయలేదు. ఈ ఏడాది అక్టోబర్ నుంచి నూతన భద్రతా ప్రమాణాలు, 2020 ఏప్రిల్ నుంచి వచ్చే బీఎస్-6 కాలుష్య నియంత్రణ ప్రమాణాలకు అనుగుణంగా నానో కారును ఆధునీకరించే ప్రణాళికలు ఏవీ లేవని ఇటీవలే టాటా మోటార్స్ సేల్స్ విభాగం హెడ్ ప్రకటించిన విషయం గమనార్హం. ఈ ఏడాది జనవరిలో ఒక్కనానో కారును కూడా తయారు చేయలేదని, గతేడాది ఇదే నెలలో మాత్రం 83 నానో కార్లను తయారు చేసినట్టు టాటా మోటార్స్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు ఇచ్చిన సమాచారంలో పేర్కొంది. ఇక 2018 జవవరిలో దేశీయ మార్కెట్లో 62 నానో కార్లు అమ్ముడుపోగా, 2019 జనవరిలో ఒక్క నానో కూడా విక్రయం కాలేదని టాటా మోటార్స్ తెలిపింది. ఇక ఎగుమతుల విషయానికొస్తే గత నెలలో ఒక్క యూనిట్‌ను ఎగుమతి చేయలేదని, గతేడాది ఇదే నెలలోనూ ఇదే పరిస్థితి ఉందని వెల్లడించింది. ఈ విషయమై టాటా మోటార్స్ కంపెనీ ప్రతినిధిని మీడియా ప్రశ్నించగా... ప్రస్తుత రూపంలో ఉన్న నానో నూతన భద్రతా, కాలుష్య ప్రమాణాలను చేరలేదని, కొత్త పెట్టుబడులు అవసరమని చెప్పారు. ఈ విషయంలో ఇంత వరకు ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేశారు. కస్టమర్ల నుంచి డిమాండ్ ఉంటే నానోను తయారు చేస్తామని చెప్పారు. టాటా మోటార్స్ గతేడాది జూన్‌లో ఒక్క నానో కారును తయారు చేయగా, అదే నెలలో దేశీయ మార్కెట్లో మూడు నానో వాహనాలను విక్రయించింది. మధ్యతరగతి వర్గాలను లక్ష్యంగా చేసుకుని టాటా మోటార్స్ నానో కారును తొలిసారిగా 2008లో మార్కెట్‌కు పరిచయం చేసింది. కానీ, వినియోగదారుల నుంచి ఆశించిన ఆదరణ దక్కలేదు.

స్పైస్‌జెట్ మెగా ఆఫర్...
టికెట్ రూ.899కే

న్యూఢిల్లీ: దేశీయంగా స్వల్ప దూరాల ప్రయాణాలకు సంబంధించి ఎంపిక చేసిన రూట్లలో రూ. 899కే టికెట్ (అన్నీ కలిపి) సేల్ ప్రకటించింది. నాలుగు రోజుల పాటు ఈ మెగా సేల్ ఉంటుందని వెల్లడించింది. ఈ ఆఫర్ కింద గంట పైగా ఉండే ప్రయాణాలకు వన్ వే చార్జీలు అతి తక్కువగా కిలోమీటరుకు రూ. 1.75 స్థాయిలో ఉంటాయని తెలిపింది.



ఎంపిక చేసిన అంతర్జాతీయ రూట్లలో కిలోమీటరుకు రూ. 2.5 మాత్రమే చార్జీ అవుతుందని పేర్కొంది. సెప్టెంబర్ 25 దాకా ప్రయాణాలకు ఈ ఆఫర్ కింద టికెట్లు తీసుకోవచ్చు. ఫిబ్రవరి 9 దాకా ఆఫర్ ఉంటుంది. అత్యంత స్వల్ప దూరాలైన కొచ్చి-బెంగళూరు, హుబ్లీ-బెంగళూరు వంటి రూట్లలో వన్ వే చార్జీలు రూ. 899 నుంచి ప్రారంభమవుతాయి. అదే ముంబై-కొచ్చి వంటి రూట్లలో రూ. 1,849 నుంచి చార్జీ ఉంటుంది. అంతర్జాతీయ రూట్లలో మదురై-దుబాయ్ రూట్లో టికెట్ చార్జీలు రూ. 3,699 నుంచి ప్రారంభమవుతాయి.

ఆర్‌బీఐ పాలసీ సమావేశం ప్రారంభం

గురువారం వడ్డీరేట్లపై కీలక నిర్ణయం



న్యూఢిల్లీ: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మూడు రోజుల ద్రవ్య పరపతి విధాన సమీక్ష మంగళవారం ప్రారంభమైంది. గురువారంనాడు కీలక నిర్ణయాలను వెలువరించనుంది. 2018-19 ఆరవ ద్వైమాసిక పరపతి విధాన సమీక్ష ఇది. గవర్నర్ శక్తికాంతదాస్ నేతృత్వంలో మొట్టమొదటిసారి సమావేశమవుతున్న ఆరుగురు సభ్యుల పరపతి విధాన మండలి ఈ దఫా రెపో రేటును (బ్యాంకులకు తానిచ్చే రుణాలపై వసూలు చేసే వడ్డీరేటు- ప్రస్తుతం 6.5 శాతం) మార్చకపోవచ్చని విశ్లేషణలు ఉన్నాయి. అయితే ద్రవ్యోల్బణం దిగువ స్థాయిలో ఉన్నందున, పాలసీకి సంబంధించి తన పూర్వ 'జాగరూకతతో కూడిన కఠిన' వైఖరిని 'తటస్థం' దిశగా సడలించే అవకాశం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. గత డిసెంబర్ పరపతి విధాన సమీక్ష సందర్భంగా వడ్డీరేట్లను యథాతథంగా కొనసాగించన ఆర్‌బీఐ, ద్రవ్యోల్బణం ఇబ్బందులు తొలిగితే, రేటు తగ్గింపు చర్యలు ఉంటాయని సూచించింది. దేశ పారిశ్రామిక రంగం మందగమన స్థితిలో ఉండడం వల్ల రేటు విషయంలో ఆర్‌బీఐ కొంత సరళతర వైఖరి ప్రదర్శించవచ్చన్న అభిప్రాయం ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండుసార్లు ఆర్‌బీఐ రేట్లు పెరిగాయి.

రేటు తగ్గింపు వెసులుబాటు...

ఆర్‌బీఐకి రేటు కోతకు వెసులుబాటు ఉందని అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీ ఎస్అండ్‌పీ అభిప్రాయపడింది. తగ్గిన క్రూడ్ ధరలు, ద్రవ్యోల్బణానికి సానుకూలత అంశాలు తన విశ్లేషణకు కారణమని తాజా నివేదికలో పేర్కొంది.

ఆర్‌బీఐ నుంచి రూ.69,000 కోట్లు

ఆర్‌బీఐ నుంచి వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.69,000 కోట్లు డివిడెండ్‌గా రావచ్చని కేంద్ర ప్రభుత్వం అంచనా వేస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఇప్పటికే రూ.40,000 కోట్లను డివిడెండ్‌గా పంపిణీ చేసింది.

ఐటీ రిఫండ్స్
24 గంటల్లోనే...!


రెండేళ్లలో ఆన్‌లైన్ వ్యవస్థ అమల్లోకి..

న్యూఢిల్లీ: ఆదాయపన్ను చెల్లింపుదారులకు రిఫండ్స్‌ను సత్వరమే చెల్లించే విధంగా తగిన వ్యవస్థను రెవెన్యూ శాఖ అమల్లోకి తీసుకురానుంది. అన్ని రిటర్నులను 24 గంటల్లోనే ప్రాసెస్ చేయడంతో పాటు, అదే సమయంలో రిఫండ్స్‌ను కూడా వెంటనే చేసేలా ఇది ఉంటుందని రెవెన్యూ విభాగం సెక్రటరీ అజయ్ భూషణ్ పాండే తెలిపారు.




రెండేళ్లలో ఇది సాధ్యపడుతుందన్నారు. రిటర్నుల ప్రాసెసింగ్, రిఫండ్‌లు, స్క్రూటినీ, తనిఖీ కోసం కేంద్ర ప్రత్యక్ష పన్నుల మండలి (సీబీడీటీ)కి సంబంధించిన ఐటీ సదుపాయాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం గత నెలలోనే రూ.4,200 కోట్లను విడుదల చేసినట్టు చెప్పారు. ప్రస్తుతం రిఫండ్‌లు ఆన్‌లైన్‌లో ఆటోమేటెడ్‌గా జరుగుతున్నాయని, ప్రస్తుత ఏడాది రూ.1.50 లక్షల కోట్ల రిఫండ్‌లను నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్టు తెలిపారు.

సుబాక్సోన్ కేసులో డాక్టర్ రెడ్డీస్‌కు ఊరట



హైదరాబాద్: జనరిక్ ఔషధం సుబాక్సోన్ కేసులో డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్‌కు అమెరికా కోర్ట్ ఆఫ్ అప్పీల్స్‌లో ఊరట లభించింది. వివరాల్లోకి వెళితే... మాదకద్రవ్య (ఒపియమ్) వ్యసనానికి బానిసలయ్యే వారి చికిత్సలో వినియోగించే తమ ఉత్పత్తి సుబాక్సోన్ జనరిక్ వెర్షన్‌ను డాక్టర్ రెడ్డీస్‌సహా ఔషధ కంపెనీలు అమెరికా మార్కెట్‌లో విక్రయించకుండా నిరోధించాలని బ్రిటిష్ ఔషధ ఉత్పత్తి సంస్థ ఇన్డీవర్ న్యాయపోరాటం చేస్తోంది. ఈ విషయంలో గత ఏడాది జూన్‌లో ఈ ఔషధానికి సంబంధించి జనరిక్ ఔషధ విక్రయాలకు అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ అనుమతినిచ్చింది. ఈ ఆమోదం అనంతరం తక్షణం ఈ ప్రొడక్ట్‌ను డాక్టర్ రెడ్డీస్ మార్కెట్‌లో విడుదల చేసింది. అయితే, ఒక ట్రైల్ కోర్ట్ విధించిన తాత్కాలిక నియంత్రణలతో ఔషధం అమ్మకాలు, వాణిజ్య కార్యకలాపాలు నిలిచిపోయాయి. దీనిపై డాక్టర్ రెడ్డీస్ అప్పిలేట్ కోర్టును ఆశ్రయించింది. డిసెంబర్‌లో ఇక్కడ డాక్టర్ రెడ్డీస్‌కు అనుకూలంగా తీర్పు వచ్చింది. కేసును పునఃవిచారించాలని తాజాగా ఇన్డీవర్ దాఖలు చేసిన పిటిషన్‌ను అప్పిలేట్ కోర్ట్ తిరస్కరించింది. ఫిబ్రవరి 11వ తేదీన 'మ్యాండేట్'ను ఇస్తామని కూడా అప్పిలేట్ కోర్టు పేర్కొనడం గమనార్హం. ఇదే జరిగితే డాక్టర్ రెడ్డీస్ ఇక యథేచ్ఛగా అమెరికన్ మార్కెట్‌లో ఈ ఔషధాన్ని విక్రయించే అవకాశం ఉంది.

రెండేళ్లు.. రూ.లక్ష కోట్లు..!



ఇన్వెస్టర్లకు తిరిగిచ్చిన టాప్ 5 ఐటీ దిగ్గజాలు

- షేర్ల బైబ్యాక్, డివిడెండ్ల రూపంలో చెల్లింపు
- టాప్‌లో టీసీఎస్, రెండో స్థానంలో ఇన్ఫోసిస్

న్యూఢిల్లీ: దేశీ టాప్ 5 ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) దిగ్గజాలు షేర్‌హోల్డర్లకు గత రెండేళ్లలో సుమారు రూ. 1.17 లక్షల కోట్లు తిరిగి చెల్లించాయి. 2017 జనవరి నుంచి ఈ ఏడాది జనవరి మధ్యకాలంలో షేర్ల బైబ్యాక్, డివిడెండ్స్ రూపంలో ఈ నిధులను చెల్లించాయి. సగటున డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం 67గా లెక్కిస్తే దాదాపు 17.5 బిలియన్ డాలర్లు చెల్లించినట్లవుతుంది. ఇందులో అయిదింట నాలుగొంతుల వాటా టాప్ రెండు ఐటీ కంపెనీలైన టీసీఎస్, ఇన్ఫోసిస్‌దే ఉంది. అయిదు టాప్ కంపెనీల్లో మూడు కంపెనీలు బోనస్‌లు కూడా ఇచ్చాయి. ఈ రెండేళ్ల వ్యవధిలో ఈ ఐదు ఐటీ సంస్థల షేర్లు సుమారు 16-68 శాతం మేర పెరిగాయి. ఇలా షేర్‌హోల్డర్లకు తిరిగిచ్చిన మొత్తం నిధుల్లో దాదాపు 61 శాతం షేర్ల బైబ్యాక్ రూపంలోనే జరిగింది. టీసీఎస్ రూ. 32,000 కోట్లు, ఇన్ఫోసిస్ రూ. 21,200 కోట్ల మేర బైబ్యాక్స్ జరిపాయి. అటు విప్రో, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ కూడా అదే బాటలో నడవగా.. టెక్ మహీంద్రా ఒక్కటి మాత్రమే బైబ్యాక్ చేపట్టలేదు. మరోవైపు, టాప్ 4 కంపెనీలు చేసిన చెల్లింపుల్లో మొత్తం షేర్ల బైబ్యాక్ వాటా 54 శాతం నుంచి 89 శాతం దాకా ఉంది.

బైబ్యాక్స్‌కే ఎందుకు ప్రాధాన్యం..

డివిడెండ్ల కన్నా షేర్ల బైబ్యాక్ వైపే కంపెనీలు ఎక్కువగా మొగ్గు చూపుతుండటానికి 2016 కేంద్ర బడ్జెట్‌లో చేసిన ప్రతిపాదనలే ప్రధాన కారణం. సాధారణంగా కార్పొరేట్ ట్యాక్స్‌లు గట్రా కట్టేసిన తర్వాత వచ్చే నికర లాభం నుంచే డివిడెండ్ల చెల్లింపు ఉంటుంది. కానీ 2016 బడ్జెట్‌లో రూ. 10 లక్షల పైగా డివిడెండ్ అందుకునే హై నెట్‌వర్త్ ఇన్వెస్టర్లు ఆ మొత్తంపై పది శాతం ట్యాక్స్ కట్టాల్సి వచ్చేలా ప్రతిపాదనలు చేశారు. ఇక కంపెనీ డివిడెండ్ డిక్లేర్ చేస్తే.. దానిపై దాదాపు 20% దాకా (అసలు 15%, సర్‌చార్జీ, సెస్సు మొదలైనవన్నీ కలిపి) డివిడెండ్ డిస్ట్రిబ్యూషన్ ట్యాక్స్ (డీడీటీ) కట్టాల్సి వస్తుంది. ఈ కారణాలతో డివిడెండ్‌లకు ఆకర్షణీయత తగ్గింది. మరోవైపు, బైబ్యాక్ మార్గంలో షేర్లను తిరిగి కంపెనీకే విక్రయించినప్పుడు వచ్చే లాభాలను దీర్ఘకాలిక క్యాపిటల్ గెయిన్స్‌గా పరిగణిస్తారు. దీనిపై పది శాతం మేర లాంగ్‌టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ ట్యాక్స్ చెల్లించినా.. డివిడెండ్లతో పోలిస్తే తక్కువే ఉంటుంది. అందుకే డివిడెండ్ల కన్నా బైబ్యాక్‌లవైపే కాస్త ఎక్కువ మొగ్గు ఉంటోందని నిపుణులు తెలిపారు.

ఈపీఎస్ ప్రయోజనాలు కూడా..

డివిడెండ్ చెల్లించడం కన్నా షేర్లను బైబ్యాక్ చేయడం వల్ల కంపెనీలకు మరికొన్ని ప్రయోజనాలు కూడా ఉన్నాయి. డివిడెండును కంపెనీ నికర లాభం నుంచి నగదు రూపంలో చెల్లించాల్సి వస్తుంది. దీంతో.. కంపెనీ నికర విలువ, ఫలితంగా మార్కెట్ విలువ కూడా ఆ మేరకు కాస్త తగ్గుతుంది. అయితే, షేర్లను బైబ్యాక్ చేసినప్పుడు చలామణీలో ఉన్న మొత్తం షేర్ల సంఖ్య తగ్గడం వల్ల షేరువారీ ఆర్జన (ఈపీఎస్) పెరిగి, వేల్యుయేషన్ కూడా ఆ మేరకు పెరుగుతుంది. అంతే కాకుండా నిర్దిష్ట రేటు ప్రకారం కొనుగోలు ఉంటుంది కాబట్టి.. ఆ స్థాయిలో సంస్థ షేరు స్థిరపడేందుకు కూడా చాలా సందర్భాల్లో ఇది ఉపయోగపడుతుంది. బైబ్యాక్ ప్రకటించినా ప్రమోటర్లు తమ వాటాలను విక్రయించకుండా దూరంగా ఉంటే.. కంపెనీలో తమ వాటాలను మరింత కన్సాలిడేట్ చేసుకోవడానికి కూడా తోడ్పడుతుంది.

బోనస్‌లు కూడా....

షేర్ల బైబ్యాక్, డివిడెండ్లతో పాటు ఈ కంపెనీలు బోనస్ షేర్లు కూడా ప్రకటించాయి. టీసీఎస్, ఇన్ఫోసిస్‌లు షేరు ఒక్కింటికి ఒక షేరు ఇచ్చాయి. విప్రో మాత్రం రెండు సార్లు బోనస్ ఇష్యూలు ప్రకటించింది. 2017లో షేరు ఒక్కింటికి ఒకటి చొప్పున ఇవ్వగా.. తాజాగా జనవరిలో మరో బోనస్ ఇష్యూకి బోర్డు ఆమోదం తెలిపింది. దీని ప్రకారం ప్రతి 3 షేర్లకు ఒక్క షేరు చొప్పున బోనస్‌గా ఇవ్వనుంది.

రూ. 1.17 లక్షల కోట్లలో కంపెనీలవారీగా వాటా

కంపెనీ	శాతం
టీసీఎస్	45
ఇన్ఫోసిస్	33
విప్రో	11
హెచ్‌సీఎల్ టెక్	9
టెక్ మహీంద్రా	2

చెల్లింపుల్లో బైబ్యాక్, డివిడెండ్స్ వాటా

కంపెనీ	బైబ్యాక్	డివిడెండ్
టీసీఎస్	61	39
ఇన్ఫోసిస్	54	46
విప్రో	89	11
హెచ్‌సీఎల్	69	31
టెక్‌మహీంద్రా	0	100

డ్రైవర్‌రహిత కార్లపై 'గూగుల్' వేమోతో రెనో జట్టు



టోక్యో: ఆటోమొబైల్ దిగ్గజాలు రెనో, నిస్సాన్, మిత్సుబిషి మోటార్స్ కలిసి డ్రైవర్‌రహిత కార్లను రూపొందించే ప్రయత్నాల్లో భాగంగా గూగుల్‌కి చెందిన వేమో సంస్థతో జట్టు కట్టనున్నాయి. ప్రస్తుతం డీల్ చర్చల దశలో ఉందని, త్వరలోనే ఒప్పందం గురించి ప్రకటన చేసే అవకాశముందని జపాన్ మీడియా సంస్థలు వెల్లడించాయి. వేమో సంస్థ సెల్ఫ్ డ్రైవింగ్ కార్ల టెక్నాలజీని అభివృద్ధి చేస్తోంది. వేమో ప్రస్తుతం అమెరికాలోని అరిజోనా లో సెల్ఫ్ డ్రైవింగ్ కార్ సర్వీసులు ప్రయోగాత్మకంగా నిర్వహిస్తోంది.

ఎల్‌పీజీ వినియోగంలో మనం ప్రపంచ నంబర్2

- వినియోగం 22.5 మిలియన్ టన్నులు
- 8.4 శాతం చొప్పున వృద్ధి



న్యూఢిల్లీ: ప్రపంచంలో ఎల్‌పీజీని (లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్) అత్యధికంగా వినియోగించే రెండో దేశంగా భారత్ పైకి చేరింది. దేశంలో ఎల్‌పీజీ డిమాండ్ 2025 నాటికి 34 శాతం పెరుగుతుందని పెట్రోలియం శాఖ కార్యదర్శి ఎంఎం కుట్టీ తెలిపారు. ఆసియా ఎల్‌పీజీ సదస్సు మంగళవారం ఢిల్లీలో జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా కుట్టీ మాట్లాడుతూ... ఎల్‌పీజీ వినియోగదారులు (తరచూ సిలిండర్ బుక్ చేసుకునేవారు) 2014-15లో 14.8 కోట్లుగా ఉంటే, 2017-18 నాటికి 22.4 కోట్లకు చేరినట్టు ఆయన తెలిపారు. ఏటా 15 శాతం చొప్పున పెరిగారని చెప్పారు. 22.5 మిలియన్ టన్నుల ఎల్‌పీజీ వినియోగంతో భారత్ ప్రపంచ దేశాల్లో రెండో స్థానంలో ఉన్నట్టు చెప్పారు. 2025 నాటికి ఎల్‌పీజీ వినియోగం 30.3 మిలియన్ టన్నులకు, 2040 నాటికి 40.6 మిలియన్ టన్నులకు పెరుగుతుందని అంచనా వెల్లడించారు. పేదలకు ఉచితంగా ఎల్‌పీజీ కనెక్షన్ అందించే ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకాన్ని 2016లో ప్రారంభించగా, అప్పటి నుంచి 6.31 కోట్ల కనెక్షన్లను అందించినట్టు కుట్టీ తెలిపారు. ఈ పథకం విజయవంతంతో 2020 మార్చి నాటికి మొత్తం మీద 8 కోట్ల ఇళ్లకు ఎల్‌పీజీ కనెక్షన్లను ఇవ్వాలని లక్ష్యాన్ని సవరించినట్టు పెట్రోలియం మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ చెప్పారు.

వృద్ధికి దోహదపడే బడ్జెట్: మూడీస్



న్యూఢిల్లీ: రైతులకు ప్రత్యక్షంగా నగదు బదిలీ, మధ్య తరగతికి ఊరటనిచ్చేలా పన్ను ప్రయోజన నిర్ణయాలు దేశాభివృద్ధికి దోహదపడే అంశాలని రేటింగ్ దిగ్గజం- మూడీస్ అభిప్రాయపడింది. ఆయా చర్యలు వ్యవస్థలో ద్రవ్య లభ్యతను పెంచుతాయని, వినియోగం పెరుగుతుందని, ఈ పరిణామాలు ఆర్థిక వ్యవస్థలో ఉద్దీపనగా పనిచేస్తాయని మూడీస్ వివరించింది. ఈ చర్యలు స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటును 0.45 శాతం మేర పెంచుతాయని కూడా మూడీస్ తన తాజా నివేదికలో పేర్కొంది. అయితే ద్రవ్యలోటు వరుసగా రెండేళ్లు కట్టుతప్పడం భారత్‌కు 'క్రెడిట్ నెగిటివ్' అని కూడా మూడీస్ పేర్కొనడం విశేషం. వచ్చే ఆర్థిక సంవత్సరం కూడా ప్రభుత్వానికి ద్రవ్యలోటు విషయంలో సవాళ్లు తప్పకపోవచ్చని మూడీస్ విశ్లేషించింది. వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ)లో ఇటీవలి సర్దుబాట్లు పన్ను వసూళ్లకు సవాలేనని, ట్యాక్స్ బేస్ మరింత తగ్గవచ్చని అంచనావేసింది. ప్రభుత్వ రంగ బ్యాంకులకు తగిన మూలధన మద్దతు లేకపోయినా, అది క్రెడిట్ నెగిటివ్‌కు దారితీస్తుందని హెచ్చరించింది.

టెక్ మహీంద్రా లాభం జూమ్

- క్యూ3లో రూ.1,203 కోట్లు; 28 శాతం పెరుగుదల
- 15 శాతం వృద్ధితో రూ.8,944 కోట్లకు మొత్తం ఆదాయం
- 21 శాతం పెరిగిన ఎబిటా
- భవిష్యత్తులో మార్జిన్లపై ఒత్తిడి



న్యూఢిల్లీ: ఐటీ కంపెనీ టెక్ మహీంద్రా ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక కాలంలో రూ.1,203 కోట్ల నికర లాభం(కన్సాలిడేటెడ్) సాధించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే క్వార్టర్‌లో రూ.9,43 కోట్ల నికర లాభం వచ్చిందని, 28 శాతం వృద్ధి సాధించామని టెక్ మహీంద్రా తెలిపింది. ఆటోమేషన్ కారణంగా లాభ మార్జిన్ పెరిగిందని కంపెనీ ఎమ్‌డీ, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సి. పి. గుర్నాని పేర్కొన్నారు. మొత్తం ఆదాయం రూ.7,776 కోట్ల నుంచి 15 శాతం వృద్ధితో రూ.8,944 కోట్లకు పెరిగిందని పేర్కొన్నారు. ఎబిటా 21 శాతం పెరిగి రూ.1,803 కోట్లకు పెరిగిందని పేర్కొన్నారు. నిర్వహణ మార్జిన్ 50 బేసిస్ పాయింట్లు పెరిగి 19.3 శాతానికి చేరిందని వివరించారు.

ఏడో క్వార్టర్‌లోనూ పెరిగిన మార్జిన్...

లాభ మార్జిన్ పెరగడం ఇది వరుసగా ఏడో క్వార్టర్ అని, అయితే గతంలో పెరిగినట్లుగా లాభ మార్జిన్ల పెరుగుదల లేదని కార్పొరేట్ స్ట్రాటజీ చీఫ్ మనోజ్ భట్ పేర్కొన్నారు. వేతన వ్యయం పెరుగుతుండటం, పెట్టుబడులు కూడా అధికం కానుండటంతో భవిష్యత్తులో కూడా మార్జిన్లపై ఒత్తిడి కొనసాగుతుందని, మార్జిన్లు తగ్గే అవకాశాలు కూడా ఉన్నాయని వివరించారు.

మైలురాయి త్రైమాసికం...

అన్ని అంశాల్లో చెప్పుకోదగ్గ మెరుగుదలను సాధించామని, టెక్ మహీంద్రాకు ఇది మైలురాయి త్రైమాసికమని సి. పి. గుర్నాని వ్యాఖ్యానించారు. ఎంటర్‌ప్రైజ్, కమ్యూనికేషన్ విభాగాల్లో మంచి వృద్ధి సాధించామని, 500 కోట్ల డాలర్ల వార్షిక ఆదాయాన్ని ఆర్జించబోతున్నామని పేర్కొన్నారు. ఈ డిసెంబర్ క్వార్టర్‌లో నికరంగా 3,451 ఉద్యోగాలు ఇచ్చామని, మొత్తం ఉద్యోగుల సంఖ్య 1,21,842కు పెరిగిందని తెలిపారు. గత ఏడాది డిసెంబర్ చివరి నాటికి నగదు. నగదు సమానమైన నిల్వలు 125 కోట్ల డాలర్లుగా ఉన్నాయని పేర్కొన్నారు.

ఆదాయానికి 5జీ జోష్..

ఈ ఏడాది చివరినాటికి 5జీ సర్వీసులు అందుబాటులోకి రానున్నాయని, దీంతో తమ టెలికం విభాగం మంచి వృద్ధిని సాధించగలదని గుర్నానీ పేర్కొన్నారు. ఈ దన్నుతో వచ్చే ఆర్థిక సంవత్సరం జూలై క్వార్టర్ నుంచి తమ ఆదాయం పెరుగుతుందని వివరించారు. ఆర్థిక ఫలితాల నేపథ్యంలో బీఎస్‌ఈలో టెక్ మహీంద్రా షేర్ స్వల్పంగా పెరిగి రూ.750 వద్ద ముగిసింది.

భెల్ లాభం 25% అప్...
షేరు 10 శాతం డౌన్

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ ఇంజినీరింగ్ సంస్థ, భెల్ నికర లాభం ఈ ఆర్థిక సంవత్సరం అక్టోబర్-డిసెంబర్ క్వార్టర్లో 25 శాతం పెరిగింది. గత క్యూ3లో రూ.153 కోట్లుగా ఉన్న నికర లాభం ఈ క్యూ3లో రూ.192 కోట్లకు పెరిగిందని భెల్ తెలిపింది. ఆదాయం రూ.6,666 కోట్ల నుంచి 10 శాతం ఎగసి రూ.7,336 కోట్లకు పెరిగిందని భెల్ సీఎమ్‌డీ అతుల్ సోబ్తి పేర్కొన్నారు.



ఒక్కో షేర్‌కు 80 పైసల మధ్యంతర డివిడెండ్‌ను చెల్లించనున్నామని, ఈ నెల 21లోపు డివిడెండ్ చెల్లిస్తామని తెలిపారు. ఎబిటా రూ.265 కోట్ల నుంచి 18 శాతం తగ్గి రూ.219 కోట్లకు చేరిందని వివరించారు. ఇతర ఆదాయం రూ.168 కోట్ల నుంచి రూ.27 కోట్లకు తగ్గిందని తెలిపారు. ఈ క్యూ3లో మంచి పనితీరు సాధించామని సోబ్తి సంతృప్తి వ్యక్తం చేశారు. కొత్త వ్యాపార విభాగాల్లోకి ప్రవేశించడం, ప్రాజెక్ట్‌ల ఆచరణను వేగవంతం చేయడం, వ్యయ నియంత్రణ పద్ధతులు, వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడం....ఈ వ్యూహాల కారణంగా ఈ స్థాయి పనితీరు సాధించామని తెలిపారు. నికర లాభం, ఆదాయం పెరిగినా, ఎబిటా తగ్గడంతో బీఎస్‌ఈలో భెల్ షేర్ 10 శాతం క్షీణించి రూ.59 వద్ద ముగిసింది.

పీఎన్‌బీ .. మళ్లీ లాభాల్లోకి!!

- క్యూ3లో రూ. 247 కోట్లు
- 7 శాతం వృద్ధి
- మొండిబాకీలకు తగ్గిన కేటాయింపులు



న్యూఢిల్లీ: నీరవ్ మోదీ కుంభకోణం దెబ్బతో వరుసగా మూడు త్రైమాసికాల పాటు భారీ నష్టాలు ప్రకటిస్తూ వచ్చిన ప్రభుత్వ రంగ పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) మొత్తానికి మళ్లీ లాభాల బాట పట్టింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ. 247 కోట్ల నికర లాభం ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో నమోదైన రూ. 230 కోట్లతో పోలిస్తే ఇది 7.12 శాతం అధికం. తాజాగా మొండిబాకీలకు కేటాయింపులు తగ్గటం ఇందుకు తోడ్పడింది. ఆదాయం సుమారు 3 శాతం క్షీణించి రూ. 15,257 కోట్ల నుంచి రూ. 14,854 కోట్లకు తగ్గింది. వరుసగా మూడు త్రైమాసికాలుగా నష్టాలు ప్రకటిస్తూ వస్తున్న పీఎన్‌బీ తాజా ఫలితాలు విశ్లేషకుల అంచనాలను తారుమారు చేశాయి. మూడో త్రైమాసికంలో పీఎన్‌బీ దాదాపు రూ. 1,063 కోట్ల మేర నష్టాలు ప్రకటించవచ్చని విశ్లేషకులు అంచనా వేశారు. 'మా బాధ్యతలన్నీ నిర్వర్తించాం. (నీరవ్ మోదీ ఫ్రాడ్‌కి సంబంధించి) పూర్తి స్థాయిలో ప్రొవిజనింగ్ చేశాము' అని పీఎన్‌బీ ఎండీ సునీల్ మెహతా తెలిపారు. మూడో క్వార్టర్‌లో దాదాపు రూ. 16,000 కోట్ల మేర మొండిబాకీలు రికవర్ కావడం కూడా పనితీరు మెరుగుపడటానికి తోడ్పడిందని ఆయన వివరించారు.

ఎన్‌పీఏలు తగ్గుముఖం...

గత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంతో పోలిస్తే తాజా క్యూ3లో ఇచ్చిన మొత్తం రుణాల్లో స్థూల మొండిబాకీలు (ఎన్‌పీఏ) 12.11 శాతం నుంచి 16.33 శాతానికి పెరిగాయి. అయితే, నికర ఎన్‌పీఏలు మాత్రం 8.90 శాతం నుంచి 8.22 శాతానికి తగ్గాయి. ఆదాయ పన్ను కాకుండా మొత్తం ప్రొవిజనింగ్ రూ. 4,467 కోట్ల నుంచి రూ. 2,754 కోట్లకు తగ్గాయి. ఇందులో మొండిబాకీలకు చేసిన కేటాయింపులు రూ. 2,566 కోట్లు (ఈ మొత్తంలో నీరవ్ మోదీ ఫ్రాడ్ ప్రొవిజనింగ్ సుమారు రూ. 2,014 కోట్లు). గత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో ఇది రూ. 2,996 కోట్లుగా ఉంది. మొండిబాకీలకు కేటాయింపులు సీక్వెన్షియల్‌గా చూస్తే 67 శాతం క్షీణించి రూ. 7,733 కోట్ల నుంచి రూ. 2,566 కోట్లకు తగ్గాయి. ఆర్థిక ఫలితాల నేపథ్యంలో మంగళవారం బీఎస్‌ఈలో పీఎన్‌బీ షేరు అర శాతం పెరిగి రూ. 73.55 వద్ద క్లోజయ్యింది.

మార్చికల్లా రూ.40,000 కోట్లు: మిరాయ్



సీఈవో స్వరూప్ మహంతీ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: అసెట్స్ అండర్ మేనేజ్‌మెంట్ (ఏయూఎం) మార్చి చివరి నాటికి రూ.40,000 కోట్లకు చేరుకుంటుందని మిరాయ్ అసెట్ మ్యూచువల్ ఫండ్ అంచనా వేస్తోంది. జనవరి 31 నాటికి ఏయూఎం రూ.23,500 కోట్లు ఉందని మిరాయ్ అసెట్ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్స్ (ఇండియా) సీఈవో స్వరూప్ మహంతీ మంగళవారమిక్కడ మీడియాకు వెల్లడించారు. 2018లో 50 శాతం వృద్ధి నమోదు చేశామన్నారు. సుమారు 12 లక్షల ఇన్వెస్టర్ ఫోలియోలు ఉన్నట్టు తెలిపారు. వీటిలో సిప్ ఇన్వెస్టర్లు 6.15 లక్షల మంది అన్నారు.

స్వల్ప లాభాలతో సరి

- ఆర్‌బీఐ పాలసీ.. మార్కెట్లో అప్రమత్తత
- నాలుగో రోజూ లాభాలు...
- 34 పాయింట్ల లాభంతో 36,617కు సెన్సెక్స్
- 22 పాయింట్లు పెరిగి 10,934కు నిఫ్టీ



ఆద్యంతం స్తబ్దుగా, పరిమిత శ్రేణిలో సాగిన మంగళవారం నాటి ట్రేడింగ్‌లో స్టాక్ మార్కెట్ స్వల్ప లాభాలతో గట్టెక్కింది. దీంతో వరుసగా నాలుగో రోజూ స్టాక్ సూచీలు లాభాల్లో ముగిశాయి. ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీ(ఎమ్‌పీసీ) సమావేశం ఆరంభమైన నేపథ్యంలో మార్కెట్లో అప్రమత్తత నెలకొన్నది. బీఎస్‌ఈ సెన్సెక్స్ 34 పాయింట్లు లాభపడి 36,617 పాయింట్ల వద్ద, ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 22 పాయింట్లు పెరిగి 10,934 పాయింట్ల వద్ద ముగిశాయి. రియల్టీ, లోహ, ఎఫ్ఎమ్‌సీజీ, క్యాపిటల్ గూడ్స్ షేర్లు నష్టపోగా, వాహన, ఆర్థిక రంగ, కన్సూమర్ డ్యూరబుల్ షేర్లు లాభపడ్డాయి.

233 పాయింట్ల రేంజ్‌లో సెన్సెక్స్....

ఆర్‌బీఐ ఎమ్‌పీసీ సమావేశం మంగళవారం ఆరంభమైంది. రేట్లపై నిర్ణయం గురువారం వెల్లడి కానున్నది. ద్రవ్యోల్బణం దిగువ స్థాయిల్లో ఉన్నందున ఆర్‌బీఐ వైఖరి 'తటస్థ' విధానానికి మారవచ్చన్న అంచనాలు నెలకొన్నాయి. స్వల్ప లాభాలతో ఆరంభమైన సెన్సెక్స్ ఆ వెంటనే నష్టాల్లోకి జారిపోయింది. ముడి చమురు ధరలు పెరగడం ప్రతికూల ప్రభావం చూపించింది. ఇంట్రాడేలో 87 పాయింట్ల వరకు నష్టపోయింది. ఆ తర్వాత కోలుకొని మళ్లీ లాభాల బాట పట్టింది. యూరప్ మార్కెట్లు సానుకూలంగా ఆరంభం కావడంతో ఒక దశలో 146 పాయింట్లు పెరిగింది. మొత్తం మీద రోజంతా 233 పాయింట్ల రేంజ్‌లో కదలాడింది. ఇక నిఫ్టీ ఒక దశలో 25 పాయింట్లు పతనం కాగా మరో దశలో 45 పాయింట్లు పెరిగింది.

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్‌ఈ	2,569
ఎన్‌ఎస్‌ఈ	28,850
ఎన్‌ఎస్‌ఈ (డెరివేటివ్స్)	5,58,363
ఎఫ్ఐఐ	421
డీఐఐ	194

కొనసాగిన ఆర్‌కామ్ నష్టాలు...

దివాళా పిటీషన్ దాఖలు చేసిన నేపథ్యంలో రిలయన్స్ కమ్యూనికేషన్స్ షేర్ పతనం కొసాగింది. సోమవారం 35 శాతం క్షీణించిన ఈ షేర్ మంగళవారం 29 శాతం పడిపోయి రూ.5.44 వద్ద ముగిసింది. మొత్తం మూడు రోజుల్లో ఈ షేర్ 54 శాతం పడిపోయింది. అనిల్ అంబానీకి చెందిన ఇతర గ్రూప్ షేర్లు కూడా భారీగానే నష్టపోయాయి. రిలయన్స్ పవర్ 30 శాతం, రిలయన్స్ నావల్ అండ్ ఇంజినీరింగ్ 13 శాతం చొప్పున నష్టపోయాయి.

నిఫ్టీ 50

టాప్ 10 గెయినర్స్ (రూపాయిల్లో)

Symbol	LTP	(%)Change
ZEEL	364.65	4.86
TITAN	1,068.50	4.17
UPL	798.8	3.62
DRREDDY	2,817.05	2.99
HEROMOTOCO	2,862.00	2.94
BAJAJ-AUTO	2,710.00	2.55
INDUSINDBK	1,538.80	2.27
MARUTI	7,125.00	1.96
M&M	687.55	1.94
EICHERMOT	20,500.00	1.85

టాప్ 10 లూజర్స్ (రూపాయిల్లో)

Symbol	LTP	(%)Change
COALINDIA	216.1	-2.7
TATASTEEL	464.7	-2.38
TATAMOTORS	176	-2.36
YESBANK	175.85	-2.2
ONGC	143.25	-2.05
INFRATEL	290.25	-1.63
IOC	133.95	-1.43
SUNPHARMA	409.15	-1.36
IBULHSGFIN	641.9	-1.36
ITC	274.1	-1.08

బుధవారం బోర్డ్ మీటింగ్స్

అలహాబాద్ బ్యాంక్, సిప్లా, లుపిన్, వొడాఫోన్ ఐడియా, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, అదానీ పోర్ట్స్, అదానీ పవర్, కమ్మిన్స్ ఇండియా, గ్రాఫైట్ ఇండియా, ఇంద్రప్రస్థ గ్యాస్, మణప్పురమ్ ఫైనాన్స్, ముత్తూట్ ఫైనాన్స్, పంజ్ లాయిడ్, సీమెన్స్, టీబీజడ్, వెంకీస్, విమ్టా ల్యాబ్స్, జైడస్ వెల్‌నెస్

రాక్‌సాల్ట్‌తో నెక్టాన్ జోడీ

ROCKSALT Interactive

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: అంతర్జాతీయ గేమింగ్ టెక్నాలజీ కంపెనీ నెక్టాన్ హైదరాబాద్‌కు చెందిన గేమ్స్ డిజైనర్ రాక్‌సాల్ట్ ఇంటెరాక్టివ్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఒప్పందంలో భాగంగా ఇరు సంస్థలు కలిసి నెక్టాన్ బ్రాండెడ్ హెచ్‌టీఎంఎల్5 గేమ్స్‌ను అభివృద్ధి చేస్తాయి. ఫ్లక్కీ పైరేట్స్:డెవిల్స్ ట్రయాంగిల్ తొలి గేమ్‌గా రానుందని రాక్‌సాల్ట్ సీఈవో ఉత్కర్ష్ వీర్ ఈ సందర్భంగా తెలిపారు.

భద్రతా వారోత్సవాన్ని ప్రారంభించిన 'హోండా'



హైదరాబాద్: రోడ్డు భద్రత పట్ల అవగాహన కల్పించడంలో 'హోండా టూ వీలర్స్' తన వంతు సహకారాన్ని అందిస్తోంది. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవం 2019 పేరిట ఈనెల 4 నుంచి 10 వరకు దేశవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని హోండా మోటార్ సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ ప్రభు నాగరాజ్ వివరించారు. హెల్మెట్ వాడకంతో లభించే రక్షణపై సందేశాల్ని పిల్లల సహకారంతో తెలియజేయడం, సేఫ్ సైక్లింగ్ వర్క్‌షాప్ నిర్వహించడం వంటి కార్యక్రమాలను వారోత్సవంలో చేపట్టినట్లు తెలిపారు.

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (99.9, 10గ్రా)	34,250	▲ 140
బంగారం (99.5, 10గ్రా)	32,620	▲ 130
వెండి (కిలో)	44,000	▲ 300
చెన్నై		
బంగారం (24 క్యారెట్లు)	33,400	0
బంగారం (22 క్యారెట్లు)	31,810	0
వెండి (కిలో)	44,000	▲ 300
హైదరాబాద్		
బంగారం (24 క్యారెట్లు)	33,400	0
బంగారం (22 క్యారెట్లు)	31,810	0
వెండి (కిలో)	44,000	▲ 300
ప్రొద్దుటూరు		
బంగారం (24 క్యారెట్లు)	33,700	0
బంగారం (22 క్యారెట్లు)	31,240	▲ 20
వెండి (కిలో)	41,500	▲ 100
విశాఖపట్నం		
బంగారం (24 క్యారెట్లు)	34,260	▲ 90
బంగారం (22 క్యారెట్లు)	31,870	▲ 90
వెండి (కిలో)	41,500	0
విజయవాడ		
బంగారం (24 క్యారెట్లు)	34,400	0
బంగారం (22 క్యారెట్లు)	31,500	▲ 50
వెండి (కిలో)	41,600	▲ 200
ఏపీ బులియన్ అసోసియేషన్		
బంగారం (24 క్యారెట్లు)	34,390	0
బంగారం (22 క్యారెట్లు)	31,810	0
వెండి (కిలో)	41,600	▲ 100

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	53.84 (రాత్రి 11.30కు)	$54.56 (సోమవారం ముగింపు)
బ్రెంట్	62.20 (రాత్రి 11.30కు)	$62.51 (సోమవారం ముగింపు)

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్/100కు రూ.లలో) 06-02-2019

విశాఖ	406-00
చిత్తూరు	438-00
వరంగల్	405-00
చెన్నై	445-00
ముంబై	456-00
విజయవాడ	401-00
నమక్కల్	430-00
గోదావరి	401-00
05-02-2019 ఫామ్ ధర...	
హైదరాబాద్	403-00
రిటైల్ (ఒక గుడ్డుకు)	4.65
బెంగళూరు	435-00
కోల్‌కత్త	430-00
ఢిల్లీ	427-00

అక్టోబర్-డిసెంబర్ త్రైమాసిక ఫలితాలు

హెచ్‌పీసీఎల్‌కు 'ఇన్వెంటరీ' నష్టాలు



హిందుస్తాన్ పెట్రోలియమ్ కార్పొ(హెచ్‌పీసీఎల్) నికర లాభం ఈ ఆర్థిక సంవత్సరం డిసెంబర్ క్వార్టర్లో 87 శాతం తగ్గింది. గత క్యూ3లో రూ.1,950 కోట్లుగా ఉన్న నికర లాభం ఈ క్యూ3లో రూ.248 కోట్లకు తగ్గిందని హెచ్‌పీసీఎల్ తెలిపింది. ఇన్వెంటరీ నష్టాలు భారీగా ఉండటం, రిఫైనరీ మార్జిన్లు తక్కువగా ఉండటం వల్ల నికర లాభం భారీగా తగ్గిందని కంపెనీ సీఎమ్‌డీ ముకేశ్ కె సురానా తెలిపారు. నికర అమ్మకాలు రూ.62,832 కోట్ల నుంచి రూ.76,884 కోట్లకు పెరిగాయని పేర్కొన్నారు. ఇంధన అమ్మకాలు 2.5 శాతం వృద్ధితో 9.4 మిలియన్ టన్నులకు పెరిగాయని వివరించారు. ఒక్కో షేర్‌కు రూ.6.50 మధ్యంతర డివిడెండ్‌ను ఇవ్వనున్నామని తెలిపారు. రూ.3,465 కోట్ల ఇన్వెంటరీ నష్టాలు గత క్యూ3లో రూ.1,477 కోట్ల ఇన్వెంటరీ లాభాలు రాగా, ఈ క్యూ3లో రూ.3,465 కోట్ల ఇన్వెంటరీ నష్టాలు వచ్చాయని పేర్కొన్నారు. బ్యారెల్ ముడి చమురును ఇంధనంగా మార్చినందువల్ల వచ్చే స్థూల రిఫైనరీ మార్జిన్ గత క్యూ3లో 9.04 డాలర్లుగా ఉండగా, ఈ క్యూ3లో 3.72 డాలర్లుగా నమోదయిందని పేర్కొన్నారు. ఇంధన నష్టాలు 7.5 శాతంగా ఉన్నాయని వివరించారు.

ఓయో నికర నష్టం రూ.360 కోట్లు



ఆతిథ్య సేవల సంస్థ ఓయో 2017–18 ఆర్థిక సంవత్సరానికి నికర నష్టం రూ.360 కోట్లుగా ప్రకటించింది. అంతక్రితం ఏడాది నష్టం రూ.355 కోట్ల నికర నష్టాన్ని సంస్థ ప్రకటించింది. 2016–17 కాలానికి నికర ఆదాయం రూ.120 కోట్లు కాగా, 2017–18లో మొత్తం ఆదాయం మూడు రెట్లు వృద్ధి చెంది రూ.416 కోట్లుగా నమోదైంది. సాంకేతిక పరిజ్ఞానం, బృందాల ఏర్పాటుకు వ్యయం పెంచడం... కొత్త విభాగాల్లోకి ప్రవేశించడం వల్ల ఆదాయంలో వృద్ధి చోటుచేసుకున్నప్పటికీ.. నష్టాలు పెరగడానికి కారణమని ఓయో హోటల్స్ అండ్ హోమ్స్ సీఎఫ్‌ఓ అభిషేక్ గుప్తా వివరించారు. 2018–19 ఆదాయ అంచనా రూ.1,400 కోట్లుగా తెలియజేశారు.

సీఈఎస్‌సీ డివిడెండ్ ఒక్కో షేర్‌కు రూ.17.5



ఆర్‌పీ సంజీవ్ గోయెంకా గ్రూప్‌నకు చెందిన ప్రధాన కంపెనీ, సీఈఎస్‌సీ నికర లాభం ఈ ఆర్థిక సంవత్సరం డిసెంబర్ త్రైమాసికంలో 13 శాతం పెరిగింది. గత క్యూ3లో రూ.153 కోట్లుగా ఉన్న నికర లాభం ఈ క్యూ3లో రూ.173 కోట్లకు పెరిగిందని సీఈఎస్‌సీ తెలిపింది. ఆదాయం రూ.1,713 కోట్ల నుంచి రూ.1,707 కోట్లకు తగ్గిందని పేర్కొంది. ఒక్కో షేర్‌కు రూ.17.5 చొప్పున మధ్యంతర డివిడెండ్‌ను ఇవ్వనున్నామని వివరించింది. మొత్తం డివిడెండ్ చెల్లింపులు రూ.280 కోట్లు అవుతాయని పేర్కొంది. మహారాష్ట్రలోని మాలేగావ్‌లో విద్యుత్‌ప్రసార బిడ్‌ను దక్కించుకున్నామని, త్వరలో కార్యకలాపాలు ప్రారంభిస్తామని పేర్కొంది. ఆర్థిక ఫలితాల నేపథ్యంలో బీఎస్‌ఈలో సీఈఎస్‌సీ షేర్ 0.5 శాతం లాభపడి రూ.685 వద్ద ముగిసింది.

27 శాతం తగ్గిన సువెన్ లాభం



డిసెంబరు త్రైమాసికంలో సువెన్ లైఫ్ సైన్సెస్ నికరలాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 27 శాతం తగ్గి రూ.25 కోట్లు నమోదు చేసింది. టర్నోవరు రూ.167 కోట్ల నుంచి రూ.135 కోట్లకు వచ్చి చేరింది. ఏప్రిల్–డిసెంబరు పీరియడ్‌లో రూ.430 కోట్ల టర్నోవరుపై రూ.82 కోట్ల నికరలాభం పొందింది. రూ.1 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుపై రూ.1.50 మధ్యంతర డివిడెండు చెల్లించాలని బోర్డు నిర్ణయించింది.

డీఎల్‌ఎఫ్ లాభం 92 శాతం డౌన్



రియల్టీ దిగ్గజం డీఎల్‌ఎఫ్ నికర లాభం(కన్సాలిడేటెడ్) ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక కాలంలో 92 శాతం తగ్గింది. గత క్యూ3లో రూ.4,091 కోట్ల నికర లాభం రాగా, ఈ క్యూ3లో రూ.335 కోట్ల నికర లాభం వచ్చిందని డీఎల్‌ఎఫ్ తెలిపింది. గత క్యూ3లో తమ అద్దె విభాగం, డీఎల్‌ఎఫ్ సైబర్ సిటీ డెవలపర్స్‌ను జీఐసీ సంస్థకు విక్రయించడం వల్ల రూ.8,569 కోట్ల అసాధారణ లాభం వచ్చిందని, ఫలితంగా గత క్యూ3లో నికర లాభం బాగా పెరిగిందని వివరించింది. గత క్యూ3లో రూ.1,885 కోట్లుగా ఉన్న మొత్తం ఆదాయం ఈ క్యూ3లో రూ.2,406 కోట్లకు చేరిందని పేర్కొంది. ఆర్థిక ఫలితాల నేపథ్యంలో బీఎస్‌ఈలో డీఎల్‌ఎఫ్ షేర్ 2 శాతం నష్టపోయి రూ.160 వద్ద ముగిసింది.

గెయిల్ లాభం రూ.1,681 కోట్లు



ప్రభుత్వ రంగ గెయిల్ ఇండియా కంపెనీ ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక కాలంలో రూ.1,681 కోట్ల నికర లాభం సాధించింది. గత ఆర్థిక సంవత్సరం క్యూ3లో ఆర్జించిన నికర లాభం(రూ.1,262 కోట్లు)తో పోల్చితే ఇది 33 శాతం అధికమని గెయిల్ ఇండియా తెలిపింది. నేచురల్ గ్యాస్ మార్కెటింగ్, ట్రాన్స్‌మిషన్, లిక్విడ్ హైడ్రో కార్బన్, ఎల్‌పీజీ ట్రాన్స్‌మిషన్ సెగ్మెంట్లు మంచి పనితీరు కనబరచడం వల్ల ఈ స్థాయి నికర లాభం సాధించామని గెయిల్ సీఎమ్‌డీ బి. సి త్రిపాఠి తెలిపారు. నేచురల్ గ్యాస్ అమ్మకాలు 9 శాతం, ఎల్‌పీజీ ట్రాన్స్‌పోర్ట్ 11 శాతం, లిక్విడ్ హైడ్రోకార్బన్ అమ్మకాలు 5 శాతం చొప్పున వృద్ధి చెందాయని వివరించారు. అయితే నేచురల్ గ్యాస్‌ట్రేడింగ్, పెట్రోకెమికల్ సెగ్మెంట్ల మార్జిన్లు అంతంతమాత్రంగానే ఉన్నాయని పేర్కొన్నారు. రూ. 10 ముఖ విలువ గల ఒక్కో షేర్‌కు రూ.6.25 మధ్యంతర డివిడెండ్‌ను ఇవ్వనున్నామని తెలిపారు.

ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ నష్టాలు రూ.1,538 కోట్లు



చిన్న సైజు ప్రైవేట్ రంగ బ్యాంక్... ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌కు ఈ ఆర్థిక సంవత్సరం మూడో క్వార్టర్‌లో రూ.1,538 కోట్ల నికర నష్టాలు వచ్చాయి. క్యాపిటల్ ఫస్ట్ సంస్థ, ఐడీఎఫ్‌సీ బ్యాంక్‌లు గత ఏడాది డిసెంబర్‌లోనే విలీనమై ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ ఏర్పడిన విషయం తెలిసిందే. విలీనం అనంతరం తొలి త్రైమాసిక ఫలితాలు ఇవి. ఇటీవలే ఈ విలీన బ్యాంక్ ఏర్పడినందున గత క్యూ3 ఫలితాలతో, ఈ క్యూ3 ఫలితాలను పోల్చడానికి లేదు. విలీనం కారణంగా లెక్కింపునకు వీలు కాని గుడ్‌విల్ తదితర అసెట్స్‌కు రూ. 2,600 కోట్ల మేర కేటాయింపులు జరపాల్సి రావడంతో ఈ క్యూ3లో భారీగా నష్టాలు వచ్చాయని బ్యాంక్ ఎండీ వి. వైద్యనాథన్ తెలిపారు. నికర వడ్డీ ఆదాయం రూ.1,145 కోట్లు సాధించామని, నికర వడ్డీ మార్జిన్ 3.27 శాతంగా నమోదైందని వివరించారు.

మరికొన్ని కంపెనీల ఫలితాలు క్లుప్తంగా.. (అంకెలు రూ. కోట్లలో)

	నికర లాభం			మొత్తం ఆదాయం		
కంపెనీ	2018-19	2017-18	వృ/క్షీ(%)	2018-19	2017-18	వృ/క్షీ(%)
ఐనాక్స్ లీజర్	36	13	176	436	329	33
ట్రెంట్	40	38	6	666	526	26
టాటా గ్లోబల్(టీజీబీఎల్)	121	186	-35	1,935	1,751	11
అపోలో టైర్స్	198	245	-19	4,655	4,016	16
మారికో	252	223	13	1,882	1,642	15
టోరెంట్ పవర్	238	206	16	3,307	2,793	18
టాటా కెమికల్స్	219	759	-71	2,928	2,591	13
బేయర్ కార్ప్‌సెన్సెస్	27	11	145	632	482	31
సెంచురీ ప్లే	41	-	-11	578	-	14
యునైటెడ్ బ్యాంక్	(1,139)	(637)	-	2,846	2,483	14
బ్లూస్టార్	(1)	13	-	1,109	935	19
ఉత్తమ్ గాల్వా స్టీల్	(530)	(179)	-	100	680	-
బిర్లా కార్ప్	27	(28)	-	1557	1388	12

() నష్టం

కార్పొబ్రీఫ్స్...

పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్: ఆర్ఈసీలో 52% వాటా కొనుగోలు చేయాలన్న పీఎఫ్‌సీ ప్రతిపాదనకు కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఆమోదం తెలిపింది. పీఎఫ్‌సీ కొనుగోలు కారణంగా ప్రభుత్వానికి రూ.15,000 కోట్ల నిధులు లభిస్తాయని అంచనా.

ఎన్‌టీపీసీ: పెట్టుబడులు కోసం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ నుంచి రూ.2,500 కోట్ల రుణం పొందనున్నది. ఈ మేరకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌తో ఒప్పందాన్ని కుదుర్చుకున్నామని ఎన్‌టీపీసీ తెలిపింది. 15 ఏళ్ల కాలపరిమితి ఉన్న ఈ రుణంపై 3 నెలల మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేట్ ఆధారంగా వడ్డీ రేటు ఉంటుంది.

ఎన్‌ఎస్‌ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ADANI PORT	339.8	335.65
ASIAN PAINT	1450.35	1446.35
AXIS BANK L	729.5	720.5
BAJAJ AUTO	2710.65	2642.5
BAJAJ FINSE	6017.1	6009.2
BAJAJ FINAN	2603.6	2594.45
BHARTI AIRT	308.2	306.55
BHARAT PETR	337.95	338.55
CIPLA LTD	508	509.6
COAL INDIA	216.4	222.1
EICHER MOTO	20479.65	20128.3
GAIL (INDIA	332.1	329.75
GRASIM INDU	703.95	706.75
HCL TECHNOL	1047.75	1044.8
HDFC LTD	1981.4	1978.5
HDFC BANK L	2114.05	2104.9
HERO MOTOCO	2854.55	2780.15
HINDALCO I	204.75	204.2
HPCL	225.15	226.5
HUL	1821.45	1802.6
INDIABULLS	645.4	650.75
ICICI BANK	352.65	354.55
INDUSIND BA	1541.75	1504.65
BHARTI INFR	288.9	295.05
INFOSYS LIM	754.85	755.9
INDIAN OIL	133.75	135.9
ITC LTD	274.15	277.1
JSW STEEL L	273.55	273.5
KOTAK MAHIN	1279.15	1272.2
LARSEN & T	1304.6	1307.4
MAHINDRA &M	684.9	674.45
MARUTI SUZU	7093.6	6988.2
NTPC LTD	138.05	137.25
OIL AND NAT	142.95	146.25
POWER GRID	186.1	184.6
RIL	1291.55	1290.9
SBI	284.65	283.95
SUN PHARMAC	409.9	414.8
TATA MOTORS	175.8	180.25
TATA STEEL	464.7	476.05
TATA CONSUL	2044.55	2050.25
TECH MAHIND	751	749.15
TITAN COMPA	1066.7	1025.75
ULTRATECH C	3461.75	3447.5
UPL LIMITED	795.95	770.9
VEDANTA LIM	162.6	161.35
WIPRO LTD	368.45	371.25
YES BANK	176.1	179.8
ZEE ENTERTA	365.35	347.75

నిఫ్టీ నెక్ట్స్ ఫిఫ్టీ

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ABB INDIA L	1257.75	1273.3
ADITYA BIRL	81.85	82.5
ACC LIMITED	1388.8	1406.1
AMBUJA CEME	209.25	212.5
ASHOK LEYLA	82.15	82.3
BANDHAN BAN	416.65	403.8
BANK OF BAR	107.95	110.3
BHARAT ELEC	79.8	82.8
BHEL	58.85	64.95
BIOCON LIMI	649.3	652.45
BOSCH LIMIT	19056.4	19048.1
BRITANNIA I	3167.05	3266
CADILA HEAL	314.85	318.9
COLGATE PAL	1291.1	1289.45
CONTAINER C	517.4	518.6
DABUR INDIA	449.05	447.45
DLF LIMITED	159.75	163.6
AVENUE SUPE	1471.7	1473.9
GENERAL INS	247.4	252.8
GODREJ CONS	684.5	699.75
HAVELLS IND	730.8	735.55
HDFC LIFE I	376.25	376.2
HINDUSTAN Z	254.8	254.7
ICICI LOMBA	884.6	883.6
ICICI PRU L	286.3	284.75
VODAFONE ID	30.45	30.05
INTERGLOBE	1174.4	1160.85
L&T FINANCE	126.4	127.55
LIC HOUSING	459.35	455.9
LUPIN LIMIT	837.7	855.9
MARICO LIMI	363.5	367.75
UNITED SPIR	549.9	556.45
MOTHERSON S	136.5	138.3
MRF LTD	60004.3	59906.55
NHPC LTD	23.8	25.2
THE NEW IND	176.05	180.2
NMDC LTD.	93.9	95.35
ORACLE FIN	3828.25	3796.2
OIL INDIA L	169.5	171.1
PIRAMAL ENT	2171.1	2107.9
PETRONET LN	220.15	210
P&G HYGIENE	9938.5	9877.1
PIDILITE IN	1119.3	1121.2
STEEL AUTHO	45.35	45.75
SBI LIFE IN	584	589.75
SHREE CEMEN	15675.65	15906.9
SIEMENS LTD	994.6	1023.3
SHRIRAM TRA	1068.1	1024.75
SUN TV NETW	522	524.1

బ్యాంక్ ఆఫ్ బరోడా వడ్డీ రేట్ల పెంపు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంక్ ఆఫ్ బరోడా తాజాగా రుణాలపై వడ్డీ రేట్లను 0.2 శాతం దాకా పెంచింది. దీంతో గృహ, వాహన, ఇతర రుణాలు మరింత భారం కానున్నాయి. సవరించిన రేట్లు (ఎంసీఎల్ఆర్) గురువారం నుంచి అమల్లోకి వస్తాయని బ్యాంక్ తెలిపింది. మూడు నెలల వ్యవధికి ఎంసీఎల్ఆర్ 8.30 శాతం నుంచి 8.50 శాతానికి, ఆరు నెలల వ్యవధికి 8.5 శాతం నుంచి 8.7 శాతానికి, ఏడాది వ్యవధికి 0.1 శాతం పెంపుతో 8.75 శాతానికి వడ్డీ రేటు చేరుతుందని బ్యాంక్ వివరించింది. గురువారం రిజర్వ్ బ్యాంక్ పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను వెల్లడించనున్న నేపథ్యంలో బ్యాంక్ ఆఫ్ బరోడా వడ్డీ రేట్లు పెంచడం ప్రాధాన్యం సంతరించుకుంది.

ఐఎల్‌ఎఫ్‌ఎస్ గ్రూపు కంపెనీల జాబితా ఇవ్వండి!

ప్రభుత్వానికి ఎన్‌సీఎల్‌ఏటీ ఆదేశం

న్యూఢిల్లీ: ఐఎల్‌అండ్‌ఎఫ్‌ఎస్ గ్రూపు కంపెనీల వివరాలను, వాటి ఆర్థిక పరిస్థితుల ఆధారంగా వర్గీకరించి సమర్పించాలని జాతీయ కంపెనీ లా అప్పిలేట్ ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్ఏటీ) కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. భారీ రుణ భారంతో సంక్షోభంలో ఉన్న ఐఎల్‌ఎఫ్‌ఎస్ గ్రూపునకు సంబంధించి పరిష్కార ప్రణాళికతో పాటు, దీన్ని పర్యవేక్షించేందుకు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ డీకే జైన్ పేరును కేంద్ర ప్రభుత్వం సోమవారమే ఎన్‌సీఎల్ఏటీకి సమర్పించిన విషయం తెలిసిందే. ఇందులో ఐఎల్‌ఎఫ్‌ఎస్ గ్రూపు కంపెనీలను వాటి ఆర్థిక పరిస్థితుల ఆధారంగా గ్రీన్, అంబర్, రెడ్ అని ప్రభుత్వం పేర్కొంది. అయితే, గ్రీన్, అంబర్, రెడ్ జాబితాలో ఉన్న దేశీయ రిజిస్టర్డ్ కంపెనీల వివరాలను అందించాలని ఆదేశిస్తూ విచారణను ఫిబ్రవరి 11కు వాయిదా వేసింది. ఇక విదేశాల్లో ఏర్పాటైన కంపెనీల వివరాలతో విడిగా మరో జాబితా ఇవ్వాలని కోరింది. గతేడాది అక్టోబర్ 1న ఐఎల్‌ఎఫ్‌ఎస్ నూతన యాజమాన్యం ఏర్పాటు కాగా, 2018 సెప్టెంబర్ 30ని రుణదాతల క్లెయిమ్‌లకు కటాఫ్ తేదీగా ప్రభుత్వం తన పరిష్కార ప్రణాళికలో పేర్కొంది.

వచ్చే ఆర్థిక సంవత్సరంలో వృద్ధి 7.5 శాతం: కేంద్రం



న్యూఢిల్లీ: వచ్చే ఆర్థిక సంవత్సరంలో దేశ జీడీపీ వృద్ధి రేటు 7.5 శాతానికి పెరుగుతుందని కేంద్ర ఆర్థిక శాఖ అంచనా వేస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి వృద్ధి రేటు అంచనా 7.2 శాతంగా ఉంది. ''2019–20లో వృద్ధి 11.5 శాతంగా ఉంటుంది. 4 శాతం ద్రవ్యోల్బణం ఆధారంగా వాస్తవిక వృద్ధి 7.5 శాతంగా ఉండొచ్చని అంచనా వేస్తున్నాం. ఇది సహేతుకమే'' అని ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి సుభాష్‌చంద్ర గార్గ్ తెలిపారు.

సేవలు, తయారీ మందగమనం: నికాయ్

న్యూఢిల్లీ: దేశంలో సేవలు, తయారీ రంగాలు మందగమనంలో ఉన్నాయని తాజా సర్వేలో నికాయ్ ఇండియా ఇండెక్స్ తెలిపింది. భారత్ సేవల రంగం వరుసగా రెండవ నెలలోనూ కిందకు జారింది. డిసెంబర్‌లో 53.2 గా ఉన్న సూచీ, ఫిబ్రవరిలో 52.2కు పడింది. ఇక తయారీ, సేవల ఇండెక్స్ డిసెంబర్‌లో 53.6 శాతం ఉంటే, జనవరిలో యథాతథంగా కొనసాగింది. కాగా నికాయ్ సూచి 50పైన ఉంటే దానిని వృద్ధి ధోరణిగానే పరిగణించడం జరుగుతుంది.

స్టార్టప్స్‌కు ఒప్పో సాంకేతిక సహాయం




హైదరాబాద్: ప్రముఖ స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ ఒప్పో స్టార్టప్స్‌కు ప్రోత్సాహం అందించేందుకు ముందుకొచ్చింది. ఈమేరకు తెలంగాణ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. దేశంలోని స్టార్టప్స్‌కు సాంకేతికత, మార్గదర్శక సహకారం చేస్తుందని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. కెమెరా, ఇమేజ్ ప్రాసెసింగ్, బ్యాటరీ, 5జీ నెట్‌వర్క్, పేమెంట్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, గేమింగ్ రంగాల్లో పనిచేస్తున్న స్టార్టప్స్‌కు ఈ అవకాశముంటుందని పేర్కొంది.

ఇన్‌ఫ్రాలో డిష్ టీవీ రూ.3,000 కోట్ల పెట్టుబడి

న్యూఢిల్లీ: డైరెక్ట్ –టు–హోమ్ (డీటీహెచ్) కంపెనీ డిష్ టీవీ తన అనుబంధ సంస్థ డిష్ ఇన్‌ఫ్రా సర్వీసెస్‌లో రూ.3,000 కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్లు ప్రకటించింది. ఇందుకోసం రూ.10 ముఖవిలువ కలిగిన 300 కోట్ల ప్రాధాన్యత షేర్లను జారీచేయనున్నట్లు స్టాక్ ఎక్స్ఛేంజీకి అందించిన సమాచారంలో తెలియజేసింది. వచ్చే మూడు నెలల్లో పెట్టుబడి ప్రక్రియ పూర్తికానుందని తెలిపింది. ఇక క్యూ3లో రూ.152 కోట్ల నికరలాభాన్ని సంస్థ ఆర్జించింది. ఆదాయం 6 శాతం తగ్గి రూ.1,529 కోట్లుగా ఉంది. డిష్ ఇన్‌ఫ్రా రూ.168 కోట్ల నికర నష్టాన్ని ప్రకటించింది.

నెల్లూరుసహా పలు నగరాల్లో సిటీ గ్యాస్ లైసెన్స్‌లకు 225 బిడ్లు



న్యూఢిల్లీ: నగరాల్లో గ్యాస్ సరఫరాకి (సీజీడీ) పదో విడత లైసెన్సుల వేలంలో.. 225 బిడ్లు దాఖలయ్యాయి. అదానీ గ్యాస్, ఐవోసీ, టోరెంట్, గెయిల్ గ్యాస్ వంటి సంస్థలు వీటిని దాఖలు చేసినట్లు సమాచారం. ఈ విడతలో నెల్లూరు, మైసూరు, అజ్మీర్, హౌరా తదితర 50 నగరాల్లో పంపిణీకి లైసెన్సులు జారీ కానున్నాయి. టెక్నికల్ బిడ్స్‌ను ఫిబ్రవరి 7 నుంచి 9 మధ్య తెరవనున్నట్లు పెట్రోలియం అండ్ నేచురల్ గ్యాస్ నియంత్రణ బోర్డు వెల్లడించింది.

ఎయిర్‌టెల్‌కు మూడీస్ రేటింగ్ షాక్

న్యూఢిల్లీ: భారతీ ఎయిర్‌టెల్ క్రెడిట్ రేటింగ్‌ను 'బీఏఏ3 సీనియర్ అన్‌సెక్యూర్డ్ రేటింగ్' నుంచి బీఏ1 కార్పొరేట్ ఫ్యామిలీ రేటింగ్ (సీఎఫ్ఆర్)కు తగ్గించినట్టు మూడీస్ ప్రకటించింది. కంపెనీ పట్ల తన వైఖరిని ప్రతికూలానికి మార్చింది. అలాగే, కంపెనీ లాభదాయకత, నగదు ప్రవాహ పరిస్థితులు, రుణ భారంపై అనిశ్చితి నేపథ్యంలో భారతీ ఎయిర్‌టెల్ సబ్సిడరీ అయిన భారతీ ఎయిర్‌టెల్ ఇంటర్నేషనల్ (నెదర్లాండ్స్) జారీ చేసిన బ్యాక్డ్ అన్‌సెక్యూర్డ్ నోట్ల విషయంలో ఇదే అమలవుతుందని పేర్కొంది. రుణాల పునఃచెల్లింపుల సామర్థ్యాలను రేటింగ్ తెలియజేస్తుంది.

రీడ్ అండ్ టేలర్ లిక్విడేషన్‌కు ఎన్‌సీఎల్‌టీ అనుమతి

ముంబై: రీడ్ అండ్ టేలర్ లిక్విడేషన్ (ఆస్తుల విక్రయానికి)కు ఎన్‌సీఎల్‌టీ ముంబై బెంచ్ ఆదేశాలు జారీ చేసింది. ఒకప్పుడు ప్రముఖ వస్త్రబ్రాండ్ ఉన్న దీన్ని విక్రయించే విషయంలో ఉద్యోగుల ఆందోళనలను, ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకోవాలని పరిష్కార నిపుణుడికి సూచించింది. రీడ్ అండ్ టేలర్ కోసం ఇండియా గ్యాస్ బిడ్ వేయగా, నెట్‌వర్త్ రూ.50 కోట్లు ఉండాలన్న అర్హతకు నోచుకోకపోవడంతో బెంచ్ ఈ నిర్ణయాన్ని వెలువరించింది.

ఎన్‌పీఏలుగా... రూ.3.5 లక్షల కోట్ల కార్పొరేట్ రుణాలు!

ముంబై: బ్యాంకుల పుస్తకాల్లో ఇప్పటికీ నిగూఢంగా, సమస్యాత్మక రుణాలుగా ఉన్న మొత్తం కార్పొరేట్ రుణాల్లో 3.9 శాతం లేదా రూ.3.5 లక్షల కోట్లను మొండి బకాయిలుగా (ఎన్‌పీఏలు) గుర్తించాల్సి ఉందని ఇండియా రేటింగ్స్ సంస్థ అంచనా వేసింది. దీన్నిబట్టి ఎన్‌పీఏల బుడగ ఇంకా పూర్తిగా పగిలినట్టు లేదు. వీటిల్లో 2020 నాటికి 40 శాతం రూ.1.40 లక్షల కోట్లు నిరర్థక ఆస్తులుగా మారతాయని కూడా పేర్కొంది. 2018 నాటికి బ్యాంకుల్లో సమస్యాత్మకంగా మారిన కార్పొరేట్ రుణాలు 19.3 శాతం లేదా రూ.13.5–14 లక్షల కోట్లుగా ఉంటాయని అంచనా.

69.50-72 శ్రేణిలో రూపాయి స్థిరీకరణ!



ముంబై: డాలర్ మారకంలో రూపాయి విలువ 69.50 – 72 శ్రేణిలో స్థిరీకరణ జరుగుతున్నట్లు కనబడుతోంది. ఇంటర్ బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్‌లో రూపాయి విలువ మంగళవారం 23పైసలు బలపడి, 71.57 వద్ద ముగిసింది. రెండు రోజుల తర్వాత రూపాయి బలపడ్డం ఇదే తొలిసారి. తాజాగా వచ్చిన విదేశీ నిధులు, కొన్ని దేశీయ ఈక్విటీల్లో పురోగతి దీనికి కారణం. ఫిబ్రవరి 7వ తేదీన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్రవ్య విధాన సమీక్ష ప్రకటన కూడా ఉండడంతో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. రూపాయి ప్రారంభంతోనే పటిష్టంగా 71.72 వద్ద ప్రారంభమైంది. 71.55–71.80 శ్రేణిలో కదలాడింది. సోమవారం రూపాయి ఏకంగా 55పైసలు పడిపోయింది. 71.80 వద్ద ముగిసింది. అక్టోబర్ 9వ తేదీన రూపాయి చరిత్రాత్మక కనిష్ట స్థాయి 74.39 వద్ద ముగిసింది. క్రూడ్ ధరలు అంతర్జాతీయంగా ఇటీవలి గరిష్ట స్థాయిల నుంచి అనూహ్యంగా 30 డాలర్ల వరకూ పడిపోతూ వచ్చిన నేపథ్యంలో...రూపాయి క్రమంగా కోలుకుని 69.40 స్థాయిని చూసింది.